# ప్రాచీన భారత దేశ చరిత్ర

## డి. డి. కోశాంబి పరిచయం

కె. బాలగోపాల్

హైదరాబాద్

వెల : 10-00

C.15519

934
వా.తె.ప్ర

34810

ట్రస్ట్ సంపాదకుడు : చేకూరి రామారావు
ప్రథమ ముద్రణ : సెప్టెంబర్, 1986
వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
3-6-687, వీధి నెం. 10,
హిమాయత్‌నగర్
హైదరాబాద్-500 029.

షాద్ ప్రింటర్స్, హబ్సిగుడ, హైదరాబాద్.

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| | ముందుమాట | i-iv |
| 1. | పద్ధతి-సిద్ధాంతం | 1 |
| 2. | ఆహార సేకరణ-ఆహార ఉత్పత్తి | 13 |
| 3. | సింధూనాగరికత-ఆర్యులు | 28 |
| 4. | వ్యవసాయక వర్గసమాజం-వర్ణవ్యవస్థ | 47 |
| 5. | మహాభారతం-బుద్ధుడు | 71 |
| 6. | ఉత్తరాపథం-దక్షిణాపథం | 98 |
| 7. | వ్యవసాయ విస్తరణ-స్వయంపోషక గ్రామాలు | 125 |
| 8. | సామంతస్వామ్యం-గ్రామీణ భూస్వామ్యం | 151 |

# ముందు మాట

ప్రాచీన భారతదేశ చరిత్ర గురించి దామోదర్ ధర్మానంద్ కోశాంబి వెలిబుచ్చిన అభిప్రాయాలను తెలుగు పాఠకులకు పరిచయం చేసే ప్రయత్నం ఈ పుస్తకం.

ఈ ప్రయత్నం ఎందుకోసం అని అడుగుతారు.

మన చరిత్రకారులలో మార్క్సిస్టులే కాక ఆధునిక దృక్పథం గలవారందరూ కోశాంబిని ఆద్యునిగా భావిస్తారు. చరిత్ర పరిశోధనా పద్ధతిలోనూ సిద్ధాంత దృక్పథం లోనూ శాస్త్రీయ ప్రమాణాలు నెలకొల్పిన వ్యక్తిగా గౌరవిస్తారు. వలసతత్వం, శృతి మించిన 'దేశభక్తి', సంప్రదాయికత, అగ్రవర్ణ ఆధిక్యత, విశృంఖలమైన ఊహా తత్పరత మొదలయిన అనేక అవలక్షణాల నుండి మన దేశచరిత్రను కోశాంబి రక్షించాడు. తనకు పూర్వులూ సమకాలికులూ అయిన చరిత్రకారులు స్థల కాలాదుల నిర్ణయం లోనూ, ప్రాచీన గ్రంథాలనూ శాసనాలనూ పరిష్కరించడంలోనూ, చారిత్రక సంఘటనల అనుక్రమణికను తీర్మానించడంలోనూ చేసిన కృషిని కోశాంబి గౌరవించాడు. అయితే వాళ్ళు అశాస్త్రీయంగా వ్యవహరించిన చోట తీవ్రంగా (ఒక్కొకసారి అమర్యాదగా) అభిశంసించాడు.

ఆద్యుడు కావచ్చుగాని చివరివాడు కాదుగదా, పైగా ఆయన చనిపోయి 20 సంవత్సరాలు గడిచాయి కదా, ఇప్పుడెందుకి పరిచయం అని అడుగుతారు. ఇది నిజానికి మన దురదృష్టం. మన దేశంలో-ఏ రంగంలోనయినా-శాస్త్రీయ దృక్పథంతో జరిగే పరిశోధనే స్వల్పమనుకుంటే ఆయింత గూడ దేశ భాషలలో ప్రజలకు అందడానికి కొన్ని దశాబ్దాలు పడుతుంది.

అంతేకాదు. కోశాంబి ప్రాచీన భారత చరిత్రను గురించి చేసిన అధ్యయనాన్ని రెండు స్థాయిలలో విభజించ వచ్చును. ఒకటి, ఆ చరిత్రను నడిపిన భౌతిక చోదక శక్తుల నిర్ధారణ, ఆహార సేకరణ నుండి ఆహార ఉత్పత్తికి పరిణామం జరగడం, ఆహార ఉత్పత్తిమీద ఆధారపడిన స్థిర వ్యవసాయ గ్రామాల ఆవిర్భావం, ఈ స్థిర వ్యవసాయ గ్రామాలు స్వయంపోషకమై భూస్వామ్య వ్యవస్థకు పునాది కల్పించడం, అనే ఆర్థిక క్రమం మన ప్రాచీన చరిత్రకు మూలం అని కోశాంబి భావించాడు. రెండవది, ఈ చోదక క్రమాన్ని మనదేశ నైసర్గిక స్వభావానికి జోడించి సామాజిక సాంస్కృతిక రంగాలను వ్యాఖ్యానించడం. ఈ వ్యాఖ్యానాన్ని గురించి తరువాతి చరిత్రకారులు ఒక్కొక్కరూ ఒక్కొక్క మేరకు విభేదించారు. అయితే కోశాంబి ప్రతిపాదించిన భౌతిక

చోదక క్రమం అయిన ఆర్థిక పరిణామాన్ని వ్యతిరేకించిన వారుగాని అందుకు ప్రత్యామ్నా యాన్ని ప్రతిపాదించినవారు గాని ఎవరూలేరు. (అసలు భౌతిక జీవితం ప్రస్తావనే అనవసరం అనుకునే వాళ్ళది వేరే సంగతి). శాస్త్రీయంగా ప్రాచీన భారతదేశ చరిత్రను ఎవ్వరు అధ్యయనం చేయదల్చుకున్నా కోశాంబి ప్రతిపాదించిన భౌతిక చోదక క్రమాన్ని ప్రాతిపదికగా తీసుకోక తప్పదేమో.

ఈ ప్రయత్నం ఎవరికోసం అనికూడ అడుగుతారు.

మన జనాభాలో అక్షరాస్యుల నిష్పత్తి పెద్దగా పెరగకున్నా జనాభా పెరుగు తోంది కాబట్టి అక్షరాస్యుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పుడు లిఖిత సాహిత్యం అనేది కొద్దిమందికి పరిమితమయింది కాదు. సమాజంలో ఒక శక్తికాగల స్థాయికి పెరిగింది. పైగా కొత్తగా అక్షరాస్యులవుతున్నవాళ్ళు వెనుకబడ్డ వర్గాలకు చెందినవాళ్ళు కావడంతో సాహిత్యం ద్వారా ప్రచారమయ్యే అభిప్రాయాలకుండే సామాజిక ప్రభావం మరింత ఎక్కువ అయింది. ఇప్పుడు వాళ్ళకు అందుబాట్లో వున్న భావ ప్రచార సాధనాలు- 'యెల్లో జర్నలిజం', వారపత్రికల సీరియల్ కథలు, వాటి తోటివయిన సినిమాలు- అశ్లీలతనూ అశాస్త్రీయతనూ అమ్మకానికి మేళవించి అంగట్లో పెట్టిన సరుకు. వీటి పోటికి తట్టుకొని నూతన తరంలో శాస్త్రీయ భావాలను ప్రచారం చేయాల్సిన బాధ్యత అభ్యుదయ కాముకులందరి మీదా వుంది. కొడవటిగంటి కుటుంబరావు అన్నట్టు చరిత్రను గురించి శాస్త్రీయంగా ఆలోచించడం నేర్చుకుంటే అన్ని విషయాల గురించీ శాస్త్రీ యంగా ఆలోచించగలుగుతాం కాబట్టి, ఈ కొత్తతరం కోసం ఈ ప్రయత్నం.

చివరిగా, ఇందులో ఉన్నవన్నీ కోశాంబి అభిప్రాయాలేనా, నీ స్వంత అభిప్రాయా లేవీ లేవా అని-కొందరుఅనుమానంగా, కొందరు కుతూహలంతో-అడుగుతారు. కోశాంబిని నేను పరిచయం చేస్తున్నానంటేనే నాకర్థమయిన కోశాంబిని పరిచయం చేస్తున్నానని. కాగా, స్వంత ఇల్లూ స్వంత స్కూటరూ వున్నట్టు ఎవరికైనా 'స్వంత' అభిప్రాయాలు ఉంటాయా అంటే అనుమానమే. అభిప్రాయాలు ఎప్పుడూ ఒక సమిష్టికి చెందినవే. వాటిని 'స్వంతం' అని ప్రకటించుకోవడం నైతిక బాధ్యతను గుర్తించడం మాత్రమే. సామాజిక సంపదగూడ ఈ స్థాయికి ఎదగాలన్న ఆకాంక్షతో ఎంతోమంది చేస్తూన్న పరిశ్రమలో ఈ ప్రయత్నం ఒక భాగం.

## ఆధారాలు

ఇది కోశాంబి మీద సిద్ధాంత గ్రంథంకాదు. వీలయినంత సరళంగా కోశాంబి అభిప్రాయాలను పరిచయం చేసే పుస్తకం కాబట్టి కోశాంబి రచ నల నుండి కొటేషన్లు ఎక్కువగా ఇవ్వకుండ, కోశాంబి అభిప్రాయాలను నా మాటలలో చెప్పడం జరిగింది. ఒక్కొక్క విషయాన్ని గురించి కోశాంబి వెలిబుచ్చిన అభిప్రాయాలను విడివిడిగా ఇవ్వకుండ, ప్రాచీన భారతదేశ చరిత్ర గురించి (ఆదిమ

కాలంనుండి భూస్వామ్య దశ వరకు) ఒక 'చిత్రం' (కోశాంబి చూపించిన చిత్రం) ఇచ్చే ప్రయత్నం చేసాను. ప్రామాణికతకోసం ఎక్కడికక్కడ ఆయా అభిప్రాయాలకు ఆధారం ఏ పుస్తకంలో లేక ఏ వ్యాసంలో ఏ పేజీలో చెప్పాడో వివరణలలో తెలియజేయడం జరిగింది.

కోశాంబి చరిత్రమీద రెండు పుస్తకాలు, అనేక వ్యాసాలు, రాసాడు. పుస్తకాలు :

(i) An Introduction to the Study of Indian History (ISIH), Popular Prakasan, Bombay, 1956

(ii) The Culture and Civilisation of Ancient India, in Historical Outline (CCAI), Vikas Publishing House Pvt Ltd, 1964.

ఇందులో రెండవ పుస్తకం కోశాంబి చరిత్రమీద చేసిన చివరి రచన. ఆయన 1966లో చనిపోయాడు. అంతకు ముందు తాను చరిత్రమీద చేసిన రచనలన్నీ ఈ పుస్తకానికి ఫుట్‌నోట్స్ వంటివని తానే అభిప్రాయపడ్డాడు.1 ఈ అభిప్రాయంతో విభేదించే హక్కు మనకుంది.

చరిత్రమీద, సంస్కృత సాహిత్యం మీద, తదనుబంధమయిన విషయాలమీద, కోశాంబి మొత్తం 64 వ్యాసాలు రాసినట్టున్నాడు.2 వీటిలో ప్రధానమయిన వ్యాసాలు చాలావరకు సంకలనాల రూపంలో వచ్చాయి. మిగిలిన వాటి సారాంశం పై రెండు పుస్తకాలలో చోటు చేసుకుంది. ఈ పుస్తకం రాయడం కోసం వాడుకున్న సంకలనాలు మూడు :

(i) Myth and Reality, Studies in the Formation of Indian Culture (MR), Popular Prakasan, Bombay, 1962. ఈ సంకలనంలో 5 వ్యాసాలున్నాయి.

(ii) Indian Numismatics (IN), Orient longman, 1981. ఇందులో 12 వ్యాసాలున్నాయి.

(iii) D. D. Kosambi on History and Society (HS), Department of History, Bombay University, 1985. ఇందులో 15 వ్యాసాలున్నాయి.

వీటిలో మొదటి సంకలనం మాత్రమే కోశాంబి జీవించి ఉండగా వచ్చింది. రెండవది ఒక విదేశీ ప్రచురణ సంస్థ ఆధ్వర్యంలో ప్రచురించబడింది. వ్యాపారాన్ని సమర్థవంతంగా నిర్వహించే పాశ్చాత్య బూర్జువా సంస్కృతి ప్రమాణాలను అనుసరించి సంకలనం చేయబడింది. మూడవది బొంబాయి విశ్వవిద్యాలయం చరిత్ర శాఖ ప్రయాస ఫలితం. మన విశ్వవిద్యాలయ మేధావుల అసమర్థతకూ అలసత్వానికీ చక్కగా అద్దం పడుతుంది. సంకలనానికి కనీసం (i) సంగతీ సందర్భం వివరించే సిద్ధాంత పరమయిన

1. CCAI, పేజీ 25, 'నోట్'.
2. Science and Human Progress, D. D. Kosambi Commemoration Volume, పేజీలు 365 - 375.

ఉపోద్ఘాతం వుండాలి. (ii) (ఏ పుస్తకానికయినా) ఒక పదసూచిక (index) వుండాలి. చరిత్ర పుస్తకాల మాటకొస్తే (iii) పాళి, సంస్కృతం తదితర భారతీయ భాషల పదాలు వాడినప్పుడు వాటి ఉచ్చారణను తెలిపే (ప్రామాణిక మయిన) గుర్తులుండాలి. ఇవేవీ లేకుంటే సంకలనానికి ఒక సంపాదకుడూ, కవరు పేజీ మీద ఆయన పేరూ ఎందుకోసమో అర్థం కాదు.

ఈ సంకలనాలు కాక విడిగా ప్రచురితమైన కొన్ని వ్యాసాలుగూడ చూసాను. నాకు సులభంగా అందుబాట్లో లేని రచనలు కొన్ని అందజేసి నందుకు మిత్రులు చలసాని ప్రసాద్‌గారికి కృతజ్ఞుడిని.

నా మాటకొస్తే ఒక్క విషయం మాత్రం చెప్పాలి. కోశాంబి భగవద్గీత మీద రాసిన వ్యాసాన్ని 1976లో మొట్టమొదటిసారి చదివి నేను మార్క్సిస్టునయ్యాను. ఆ రుణం ఈ రూపంలో తీర్చుకోవాలన్న కోరిక కలిగి మూడేళ్ళయింది. ఇప్పటికి తీరింది.

కె. బాలగోపాల్

# 1. పద్ధతి-సిద్ధాంతం

చరిత్ర పరిశోధనకు ఆధారాలు స్థూలంగా రెండు రకాలు. ఒకటి సాహిత్య ఆధారాలు (literary sources), రెండు పురావస్తు ఆధారాలు (archaeological sources). సాహిత్య ఆధారాలంటే మత ధార్మికపురాణ తదితర గ్రంథాలు, కాల్పనిక సాహిత్య కావ్యాలు, రాజవంశాల అనువంశిక ఆస్థాన చరిత్రలు, పరిపాలనా సంబంధమయిన రికార్డులు, మొదలయినవి. వీటిని అధ్యయనంచేసి గత కాలపు చరిత్రను చరిత్రకారులు తెలుసుకునే ప్రయత్నం చేస్తారు. పురావస్తు ఆధారాలంటే గతకాలపు నివాసాలూ దేవాలయాలూ మొదలయిన కట్టడాలు, వాడకపు పనిముట్లు, ఆయుధాలు, అలంకార ప్రాయమయిన వస్తువులు, కర్మకాండ సంబంధమయిన సామగ్రి, మొదలయిన వాటి అవశేషాలు. కట్టడాలు సాధారణంగా శిధిలాల రూపంలో దొరుకుతాయి. ఆయుధాలు, పనిముట్లు, పురావస్తు తవ్వకాలలో బయటపడతాయి.

ఇవికాక అతిముఖ్యమైన ఆధారాలు రాజులుగాని, వర్తకులుగాని ప్రకటించే శాసనాలు, అచ్చువేసే నాణాలు, వగైరా. శాసనాలు ఎక్కువగా రాళ్ళమీద, దేవాలయాల మీద, సమాధులమీద, చెక్కివుంటారు కాబట్టి పురావస్తు ఆధారాలుగా పరిగణించవచ్చు[illegible] చరిత్ర కారులు శిలాశాసన ఆధారాలు (epigraphic sources) అనే ప్రయోగం చేయడం కద్దు.

మనదేశంలో పురావస్తు పరిశోధన చాలా ఆలస్యంగా ప్రారంభమయింది. మొదట్లో చరిత్రకారులు ఎక్కువగా సాహిత్య ఆధారాలను ఉపయోగించుకున్నారు. ఇతర దేశాలలాగ మనదేశంలో ప్రాచీనకాలపు రాజవంశాలూ రాజాస్థానాలూ తమ వ్యవహారాలను గ్రంథస్థం చేయలేదు. కాబట్టి, వేదాలు, ధర్మశాస్త్రాలు, పురాణాలు, కావ్యాలు మొదలయిన మత, సాంస్కృతిక సంబంధమైన గ్రంథాలమీద ఆధారపడి వాటి నుండి ఇక్కడొక వాక్యం అక్కడొక వాక్యం తీసి చరిత్రను మొత్తం వాఖ్యానించేవారు. పదాల సారూప్యాన్ని బట్టి అలవాట్ల సారూప్యాన్ని, మాటల పోలికనుబట్టి కొన్ని శతాబ్దాల చరిత్రనూ, 'నిరూపించడం' అలవాటయింది. పురాణాలలో ఇచ్చిన రాజ వంశాల పట్టికలనూ కథలనూ ఉన్నదున్నట్టుగా స్వీకరించి చరిత్రను వాఖ్యానించారు. ఈ పద్ధతిని కోశాంబి తీవ్రంగా విమర్శించాడు. బాలగంగాధర్ తిలక్ ఋగ్వేదంలోని నాలుగు పదాల వాక్యం ఒకటి తీసుకొని ఆర్యులు ఉత్తరధృవం నుండి వచ్చారని నిర్ధారించిన వైనాన్ని కోశాంబి 'అద్భుతమైన వక్రీకరణ'గా వర్ణించాడు.[1] ఇతర

ఉదాహరణలను సందర్భం వచ్చినప్పుడు ప్రస్తావిస్తాను.[1]

శాసన సాహిత్య ఆధారాలను పురావస్తు ఆధారాలతో సమన్వయ పరచనిదే చరిత్ర పరిశోధన శాస్త్రీయం కాదన్న అభిప్రాయాన్ని కోశాంబి పదే పదే వ్యక్తం చేసాడు.[2] పురావస్తు ఆధారాలను పట్టించుకోకుండ కేవలం ప్రాచీన సాహిత్యాన్ని ఆధారం చేసుకొని ఊహాగానాలు చేసే చరిత్రకారులు కోశాంబి చేతిలో చాలా తీవ్రంగా విమర్శకు గురయ్యారు. పౌరాణిక గాథలనుండి (అంటే బ్రాహ్మణ పురాణాలే కాదు. పోచమ్మ, గంగమ్మ మొదలయిన గ్రామదేవతల గురించి జనంలో ప్రచారంలో వున్న గాథలు గూడ) చరిత్రను అర్థం చేసుకునే ప్రయత్నం కోశాంబి పెద్ద ఎత్తునే చేసాడు. నిజానికి ఆయన చేసిన పరిశ్రమలో ఇది అత్యంత ముఖ్యమయిన భాగం. అయితే ఎక్కడికక్కడ తన అభిప్రాయాలను పురావస్తు మూలాలతోనూ నైసర్గిక స్థితిగతుల తోనూ పోల్చి చూసుకోకుండ ఉండరు. సంస్కృత భాషలో తమకున్న పాండిత్యాన్ని ఆసరా చేసుకొని కొందరు పాశ్చాత్యులు కేవలం పదవిశ్లేషణ (**philological analysis**)తో చరిత్రను నిర్ధారించడానికి చేసిన ప్రయత్నాన్ని ఆయన వివరంగా ఖండించాడు.

కాని, సాహిత్య పురావస్తు ఆధారాలను రెండింటినీ సమన్వయపరచి వాడుకున్నా, మన దేశ చరిత్రను పునర్నిర్మించు కోవడానికి అది సరిపోదని కోశాంబి గుర్తించాడు. మనదేశంలో పురావస్తు పరిశోధన చాలా అపరిణతంగా వుంది. సాహిత్య ఆధారాల విషయంలోగూడ ఇతర దేశాలతో పోలిస్తే మనదేశం పరిస్థితి చాలా అసంతృప్తి కరమయినది. మన ప్రాచీన సాహిత్యంలో లౌకిక సాహిత్యం దాదాపు మృగ్యం. ముస్లింలకు పూర్వం ఏ రాజవంశమూ తన చరిత్రను రాసుకోలేదు, రాయించలేదు. రాజాస్థానాలు ఏ విషయాలలోనూ రికార్డులు నిర్వహించ లేదు. మనదేశ లిఖిత చరిత్ర మొత్తం పురాణాలతో కలిసిపోయింది. పౌరాణిక గాథలు ఉపాఖ్యానాల రూపంలో మిగిలింది. ముస్లిం రాజులకు పూర్వం ఏ ఒక్కరి జన్మ సంవత్సరంగానీ ఏ ఒక్క గ్రంథం రాసిన సంవత్సరంగానీ ఖచ్చితంగా చెప్పలేం. ఒక రాజు పరిపాలించిన ప్రాంతం ఏమిటో ఇదమిత్థంగా నిర్ణయించలేం. ఒక్కొకసారి ఒక సంఘటన ఏ శతాబ్దంలో జరిగిందోకూడ చెప్పలేం. "ఒక్కొక్క గ్రంథానికి రచయిత ఒకడున్నాడు అని చెప్పగలం. కొన్నిటికి అదిగూడ సాధ్యంకాదు" అంటాడు కోశాంబి.[4] మనదేశాన్ని ఏలిన వాళ్ళెవ్వరూ తమ జీవితాలను గాని, పరిపాలనా వ్యవహారాలను గాని గ్రంథస్తం చేసే ప్రయత్నం చేయలేదు. అశోకుని శాసనాలు అరుదయిన మినహాయింపు. తరువాతి కాలంలో ఒక్క భూదానాలను మాత్రమే శాసనాలలో ప్రకటించారు. మన ప్రాచీన సాహిత్యమంతా గూడ కర్మకాండకూ మత ధర్మ ప్రచారానికీ సంబంధించినది.

మరయితే మనదేశ చరిత్ర రాయడం అసాధ్యమా అన్న ప్రశ్న వస్తుంది. అసాధ్యం కాదు. ఎందుచేతనంటే వేరే ఏ ఇతర దేశానికీ లేని ఒక గొప్ప సౌకర్యం

భారతదేశ చరిత్రకు ఉంది. అదేమిటంటే గతం యొక్క భౌతిక (పురావస్తు) అవశేషాలేకాక సామాజిక, సాంస్కృతిక అవశేషాలు సమాజం 'పొరల' లో భద్రంగా వుండడం. అపారమయిన భిన్నత్వం భారతీయ సంస్కృతి ప్రత్యేకత అని చాలా మంది భావిస్తారుగాని, నిజమయిన ప్రత్యేకత భిన్నత్వం కాదు, అవిచ్ఛిన్నత అంటాడు కోశాంబి. గతంలో జరిగిన సామాజిక మార్పులన్నీ తమ ముద్రను మన సమాజం మీద వదిలాయి వాటి నుండి చరిత్రను చదవ వచ్చుననీ ఆ సౌకర్యాన్ని భారత చరిత్రకారులు వాడుకోవాలనీ అంటాడు.

ఈ అవశేషాలను రెండు రకాలుగా చూడవచ్చును.

ఒకటి, మన సామాజిక చరిత్రలో వచ్చిన ఏ మార్పు సంపూర్ణంగా రాలేదు. 5000 సంవత్సరాలు పూర్వం మన దేశంలో అందరూ ఆహార సేకరణ మీద ఆధారపడ్డ సంచార జీవులే. అందే దొరికిన ఆహారాన్ని ఏరుకుని (లేక వేటాడి) తింటూ స్థిర నివాసం లేకుంట సంచరిస్తూ వుండేవారు. ఆ తరువాత క్రమంగా ఆహార సేకరణ మాని ఆహారాన్ని ఉత్పత్తి చేయడం అలవర్చుకున్నారు. కాని 5000 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ ఆ మార్పు పూర్తి కాలేదు. ఆహార సేకరణ మీద ఆధారపడ్డ ఆటవిక తెగలు ఇంకా మిగిలే వున్నాయి. ఆ తరువాత వచ్చిన అన్ని మార్పులూ ఇంతే. నాగలితో వ్యవసాయం చేయడం, ఇనప పనిముట్లు వాడకం, స్థిర నివాస గ్రామీణ జీవనం, భూమిపైన వ్యక్తి యాజమాన్యం, సాంస్కృతిక రంగంలో అనాగరిక జంతుబలుల స్థానంలో నాగరిక పూజా విధానం, ఏ మార్పూ గూడ పూర్తిగా రాలేదు. అన్నింటిలోనూ పాత వ్యవస్థను ఇప్పటికీ మిగుల్చుకున్న ప్రజలున్నారు.

రెండవది, మార్పు వచ్చిన చోట గూడ కొత్త వ్యవస్థ పాత వ్యవస్థను పూర్తిగా నాశనం చేయకుండ కొత్త రూపంలో-ఒక్కొక్కసారి అభావ రూపంలో-తనలో ఇముడ్చుకుంది. చారిత్రకంగా ఉన్నతమయిన వ్యవస్థ చారిత్రకంగా వెనుకబడ్డ వ్యవస్థ పైన విజయాన్ని సాధించినా ఓడిపోయిన సమాజం ఆచారవ్యవహారాలపైన తన ముద్ర వేసి తనకు లోబరచుకొని తనలో చేర్చుకుంది. గతం ఉన్నదున్నట్టుగా మిగిలిపోని చోట గూడ పరిణత రూపంలో మిగిలి పోయింది. ఈ పరిణత రూపంలో గత కాలపు ఛాయలేకాక అది లొంగిపోయిన క్రమం ఛాయలు గూడ వుంటాయి. గతాన్ని ఇంతగా మిగుల్చుకున్న దేశం మరొకటి లేదు.

ఈ సామాజిక అవశేషాలను చరిత్ర పరిశోధనకు ఒక ప్రబలమయిన ఆధారంగా గుర్తించడం కోశాంబి ప్రత్యేకత. చరిత్ర పరిశోధనా పద్ధతిలో ఆయన సాధించిన ఆవిష్కరణగా దీనిని భావించాలి. తరచుగా ఆయన సాహిత్య ఆధారాలనయినా పురావస్తు ఆధారాలనయినా ఈ స్పష్టాస్పష్టమైన అవశేషాలను గుర్తించడం కోసమే పరిశీలిస్తాడు. ఈ విధంగా గుర్తించిన అవశేషాలను తిరిగి సాహిత్య పురావస్తు ఆధారాలతో సమన్వయ పరచి చారిత్రక విషయాలను నిర్ధారిస్తాడు. ఈ దృష్టి

కోశాంబికి ఎంతగా అలవాటయిందంటే మన పట్టణాలలోని అస్తవ్యస్తమైన రహదార్లలో గూడ ఆయనకు ఆ పట్టణాల పుట్టుకే కనబడుతుంది. హరప్పా, మొహెంజోదారోల తరువాత మన దేశంలో ఏ పట్టణమూ ఒక నమూనా ప్రకారం నిర్మించింది కాదనీ, అన్నీ గూడ కొన్ని సమీప గ్రామాలు కలియకగా ఏర్పడ్డవేననీ, పట్టణాల రహదార్లన్నీ ఒకప్పటి పల్లెలను కలిపిన బాటలు కావడం వల్లనే అంత అవ్యవస్థితంగా వుంటాయనీ అంటాడు.[6]

## సిద్ధాంతం

పద్ధతినీ సిద్ధాంతాన్నీ విడదీయడం కష్టం. పరిశోధనా పద్ధతి సిద్ధాంత నిరూపణకు సాధనం కాగా, సిద్ధాంత దృక్పథం నుండే పరిశోధనా పద్ధతి రూపొందుతుంది. కోశాంబి చరిత్రకు తానిచ్చే నిర్వచనం చెబుతూ, ఆ నిర్వచనం ఇవ్వడానికి గల కారణాన్ని పరిశోధనా పద్ధతి పరంగా వివరిస్తాడు.

మన ప్రాచీన చరిత్రకు సాహిత్య పురావస్తు ఆధారాలు అసంతృప్తికరంగా వున్నాయన్న అభిప్రాయాన్ని పైన ప్రస్తావించాము. పాశ్చాత్యదేశాల ప్రాచీన చరిత్రను హెరొడోటస్ టాసిటస్ వంటి చరిత్రకారులేకాక పరిపాలకుడయిన సీజర్ స్వయంగా గ్రంథస్తం చేసాడు. మనదేశంలో ముస్లింలకు పూర్వం చరిత్రకారులు లేరు. హర్షుడి వంటి రాజులు "రచనా సామర్థ్యంలో సమకాలిక పాశ్చాత్య ప్రభువులకంటె ఎంతో ఉన్నతులయినప్పటికీ" చరిత్రను లిఖితం చేసే ప్రయత్నం చేయ లేదు. చరిత్రగా పరిగణించగల ఏకైక సంస్కృత గ్రంధం క్రీ.శ. 12వ శతాబ్దంలో కాశ్మీరు ప్రాంతానికి చెందిన కల్హణుడు రాసిన "రాజతరంగిణి" అయితే ఈ 'చరిత్ర' గూడ సంస్కృత కావ్య సాహిత్యం యొక్క అలంకారిక సంప్రదాయానికి లోబడి వుండి రచయిత చెప్పదల్చుకున్న వాస్తవ విషయాలను అస్పష్టం చేయడానికి ఉపయోగపడిందే తప్ప ప్రాచీన పాశ్చాత్య చరిత్ర కారులయిన లివీ, టాసి టస్ మొదలయిన వారి "శైలిలోని స్పష్టత, మితమయిన ప్రశంస, నిరాడంబరమయిన కథనం," అందులో కనబడవని కోశాంబి అంటాడు.[7]

పురావస్తు ఆధారాల విషయం గూడ అంతే. ఇతరదేశాలలో పురావస్తు పరిశోధన ఆధారంగా సాహిత్య శాసనమూలాలను అర్థం చేసుకో గలిగారు. సాహిత్య అదారాలలో చెప్పిన విషయాలు వాస్తవమా కాదా అన్నది పురావస్తు పరిశోధన ద్వారా తెలుసుకో గలిగారు. హెరొడోటస్, టాసిటస్, లివీ తదితరుల చరిత్ర గ్రంధాలలోని విషయాలు గ్రీస్, ఇటలీ దేశాలలో పురావస్తు పరిశోధనలో నిరూపిత మయ్యాయి, ఆ పరిశోధనకు మరింత దోహదం చేసాయి. కాగా, మన ప్రధాన 'ఇతిహాసాల'యిన రామాయణ మహా భారతాలలోని రెండు యుద్ధాలు ఎక్కడ జరిగిందీ చెప్పడం సాధ్యం కాదు-అవి అసలు చారిత్రక సంఘటనలో కాదో తెలియదు. "రోమన్ గణతంత్రం చివరి రోజుల

చరిత్రను దైనందిన సంఘటనలతో సహా పునర్నిర్మించ వచ్చునుగాని, మనం విక్రమ శకం అని లెక్కపెట్టుకునే విక్రముడు నిజంగా వున్నాడోలేదో తెలియదు". చైనా రాజవంశాల చరిత్రను క్రీ. పూ. 840 నుండి (ఆస్థాన రికార్డుల ఆధారంగా) ఖచ్చితంగా చెప్పవచ్చునుగాని మన దేశంలో ఏ రాజు ఎప్పుడు పరిపాలించిందీ ఖచ్చితంగా చెప్పలేం. సాహిత్య ఆధారాలు వాటంతటవే అర్థవంతం కావు. కొన్ని ప్రాచీన మయిన మాటలకూ ప్రయోగాలకూ గల అర్థాన్ని పురావస్తు పరిశోధన ద్వారా మాత్రమే నిర్ణయించడం సాధ్యం అవుతుంది. మధ్య ప్రాచ్యదేశాల (సుమేర్, ఈజిప్టు) ప్రాచీన చరిత్రను ఈ సమన్వయం సాధ్యమయిన కారణంగానే చాలా నిర్దుష్టంగా అర్థం చేసుకోగలిగారు. మన దేశంలో అది సాధ్యం కాలేదు.[8] సాధ్యంకాక పోవడంవల్ల పురావస్తు పరిశోధనను పక్కకు పెట్టి కేవలం ప్రాచీన సాహిత్యంలోని పదాల ధాతువులను విశ్లేషించడం, ప్రయోగాలకు అద్భుత ఉద్దేశ్యాలను ఆపాదించడం మొదలయిన పద్ధతులను అవలంబించిన వ్యక్తులను-మాక్స్ ముల్లర్ నుండి[9] ఎస్. ఎ. డాంగె వరకు[10]-కోశాంబి అమర్యాదగానయినా చాలా న్యాయంగా అభిశంసించాడు.

మరి సాహిత్య పురావస్తు ఆధారాలు అసమగ్రంగా వుండడమేకాక రెండింటికీ సమన్వయం గూడ కుదరక పోతే చరిత్ర కారుడు ఏ పద్ధతులు అవలంబించాలి అన్న ప్రశ్న వస్తుంది. చరిత్ర పరిశోధనా పద్ధతికి సంబంధించిన ఈ ప్రశ్నకు కోశాంబి సిద్ధాంత సంబంధమయిన సమాధానం కోసం వెతుకుతాడు. ఆ సమాధానం దొరికిన తరువాత తదనుగుణ్యమైన విశ్లేషణా పద్ధతిని ప్రతిపాదిస్తాడు. పాశ్చాత్య దేశాల చరిత్ర రాసిన పద్ధతిలో మన దేశ చరిత్ర రాయాలని చూడడం తప్పనీ, మనదేశ చరిత్రకు అనువయిన పరిశోధనా పద్ధతిని వెతుక్కోవాలనీ కోశాంబి అంటాడు.[11] చరిత్రను రాజ వంశాల చరిత్రగా రాయదల్చుకుంటే మన దేశ చరిత్ర రాయడం సాధ్యం కాదు. పురాణాల మీద, కర్మ కాండ కోసమో ధర్మ ప్రచారం కోసమో రాసిన సాహిత్యం మీద, అరకొరగా దొరికిన శాసనాలలోని అస్పష్టమైన వాక్యాల మీద ఆధారపడి, స్పష్టత కొరవైన చోట దేశభక్తి చేర్చి ఊహాగానాలు చేయాలి. అంతే తప్ప ఖచ్చితమైన చరిత్ర ఎప్పటికీ సాధ్యంకాదు. ఒక వాక్యానికి అర్థం మారినా ఒక మాటను తప్పు చదివినా ఈ చరిత్ర రూపమే మారిపోతుంది. అయితే చరిత్రకు ఇచ్చే నిర్వచనాన్నీ చరిత్రను అర్థం చేసుకునే విధానాన్నీ మార్చుకుంటే మనదేశ చరిత్ర రాయడం సాధ్యం అవుతుంది. ఈ విధంగా, పద్ధతికి సంబంధించిన చర్చ సిద్ధాంత చర్చగా మారుతుంది.

చరిత్ర అంటే మహారాజుల, మహా సంగ్రామాల పట్టిక మాత్రమే అయితే భారత దేశ చరిత్ర రాయడం అసాధ్యమన్న కోశాంబి అభిప్రాయాన్ని చూసాం. అయితే ఒక ప్రాంతానికి రాజెవ్వడు అనే ప్రశ్నకంటె ఆ ప్రాంతం ప్రజలకు నాగలి వాడకం తెలుసునా లేదా అనేది ముఖ్యమైన ప్రశ్న. అయితే భారతదేశానికి ఖచ్చితంగా ఒక

చరిత్ర వుందనీ. ఆ చరిత్ర రాయడం సాధ్యమేననీ, కోశాంబి భావిస్తాడు.[12] "సింధూ నాగరికతలో రాజులున్నారా లేదా అనేది ముఖ్యం కాదు, వాళ్ళకు నాగలి వాడకం తెలుసునా లేక నదీతీరంలోని వరద ముంపు భూములలో ముళ్ళ కర్రతో వ్యవసాయం చేయడం మాత్రమే తెలుసునా అనేది ముఖ్యం" అంటాడు.[13] మరి రాజుల ప్రస్తావనే చరిత్రకారుడికి అక్కరలేదా అంటే "వ్యవసాయానికి ఉపయోగించిన పద్ధతి మీద రాజ్యాధికారం స్వభావం ఆధారపడి వుంటుందిగాని రాచరికం వ్యవసాయ విధానాన్ని నిర్ణయించదు" అంటాడు.[14] "ఈ రాజు ముందా ఆ రాజు ముందా అనేది అక్కరకు రాని ప్రశ్న. అయితే ఇనుము వాడకం ఫలాన రాజు కాలంలో మొదలయిందా లేక మరొక రాజు కాలంలో మొదలయిందా అనేది అందుకు భిన్నమయిన ప్రాముఖ్యాన్ని కలిగిన ప్రశ్న. అప్పుడు ఆ యిద్దరిలో ఎవరు ముందో నిర్ణయించడం అవసరం అవుతుంది" అంటాడు.[15] మరి చరిత్ర అంటే ఏమిటో నిర్వచించమంటే : ఉత్పత్తి శక్తులలోనూ ఉత్పత్తి సంబంధాలలోనూ క్రమానుసారంగా వచ్చే మార్పులను కాలానుగతంగా వివరించడం చరిత్ర అంటాడు.[16]

'ఉత్పత్తి శక్తులు' 'ఉత్పత్తి సంబంధాలు' అనే మాటలను తరచుగా దుర్వినియోగం చేయడం జరుగుతోందని కోశాంబి భావిస్తాడు. కాబట్టి, ఆయన ఏ అర్థంలో వీటిని ప్రయోగించాడో చెప్పుకోవాలి. 'ఉత్పత్తి శక్తులు' అంటే ఆహారం తదితర భౌతిక అవసరాలను ఉత్పత్తి చేయడానికి ఉపయోగించే సాధనాలు, పద్ధతులు. 'ఉత్పత్తి సంబంధాలు, అంటే ఉత్పత్తి అయిన వస్తువులలో శ్రామికుడి మనుగడకు అవసరమయింది పోగా మిగిలిన దానిని (దీనిని 'అదనపు ఉత్పత్తి' అంటారు) పాలక వర్గాల చేతుల్లోకి చేరవేసే ఏర్పాటు. చరిత్రలో ఉత్పత్తికి వినియోగించే సాధనాలు, పద్ధతులు, అదనపు ఉత్పత్తిని పాలక వర్గాలకు చేరవేసే సామాజిక ఏర్పాట్లు, కాలక్రమంలో మారుతూ వస్తాయి. ఈ మార్పును క్రమానుగతంగా వివరించడం చరిత్ర అని కోశాంబి నిర్వచనం.

మరి సంస్కృతి మాటేమిటి అని కొందరు గాభరా పడతారని కోశాంబికి తెలుసు. వీళ్ళు మామూలుగా సంస్కృతిని బౌద్ధిక లేక ఆధ్యాత్మ విషయంగా -మతం, తత్వం, ధర్మం, సాహిత్యం, సంగీతం, కళ, ఒక్కొక్కసారి పాలకవర్గాల జీవిత విన్యాసాలు గూడ కలిపి - అర్థం చేసుకుంటారని ఆక్షేపిస్తూ, మనిషి తిండికోసమే జీవించడనేది వాస్తవమేగాని, తిండి లేకుండ జీవించగల మానవ వంగడాన్ని ఇప్పటిదాకా ఎవ్వరూ ఉత్పత్తిచేయలేదని వేళాకోళంగా అంటాడు. పైన చెప్పిన 'సంస్కృతి' సాధ్యం కావాలంటే అదనపు ఉత్పత్తి తగుమాత్రం తగురీతిలో కావాలి. "మెసపొటేమియా దేవాలయాలు, గ్రేట్ వాల్ ఆఫ్ చైనా, ఈజిప్టు పిరమిడ్లు, ఆధునిక ఆకాశ హర్మ్యాలు" కావాలంటే పెద్ద ఎత్తున అదనపు ఉత్పత్తి అవసరం, పైగా అది కొందరి చేతులలోకి వెళ్ళడం అవసరం.

ఈ సిద్ధాంత దృక్పథానికి ఉదాహరణగా కొన్ని దశలలోని ఉత్పత్తి శక్తులను, ఉత్పత్తి సంబంధాలను కోశాంబి వివరిస్తారు.[17] ప్రకృతిలో దొరికే ఆహారాన్ని ఏరుకుని (వేట కూడ ఇందులో భాగమే) జీవించడం ఉత్పత్తి పద్ధతి అయినప్పుడు అదనపు ఉత్పత్తి చాలా స్వల్పంగా వుంటుంది. దానిని కర్మకాండ యుతంగా పంచిపెట్టే బాధ్యత స్త్రీలమీద వుంటుంది. ఉత్పత్తి పద్ధతి ఇంకొంచెం అభివృద్ధిచెంది (ఉదాహరణకు పశుపోషణ అలవాటయిన తరువాత) అదనపు ఉత్పత్తి పెరిగినప్పుడు దాన్ని పంపకం చేసే అధికారం గణ ముఖ్యులయిన పురుషుల చేతిలోకి పోతుంది. మరింత అభివృద్ధి చెందిన దశలో అదనపు ఉత్పత్తిని సేకరించి వినియోగించే అధికారాన్ని ఒక దేవాలయంగానీ రాజుగానీ చేజిక్కించుకుంటారు. ఉత్పత్తి బానిసల ద్వారా జరిగే సమాజంలో అదనపు ఉత్పత్తి బానిస యజమానులకు, రైతులద్వారా జరిగే ఫ్యూడల్ సమాజంలో భూస్వాములకు, స్వేచ్ఛా కార్మికులద్వారా జరిగే బూర్జువా సమాజంలో పెట్టుబడిదార్లకు చెందుతుంది.

## మార్క్సిజం

తన దృక్పథం గతితార్కిక భౌతిక వాదమనీ దానినే మార్క్సిజం అంటారనీ అంటూ[18] అయితే ఇది ఎంత మాత్రం ఆర్థిక నియతి వాదం కాదని కోశాంబి హెచ్చరిస్తారు.[19] ఈ హెచ్చరికకు కోశాంబి యిచ్చిన అర్థం ఏమిటో చూడాలి.[20]

స్థూలంగా మూడు విషయాలు కనబడతాయి. 1. ఒకే రకమయిన పరిస్థితులు అనివార్యంగా ఒకే రకమయిన మార్పుకు దారి తీస్తాయని భావించకూడదు. సమాజం ఆ పరిస్థితులను చేరుకున్న మొత్తం చారిత్రక క్రమాన్ని దృష్టిలో పెట్టుకోనిదే భవిష్యత్ పరిణామాలు అర్థంకావు. గతకాలపు అవశేషాలు ఎప్పుడూ ఉంటాయి. వాటి ప్రభావం బలహీనంగా వుండి తీరాలని చెప్పలేం. దీనికి కోశాంబి ఒక చక్కటి ఉదాహరణ ఇస్తారు. కొలంబస్ అమెరికాను 'కనిపెట్టిన' తదుపరి అమెరికా నుండి (16వ శతాబ్దంలో) పెద్ద ఎత్తున వెండి బంగారాలు స్పెయిన్‌కు తరలి వచ్చాయి. అవి స్పెయిన్‌లోని ఫ్యూడల్ వర్గాలనూ తిరోగామి మతాధికారులనూ బలపరిచాయి. అయితే అదే సంపదలో కొంత భాగాన్ని దోపిడీ చేసి ఫ్రాన్సిస్. డ్రేక్ వంటి సముద్రపు దొంగలు ఇంగ్లండ్‌కు తరలించగా ఆ సంపద ఇంగ్లండులో భూస్వాములను కాక వ్యాపార వర్గాలను బలపరిచి అంతిమంగా భూస్వామ్య సమాజం విచ్ఛిన్నానికి పెట్టుబడిదారీ సమాజం ఆవిర్భావానికి దోహదం చేసింది.

2. 'సంస్కృతి' అని పిలవబడే విషయాలు అదనపు ఉత్పత్తి మీద ఆధారపడినవే అయినంత మాత్రాన చరిత్రలో వాటి స్థానం శూన్యం కాదు. మనుష్యులు (ముఖ్యంగా ఉత్పత్తి రంగం వెనుకబడివున్న సమాజాలలో) తమ భౌతిక వైరుధ్యాలను తరచుగా సాంస్కృతిక సంఘర్షణల రూపంలో పరిష్కరించు కుంటారు. రెండు సమాజాల లేక

వర్గాల మధ్య వైరుధ్యం ఇద్దరు దేవుళ్ళ మధ్య కొట్లాటగా పరిణమిస్తుంది. సామరస్యం దేవుళ్ళ కలయికకూ అవతారాలకూ వివాహాలకూ దారి తీస్తుంది. మన దేశంలో ఇది చాలా విస్తృతంగా జరిగింది. కాబట్టి కోశాంబి రచనలలో ఎన్నయినా నిదర్శనాలు దొరుకుతాయి. అద్వైతానికీ విశిష్టాద్వైతానికి గల సున్నితమయిన తాత్విక భేదం తలలు పగలగొట్టుకునే కొట్లాటలకు దారి తీయాల్సిన అగత్యం ఏమీ లేదని, అయితే పెద్ద భూస్వాములు శైవాన్ని ఆదరించగా కొంత చిన్న తరహా కామందులు వైష్ణవాన్ని ఆదరించడం వల్ల శైవ-వైష్ణవ సంఘర్షణ అంత తీవ్రంగా జరిగిందని అంటాడు.[21]

8. మార్క్సిజం చరిత్రను పురోగామి స్వభావం గలదిగా భావిస్తుంది. అంటే ఉత్పత్తి సామర్థ్యంలో వెనుక బడ్డ దశనుండి అభివృద్ధి చెందిన దశకు చరిత్ర పురోగమిస్తుంది. అయితే ఇది చరిత్రను మొత్తంగా, విశాల భౌగోళిక ప్రాతిపదిక మీద చూసినప్పుడు మాత్రమే. ఒక పరిమితమయిన ప్రాంతంలో చరిత్రను పరిశీలించి నప్పుడు చరిత్ర చాలాకాలం పురోగమించకుండ కరడు గట్టి పోవడం, ఒక్కొక్కసారి వెనక్కిపోవడం కనబడుతుంది. మనదేశ చరిత్రలో ఇటువంటి ప్రముఖమయిన ఉదాహరణ ఒకటి వుంది' ఆర్యుల కంటే సింధూ నాగరికత ప్రాచీనమయినా అదే ఆర్థికంగా పై దశలో వుండింది' సింధూనాగరికతలో నాగలి వాడకం తెలియక పోయినప్పటికీ తేలిక వ్యవసాయ పద్ధతులలో చెప్పుకోదగ్గ అదనపు ఉత్పత్తిని సాధించి పట్టణాలు నిర్మించారు. వాళ్ళ తరువాత వచ్చిన ఆర్యులకు తొలిరోజులలో వ్యవసాయంగానీ పట్టణ నాగరికత గాని తెలియవు. వాళ్ళు పశుపోషణ మీద ఆధారపడ్డ సంచార జీవులు.

## పద్ధతి

ఇప్పుడు తిరిగి పద్ధతిని పరామర్శిద్దాం. చరిత్ర అనేది మహారాజుల మహాసంగ్రామాల పట్టిక కాదు. ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల క్రమానుగత పరిణామాల వివరణ అని అర్థం చేసుకున్న తరువాత ఈ పరిణామాల ముద్రలను అన్వేషించే పద్ధతి కావాలి. సాహిత్య ఆధారాలనూ పురావస్తు ఆధారాలనూ రాజవంశాల అనుక్రమణిక కోసం కాక గతకాలపు సామాజిక పరిణామాల ఛాయలకోసం అధ్యయనం చేయాలి. అయితే ఈ రెండు ~~సాంప్రదాయక~~ ఆధారాలూ అసంతృప్తి కరంగా వున్నంత మాత్రాన ఇబ్బంది లేదు. ఎందుకంటే గతకాలపు పరిణామాలను అన్వేషించడానికి గతకాలపు సాహిత్యం, పనిముట్లు తదితర వస్తువులు దొరకక పోయినా, ఆ పరిణామాలు ఇప్పటికీ నిలిచేలాగ వదిలి పోయిన సామాజిక అవశేషాలు దొరుకుతాయి-వెతికే ఓపిక వుంటే. మనదేశం గతాన్ని అసాధారణంగా మిగుల్చుకున్నది కావడం ప్రజలకు శాపం అయితే చరిత్రకారుడికి వరం. నాలుగు సహస్రాబ్దాల చరిత్రలో అన్ని దశలూ ఆ దశలలోని సంఘర్షణలూ తమ ఛాయలను సమాజం మీద వదిలి వెళ్లాయి. అవి మన చుట్టూ వున్నాయి. వాటిని గుర్తించి విశ్లేషించాలి. జె. డి. బెర్నాల్ అన్నట్టు "కోశాంబి

దృష్టిలో చరిత్ర గతంలోనే కాదు, వర్తమానంలోనూ వుంది".[22]

మనదేశంలో కొత్త వ్యవస్థ ఎప్పుడు వచ్చినా అది పాత వ్యవస్థను నాశనం చేయకుండ తనకు లోబరచుకొని అట్టడుగు పొరలలోనికి చేర్చుకుంది కాబట్టి ఈ అవశేషాలు వెనుకబడ్డ సామాజిక రంగాలలో వుంటాయి. 'వెనుకబడ్డ' అంటే ఎక్కడో అడవులలో అనికాదు. మహానగరంలోనూ వుంటాయి, మన కుటుంబాలలోనూ వుంటాయి. మాతృస్వామ్యం నుండి పితృస్వామ్యానికి జరిగిన మార్పు మన చరిత్రలోని తొలి పరిణామాలలో ఒకటి కాబట్టి మన కుటుంబాలలో స్త్రీల అలవాట్లూ ఆచారాలూ గతం ఛాయలను ఎక్కువగా కలిగివుంటాయి. స్త్రీలకు ప్రత్యేకమయిన పండుగలు-బ్రాహ్మణుల వరలక్ష్మీవ్రతంగానీ, అబ్రాహ్మనుల బోనాలపండుగకానీ-చరిత్ర పరిశోధనకు ఎక్కువగా ఉపయోగపడతాయి. ఆటవికులు ఆహార సేకరణ మాని వ్యవసాయక సమాజం అట్టడుగు పొరల్లోనికి శూద్ర (లేక పంచమ) కులాలుగా వచ్చి చేరడం మరొక ముఖ్యమయిన పరిణామం. కాబట్టి, సమాజంలోని అట్టడుగు వర్గాలలో ఇంకా మిగిలిపోయిన అలవాట్లలో, వాళ్ళ గతకాలపు జీవితం, వాళ్ళను నాగరిక సమాజం లొంగదీసుకున్న క్రమం, రెండూ గోచరిస్తాయి. కాబట్టి చరిత్ర పరిశోధకుడు ఇల్లూ గ్రంథాలయం వదిలి తనకు విద్యతో అబ్బిన ఆధిక్య భావాన్ని గూడ వదిలి ప్రజల విశ్వాసాన్ని పొందా లంటాడు.[23] తరతరాల పేదరికం దోపిడీలవల్ల అది సులభంకాదని గుర్తిస్తాడు. బ్రాహ్మనుల ఆమోదం పొందినదే 'భారతీయ సంస్కృతి' అనీ సంస్కృతీకరించబడినదే సంస్కారవంతులభాష అనీ తక్కినదంతా 'మన సంస్కృతి' కాని కుసంస్కారం అనీ భావించడం వల్ల గతకాలపు ఛాయలు మిగిలి పోయిన రంగాలను తక్కువగా చూడడం జరుగుతోంది. దానివల్ల చారిత్రక దృష్టి లోపించి విద్యాధికుడయిన చరిత్ర పరిశోధకుడు న్యూనతా భావంవల్ల జనం అలవాట్లలో గమనార్హమయిన విషయాలను విస్మరించే ప్రమాదం వుందని కోశాంబి అంటాడు.[24]

ఇప్పుడు కోశాంబి సూచించే చరిత్ర పరిశోధనా పద్ధతేమిటో క్లుప్తంగా చెప్పుకో వచ్చును. ప్రాచీన సాహిత్యమూలాలను పురావస్తు ఆధారాలు ఉన్న మేరకే విశ్వసించాలి. పద విశ్లేషణ ఆధారంగా, శాసనాల శకలాల ఆధారంగా, ఊహాగానాలు చేయడం మానుకోవాలి. సాహిత్య ఆధారాలలో నయినా పురావస్తు ఆధారాలలో నయినా రాజవంశాల కాలను క్రమణిక కోసంకాక ఉత్పత్తి శక్తుల, ఉత్పత్తి సంబంధాల పరిణామం ఛాయల కోసం వెతకాలి. ఈ పరిణామం అన్ని దశలలోనూ వదిలి వెళ్ళిన సామాజిక అవశేషాల నుండి గతాన్ని పునర్నిర్మించుకోవాలి. అన్నిటినీ మించి, వర్తమాన సమాజంలోని క్రింది పొరలలోని ఆచార వ్యవహార సంబంధమైన అవశేషాలను జాగ్రత్తగా (ఎటువంటి న్యూనతాభావం గాని, అట్లాగని, సెంటిమెంటల్ సంస్కరణ మనస్తత్వంగాని లేకుండ) పరిశీలించి నైసర్గిక భౌతిక పరిస్థితులతో, సాహిత్య పురావస్తు ఆధారాలతో, సమన్వయ పరచాలి.

అన్వయంతోనే పద్ధతి అర్థవంతమవుతుంది. కాబట్టి ఈ పద్ధతిని ప్రయోగించిన ఫలితంగా కోశాంబి మన దేశచరిత్ర గురించి చేయగలిగిన సూత్రప్రాయమయిన తీర్మానాన్ని తెలుసుకోవాలి. ప్రాచీన భారత దేశ చరిత్రకు అంతస్సూత్రంగా ఒక ఆర్థిక క్రమం నడిచిందని కోశాంబి నిరూపించాడు. ఈ ఆర్థిక క్రమంలో మూడు దశలున్నాయి. ఒకటి, ఆహార సేకరణ స్థానంలో ఆహార ఉత్పత్తి చేపట్టడం. ఈ రెండింటికీ మధ్యదశగా ఒక్కొక్కసారి పశుపోషణ వస్తుంది. రెండు, ఆహార ఉత్పత్తి ప్రాతిపదికగా గల స్థిర నివాస గ్రామాలు ఏర్పడడం. మూడు, ఆ గ్రామాలలో శ్రమ విభజన అభివృద్ధి చెంది అవి చాలా వరకు స్వయం పోషకమయి భూస్వామ్య వ్యవస్థకు పునాది ఏర్పడడం. క్రీ.పూ. 1000 ప్రాంతంలో ప్రారంభమయిన ఈ క్రమం క్రీ.శ. 1000 నాటికి ఒక కొలిక్కి వచ్చింది. (పూర్తి అయిందని కాదు-ఇప్పటికీ పూర్తి కాలేదు.)

మూడు దశలు అంటున్నామంటే ఇవి కాలక్రమంలో మూడు స్పష్టమయిన దశలగా వున్నాయని కాదు. అట్లా వుండివుంటే ప్రాచీన భారత చరిత్రను మూడు కాలాలగా విభజించి వుండవచ్చును. కాని ఒక ప్రాంతం ఒక దశలో వుండే పక్క ప్రాంతం ముందు దశలోనో తరువాతి దశలోనో వుంది. గంగా యమునా తీర ప్రాంతంలో స్థిర వ్యవసాయ గ్రామాలు ఏర్పడుతున్న కాలంలో దక్కన్‌లో ఇంకా ఆహార సేకరణే జీవనాధారంగా వుంది.

అయితే ఈ వైవిధ్యానికి ఒక క్రమం వుంది. చరిత్రకు అంతస్సూత్రంగా నడిచిన ఈ ఆర్థిక క్రమం ఎక్కడి కక్కడ స్వతంత్రంగా ప్రారంభం కాలేదు. అది ఒక చోట ప్రారంభమయి ఇతర ప్రాంతాలకు విస్తరించింది. కోశాంబి వివరణలో మన చరిత్ర కాలక్రమంలోనే కాక భౌగోళికంగా గూడ 'ప్రవహిస్తుంది'. ఆహార ఉత్పత్తిని అలవర్చుకొని నాగరికులయిన వాళ్ళు తమ పరిసరాలలోని ఆటవికులకు గూడ ఆహార ఉత్పత్తిని అలవర్చి తమకు లోబరచుకున్నారు. దానికి కావలసిన సామాజిక నిర్మాణాన్ని (ఉత్పత్తి సంబంధాలను) వాళ్ళకు సమకూర్చారు. పంజాబులో ప్రారంభమయిన ఈ మార్పు తూర్పు దిక్కుగా బీహార్ చేరి, అక్కడి నుండి 'దక్షిణాపథం' మీదుగా గోదావరి తీరం చేరి అక్కడినుండి పడమటి దక్కన్‌కు, తూర్పున గోదావరి ఒడ్డున ఆంధ్ర ప్రాంతానికి విస్తరించింది. ఆ క్రమంలో తొలినాటి సమాజం సంఘర్షణకూ మార్పుకూ సమ్మేళనానికి లోనయింది. "చరిత్రలో చూస్తే మనకు కనిపించే దేమిటంటే ఆహారాన్ని సేకరించి జీవించే జనం పల్చగా పరచుకున్న దేశంలో ఆహారాన్ని ఉత్పత్తి చేసే సమాజం నెమ్మదిగా విస్తరించడం"[15] అనీ, "గణాలు నివసించే భూమిలోకి వ్యవసాయక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ విస్తరించడం భారతదేశంలోని మొట్ట మొదటి గొప్ప సామాజిక విప్లవం"[16] అనీ కోశాంబి అంటాడు. దీని వివరణ, ఫలితాల విశదీకరణ, తరువాతి అధ్యాయాలలో చూద్దాం.

## వివరణలు

1. Urvasi and Pururavas, Myth and Reality (hereafter referred to as 'MR') పేజీ 67, పాద సూచిక.

2. కోశాంబి ఇచ్చే ఉదాహరణలు ఎక్కువగా తెలుగు పాఠకుడికి అందుబాట్లో లేని పుస్తకాలలోనివి. కాబట్టి, మనకు అనువయిన ఉదాహరణ ఒకటి ఇచ్చుకుంటే బాగుంటుంది. ప్రముఖ రచయిత్రి తెన్నేటి హేమలత గారు తన 'లత రామాయణం'లో ఒక చోట, ఋగ్వేదంలో ఏనుగుల ప్రస్తావన లేదు కాబట్టి ప్రపంచంలో ఏనుగులు లేక పూర్వమే వేదాలు ఉన్నాయని అన్నారు. జీవశాస్త్రజ్ఞుల ప్రకారం ఏనుగులు ప్లియోసీన్ యుగం నుండి (అంటే దాదాపు ఒక కోటి సంవత్సరాల నుండి) వున్నాయి. అప్పటికి వేదాలు కావు సరికదా, అసలు మనుషులు లేరు. బ్రహ్మదేవుడు వేద విజ్ఞానాన్ని మన పూర్వీకులయిన ఆదివానరాలకు అందజేసి పోయాడనుకోవలసి వుంటుంది.

3. Culture and Civilization of Ancient India (hereafter referred to as 'CCAI') Page 13, Page 51
   Marxism and Ancient Indian Culture, D.D. Kosambi on History and Society (hereafter referred to as 'HS'), Page 75
   On a Marxist Approach to Indian Chronology, HS, Page 81
4. CCAI, Page 10
5. CCAI, పేజీ 54, హైదరాబాద్‌లోని ఒక్కొక్క 'గూడ' ఒకప్పుడు ఒక గూడెం అని గుర్తిస్తే ఆ నగర నిర్మాణంలోని అరాచకత్వం అర్థమవుతుందేమో!
6. ప్రాచీన తమిళ 'సంగం' సాహిత్యంలో ఇటువంటి రచనలున్నాయి. కోశాంబి కల్హణుడి రాజతరంగిణిని విశ్లేషించిన వ్యాసం The Origins of Feudalism in Kashmir, HS, పేజీలు 115–126.
7. Introduction to the Study of Indian History (hereafter referred to as 'ISIH') Pages 2-3
8. ISIH, Pages 3-10
9. Urvasi and Pururavas, MR, Page 44
10. Marxism and Ancient Indian Culture, HS, Page 75
11. ISIH, Pages 2-3
    What Constitutes Indian History, HS, Pages 68-69
12. CCAI, Page 10
13. What Constitutes Indian History, HS, Page 67
14. ISIH, Page 13
15. What Constitutes Indian History, HS, Page 69
16. CCAI, Page 10
    ISIH, Page 1
    What Constitutes Indian History, HS, Page 69
17. CCAI, Page 11
18. ISIH, Pages 8-9

19. CCAI, Page 12, ISIH, Pages 9-10
20. ISIH, మొదటి అధ్యాయం
    CCAI, మొదటి అధ్యాయం
21. Social and economic aspects of the Bhagavadgita, MR, Page 14
22. Science and Human Progress, D.D. Kosambi commemoration Volume, Page 331
23. ISIH, ముందు మాట
24. Combined methods in Indology, HS, Page 5
25. CCAI, Pages 50-51
26. The Basis of Ancient Indian History, HS, Page 27

# 2. ఆహార సేకరణ-ఆహార ఉత్పత్తి

ఆహారాన్ని సేకరించడానికి ఆహారాన్ని ఉత్పత్తి చేయడానికి మౌలిక మయిన తేడా వుంది. ఈ తేడా ఉత్పత్తి శక్తులలోనూ ఉత్పత్తి సంబంధాలలోనూ గూడ కన బడుతుంది. ఆహార సేకరణకు పనిముట్ల అవసరం తక్కువ. జంతువులను చంపడానికి వాటి చర్మం బలవడానికి కావలసిన పరికరాలుంటే చాలును. చంపిన జంతువు మాంసాన్నిగాని ఇతర ఆహారాన్ని గాని నిలువ ఉంచుకునే టట్టయితే దానికి కుండలో, బుట్టలో కావాలి. ఈ-రకమయిన సాధనాలతో చేసే ఆహార సేకరణలో మిగులు ఉండదు. అంటే 'అదనపు ఉత్పత్తి' వుండదు. సమాజంలో వర్గవిభజన వుండదు.

ఆహారాన్ని ఉత్పత్తి చేయడం అనేది రెండు విషయాలలోనూ ఇందుకు భిన్న మయినది. నాగళ్ళు, పశువులు, పార, కొడవలి, గొడ్డలి మొదలైన సాధనాలు కావాలి. ఉత్పత్తిలో మిగులు గూడ సాధారణంగా వుంటుంది. ఈ అదనపు ఉత్పత్తిని చేజిక్కిం చుకునే ఒక పాలక వర్గం వుంటుంది. ఇటువంటి సమాజాన్ని మనం మామూలుగా 'నాగరిక' సమాజం అంటాము. ఈ రెండు దశలకూ సంధి దశగా కనబడే పశు పోషక సమాజాలు సాధారణంగా వర్గసమాజాలు కావు. అయితే ఆటవిక సమాజాల కంటె సంపన్నమయినవి.

మన దేశంలో నాగరికత ప్రారంభమయినప్పటి నుండి, అల్ప సంఖ్యాకులుగా వున్న నాగరిక సమాజాల చుట్టూ అత్యధిక సంఖ్యలో ఆహారాన్ని సేకరించే ఆటవికు లున్నారు. నాగరికులు వీళ్ళకు ఆహార ఉత్పత్తిని అలవాటు చేయడం, వాళ్ళను శ్రామికులుగా తమకు లోబరచుకోవడం, లేదా వాళ్ళలోనే వర్గవిభజనను ప్రవేశ పెట్టడం, మన దేశంలోని ప్రధాన చారిత్రక క్రమం. మన ప్రాచీన చరిత్రను ఆద్యంతం కోశాంబి ఈ దృష్టితోనే చూస్తాడు.

నాగరికులూ ఆటవికులూ తలపడినప్పుడు మూడు పరిణామాలు సంభవం. ఒకటి, నాగరికులు ఆటవికులను వాళ్ళ నివాస స్థలాల నుండి తరిమివేయడం ద్వారా గాని లేదా బలప్రయోగంతో బానిసలుగా లొంగ దీసుకోవడం ద్వారాగాని వాళ్ళ నివాసస్థలాలను తాము ఆక్రమించుకో వచ్చును. ఆధునిక కాలంలో అమెరికా, ఆస్ట్రేలియా దేశాలలో ఇదే జరిగింది. రెండు, ఆటవికులకు వ్యవసాయం నేర్పి కర్షకులుగా మార్చి తమ నాగరిక సమాజం దిగువ భాగంలో శ్రామిక వర్గంగా చేర్చుకోవచ్చును. మూడు, వాళ్ళలోగూడ వర్గవిభజన ప్రవేశపెట్టి కొందరు కర్షకులు, కొందరు పాలకులుగా

వాళ్ళను విభజించి తద్వారా వ్యవసాయక సమాజాన్ని విస్తరింప జేయవచ్చును. ఇందులో మొదటి దాని కంటె రెండవవి, మూడవది మన దేశ చరిత్రలో ఎక్కువగా జరిగాయని కోశాంబి అభిప్రాయం. అణచివేతకంటె కలుపుకోవడం (assimilation) మన చరిత్రలో ప్రధాన విషయం అంటాడు. అయితే ఈ కలుపుకోవడం అనేది సమాన ప్రాతిపదిక మీద కాదు, నాగరికుల ఆధిపత్యం క్రింద. ఈ కలుపుకునే క్రమంలో సాంస్కృతిక లేక పూజల సమ్మేళనం (cult syncretism) జరిగింది. ఆటవికుల దేవతలు నాగరికుల దేవుళ్ళ భార్యలుగా భక్తులుగా వాహనాలుగా అవతారాలుగా అంగీకరించబడ్డారు. ఈ సమ్మేళనంలో గూడ నాగరికుల పూజలదే పైచేయి.

మనదేశ చరిత్రలో వ్యవసాయ విస్తరణ బలప్రయోగం కంటె సామాజిక సంలీనం సాంస్కృతిక సమ్మేళనల ద్వారా ఎక్కువ జరిగిందనేది కోశాంబి అవగాహనలో అత్యంత ముఖ్యమయిన విషయం. అప్పుడప్పుడు వ్యవసాయ విస్తరణ 'శాంతి యుతం'గా జరిగిందని గూడ అంటాడు. అంటే ఆయుధాల ప్రయోగం ఎక్కువగా జరగలేదని అర్థం-ఆటవికులను మాలమాదిగలుగా లోబరచుకోవడం ప్రశాంతమైన సంలీనం అని అర్థం కాదు. భౌతిక బలప్రయోగం కంటే సామాజిక అణచివేత సాంస్కృతిక ఆధిపత్యాల ద్వారా వ్యవసాయ విస్తరణ ఎక్కువగా జరిగిందని విశదీకరిస్తే అది కోశాంబి విశ్లేషణకు తగిన వివరణ అవుతోంది.

ఈ వివరణ తెలుసుకునే ముందు ఆహార సేకరణ మీద జీవించే ఆటవికుల గురించి తెలుసుకోవాలి.

ప్రాచీన చరిత్రను మామూలుగా పురావస్తు శాస్త్రజ్ఞులు, చరిత్రకారులు, పాత రాతి యుగం, కొత్తరాతి యుగం, కంచు లేక రాగి యుగం, ఇనుము యుగం అని విభజిస్తారు. పనిముట్లను[1] తయారు చేయడానికి ఉపయోగించిన పదార్థాన్ని బట్టి ఈ విభజన చేస్తారు. రాతి పనిముట్ల తయారీ చాలా మొరటుగావున్న కాలాన్ని పాత రాతి యుగం అనీ, కొంత సున్నిత మయిన పనిముట్లు తయారు చేసే సామర్థ్యం అలవడిన తరువాతి కాలాన్ని కొత్తరాతి యుగం అనీ, అంటారు. ఈ రెంటికి మధ్య దశను మధ్యరాతి యుగం (mesalithic age) అనడం కద్దు. రాగి, కంచు, ఇనుము లోహాల వాడకం అలవాటయిన దశలను ఆయా పేర్లతో పిలుస్తారు. ఈ లోహాల వాడకానికీ రాతి పనిముట్ల వాడకానికీ గలతేడా కేవలం పనిముట్ల ముడిపదార్థంలోనే కాదు. రాతి పనిముట్లను ప్రకృతిలో దొరికే రాళ్ళను పదును పెట్టుకోవడం ద్వారా తయారు చేస్తారు. దానికి భౌతికశ్రమ, కొంత నిపుణత, మాత్రమే కావాలి. కాగా, లోహాలు ప్రకృతిలో స్వచ్ఛంగా దొరకవు. ఖనిజాల రూపంలో దొరుకుతాయి. ఖనిజాన్ని పరిశుభ్రపరచి ముడి లోహాన్ని తయారు చేసుకొని దానితో పనిముట్లు చేసుకోవాలి. దీనికి చాలా శ్రమకావాలి, సాంకేతిక పరిజ్ఞానం కావాలి. సమాజంలో కొంత మంది పూర్తికాలం దీనికే వినియోగించాలి. కాబట్టి ఆహారంలో అదనపు ఉత్పత్తి

ఉండాలి. ఆ అదనపు ఉత్పత్తిని చేజిక్కించుకొని లోహాల తయారీకి వినియోగించే ఒక పాలక వర్గం ఉండాలి. అందుకే ఆహార సేకరణ కాక, ఏదో ఒక మేరకు ఆహార ఉత్పత్తి చేయగల సమాజాలలోనే లోహాల వాడకం కనబడుతుంది. ఆహార సేకరణ కొత్త రాతి యుగంతో అంతమవుతుంది.[3]

కాని, పనిముట్ల ముడిపదార్థాన్ని బట్టి చేసే ఈ చారిత్రక కాల విభజన పూర్తిగా శాస్త్రీయమైనది కాదు. పనిముట్లు ఉత్పత్తి శక్తులలో ఒక భాగం మాత్రమే (ప్రాచీన కాలంలో చాలా ముఖ్యమైన భాగం). మొత్తం ఉత్పత్తి శక్తులు ఉత్పత్తి సంబంధాలు కలిస్తే గాని నిర్ణాయకం కాదు. నిజానికి ఈ వివిధ లోహాల సామాజిక పాత్ర కూడ అప్పుడే పూర్తిగా అర్థం అవుతుంది. సామాజిక పాత్రలో ఇనుముకూ కంచుకూ సామ్యం లేదు. ఇనుము విస్తారంగా దొరికే చవక లోహం కావడంవల్ల అది ఉత్పత్తి శక్తులలో గణనీయమయిన అభివృద్ధిని సాధిస్తుంది. రాగి (దాని మిశ్రమమయిన కంచు) విరివిగా దొరకవు కాబట్టి ఉత్పత్తి శక్తుల అభివృద్ధిలో వాటికి గల పాత్ర స్వల్పం. అవి ప్రధానంగా ఉపయోగపడేది కొత్తగా ఏర్పడ్డ పాలక వర్గం ఆయుధాల తయారీకోసం, దేవతల విగ్రహాల తయారీ కోసం.[3] కాబట్టి మొత్తం ఉత్పత్తి శక్తులు ఉత్పత్తి సంబంధాలను-అంటే సామాజిక భౌతికజీవిత నిర్మాణ స్వభావాన్ని-దృష్టిలో వుంచుకొని ప్రాచీన సమాజాన్ని అర్థం చేసుకోవాలి.[4]

## ఆహార సేకరణ

ప్రకృతిలో సహజంగా దొరికే ఆహారాన్ని-ధాన్యం, పండ్లు, దుంపలు, జంతువులు-సేకరించి లేక వేటాడి జీవించే మానవులు చిన్నచిన్న గుంపులుగా ఏర్పడతారు. ఇది రక్షణ కోసం అవసరం. అంతకంటే ముఖ్యంగా, ప్రతిరోజూ ప్రతి ఒక్కరూ తమకు సరిపోయేంత ఆహారం సేకరించలేక పోవచ్చు కాబట్టి, ఎక్కువ సేకరించిన వాళ్ళు సేకరించలేక పోయిన వాళ్ళతో తమ తిండిని పంచుకునే ఏర్పాటు అవసరం. మిగిలిపోయిన ఆహారాన్ని నిలవ ఉంచుకునే పరికరాలూ పరిజ్ఞానం ఆదిమ కాలంలో ఉండవు కాబట్టి ఇది ఉభయ తారకం.

ఈ గుంపు వ్యవస్థీకృతమయినప్పుడు ఒక 'కుదురు' (clan) అవుతుంది. వ్యవస్థీకృతం కావడం అంటే (i) తిండి పంపకం ఒక కర్మకాండ యుతమయిన ఆచారంగా రూపొందడం, (ii) లైంగిక సంబంధాలలో బాహ్యనిషేధం (endogamy) ఏర్పడడం. అంటే గుంపులోని స్త్రీ పురుషులు గుంపుకు చెందనివారితో(ఇతర గుంపులకు చెందిన వారితో) కలవడం నిషిద్ధం అవుతుంది. వాళ్ళు తమ గుంపులోని వారితో మాత్రమే లైంగిక సంపర్కం పెట్టుకోవాలి. అయితే 'ఆదిమ కమ్యూనిస్టు సమాజంలో' గుంపు మొత్తం ఒక సహకార సంఘంలాగ ఆహారాన్ని సమిష్టిగా సేకరించి మొత్తం సేకరించిన దాన్ని అందరికీ సమంగా పంచుకుంటారనే అభిప్రాయాన్ని కోశాంబి

పలుచోట్ల విమర్శించాడు.[5] ఆదిమ సమాజంలోని గుంపు తత్వాన్ని ఆదర్శవంతమయిన సమానత్వంగా భావించడం రూసో వంటి రచయితల ప్రభావమేగాని మార్క్సిస్టు దృక్పథం కాదు.

ఒక ప్రాంతంలో సంచార నివాసం ఏర్పరచుకొని ఆహార సేకరణ ద్వారా జీవనం సంపాదించుకునే కుదురు తన ఆహార సేకరణను ప్రధానంగా (పూర్తిగా కాక పోవచ్చు) ఒక వస్తువుకు పరిమితం చేస్తుంది. గుంపు మొత్తం ఒక దుంపను గాని ఒక అడవి ధాన్యాన్ని గాని లేక ఒక జంతువునుగాని సేకరించడంలో 'స్పెషలైజ్' చేస్తుంది. ఆహార సేకరణ ఆషామాషీ వ్యవహారం కాదు (వేట విషయంలో ఇది విదితమే). అటువంటప్పుడు ఈ స్పెషలైజేషన్ చాల సహజమయిన విషయం. దానివల్ల సేకరణలో నిపుణత పెరిగి ఉత్పాదకత పెరుగుతుంది. ఈ విధంగా ఒక కుదురు తన ప్రత్యేకతగా ఎంచుకున్న ఆహారపదార్థం (మొక్కగాని, దుంపగాని, ఫలంగాని, జంతువు గాని) ఆ కుదురుకు 'చిహ్నం' (Totem) అవుతుంది. ఆ కుదురుకు తన కుదురు చిహ్నమయిన ఆహార పదార్థంతో కేవలం భోజన-భోక్త సంబంధం కాక అంతకు మించిన ఆధ్యాత్మ సంబంధం వుందని భావిస్తారు. తామంతా దాని 'అంశ' అనీ, దానితో తమకు 'సాధర్మ్యం' వుందని అనుకుంటారు. దాన్ని పూజిస్తారు. మంత్రం, లేఖనం, నాట్యం, గానం, అన్ని కళలూ ఈ ఉపాసన నుండే పుట్టాయి.[6] ఈ ఉపాస నకు కీలక మయినది అనుకరణ మంత్రం. ఎద్దును వేటాడేవారు ఎద్దుబొమ్మ వేసి దాని వీపులో బాణం గుచ్చుకున్నట్టు వేస్తారు. అట్లాచేస్తే నిజంగానే ఎద్దు వేటలో సాఫల్యం పొందుతామని భావిస్తారు. ఆ నమ్మకం వల్ల మానసిక స్థైర్యం పెంపొందడం దాని భౌతిక ప్రయోజనం.[7] ఇది చాలా స్పష్టమయిన ఉదాహరణ. ఇంతకంటే చాలా సంకీర్ణ మయిన ఆటవిక కళ, కర్మకాండ, అనుకరణ మంత్రం నుండే పుట్టాయి.

తరువాతి కాలంలో ఆటవిక కుదురు ఆహార సేకరణ మాని ఆహార ఉత్పత్తిని చేపట్టి, వ్యవసాయక సమాజంలో అట్టడుగు స్థానంలో వచ్చి చేరినప్పుడు ఈ కుదురు చిహ్నం తరచుగా ఇంటి పేరుగా మిగిలి పోతుంది. ఈ కారణంగానే కొన్ని గ్రామాలలో ఒకే ఇంటిపేరుగల కుటుంబాలు చాలా వుంటాయి. మహారాష్ట్రలో మోరె (నెమలి) అనే ఇంటిపేరు ఈవిధంగా కుదురు చిహ్నం నుండి వచ్చిందేనని కోశాంబి అంటాడు.[8] మనలో మాదిగ కులస్తులకు పిల్లి, ఎద్దు, పాము మొదలైన ఇంటి పేర్లుంటాయి. వీళ్ళు ఒకప్పుడు ఆయా జంతువులను కుదురు చిహ్నాలుగా కలిగిన ఆటవికులయి వుండాలి. నాగరిక సమాజం వాళ్ళచేత వేట మాన్పించి వాళ్ళను కూలీలుగా లొంగదీసుకున్నప్పుడు అవి ఇంటిపేర్లయ్యాయి. కాపు, కమ్మ, రెడ్డి తదితర వ్యవసాయ కులస్తులలో గూడ తరచుగా మొక్కల పేర్లు, చెట్ల పేర్లు, ఇంటిపేర్లగా వుంటాయి (రావి, మర్రి, వేప, నిమ్మ మొదలయినవి). ఈ చెట్లన్నీ ఆయా ప్రాంతాలలో పవిత్రమైనవిగా భావించబడతాయి కాబట్టి ఇవి కుదురు చిహ్నాలయి వుండాలి.

అయితే ఆటవిక కుదుర్లు నాగరిక సమాజానికి లోబడడం తరువాతి కాలపు మార్పు. వాటి సహజ పరిణామంలో మొదటి మార్పు, కొన్ని కుదుర్లు కలిసి ఒక తెగ లేక గణం (tribe)గా ఏర్పడడం. విభిన్నమయిన ఆహారపదార్థాలను సేకరించే కుదురులు ఒక గణంగా ఏర్పడడం వల్ల ఒకరు సేకరించిన ఆహారాన్ని మరొకరి ఆహారంతో మార్చుకుంటారు. దీనివల్ల ఆహారంలో వైవిధ్యం పెరిగి అది పుష్టికరం కావడం ఒక భౌతిక ప్రయోజనం. లైంగిక నియమాలలో గూడ ఇప్పుడు మార్పు వస్తుంది. అంతవరకు కుదురులోని స్త్రీ పురుషులకు తమ మధ్యనే తప్ప ఇతరులతో లైంగిక సంబంధాలు నిషిద్ధం. ఇప్పుడు తెగగా ఏర్పడ్డ తరువాత ఒకే కుదురులోని స్త్రీ పురుషులకు పరస్పర లైంగిక సంబంధాలు నిషిద్ధమవుతాయి. కుదురులో లైంగిక అంతర్నిషేధం (exogamy) వస్తుంది. ఒక కుదురులోని వారంతా 'సగోత్రీకులు' అవుతారు. అయితే తెగ మొత్తం బాహ్య నిషేధాన్ని పాటిస్తుంది. అంటే ఒక తెగలోని వారు తమ తెగలోని (ఇతర కుదురుల) వారితోనే తప్ప ఇతర తెగలతో సంపర్కం పెట్టుకోగూడదు. ఒకే తెగలోని కుదురుల మధ్య గుంపు వివాహం గూడ ఈ దశలో ప్రారంభమవుతుందని కోశాంబి భావిస్తాడు.[9]

మరొక విచిత్రమయిన అభావం గూడ వుంది. అంతవరకు ఏ ఆహారమయితే కుదురు యొక్క ప్రధాన ఆహారంగా, కుదురు చిహ్నంగా, వుండిందో అది ఇప్పుడు పూర్తిగా నిషిద్ధం అయిపోతుంది. దానిని తినడం పాపం అనీ అశుభం అనీ రకరకాల నిషేధాలు అమలులోనికి వస్తాయి. దానిని ఇకపైన ఆ కుదురులోని వాళ్ళు వేటాడడానికీ సేకరించడానికీ వీలులేదు. ఒక్కొక్క సారి అది ఆ కుదురుకు ఆరాధ్యం అవుతుంది. విచిత్రమైన ఈ మార్పుకు అత్యంత ప్రముఖమైన ఉదాహరణ, వేదకాలంలో ప్రధానంగా గోమాంస భక్షకులగా వున్న ఆర్యులు వ్యవసాయకులయిన తరువాత గోమాంసాన్ని పూర్తిగా నిషేధించడం[10] అని కోశాంబి అంటాడు.

ఒక తెగలోకి వచ్చి చేరిన కుదురులు తాము సేకరించిన ఆహారాన్ని పరస్పరం మార్పిడి చేసుకుంటాయి. ఈ ఆహార మార్పిడే గుంపు లైంగిక సంబంధాలకు పునాది అని కోశాంబి భావిస్తాడు. ఈ మార్పిడి ఒక కర్మకాండగా, పబ్బంగా, జరుగుతుంది. ఇది కుంద మార్పిడి (barter) కాదు. ఇందులో సమాన విలువలను మార్పిడి చేసుకోవడం అనే ఆలోచనలేదు. అయితే తీసుకున్న వాడు భవిష్యత్తులోనయినా గౌరవానికి భంగం కలగకుండ తిరిగి ఇస్తాడన్న ఆచారం, విశ్వాసం వుంటాయి. ఇవి వ్యాపారం కంటె కర్మకాండకు చాలా సన్నిహితమయిన మార్పిడి. కుదురులేకాక, తెగలు గూడ ఈ విధంగా పరస్పరం ఆహారం మార్పిడి చేసుకుంటాయి.

## అమ్మ దేవతలు

ఈ రకమయిన కుదురు-తెగ నిర్మాణం వున్న గణ సమాజాల సామాజిక

వ్యవస్థను పరిశీలించాలి. ఈ వ్యవస్థలో రాతి పనిముట్లు తప్ప వేరే ఉత్పత్తి సాధనాలు లేవు. ఆహారం పూర్తిగా ప్రకృతి సంపద మీదనే ఆధారపడింది. దానిని వెతుక్కుంటూ సంచరిస్తూ జీవిస్తారు. స్థిర నివాసం గాని, ఇళ్ళుగాని వుండవు. ఈ వ్యవస్థలో మాతృత్వానికే తప్ప పితృత్వానికి గుర్తింపులేదు. దీనిని మాతృస్వామ్యం అనే కంటే మాతృప్రధాన లేక మాతృ పారంపర్య (**Matrilineal**) వ్యవస్థ అనడం సబబు. ప్రతి వ్యక్తికీ తన తల్లిద్వారానే గుర్తింపుగానీ తండ్రిద్వారా కాదు. పిల్లలనుకనే స్త్రీలాగ ప్రకృతి గూడ ఫలసాయాన్ని ఇస్తుంది కాబట్టి ప్రకృతిని దేవతగా భావించు కుంటారు. రాతియుగపు దేవతలంతా స్త్రీలే. పశుపోషణ వచ్చి పురుషుల చేతిలోకి పశుసంపద చేరి పితృస్వామ్య సమాజం ఏర్పడిన తరువాతే మగదేవుళ్లు వచ్చారు. అప్పుడు పాత దేవతలను కొత్త దేవుళ్లకు భార్యలను చేశారు.

ఈ దేవతలను అమ్మ దేవతలు (**Mother goddesses**)అంటారు. అన్ని భాషలలోనూ ఈ దేవతల పేర్లు మాతృత్వాన్ని సూచించే శబ్దంతో అంతమవుతాయి. దాన్నిబట్టే ఈ దేవతలకు ఫలసాయంతో వున్న సంబంధం అర్ధమవుతుంది. తెలుగులో గంగమ్మ, పోచమ్మ, మైసమ్మ, నూకాలమ్మ, ముత్యాలమ్మ, పైడితల్లి మొదలయిన పేర్లు గల దేవతలు అన్ని గ్రామాలలోనూ వుంటారు. కోశాంబి చాలా వివరంగా అధ్యయనం చేసిన మహారాష్ట్ర దక్కన్ ప్రాంతపు దేవతల పేర్లు కాలూబాయి (నల్లటి తల్లి), లాడూబాయి (ప్రియమైనతల్లి), అంబాఆయి (అమ్మతల్లి) మొదలయినవి.[11] ఈ అమ్మదేవతల పూజలు తొలినాడు స్త్రీలే నిర్వహించే వారు. అంతేకాదు, ఆ పూజా స్థలాల దగ్గరకు పురుషులు పోవడానికి వీలు లేదు. అమ్మదేవతల పూజాస్థలం దగ్గర సాధారణంగా ఒక వనం వుంటుంది.[12] ఆ వనంలోకి పురుషులు ప్రవేశిస్తే శిరచ్ఛేదం చేస్తారు.

శాంతం, సౌమ్యం 'స్త్రీ సహజ' మయిన గుణాలు కావనీ పితృస్వామిక సమాజం కల్పించిన విలువలనీ గుర్తించడానికి అమ్మదేవతల స్వరూపమే నిదర్శనం. వీళ్ళకు సాధారణంగా ఒక స్పష్టమైన రూపం వుండదు. ఉన్నా ఎంత మాత్రం అందంగా, సౌమ్యంగా వుండదు. రాతిమీద వికృతంగా చెక్కబడి వుంటుంది. ఈమెను మంచి చేసుకొని ఫలసాయం ఇనుమడింప జేసుకోవడం కోసం బలులు (జంతుబలులు గానీ నరబలులు గానీ) ఇస్తారు. బలిఇచ్చిన జంతువురక్తాన్ని విగ్రహానికి పూస్తారు. ఆరాధకులు ఆ రక్తంతో బొట్లు పెట్టుకుంటారు. ఇప్పుడు బలులు తగ్గిపోయినా అమ్మదేవతల విగ్రహాలకు (హనుమంతుడి వంటి కొందరు మగదేవుళ్ళ విగ్రహాలకు గూడ) ఎల్లప్పుడూ ఎర్రటిరంగు పూసి వుంచుతారు. నాగరికుల బ్రాహ్మణ మతంలో ఈ అలవాటు అభావం చెంది ఎరుపు నిషిద్ధం అవుతుంది. బ్రాహ్మణుల పూజలలో సాధారణంగా ఎర్రటి పూలు వాడరు. కాని రక్తబలులకు చిహ్నంగా ఇప్పటికి పూజ అయిన తరువాత ఎర్రటి కుంకుమతో నుదుటమీద బొట్టు పెట్టుకుంటారు.

ఆటవికులు నాగరికులకు లోబడిన తరువాత అమ్మ దేవతలను లక్ష్మి, పార్వతి

మొదలైన బ్రహ్మణ దేవతల 'అంశ'గా గుర్తిస్తారు. అయితే పాత లక్షణాలు ఇంకా మిగిలిపోతాయి. వాడెం-ఘోడెం అనే గ్రామంలో పార్వతి ప్రతిరూపంగా గుర్తించబడే బోల్లా-అయి అనే అమ్మదేవత గురించి చెపుతూ "గుడిలోని మూల విగ్రహం కోరలతో, భయం గొలిపే కనుగుడ్లతో, వికారంగా వుంటుందిగాని ఊరేగింపులో తీసుకుపోయే ఉత్సవ విగ్రహం మాత్రం చక్కటి కంచుతో చేసిన పార్వతి విగ్రహం" అంటాడు కోశాంబి.[13] మనదగ్గర కాళిక, భద్రకాళి, దుర్గ, గంగమ్మ మొదలయిన పేర్లతో పార్వతి అంశగా గుర్తించబడే అందరు దేవతల గుళ్ళలోనూ ఈ తేడా కనబడుతుంది. ఉత్సవ విగ్రహాలకు నోచుకోని రోడ్ సైడు గుళ్ళలో గూడ ఈ విషయం గమనించ వచ్చును. గుడిలోపల విగ్రహం స్థానంలో మొరటు రాయి వుంటుంది. గుడిబయటి గోడల మీద మాత్రం పౌరాణిక వర్ణనల పోలికలో అందమయిన తైలవర్ణ చిత్రాలుంటాయి.

అమ్మదేవతలలో కోశాంబి రెండు రకాలను గుర్తిస్తాడు. కొందరు నీటి దేవతలు. వీళ్ళ పూజాస్థలాలు, చెరువులు, వాగులు, నదులు, జలపాతాలు తదితర నీటివనరుల దగ్గరుంటాయి. ఆ నీటి వనరులకు ఈ దేవతలను అధినేతలుగా భావిస్తారు.

రెండవరకం కూడలి దేవతలు. ఆహార సేకరణ కోసం గుంపులుగా తిరిగే కుదురులు లేక గణాలు తాము సేకరించిన ఆహారాన్ని పరస్పరం పంచుకోవడంకోసం అప్పుడప్పుడు కలుసుకుంటాయి. ఈ స్థలాలు కొన్ని కాలిబాటల కూడలి స్థలాలుగా కనబడతాయి. ఈ కూడలుల దగ్గర అమ్మదేవతలుంటారు. ఎందుకంటే ఆటవికుల ఆహార మారకం ఆధునిక పెట్టుబడిదారీ వ్యాపారంగాని కొంత ప్రాచీనమయిన కుండ మార్పిడి (barter) గానీ కాదు. ఆటవికులు తమ మారకాన్ని ఒక కర్మకాండ యుతమైన ఆచారంగా నిర్వహిస్తారు. దానిని పర్యవేక్షించే దేవతలు ఈ కూడలి దేవతలు. కూడలి దేవతల పూజాస్థలాలను, అక్కడ వచ్చిన మార్పులను, పరిశీలించి కోశాంబి ప్రాచీన చరిత్రను- ఆహార సేకరణ నుండి ఆహార ఉత్పత్తికి జరిగిన పరిణామాన్ని-వివరంగా నిరూపిస్తాడు.[14] ఈ వివరణను తరువాత చూద్దాం.

ఆహారాన్ని సేకరించి జీవించే ఆటవిక సమాజపు ఉత్పత్తి శక్తులలో వచ్చే మొట్టమొదటి మార్పు, ఆహారాన్ని నిలవ ఉంచే పరికరాలను తయారు చేసుకోవడం. ఇది ఆహార సేకరణలోని ఆటుపోట్ల దుష్ప్రభావాన్ని తగ్గించి జీవితాన్ని గుణాత్మకంగా మెరుగు పరుస్తుంది. కుండలు బుట్టలు తయారు చేయడం ఈ విధంగా మొదలవుతుంది. వీటిని చాలా సమాజాలలో స్త్రీలే తయారుచేస్తారు. కుండలు, ఆహారం నిలవకోసం-అంటే ఒక ఉత్పత్తి సాధనంగా- ఆవిర్భవించాయనడానికి నిదర్శనంగా అవి అమ్మదేవతల పూజలలో ముఖ్య భాగమవుతాయి. ఇప్పటికీ అమ్మదేవతల పేరుమీద జరిపే బోనాల వంటి పండుగలలో కుండలకు ప్రముఖ స్థానముంది. బ్రాహ్మణ మతానికి చెందిన దేవతల (లక్ష్మి, సరస్వతి) పూజలలో గూడ కలశాలు పెడతారు. ఈ దేవతల పూజలు ఇళ్ళల్లో స్త్రీలే నిర్వహించడం, వైదిక కర్మకాండలో కలశాలకు ప్రధాన స్థానం లేకపోవడం,

గమనించదగ్గ విషయాలు. దీనిబట్టే ఈ దేవతలంతా ఒకప్పుడు ఆటవికుల అమ్మ దేవతలగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగివున్నారనీ తరువాతి కాలంలో . నాగరికులకు ఆటవికులు లోబడిన తరువాత-ఆహార సేకరణ మాని ఆహార ఉత్పత్తి సమాజంలో అడుగుభాగాన వచ్చి చేరిన తరువాత-ఆ లొంగుబాటుకు చిహ్నంగా ఈ అమ్మ దేవతలను నాగరికుల మగ దేవుళ్ళకు భార్యలగా స్వీకరించడం జరిగిందని, అర్థమవుతుంది. ఈ పరిణామం మొత్తం శివుడి 'భార్య' అయిన పార్వతిలో స్పష్టంగా కనబడుతుంది. లక్ష్మి, సరస్వతి పూర్తిగా భూస్వామ్య సమాజపు ఉత్తమ ఇల్లాళ్ళగా మారిపోయారుగాని పార్వతి స్వయంగా కాకున్నా దుర్గ, కాళిక మొదలయిన దేవతల రూపంలో ఆటవిక లక్షణాలను స్పష్టంగా ప్రదర్శిస్తుంది. నాలుగు చేతులు, కోరలు, రక్తంతో తడిసిన నాలుక, ఇవేవీ బ్రాహ్మణ దేవతల లక్షణాలు కావు.

కుండలు అమ్మదేవతల కర్మకాండలో ప్రముఖ పాత్ర వహించడమేకాక తామే అమ్మదేవతల ప్రతిరూపాలగా పూజలందుకుంటాయి. ప్రాచీనకాలం నుండి ఇప్పటి దాకా కుండలను తయారు చేసేవాళ్లు మెడ భాగం దగ్గర అలంకరణ కల్పిస్తారు. అది స్పష్టంగా స్త్రీత్వాన్ని సూచిస్తుంది. చనిపోయిన వాళ్ళు తిరిగి తల్లి గర్భంలోకి పోతారన్న నమ్మకం ఉండడం వల్ల చాలా ప్రాచీన సమాజాలలో చనిపోయిన వాళ్ళ శవాలను మాతృగర్భానికి సంకేతమయిన కుండలలో పూడ్చిపెడతారు.[15] పాశ్చాత్యులు ఇప్పటికీ శవపేటికలో పెట్టి పూడుస్తారు.

## అమ్మదేవతల పరిణామం, నాగరికత

అమ్మదేవతల పూజలలోని[16] పరిణామాలను బట్టి ప్రాచీన కాలపు మొట్టమొదటి సామాజిక విప్లవం[17] -ఆహార సేకరణ నుండి ఆహార ఉత్పత్తికి జరిగిన పరిణామం తీరుతెన్నులను నిర్ణయించడంలో కోశాంబి ఒక పద్ధతిని అవలంబిస్తాడు. ఆయన చేసిన నిర్ణయాలతో విభేదించవచ్చు నేమోగాని ఆయన ఉపయోగించిన పద్ధతి అమూల్యమైనది. అమ్మదేవతల పూజలు జరిగే స్థలాలను వివరంగా పరిశీలిస్తాడు. అక్కడ పురావస్తు అవశేషాలకోసం (రాతి పనిముట్లు, కుండ పెంకులు వగైరా) వెతుకుతాడు. అక్కడి ప్రస్తుత నైసర్గిక స్థితిని బట్టి వేల సంవత్సరాల పూర్వపు నైసర్గిక స్థితిని, భూమి యొక్క వ్యవసాయ యోగ్యతను, నిర్ణయిస్తాడు. దీనిని బట్టి ఆ పూజను నిర్వహించిన ఆటవికుల జీవన విధానాన్ని నిర్ధారిస్తాడు. ఆ తరువాత ఆ అమ్మదేవత పూజలో వచ్చిన మార్పు సామాజిక విప్లవాన్ని సూచిస్తుంది. నాగరిక వ్యవసాయకులు ఆటవికులను లొంగదీసుకొని వాళ్ళను ఆహార ఉత్పత్తి చేసే వ్యవసాయక సమాజంలో కలుపుకునే క్రమానికి సాంస్కృతిక ప్రతిఫలనం పూజలలో వచ్చే మార్పు. మూడు రకాల మార్పును తన పరిశోధనలో కోశాంబి గుర్తిస్తాడు. ఒకటి, ఆ అమ్మదేవత పార్వతి అంశ అయిన దుర్గగానో కాళికగానో గుర్తింపు పొందుతుంది. ఆమె పూజలను

ఇక మీదట స్త్రీలు కాక పురుషులు నిర్వహిస్తారు. అయితే ఇందులో గూడ గతం చిహ్నం మిగిలిపోతుంది. మన బోనాల పండగ వంటిది బెంగుళూరు సమీపంలో జరిగే కరగా జాతర. ఈ జాతరలో పూజలు నిర్వహించే పురుషులు స్త్రీల దుస్తులు ధరిస్తారు.[18] రెండు, అమ్మదేవత స్థానంలో ఒక మగదేవుడు పూజలందుకోవచ్చును. ఉదాహరణకు హైదరాబాద్ నగరంలో మాసబ్‌ట్యాంక్ ప్రాంతంలో చెరువుకట్ట మీద ఒక ఆంజనేయుడి గుడి వుంది. ఆంజనేయుడికి నీటివనరులకూ ఎటువంటి సంబంధం లేదు. కాబట్టి ఈ ఆంజనేయుడు ఒక అమ్మదేవత స్థానాన్ని ఆక్రమించాడని అనుమానించాలి. మూడు, అమ్మదేవత గుడి పక్కనేగాని, కొంత దూరంలో గాని ఒక మగదేవుడు వెలిసి ఆమె అతని భార్యగా గుర్తింపు పొందవచ్చు. పూజలలో జరిగిన ఈ మార్పును బట్టి నాగరిక సమాజం ఆవిర్భావాన్ని అధ్యయనం చేయవచ్చును.

ఈ రకమయిన పరిశోధనా పద్ధతి సాధ్యం కావడానికి మన చరిత్ర స్వభావమే కారణం. పరిశోధనా పద్ధతిని ఎప్పుడూ గూడ పరిశోధక విషయం యొక్క స్వభావమే నిర్ణయించాలి. పరిశోధన చేయనిదే ఆ స్వభావం ఏమిటో తెలియదు కాబట్టి, పరిశోధనా క్రమంలోనే విషయ స్వభావం, విశ్లేషణ పద్ధతి, రెండూ పరస్పర గతితార్కిక చర్యలో అర్థం అవుతాయి. పాశ్చాత్య చరిత్ర అధ్యయనానికి అనుసరించిన పద్ధతి-సంప్రదాయిక పురావస్తు సాహిత్య ఆధారాల విశ్లేషణ-మన చరిత్రకు సరిపోదన్న కోశాంబి అభిప్రాయాన్ని మొదట్లో వుటంకించాము. మన చరిత్ర అధ్యయనానికి కోశాంబి అనుసరించిన పద్ధతి పాశ్చాత్యుల చరిత్రకు పనికి రాకపోవచ్చు. అమెరికాలోనూ ఆస్ట్రేలియాలోనూ ఇనుము వాడకం తెలిసిన శ్వేత జాతి నాగరికులు కంచు యుగానికి రాతి యుగానికి చెందిన స్థానిక ప్రజలను హింసాత్మకంగా నిరాశ్రయులను చేసి దాదాపు నిశ్శేషం చేసారు. మన దేశంలో నాగరిక వ్యవసాయకులు మొదటి నుండి అల్పసంఖ్యాకులు కావడం వల్ల ఆటవికులను లొంగదీసుకునే మేరకు హింసను ప్రయోగించి ఆ తరువాత వాళ్ళను తమ సమాజంలో ఆర్థికంగా సాంస్కృతికంగా కలుపుకున్నారు. బలప్రయోగానికి బదులు మతాన్ని ఉపయోగించారు.[19] ఓడిపోయిన ఆటవికులలో బహుశా కొందరిని-గణం పెద్దలను, పురోహితులను-క్షత్రియ, బ్రాహ్మణ కులాలలోనికి స్వీకరించి తక్కిన వారి నందరినీ శూద్ర పంచమ కులాలుగా, కూలి చేసే రైతాంగంగా మార్చారు. ఉదాహరణకు నిషాదులు ఆటవికులుకాగా బ్రాహ్మణులలో ఒక నిషాద గోత్రం వుంది.[20] వీళ్ళు నిషాద పురోహితులయి వుండి బ్రాహ్మణులుగా గుర్తింపు పొందిన వారయివుండాలి.

ఈ క్రమంలో ఆటవిక గణాల కుదురు చిహ్నాలు, దేవతలు, ఆచారాలు బ్రాహ్మణ మతంలోనికి రకరకాలుగా వచ్చి చేరాయి. వాళ్ళ కుదురు చిహ్నాలను తమ దేవుళ్ళ వాహనాలుగా, భక్తులుగా, అవతారాలుగా, ఆమోదించారు. వాళ్ళ దేవతలను తమ దేవుళ్ళ కుటుంబాలలో చేర్చుకున్నారు. వాళ్ళ కర్మకాండలోని బలమయిన ఆచారాలను

ఏ రకమయిన వైదిక ప్రామాణికతా లేకున్నా తమ ఆచారాలలో కలుపుకున్నారు. దీని కోసం పురాణాలు సృష్టించారు కథలు కల్పించారు హిందూ దేవుళ్ళలో పాములు, కోతులు పశువులు, ఉండడానికి ఈ సమ్మేళనే కారణం

ఏ ఒక్క దేవుడినీ అతని అవతారాలనూ కుటుంబాన్నీ చూసినా ఈ విషయం అర్థం అవుతుంది. శివుడి నెత్తి మీది గంగ నీటిదేవత. ఆమె ఇప్పటికీ శివుడితో ప్రమేయం లేకుండ గంగమ్మగా స్వతంత్రంగా పూజలందు కుంటుంది. శివుడి మెడ లోని పాము మన పురాణాలలో 'నాగజాతి'గా పిలవబడ్డ ఆటవికుల కుదురు చిహ్నం. శివుడి భార్య పార్వతి ప్రతి రూపాలయిన దుర్గ, కాళిక, అమ్మ దేవతల పరిణత రూపాలు ఒక కొడుకు కుమారస్వామి వాహనం నెమలి (కుదురు చిహ్నం) మరొక కొడుకుది ఏనుగు తల, ఎలుక వాహనం (కుదురు చిహ్నాలు) శివుడి వాహనమయిన నంది చాలా ప్రాచీన కాలం నుండి-దానిమీద ఎక్కి సవారి చేయడానికి ఒక శివుడిని కల్పించక పూర్వం నుండి-ఆటవికులకు ఆరాధ్యం [21] నంది ఇప్పటికీ శివుడి వాహనంగానే కాక స్వతంత్రంగా పూజలందుకుంటుంది.

విష్ణువు పాము (ఆదిశేషుడి) మీద పడుకుంటాడు. అదే ఆదిశేషుడు తన పడగతో విష్ణువుకు నీడ కల్పిస్తాడు విష్ణువు భార్య లక్ష్మి సముద్ర మధనంలో పుట్టింది (ఈమె స్పష్టంగా నీటి దేవతే). విష్ణువు అవతారాలు కూర్మం, మత్స్యం, వరాహం, కుదురు చిహ్నాలు ఇవి మూడూ ఇప్పటికీ వేటాడబడే ప్రాణులే. (అంతే గాని ఈ అవతారాలు డార్విన్ సిద్ధాంతాన్ని రుజువు చేయవు) మరొక అవతారం అయిన కృష్ణుడు పశుపోషకుల దేవుడు. అతని సోదరుడు బలరాముడు ఆదిశేషుడి అంశ అయిన కర్షకుల ప్రతినిధి (అతని 'ఆయుధం' నాగలి). చివరికి బుద్ధుడిని గూడ విష్ణువు అవతారంగా ప్రకటించి బౌద్ధులనూ ఇదే విధంగా కలుపుకు రావాలని చూసారు. గాని, వాళ్ళు మత్స్య, కూర్మ, వరాహ కుదురు చిహ్నాలు గల గణజీవులలాగ ఆటవికులు కాక నాగరికులు కావడంతో లొంగిరాలేదు అందుకనే బుద్ధుడి అవతారం అసం పూర్ణంగా వుండి పోయి బౌద్ధం స్వతంత్ర మతంగా నిలిచి పోయింది.

బ్రాహ్మణమతం ఆమోదం పొందిన ఈ పూజల సమ్మేళనమేకాక ఎటువంటి ఆమోదం లేని ఆచారాల అవశేషాలను గూడ కోశాంబి గుర్తిస్తాడు స్త్రీలకు ప్రత్యేక మయిన అవైదిక ఆచారాలను ఈ సందర్భంలో ఉదహరిస్తాడు. రాతి యుగపు ఆట వికులు తాము సేకరించిన ఆహారాన్ని మెత్తగా నలగగొట్టడం కోసం రాతి పనిముట్లు తయారు చేసుకున్నారు అవి రోలు, రోకలి. రూపంలోనూ వినియోగంలోనూ ఎన్ని మార్పులు వచ్చినా ఇప్పటికీ వీటిని రాతితోనే తయారు చేస్తారు. కుండలలాగే ఈ రాతి పరికరాలు గూడ అమ్మ దేవతల ప్రతిరూపాలుగా పరిగణించ బడతాయి. మహారాష్ట్రలో అగ్రవర్ణాల స్త్రీలుగూడ పిల్లలకు నామకరణం చేసేటప్పుడు రోకలి గుండును చక్కగా అలంకరించి ఉయ్యాల చుట్టూ తిప్పుతారని కోశాంబి అంటాడు [22] మగవాళ్ళు వైదిక

ఆచారాన్ని అనుసరించి నిర్వహించే నామకరణ సంస్కారంతో ఈ అమ్మదేవత పూజల అవశేషానికి నిమిత్తం లేదు.

బ్రాహ్మణుల పురాణాలకూ వర్ణ వ్యవస్థకూ బల ప్రయోగం అవసరం లేకుండా నాగరిక వ్యవసాయక సమాజాన్ని వ్యాపింప జేయడంలో తొలినాడు ఈ ప్రయో జనకర మయిన పాత్ర ఉండబట్టే అవి అంత బలంగా నిలిచిపోయాయి. పురాణాలలోని అమోఘమయిన అసంబద్ధతకూ, తిమ్మిని బమ్మి చేయగల బ్రాహ్మణ కుతర్కానికి కదే మూలం అని కోశాంబి బ్రాసారు.[23] హింసను కాక సామరస్యాన్ని - సామాజిక సాంస్కృతిక సమ్మేళనాన్ని - ఆటవికులను లోబరచుకోవడానికి ప్రధాన సాధనంగా రూపొందించింది బ్రాహ్మణ మతం.[24] ఒక్కొక్క ఆటవిక గణాన్ని (లేక కుదురును) లొంగదీసుకోవడానికి ఒక కులాన్ని, ఒక పురాణాన్ని, ఒక బ్రాహ్మణ గోత్రాన్ని) ఒక కర్మకాండ సంబంధమయిన మార్పును, సృష్టించాల్సి వచ్చింది. ఈ క్రమంలో అపారమయిన గందరగోళానికి నిలయమయిన బ్రాహ్మణ పౌరాణిక గాధలు, అనంత మైన కర్మలు సమాజంమీద ఒక భారంగా తయారయి సమాజాన్ని ఇక ముందుకు నడవకుండ ఆటంకపరచాయి. ఒకప్పటి సామాజిక అవసరం తరువాత గుదిబండగా మారి బ్రాహ్మణుల ఉదర పోషణకు తప్ప ఇంకెందుకూ పనికిరాని భారంగా తయారయింది.

ఈ అధ్యాయాన్ని ముగించేముందు మన రాష్ట్రంలోని ముఖ్య తెగలకు కోశాంబి పద్ధతిని క్లుప్తంగా అన్వయించి చూద్దాం. మన రాష్ట్రంలోని అన్ని షెడ్యూల్డ్ తెగల లోనికి వెనుకబడినవి దొమ్మరి, వడ్డెర, ఎరుకల, యానాది, బోయ తెగలు. బహుశా మేదరులను గూడ వీళ్ళతో చేర్చవచ్చునేమో. ఈ తెగలు అన్నీ గూడ కొత్తరాతి యుగపు ఆహార సేకరణ ఛాయలను ఇప్పటికీ బలంగా కలిగి వున్నాయి. యానాదులు ఎలుకలనూ ఉడుతలనూ పట్టుకోవడంలో ('వేట'లో) నిపుణులు. యానాదులూ ఎరుకలూ పందులను పోషిస్తారు గాని వాళ్ళు పందుల పోషణలో కంటె వాటిని పట్టుకోవడంలో నిపుణులు. మన గ్రామాలలో పందులు ప్రాచీన కాలంనుండి అశుద్ధాన్ని శుభ్రం చేసే పని సమర్థవంతంగా నిర్వహిస్తున్నాయి. చిత్తూరు, నెల్లూరు జిల్లాలలోని చాలా పట్టణాలలో పాకీ పని యానాదులు చేస్తారు. బుట్టల తయారీలో ఎరుకలు, మేదరులు నిపుణులు. (కుండలలాగే బుట్టలుగూడ ఆహార సేకరణ దశకు చెందిన కొత్తరాతి యుగపు పరిశ్రమ). వడ్డెరలు రాళ్ళు కొడతారు. తెలంగాణ జిల్లాల్లోని క్వారీలలో ఎక్కువగా వడ్డెరలు పనిచేస్తారు. దొమ్మరల్లో స్త్రీలకు వ్యభిచారం చేసే అలవాటుంది. మాతృ ప్రధానమయిన రాతి యుగపు తెగలలో 'వ్యభిచారం' అనే మాటకు అర్థంలేదు. ఆ పని చేయడంద్వారా పితృస్వామిక నాగరిక సమాజంలో జీవనం సంపాదించుకోవచ్చును కాబట్టి వాళ్ళు దానినొక వృత్తిగా స్వీకరించడంలో ఆశ్చర్యం లేదు.

అన్నిటికంటే ముఖ్యమైన విషయం ఈ తెగలన్నింటినీ బ్రిటిష్‌వాళ్ళు 'క్రిమినల్'

తెగలగా గుర్తించడం. ప్రకృతి సంపద ఏ ఒక్కరి స్వంత ఆస్తి కాకుండడం ఆహార సేకరణకు అత్యవసరమయిన నియమం. అయితే నాగరిక సమాజం స్వంత ఆస్తి వ్యవస్థను ప్రవేశపెట్టి క్రమంగా ప్రకృతి సంపదను కొందరి ఆస్తిగా మారుస్తుంది. బ్రిటిష్వాడు ప్రవేశపెట్టిన పెట్టుబడిదారీ సంబంధాలు ఈ క్రమాన్ని పూర్తిచేసి ఎవ్వరికీ చెందనిది ఏదయినా వుంటే దాన్ని ప్రభుత్వం ఆస్తిగా ప్రకటించింది. ఈ విధంగా ఆహార సేకరణ దొంగతనంగా మారింది. కొత్తరాతి యుగంనుండి ఈ ఆటవికులు దొంగలగా నాగరిక సమాజంలోనికి ప్రవేశించారు. (గతంలోగూడ, భిల్లుడయిన వాల్మీకిని బ్రాహ్మణులు 'దొంగ' అన్నారు. పైగా అతనిచేత రామాయణం చెప్పించి ఉచితంగా ప్రాయశ్చిత్తం గూడ చేసారు. భిల్లులు ఇప్పటికీ వేటాడి జీవించే ఆటవికులు).

ఈ రాతియుగపు తెగలకంటె కొంచెం మెరుగయినవి గోండు, కోయ నాయకపు కొండరెడ్డి, చెంచు మొదలయిన వ్యవసాయక తెగలు. వీళ్ళలో కొందరి విషయంలో కోశాంబి చెప్పిన సాంస్కృతిక సమ్మేళనం ఇప్పటికే మొదలయింది. చెంచులు తమను తాము బ్రాహ్మణుల దేవత లక్ష్మి ప్రతిరూపం అయిన చెంచులక్ష్మి సంతతిగా భావిస్తారు. ఆమెను విష్ణువు అవతారమయిన నరసింహుడు వరించాడు. అయితే ఈ సమ్మేళనం పరిపూర్ణం కాలేదనడానికి నిదర్శనంగా బ్రాహ్మణుల లక్ష్మి ఈ సవితిని వైకుంఠానికి రానీయకుండ తరిమేసింది. గోండులుగూడ ఇదే విధంగా తాము భీముడికి హిడింబకూ పుట్టిన సంతతిగా భావిస్తారు. అయితే హిడింబగూడ భీముడి 'ధర్మపత్ని' అయిన ద్రౌపదితో సమానం కాదు. భీముడు ఆమెతో కొంతకాలం గడిపి వెళ్ళాడు.

ఈ తెగలన్నీ ఇదివరకే ఏదో ఒక మేరకు ఆహార ఉత్పత్తికి అలవాటు పడ్డాయి కాబట్టి వీళ్ళు మరీ నికృష్టంగా లేరు. అయితే అభివృద్ధి పేరిట వీళ్ళ అడవులను ప్రభుత్వం చేజిక్కించుకోవడంతో వీళ్ళుగూడా అనివార్యంగా 'నేరస్తులు' అవుతున్నారు.

అందరికంటె అభివృద్ధి చెందిన తెగ లంబాడాలు. ఉత్తర దక్కన్లో బంజారాలు అని పిలవబడే తెగకు వీళ్ళొక శాఖ. ఈ బంజారాలు కొన్ని శతాబ్దాలు క్రితమే ఆహార సేకరణ మాని పశుపోషకులయ్యారు. ముగలాయి సామ్రాజ్యంలో కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థ ఏర్పడడంతో దూరప్రాంతాలకు వర్తకం విస్తరించింది. బంజారాలు తమ పశువుల వీపుమీద మూటలగా సరుకులను రవాణా చేసేవారు. వేల సంఖ్యలో వున్న బంజారా 'కారవాన్'లను చూసి పాశ్చాత్యులు ఆశ్చర్యం ప్రకటించారు. అంతేకాక ముగలాయి సైనిక శిబిరాలకు గ్రామాలనుండి సరుకులు తెచ్చి అమ్మేవారు. మనదేశంలో పెట్టుబడిదారీ విధానం స్వతంత్రంగా అభివృద్ధి చెంది వుంటే వీళ్ళు ఒక బలమయిన వర్తక వర్గంగా తయారయ్యేవారు గాని, బ్రిటిష్వాడు బయటనుండి పెట్టుబడిని దిగుమతిచేసి రైలు మార్గాలూ రహదార్లూ వేయడమే కాక, దేశ వర్తకాన్ని రేవుపట్టణాలకు ఉన్ముఖం చేయడం వల్ల వీళ్ళ జీవనాధారం ఒక్కసారిగా నాశనం

అయింది. 19వ శతాబ్దం చివరి దాకా వ్యవసాయ యోగ్యమైన మెట్టభూమి దేశంలో అందుబాట్లో వుండడం వల్ల వీళ్ళలో అత్యధికులు మెట్టసాగుకు అలవాటు పడ్డారు. వరంగల్, కరీంనగర్ జిల్లాలలోని కుష్క (ఎర్ర) నేలలలో వేరుశెనగ, ఆదిలాబాద్ జిల్లా నల్లరేగడి నేలలలో పత్తి పండిస్తారు. అయితే ఈ విధంగా వ్యవసాయ ఉత్పత్తి చేయడానికి భూమి దొరకనివాళ్లు దొంగతనాలకు అలవాటుపడ్డారు.

ఈ విధంగా, ఆహార సేకరణమీద గాని పశుపోషణమీద గాని ఆధారపడి జీవించే తెగలను ఇవ్వాళ మన నాగరిక సమాజం పాకీ పనివాళ్ళుగా, కూలీలుగా, పేద రైతులుగా, అన్నిటినీ మించి 'నేరస్థులు'గా తనలో కలుపుకుంటోంది. నాగరిక భారత సమాజం అమెరికా, ఆస్ట్రేలియా దేశాలలోలాగ ఆటవికులను చంపేయడం లేదు, ఒక నిమ్నజాతిగా, దొంగలుగా తనలో కలుపుకుంటూ వుంది. ప్రత్యక్ష బలప్రయోగం అవసరంలేకుండ సామాజిక ఆధిపత్యం ద్వారా సంలీనం చేసుకుంటోంది. అయితే ఒకప్పుడు బ్రాహ్మణ పురాణాలు నిర్వహించిన పాత్రను ఇప్పుడు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ నిర్వహిస్తోంది. మన దేశ జనాభాలో షెడ్యూల్డ్ తెగలు 7 శాతమే గాని మన జైళ్ళలో కనీసం 20 శాతం వాళ్ళే వుంటారు.

## వివరణలు

1. ఆయుధాలుగూడ ఒకప్పుడు పనిముట్లే. వాటిని జంతువుల వేటకు కాకుండ మనుషుల వేటకు వాడడం మొదలుపెట్టిన తరువాతే అవి ఆయుధాలయ్యాయి.
2. అయితే కోశాంబి పదేపదే చేసే హెచ్చరికను గుర్తుంచుకోవాలి (ఉదా : ISIH పేజీ 21). ఆహారాన్ని సేకరిస్తూ జీవించే ఆటవికులు తమ సమీప నాగరికులనుండి లోహాల వాడకాన్ని నేర్చుకోవచ్చును. ఏ సమాజం శూన్యంలో బ్రతకదు. ఇది త్వరలోనే వాళ్ళను గూడ నాగరికులను చేయాలిగాని, ఆ 'త్వరలోనే' అనేవి కొన్ని దశాబ్దాలు కావచ్చు, శతాబ్దాలు గూడ కావచ్చు.
3. CCAI, Pages 28-29
4. ISIH, Pages 21–22
5. CCAI,Page 30, ISIH, Page 25
6. ISIH, Page 23
7. దీనిని ఇంగ్లీషులో **Sympathetic magic** అంటారు. ఇవ్వాళ ఒక బ్యాంకు గుమాస్తా తన యింట్లో లెడ్జర్ బొమ్మలేసి (ముగ్గులు పెట్టి) దాని మీద తాను రాస్తున్నట్టుగా అభినయిస్తే తన పని సవ్యంగా జరిగిపోతుందని నమ్మడుగాని, అదే సూత్రంమీద ఆధారపడిన "చేత బడి" మీద నమ్మకం మాత్రం విస్తృతంగా వుంది. ఆంధ్రప్రాంతంలో ఆటవిక ఆహార సేకరణ మాని ఆహారాన్ని ఉత్పత్తి చేసే వ్యవసాయక సమాజం ఏర్పడే క్రమం 2500 సంవత్సరాలకు పూర్వం గోదావరీ తీరంలో ప్రారంభమయింది. 25 శతాబ్దాలు గడిచినా అను

కరణ మంత్రం మీద నమ్మకం పోక పోవడం కోశాంబి చెప్పే అవశేషాలలో ఒకటి. అయితే 'చేతబడి' మీద నమ్మకం ఇప్పుడెవ్వరికీ ఆత్మస్థైర్యాన్ని ఇవ్వక పోగా గ్రామాలలో కొందరు "మంత్రగాళ్ళ"కూ పట్టణాలలో నవలా రచయితలకూ అనాయాసమైన జీవనాధారం అయింది. నవలా రచయితలు సుఖంగానే వున్నారుగాని మంత్రగాళ్ళను మాత్రం జనం అప్పుడప్పుడు (ముఖ్యంగా మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో) సామూహికంగా తగల బెడుతుంటారు.

8. Combined methods in Indology, HS, Page 12
9. ISIH, Page 22
10. ISIH, Page 22
11. అటువంటి ఒక అమ్మ దేవత పేరు ముంబా అయి. ఈమె పూజలందుకున్న ప్రాంతం పెరిగి పెద్దదయి ముంబాయి లేక బొంబాయి నగరం అయింది. ఇప్పుడు దాన్ని తిరిగి ముంబాయి చేయాలని శివసేన పట్టుబట్టింది. బహుశా ఆ ముంబా అయి నగరంలో ఎక్కడుందో వెతికి పట్టుకొని పెద్దఎత్తున గుడి కట్టిస్తారేమో!
12. ఉదాహరణకు తులసివనం, బృందావనం, తులసి లేక బృంద ఒక అమ్మ దేవత. చూ. Urvasi and Pururavas, MR, పేజీలు 42-81
13. Pilgrim's progress : A contribution to the pre-history of the Western Deccan Plateau, MR, పేజీ 117
14. ఈ విశ్లేషణ కోశాంబి చేసిన అన్ని రచనలలోనూ వుంది. ముఖ్యమైన వ్యాసం : At the cross-roads: A study of mother goddess cult sites, MR, పేజీలు 82-109
15. Urvasi and Pururavas, MR, పేజీ 76
16. "పూజ" అంటే కేవలం పూజా కార్యక్రమం కాదు. ఇంగ్లీష్‌లో Cult అనే మాటకు అనువాదంగా వాడుతున్నాను. ఆ దేవతకు సంబంధించిన పౌరాణిక గాథలు, కర్మకాండ, మహాత్మ్యాలు, అన్నీ కలిసిన మొత్తాన్ని cult అంటారు. తెలుగులో గూడ పూజ, ఆరాధన అనే మాటలకు ఈ విస్తృత అర్థంవుంది.
17. The Basis of Ancient Indian History, HS, Page 27
18. Urvasi and Pururavas, MR, Page 73
19. The Basis of Ancient Indian History, HS, Page 29
    What constitutes Indian History, HS, Pages 69-70
20. The Basis of Ancient Indian History, HS, Pages 41-42
21. Social and economic aspects of the Bhagavadgita, MR, Page 28
22. ISIH, Page 49
23. CCAI, Page 166, ISIH, Page 45

24. ప్రధాన సాధనం మాత్రమే. సంఘర్షణ లేకుండ సమ్మేళనం సాధ్యం కాలేదన దానికి అవే పౌరాణిక గాధలలోని అసంబద్ధత ఒక నిదర్శనం. ఒకే దేవుడి అవతారాలు, వాహనాలు, భార్యలు, కుటుంబ సభ్యులు, భక్తులు, పరస్పరం కలహించుకుంటారు, చంపుకుంటారు గూడ.

# 3. సింధూ నాగరికత-ఆర్యులు

ప్రాచీన కాలంలో మనదేశంలో భూసారం బాగావున్న ప్రాంతాలలో (నదీ లోయలు, తూర్పు పడమటి తీరప్రాంతాలు) దట్టమయిన అడవులుండేవి. వాటిని వ్యవసాయ యోగ్యం చేయడానికి ఇనుము వాడకం తప్పనిసరి. నదీలోయలు కాని మెట్ట ప్రాంతాలలో (ఉదాహరణకు దక్కన్ పీఠభూమి) అడవులు సాపేక్షికంగా పల్చగానే వున్నా నేల చాలా గట్టిది కావడంవల్ల వ్యవసాయానికి బరువయిన నాగలి కావాలి. నాగలికి ఇనుపముక్క వున్నా లేకపోయినా దాన్ని తయారు చేయడానికి ఇనుప పని ముట్లు కావాలి. కాబట్టి ఇనుము వాడకం తెలియక పూర్వం (పురావస్తు శాస్త్ర పరిభాషలో ఇనుము యుగానికి పూర్వం) మనదేశంలో విస్తృత ప్రాతిపదిక మీద ఆహార ఉత్పత్తి సాధ్యం కాదు. చాలా అనుకూలమయిన ప్రాంతాలలో మాత్రమే (నేల తేలికగా వుండి అడవులు దట్టంగా లేని ప్రాంతాలలో) ఆహారాన్ని ఉత్పత్తి చేసే వ్యవసాయక సమాజం సాధ్యం అవుతుంది. ఇది మనదేశానికే కాదు, ఏ దేశానికైనా వర్తిస్తుంది. అందుకనే ప్రపంచంలోని మొట్టమొదటి వ్యవసాయక సమాజాలు (కంచు యుగానికి చెందినవి) గంగ, అమజాన్, మిసిసిపీ నదుల లోయలలో ప్రారంభం కాలేదు. ఈ నదుల లోయలు ప్రాచీన కాలంలో చాలా దట్టమయిన అడవులతో నిండి వుండేవి (అమజాన్ ఇప్పటికీ గూడ). ఎడారి సదృశమయిన ప్రాంతాల గుండా ప్రవహించే సింధు, నైల్, టైగ్రిస్, యూఫ్రటిస్ వంటి నదుల లోయలలోనే మొట్టమొదటి కంచు యుగపు వ్యవసాయ నాగరికత ప్రారంభమయింది.[1] ఈ నదులకు వరదలు వచ్చినప్పుడు అవి తమ పరీవాహక ప్రాంతాన్ని సారవంతం చేసేవి. అక్కడ తేలిక రకం నాగలితో లేక కర్రతో వ్యవసాయం సాధ్యమయ్యేది. ఈ విధంగా మొదలయిన వ్యవసాయ నాగరికత ఇనుము వాడకాన్ని నేర్చుకోక పోతే అక్కడి నుండి విస్తరించడం కష్టం. కొన్ని ఇతర దేశాలలో ఈ కంచుయుగం నాగరికతలు ఇనుము వాడకాన్ని నేర్చుకొని విస్తరించాయి గాని, సింధూ నాగరికత ఇనుము వాడకాన్ని నేర్చుకోక ఆ ప్రాంతానికే పరిమిత మయిపోయి క్రమంగా నశించి పోయింది. అందుకే మనదేశ చరిత్రలో సింధూనాగరికత అంతర్భాగంగా కాక 'విసిరేసినట్టు' వుంటుంది. అయితే సాంస్కృతిక సామాజిక నిర్మాణంలో సింధూ నాగరికత ప్రభావం బలంగానే వుందని కొందరు చరిత్రకారులు భావిస్తారు. వారిలో కోశాంబి ఒకరు.

## సింధూ నాగరికత

సింధూ నది లోయ ప్రాంతాలలో జరిగిన పురావస్తు తవ్వకాలలో రెండు ప్రాచీన మయిన పట్టణాలు బయటపడ్డాయి. అవి హరప్పా, మొహెంజొదారో. హరప్పా సింధు నది పై భాగాన (ఉపనది రావి ఒడ్డున) వుంది. మొహెంజొదారో నది దిగువ భాగాన ఇప్పటి సింద్ (పాకిస్తాన్) రాష్ట్రంలో వుంది. ఆ తరువాత విస్తృతంగా జరిగిన తవ్వకాలలో ఈ రెండు పట్టణాలే కాక చాలా ఆవాసాలు (settlements) బయట పడ్డాయి. ఈ ఆవాసాలన్నీ గూడ సింధూనది లోయలో హరప్పా నుండి దిగువకు నదీ ముఖం దాక, నదీ ముఖం నుంచి సముద్రతీరంలో సింద్ గుజరాత్ రాష్ట్రాలలోనూ పరచుకొని వున్నాయి. ఉత్తరం నుండి దక్షిణానికి నదీలోయలో వెయ్యి మైళ్ళు, సముద్ర తీరాన్ని ఆనుకొని మరొక వెయ్యి మైళ్ళ నిడివిలో విస్తరించి వున్నాయి. సింధూ నాగరికత మొత్తం ఎడారి సదృశమైన నదీలోయ ప్రాంతానికి సముద్ర తీర ప్రాంతానికీ పరిమితమై వుండి సారవంతమయిన భూ భాగంలోనికి విస్తరించలేక పోవడం గమనార్హమయిన విషయం అనీ అయితే చరిత్ర కారులు పట్టించుకోవడం లేదనీ కోశాంబి అంటాడు.[3] దేశంలోని మొట్టమొదటి పట్టణ నాగరికత ఎడారి గుండా ప్రవహించే నది ఒడ్డున ఎందుకు ఆవిర్భవించాల్సి వచ్చిందో చర్చించడంతో విశ్లేషణ ప్రారంభం అవుతుంది.

పట్టణ నాగరికత సాధ్యం కావాలంటే ఆహారంలో అదనపు ఉత్పత్తి వుండాలి. అంటే ఆహార సేకరణ మాని ఆహారాన్ని ఉత్పత్తి చేసే వ్యవసాయ సమాజం ఆవిర్భవించి వుండాలి. సరిగ్గా సింధూలోయలోనే ఆహార ఉత్పత్తి ప్రారంభం కావడానికి గల అవసరం ఏమిటో అనుకూలత ఏమిటో రెండూ పరిశీలించాలి. సారవంతమయిన నేలలలో అడవులు దట్టంగా వుంటాయి. కాబట్టి వాటిని వ్యవసాయయోగ్యం చేయడానికి ఇనుము విస్తారంగా కావాలి, బరువయిన నాగలి కావాలి. పైగా దట్టమయిన అడవులలో ఆహార సేకరణకు వృక్ష సంపదా జంతువులూ దండిగానే దొరుకుతాయి. ఆహార ఉత్పత్తి అప్పటి కింకా 'అవసరం' కాదు. కాగా, ఎడారి నదీ లోయలలోని చిట్టడువులలో ముళ్ళ పొదలలో ఆహార సేకరణ వల్ల కలిగే ఫలితం స్వల్పం. ఆ పొదలను వ్యవసాయయోగ్యం చేయడం సాపేక్షికంగా సులభం. నిప్పుపెట్టి తగలబెట్టవచ్చును. నది నుండి కాలవలు తవ్వినీళ్ళు తెచ్చుకో వచ్చును. లేకున్నానదికి వరదలు వచ్చినప్పుడు సారవంతమైన మట్టి 'మేట' వేస్తుంది. అది ప్రవాహంలో కొట్టు కొచ్చిన మట్టి కావడం వల్ల వదులుగా వుంటుంది. బరువయిన నాగలి అవసరంలేకుండ వ్యవసాయం చేయవచ్చును.

ఈ కారణాల వల్ల ప్రపంచంలోని మొట్ట మొదటి కంచు యుగపు వ్యవసాయ నాగరికతలు ఎడార్ల గుండా ప్రవహించే నదీ లోయలలో-సింధూనది, మెసపొటేమియా

లోని టైగ్రిస్-యూఫ్రటిస్ నదులు, ఈజిప్టులోని నైలునది-ప్రారంభం అయ్యాయి. ఇనుము వాడకం విస్తారంగా అలవాటయ్యేదాక గంగ, గోదావరి మొదలయిన (సార వంతమయిన గట్టి నేలలగుండ ప్రవహించే) నదీలోయలలో ఆహార ఉత్పత్తి సాధ్యం కాలేదు. సింధూనదికి తరచుగా వచ్చే వరదలలో కొట్టుకొచ్చి ఒడ్డు మీద మేటవేసిన సారవంతమయిన మట్టిలో తేలిక పరికరాలతో వ్యవసాయం చేయడం దాదాపు క్రీ.పూ. 3000 నాడు ప్రారంభమయిందని, క్రీ.పూ. 1750 దాకా నిలిచిందని, కోశాంబి భావిస్తాడు.[3]

ఈ నాగరికతను అర్థం చేసుకోవడానికి సాహిత్య ఆధారాలు లేవు. హరప్పా మొహెంజొదారోల అవశేషాలలో కొన్ని వ్యాపారస్తుల ముద్రలు (seals) దొరికాయి. వీటి మీద కుదురు చిహ్నాలయిన జంతువులూ ఇతర చిత్రాలేకాక ఒక లిపి లాంటిది వుంది. అయితే ఆ లిపిని ఇప్పటివరకు ఎవ్వరూ చదవలేక పోయారు కాబట్టి వాటి మీద ఏం రాసివుందో తెలియదు. ఆ కాలానికి చెందిన వేరే ఎటువంటి రచనలూ లభ్యం కాలేదు. పురావస్తు ఆధారాల మాటకొస్తే హరప్పా, మొహెంజొదారోలలో చాలానే దొరికాయి. మొత్తం సింధూలోయ నాగరికతలో చెప్పుకోదగ్గ పట్టణాలు హరప్పా మొహెంజొదారోలు రెండే. వాటి ఉచ్ఛదశలో రెండూ గూడ ఒక చదరపు మైలు విస్తీర్ణాన్ని కలిగి వున్నాయి. రెండూ గూడ అకస్మాత్తుగా ఒక నమూనా ప్రకారం కట్టినట్టున్నాయి గాని చిన్న గ్రామాలగా మొదలయి పెరిగినట్టు లేవు. దీనిని బట్టి, పట్టణ నిర్మాణంతో పరిచయం ఉన్నవాళ్ళెవరో ఇక్కడకు వచ్చి ఈ పట్టణాలను నిర్మించారని కోశాంబి భావిస్తాడు. క్రీ.పూ. 1750 దాకా ఈ నాగరికతకు మెసపొటేమియాతో వ్యాపార సంబంధాలు ఉన్నట్టు అక్కడ జరిగిన పురావస్తు పరిశోధనలో తేలింది.[4]

సింధూలోయ అవశేషాల నేలమట్టం 30 లేక 50 అడుగులు పెరిగింది కాబట్టి అది 1000 సంవత్సరాల పైనే నిల్చిందని భావిస్తే ఆ నాగరికత కాలం క్రీ.పూ.3000-1750 అని నిర్ధారించ వచ్చును.

చాలా విచిత్రమైన విషయం ఏమంటే ఇంత దీర్ఘకాలం హరప్పా మొహెంజొదారో పట్టణాల నిర్మాణంలో ఎటువంటి మార్పులేదు. ఎన్ని కొత్త కట్టడాలు నిర్మించినా అదే నమూనాలు నిర్మించారు. కుండపెంకుల అవశేషాలను బట్టి చూస్తేగూడ ఈ 1000 చిల్లర సంవత్సరాలలో కుండల తయారీలోగూడ ఎటువంటి మార్పులేదు. ముద్రల మీద వున్న లిపిలో గూడ ఈ సహస్రాబ్ది కాలం మార్పులేదు. తరువాతి కాలంలో మన దేశ భాషల లిపి చాలా తరచుగా మారడాన్ని బట్టి ఈ నాగరికత ఏ రూపంలో ఆవిర్భవించిందో ఆ రూపంలోనే కరడుగట్టి పోయిందని, ఆ కారణంగానే బయటనుండి దాడి జరగగానే తట్టుకోలేక నాశన మయిందని నిర్ధారిస్తాడు. హింసాత్మకమయిన దాడి ఫలితంగా ఈ నాగరికత అంతమయిందని భావించడానికి గల నిదర్శనాలు మొహెంజొ

దారో అవశేషాల పైపొరల్లో వున్నాయి. ఇళ్ళు తగలబడినట్టు, పెద్ద ఎత్తున హత్యా కాండ జరిగినట్టు, ఆధారాలున్నాయి. ఈ హింసాకాండకు కారకులు ఆర్యులన్న కోశాంబి అభిప్రాయాన్ని తరువాత వివరిద్దాం.

ఈ నాగరికతను అర్థం చేసుకోవడానికి కోశాంబి తన పరిశోధనా పద్ధతిని, సిద్ధాంతాన్ని, చాలా సృజనాత్మకంగా అన్వయిస్తాడు. ఉత్పత్తి శక్తుల ఉత్పత్తి సంబంధాల స్వరూపాన్నీ అందులోని పరిణామాలనూ నిర్ణయించాలి. పట్టణ నాగరికత వుందం టేనే పరిసర గ్రామాలలో ఆహార ఉత్పత్తి జరుగుతోందని అర్థం. అయితే ఆ గ్రామాల అవశేషాలు పురావస్తు తవ్వకాలలో బయటపడే అవకాశం లేదు కాబట్టి వాటి స్వభావాన్ని ఇతరత్రా నిర్ధారించాలి. ఈ ఉత్పత్తి నది ఒడ్డున వరద ముంపు భూములలో జరుగు తోంది. దీనికి అవలంబించిన పద్ధతులేమిటి, ఉత్పత్తి చేసినవాళ్లు ఎవ్వరు, వాళ్ళ నుండి అదనపు ఉత్పత్తిని చేజిక్కించుకొని పట్టణ నాగరికతను నిర్మించిన పాలక వర్గం ఎవరు, వాళ్ళు అదనపు ఉత్పత్తిని ఏ విధంగా చేజిక్కించుకున్నారు, అనే ప్రశ్నలకు సమాధానం కావాలి.

ఒకే నైసర్గిక పరిస్థితులలో ఒకే రకమైన ఉత్పత్తి పద్ధతులను ప్రయోగించే నాగరికతల సామాజిక నిర్మాణం (మొత్తం మీద) ఒకేలాగ వుండాలి. కాబట్టి సింధూ నాగరికతను సమకాలిక ఎడారి నదీలోయ నాగరికతలయిన మెసపొటేమియా, ఈజిప్టులతో కోశాంబి పోలుస్తాడు. తేడాలు కనబడిన చోట ఉత్పత్తి విధానంలోని తేడాలను నిర్ధారించే ప్రయత్నం చేస్తాడు. ఈ పద్ధతిలో వున్న సౌకర్యం ఏమిటంటే సింధూ నాగరికత కంటె ఈజిప్టు, మెసపొటేమియాల ప్రాచీన కాలపు చరిత్ర గురించి సమగ్రమయిన సమాచారం వుంది. ఆ నాగరికతల లిపిని చదవగలిగారు. లిఖిత ఆధారాలను పురావస్తు పరిశోధనలతో సమన్వయపరచి చాలా విషయాలు నిర్ధారించ గలిగారు. సింధూ నాగరికత లిపిని ఒక వేళ చదవ గలిగినా అది కేవలం కొన్ని ముద్రల మీదవున్న క్లుప్తమయిన వాక్యాలకు పరిమితం కావడం వల్ల తెలుసుకో గలిగింది పెద్దగా వుండదని కోశాంబి అభిప్రాయం.

మెసపొటేమియాకు సింధూ నాగరికతతో వర్తక సంబంధాలుండేవి. బహరైన్ దీవిలోని రేవుద్వారా సింధూ నాగరికత సరుకులు మెసపొటేమియా చేరేవి. ఇక్కడి నుండి ఎగుమతి అయిన సరుకులు దంతం, రాగి, నెమళ్ళు, కోతులు, సముద్రపు ముత్యాలు, వస్త్రాలు. దిగుమతి చేసుకున్న వేమిటో తెలీదు. ఈ సరుకులను ఎగుమతి చేసిన వ్యాపారస్తులు వాటిని గట్టిగా మూటగట్టి 'ముద్ర' వేసేవారు. ఈ ముద్రమీద ఎద్దు, ఏనుగు, ఖడ్గమృగం, పొటేలు, గేదె మొదలయిన జంతువుల చిత్రాలు మనకు అర్థంకాని లిపిలో కొన్ని వాక్యాలు, వున్నాయి. ఈ బొమ్మలు కుదురు చిహ్నాలు. కొన్ని ముద్రల మీద సగం మనిషి సగం ఎద్దు, సగం ఎద్దు సగం ఏనుగు అయిన సంయుక్త కుదురు చిహ్నాలున్నాయి. ఇటువంటివి రెండు మూడు కుదురుల సంలీనాన్ని

సూచిస్తాయి. కుదురు చిహ్నాలకు 'మాంత్రిక' స్వభావం ఆపాదించడం వల్ల ఈ ముద్రలు వేసిన మూటలు విప్పడానికి భయపడతారు. ఆ విధంగా సరుకు భద్రంగా వుంటుంది. హరప్పా, మొహెంజొదారోల ముద్రలు ఇరాక్‌లో దొరికాయి కాబట్టే సింధూ పట్టణాలు మెసపొటేమియాతో వర్తకం చేసేవని తెలిసింది. మెసపొటేమియాలో దొరికిన మట్టి ఫలకాల (clay tablets) మీది వాక్యాలను చదవ గలిగిన తరువాత ఏయే సరుకులు ఇక్కడి నుండి ఎగుమతి అయ్యాయో తెలిసింది.

దీనిని బట్టి హరప్పా, మొహెంజొదారోలలో ఒక వర్తకుల వర్గం ఉన్నట్టు అర్థం అవుతుంది. ఈ వర్తకులు దూరప్రాంతపు ఆటవికుల నుండి రాగి దంతం మొదలయినవి సంపాదించి మెసపొటేమియాకు ఎగుమతి చేసేవారు. ఇంత పెద్ద ఎత్తున వర్తకం చేయడానికి ఈ వర్తకులు తమ పట్టణాల పరిసరాలలోని గ్రామీణ వ్యవసాయకులనుండి అదనపు ఉత్పత్తిని తగురాశిలో సేకరించాలి. ఆ విధంగా సేకరించిన ధాన్యాన్ని నిలవ ఉంచిన గిడ్డంగులు హరప్పా, మొహెంజొదారోలలో కనబడ్డాయి. ఆ ధాన్యానికి పొట్టు తీయడం మొదలైన పనులు చేసిన కూలీల చిన్నచిన్న ఇళ్ళు గూడ గిడ్డంగులను అనుకొనివున్నాయి. ఈ పనులు చేయడానికి వాడిన రాతి, కర్ర, పరికరాలు గూడ లభ్యం అయ్యాయి.

ఇంకొన్ని వివరాలు తెలుసు కోవడానికి ఈజిప్టు మెసపొటేమియాలతో సింధూ నాగరికతను మరికొంత జాగ్రత్తగా పోల్చి చూడాలి. ఈజిప్టులోని నైలునది నాగరికత ప్రాచీన కాలంలో అత్యంత సాంద్రతరమైన జనాభాను పోషించింది. పెద్ద ఎత్తున మధ్యధరా సముద్ర తీరంలోని చాలా ప్రాంతాలలో వర్తకాన్ని పోషించింది. ఆహారం తప్ప ఇతర అవసరాలను (ముఖ్యంగా లోహాలను) ఈజిప్టు దూరప్రాంతాల నుండి బల ప్రయోగం ద్వారా సేకరించేది. ఈ సేకరణను నిర్వహించిన రాజన్యుల వర్గం, వాళ్ళ అధిపతి అయిన ఫారో (Pharoah) రాజు ఉండేవారు. ఆర్భాటమయిన దేవాలయాలుండేవి. వీటన్నింటినీ నైలునది వ్యవసాయం పోషించింది. మెసపొటేమియాలో గూడ కనీసం ఒక డజను పెద్ద పట్టణాలు, అనేక చిన్న పట్టణాలు బయటపడ్డాయి. ఒక్కొక్క పట్టణం తన పరిసర గ్రామాలతో కలిసి ఒక నగర రాజ్యం (city state)గా ఏర్పడి పరస్పరం తరచు యుద్ధాలు చేసుకునేవి. ఈజిప్టులోనూ మెసపొటేమియాలోనూ ఈ విధంగా అర్భాటమయిన నాగరికత, రాజవంశాలు, యుద్ధాలు, దేవాలయాలు, కనబడతాయి.

కాగా, మెసపొటేమియా కంటే భూవైశాల్యం అధికంగా వున్న సింధూలోయ నాగరికతలో రాజుల రాజవంశాల చిహ్నాలులేవు. మొహెంజొదారోలో దొరికిన వర్తకుల నాణాల మీద రాజుల ముద్రలుగానీ రాజవంశాల చిహ్నాలు గాని లేవు.[8] పెద్దపెద్ద దేవాలయాలు లేవు. రెండే రెండు పట్టణాలున్నాయి. సామాజిక నిర్మాణంలోని ఈ తేడాను బట్టి, సింధూ నాగరికత వ్యవసాయం మిగిలిన రెండు కంచుయుగం

నాగరికతల కంటె వెనుక బడిందని కోశాంబి భావిస్తాడు. ఇరుకయిన లోయలో ప్రవహించే నైలునదికి వరదలు విపరీతంగా వుండడం వల్ల వరద ముంపు భూమిలో భూసారం అధికంగా వుంటుంది. మెసపొటేమియాలో నదులకు అడ్డుకట్టలు కట్టి కాలవలు తవ్వి వ్యవసాయం చేసారు. పైగా వ్యవసాయానికి తేలిక రకం నాగలిని ఉపయోగించి నట్టు అక్కడ బయటపడ్డ బొమ్మలను బట్టి తెలుస్తుంది.

సింధూ నదికి నైలు నదితో పోల్చదగ్గ వరదలు రాకపోవడమే కాక, మెసపొటేమియాలో లాగ కాలవలు తవ్విన దాఖలాలు లేవు. అయితే వాళ్ళు పూర్తిగా సహజమయిన వరదల మీద ఆధారపడలేదు. సింధూనదికి అనుకూలమయిన చోట అడ్డుకట్టలు కట్టారు. అడ్డుకట్టల వల్ల వరదలు వచ్చినప్పుడు వరద ముంపుకు గురయ్యే భూమి విస్తీర్ణం పెరుగుతుంది. ఆ విధంగా ఉత్పత్తిని పెంచుకున్నారేతప్ప సింధూలోయ వాసులు కాలవల తవ్వకం నేర్చుకోలేదు. మరొక తేడా నాగలి వాడకానికి సంబంధించినది. మెసపొటేమియా అవశేషాలలో చాలా స్పష్టమైన నాగలి బొమ్మలు గల ముద్రలు దొరికాయి. హరప్పా, మొహెంజొదారో అవశేషాలలో నాగలి చిత్రాలు లేవు. పశువుల బొమ్మలున్నాయిగాని ఒంటరిగానో లేక బండిలాగుతున్నట్లో ఉన్నాయి తప్ప నాగలితో భూమి దున్నుతున్న బొమ్మలు లేవు. కాబట్టి వాళ్ళకు నాగలి వాడకం తెలియదని, తేలికగా వున్న నేలలలో 'ముళ్ళ కర్ర'తో వ్యవసాయం చేసారని, కోశాంబి భావిస్తాడు. ఇప్పటికీ అర్థంకాని సింధూ నాగరికత లిపిలో నాలుగు పండ్లున్న కర్రలాంటి సంకేతం వుంది. అది బహుశా ఈ ముళ్ళ కర్రను సూచిస్తుందని కోశాంబి భావిస్తాడు.[7]

ఇప్పుడు కోశాంబి భావించే చిత్రాన్ని కొంచెం వివరంగా చెప్పుకోవచ్చును. కొన్ని వేల మైళ్ళ పర్యంతం విస్తరించిన సింధూలోయ నాగరికతలో రెండే పట్టణాలున్నాయి. రాజులుగాని, రాజవంశాలుగాని లేవు. గ్రామీణ ప్రాంతాలలో వరద ముంపు భూములలో పండ్లకర్ర సహాయంతో వ్యవసాయం చేసారు. వ్యవసాయానికి పశువులను ఉపయోగించలేదు. నదికి అడ్డు కట్టలు కట్టి ముంపు భూమి విస్తీర్ణాన్ని పెంచి ఎక్కువ ఉత్పత్తి సాధించారు. వరి, గోధుమ, బార్లీ, నువ్వులు, పండించారు. వ్యవసాయదారులు తాము చేసిన ఉత్పత్తిలో తమ మనుగడకు పోగా మిగిలిన దానిని నది వెంబడి ఓడలలో హరప్పా మొహెంజొదారోలకు తరలించారు. అక్కడ ఆ ధాన్యాన్ని గిడ్డంగులలో నిలవుంచి ఒక వ్యాపారస్తుల వర్గం సుదూర ప్రాంతాలతో వర్తకానికి వినియోగించింది.

మరయితే వ్యవసాయకులు ఈ దోపిడికి ఎందుకు లోనయ్యారు, అదనపు ఉత్పత్తిని స్వచ్ఛందంగా ఎందుకు ఈ రెండు పట్టణాలకు తరలించారు అనే ప్రశ్న వస్తుంది.

"సంపదను సృష్టించేవాళ్ళ తిరుగుబాటునుండి ధనిక వర్గాన్ని కాపాడిన

పద్ధతులేమిటి?" చరిత్రలో రెండే పద్ధతులున్నాయి. "వర్గవిభజన అంతిమంగా ఎల్లప్పుడూ బల ప్రయోగం మీదనే ఆధారపడింది. ఒక వర్గం చేసిన అదనపు ఉత్పత్తిని అల్పసంఖ్యాకులయిన పాలకులు ఎల్లప్పుడూ బలప్రయోగం ద్వారానే చేజిక్కించుకున్నారు." అయితే "ధనిక వర్గం పాలనలో తప్ప ఇతరత్రా తమకు జీవనం సంపాదించుకునే మార్గం ఉత్పత్తి దారులకు గోచరించకపోతే బలప్రయోగం తక్కువ స్థాయిలో ఉండవచ్చును. ఇది సాధ్యం కావాలంటే, శ్రామిక వర్గం అదనపు ఉత్పత్తిని అందజేయకపోతే అద్భుత శక్తులు వాళ్ళను నాశనం చేస్తాయని నమ్మించే మతం అవసరం అవుతుంది." అంతేకాక, "దోపిడీ తీవ్ర తరమయ్యే కొద్దీ నిర్బంధ బల ప్రయోగం మరింత అవసరం అవుతుంది. ఇక్కడ గూడ మత పరమయిన నిషేధాలు బలంగా పనిచేస్తాయి." బలప్రయోగం, మతం, ఈ రెండింటిలో ఏ సాధనాన్ని ప్రయోగించారో విశ్లేషిస్తే సింధూ నాగరికత సామాజిక నిర్మాణాన్ని మరికొంచెం వివరంగా తెలుసుకో వచ్చును. "బలప్రయోగ సాధనాలు-అంటే ఆయుధాలు-పురావస్తు తవ్వకాలలో బయట పడతాయి. మూఢ నమ్మకాల చిహ్నాలు మత పరమైన నిర్మాణాలలోనూ చిత్రాలలోనూ బయటపడతాయి." కాబట్టి ఈ అవశేషాలకోసం అన్వేషించాలి.[8]

చాలా విచిత్రమైన విషయం ఏమిటంటే సింధూ నాగరికత అవశేషాలలో బలమయిన ఆయుధాలులేవు. కత్తులుగాని గొడ్డళ్ళుగాని లేవు, సన్నని బల్లాలు, అంబులు వున్నాయి. వీటి మొనలు ఎక్కువగా రాతితోనూ బలహీనమయిన లోహం రాగితోనూ చేసారుగాని, కంచుతో కాదు. అయితే వీళ్ళకు లోహపు ఆయుధాల తయారీ సాధ్యం కాకపోలేదు. ఎందుకంటే రాగి తగరాల మిశ్రమమయిన కంచుతో బలమయిన పని ముట్లు తయారు చేసుకున్నారు. ఆయుధాల తయారీకి మాత్రం కంచు ఉపయోగించలేదు. బలప్రయోగానికి అవసరమయిన గట్టి ఆయుధాలను పాలక వర్గం తయారు చేసుకోలేదనడానికి మరొక నిదర్శనంగా హరప్పా, మొహెంజొదారోలలో బయటపడ్డ వర్తకుల ఇళ్ళకు కాల్చిన ఇటుకలతో కట్టిన బలమయిన గోడలున్నాయి. ఈ గోడలు ఏడడుగుల మందాన్ని కలిగి వున్నాయి. వాళ్ళ సంపదను కాపాడడానికి బలమయిన 'పోలీసు వ్యవస్థ' లేదు, ఇంటి గోడలే కాపాడాయి.

రాగి చాలా అరుదుగా దొరికే లోహం కావడం వల్ల కంచు యుగంలో పాలక వర్గాల చేతిలో ఆయుధాలు తక్కువగా వున్నా సరిపోతుందని భావించవచ్చును. (ఇనుము యుగంలో, అందుకు భిన్నంగా, విరివిగా దొరికే ఇనుప లోహంతో శ్రామిక వర్గం గూడ ఆయుధాలు తయారుచేసుకోగలదు కాబట్టి పాలక వర్గం చేతిలో ఆయుధాలు ఎక్కువ కావాలి). ఈ విషయాన్ని కోశాంబి విస్మరించడుగాని ఇంత బలహీనమయిన ఆయుధాలు గల పాలక వర్గం కేవలం బలప్రయోగంతో సింధూలోయను ఏలిందని భావించడం కష్టం అని నిర్ధారిస్తాడు.[9] బలప్రయోగం లేకపోతే ఇక మిగిలింది మతం, మౌఢ్యం. వీటి చిహ్నాల కోసం వెతుకుతాడు.

వ్యాపారస్తుల ముద్రలమీద దేవుళ్ళ బొమ్మలూ కుదురు చిహ్నాల బొమ్మలూ వున్నాయి. ఈ జంతువులన్నీ మగ జంతువులు, దేవుళ్లుగూడ మగ దేవుళ్ళగానే కన బడతారు. వాళ్ళలో ఒక దేవుడు తరువాతి కాలపు శివుడికి నమూనా కావచ్చునని కోశాంబి భావిస్తాడు. విశ్వామిత్రుడు-త్రిశంకువుల కథకు రూపచిత్రణ అనిపించే మరొక బొమ్మ గూడ వుందని అంటాడు.[10]

ఈ మగ దేవుళ్లు, మగ జంతువులే కాక, మరొక ముఖ్య విషయంగూడ వుంది. ఈజిప్టు మెసపొటేమియాలలాగ కాక సింధూ నాగరికత అవశేషాలలో దేవాలయాలుగాని పెద్దపెద్ద దేవతా విగ్రహాలుగాని లేవు. కాని హరప్పా, మొహెంజొదారో అవశేషాలలో ధనిక వర్గం ఇళ్ళకు కొద్దిదూరంలో 10 మీటర్ల ఎత్తున ఒక మట్టి-ఇటుకలతో నిర్మించిన చతురస్రాకారపు 'గుట్ట' (mound) వుంది. మొహెంజొదారోలో ఈ గుట్టమీద ఒక నిర్మాణం వుంది. అందులో మధ్యభాగంలో 23 అడుగులు పొడవు, 39 అడుగులు వెడల్పు, 8 అడుగులు లోతు వున్న 'తొట్టి' వుంది. దాని కింద తూములు ఉండడం బట్టి అది కృత్రిమ తటాకం అని అర్థం అవుతుంది. ఈ తటాకం చుట్టూ చిన్న చిన్న గదులున్నాయి. దీనిని చరిత్ర పుస్తకాలలో స్నాన ఘట్టంగా వర్ణిస్తున్నారు. పురజను లంతా ఇక్కడకు వచ్చి స్నానంచేసే వారని భావించడం జరుగుతోంది. అయితే కోశాంబి ఇందుకు కొన్ని అభ్యంతరాలు తెలుపుతాడు. స్నానం చేయడమే ఉద్దేశ్యం అయితే ప్రతీ ఇంటిలోనూ చక్కటి స్నానాలగది వుంది. గుట్ట పక్కనే సింధూ నది ప్రవహిస్తోంది. పైగా ఎత్తయిన ప్రాంతంలో వున్న ఈ తొట్టిలోకి నీళ్లు నింపడానికి చాలా శ్రమతో మోసుకు రావాలి.

కాబట్టి ఇది కేవలం స్నానం చేయడానికి ఉద్దేశ్యించిన ఏర్పాటు కాదని, దీనికి పూజా సంబంధమైన ఏర్పాటు వుండాలని, అంటాడు. ఈ తటాకం నిర్మాణాన్ని, తటాకంలోకి దిగడానికి ఏర్పాటు చేసిన మెట్లను బట్టి ఇది పూజా సంబంధమైన తటాకం లేక పుష్కరం (పుష్కరణి) అయి వుంటుందని భావిస్తాడు.[11] తరువాతి కాలంలో పుష్కరణులను దేవాలయాలను అనుకొని నిర్మించారు గాని ప్రాచీన సంస్కృత సాహి త్యంలో పుష్కరాలు అప్సరసల (నీటి దేవతల) నివాసస్థలాలు. అమ్మ దేవతల పూజ కోసం ఒకప్పుడు ఈ పుష్కరాలను స్వతంత్రంగా నిర్మించేవారు. పుష్కలం, పుష్టి, మొదలయిన మాటలకు అదే ధాతువు ఉండడాన్ని బట్టి పుష్కరం అనే మాట ఫల సాయం కోసం జరిగే అమ్మదేవతల పూజను సూచిస్తుంది.[12] ఈ అమ్మదేవతలను ఆరా ధించిన ఆటవికులను వ్యవసాయ నాగరికులు లోబరచుకున్న తరువాత సమ్మేళనానికి చిహ్నంగా పుష్కరాలను మగ దేవుళ్ళ దేవాలయాలను అనుకొని నిర్మించడం మొద లయింది.

మరొక పరిణామం గూడ జరుగుతుంది. తొలినాటి అమ్మదేవతలు భయంకర స్వరూపిణులు. వాళ్ళ పూజా స్థలాలకు మగవాళ్లు పోకూడదు. సంవత్సరానికి ఒకసారి

ఒక మగవాడిని అమ్మదేవతకు ఇచ్చి వివాహంచేసి వెంటనే బలి ఇస్తారు. నాగరికుల పూజ అమ్మదేవతలను తన ఆధిపత్యం కింద సంలీనం చేసుకున్న తరువాత ఈ ఆచారం వివిధ రకాలగా మారుతుంది. భయం గొలిపే నీటి దేవతలు అందమైన అప్సరసలగా మారతారు. అయితే తరువాతి కాలంలో గూడ ఈ అప్సరసలకు పాత వాసనలు పోవు. మన పురాణాలలో తరచుగా అప్సరసల సౌందర్యాన్ని మోహించినవాళ్ల వినాశనం చెందుతారు. ఇది గతకాలపు అవశేషం కాగా, కొత్తగా వచ్చే మార్పు ఏమిటంటే అంతవరకూ తమతో సంగమించిన పురుషుడి బలికోరిన అమ్మదేవతలు ఇప్పుడు ఇంద్రలోకంలో నాట్యగత్తెలు, దేవ వేశ్యలు, అవుతారు. దేవుళ్ల తమ ప్రత్యర్థులను ఓడించడానికి ఒక ఆయుధంగా ఈ వేశ్యలను వాడుకుంటారు.

సింధూ నాగరికతలో వర్తకుల ముద్రల మీద వున్న మగదేవుళ్ళ మగ జంతువుల పూజలేకాక అమ్మ దేవతల పూజగూడా ఉండిందనడానికి నిదర్శనంగా చిన్న చిన్న (భయం గొలిపే) ఆడవాళ్ళ బొమ్మలు అవశేషాలలో లభ్యం అయ్యాయని కోశాంబి అంటాడు.[13] ఈ అమ్మదేవతల పూజకు సంబంధించిన పుష్కర మే-మొహెంజొదారో శిధిలాలలో కనిపించిన 'స్నానం తొట్టి' అని కోశాంబి అభిప్రాయం.

మరయితే ఈ అమ్మదేవతల విగ్రహాలెందుకు లభ్యంకాలేదని అడిగితే, బహుశా వాళ్ళ సజీవ ప్రతినిధులు ఉన్నారేమో అని భావిస్తాడు. కొంతమంది స్త్రీలు అమ్మ దేవతల ప్రతినిధులుగా, 'దేవదాసీలగా' వుండి వుండాలి. తటాకం చుట్టూ వున్న గదులు ఇప్పుడు అర్థవంతం అవుతాయి. పూజలో భాగంగా మగవాళ్లు తటాకంలో స్నానంచేసి ఆ గదులలో దేవదాసీలతో సంగమిస్తారు. సమకాలీన మెసపొటేమియాలో ఇష్టర్ అనే అమ్మదేవత ఆరాధనలో ఇటువంటి దేవదాసీ వ్యవస్థ ఉందని అంటాడు.[14] మనదేశంలో ఇప్పటికి ఇటువంటి ఆచారాలను పాటించే పూజాస్థలాలు ఉన్నాయి. మహారాష్ట్రలోని పంఢర్ పూర్‌లో అంబా అయి అనే అమ్మదేవత పూజలను వేశ్యలు నిర్వహిస్తారు.[15] కొత్తరాతి యుగపు ఆటవికుల అమ్మదేవతల మాతృస్వామ్యానికి అభావంగా నాగరిక వ్యవసాయ సమాజ దేవాలయాలలో దేవదాసీ వ్యవస్థ మనదేశంలో చాలాకాలం నిలిచి పోయింది. అప్సరసలు దేవదాసీల ఇంద్రలోకపు ప్రతినిధులు. దేవదాసీ వ్యవస్థ పురుషాధిక్య బ్రాహ్మణ మతం ఆలస్యంగా విస్తరించిన దూర ప్రాంతాలలో ఇప్పటికి నిలిచిపోవడం గమనించదగ్గ విషయం అని కోశాంబి భావిస్తాడు.[16]

ఇప్పుడు ఉత్పత్తి సంబంధాలను గురించి ఇంకొంచెం వివరంగా చెప్పకోవచ్చును. ఆయుధాల అవశేషాలు స్వల్పంగా బలహీనంగా వుండడాన్ని బట్టి అదనపు ఉత్పత్తిని పాలకవర్గం చేజిక్కించుకోవడానికి ఉపయోగించిన ప్రధాన సాధనం మతం. వర్తక వర్గాల ముద్రల మీద మగ దేవుళ్ళ, మగ జంతువుల (కుదురు చిహ్నాల), చిత్రాలున్నాయి. వర్తకుల మతం పురుష ప్రధానమయినది అని ఊహించవచ్చును. ఇవి కాక, అమ్మదేవతల పూజలలో భాగం అయిన పుష్కరం చాలా ప్రముఖ స్థానంలో-

ఎత్తయిన స్థలంలో-వుంది. మెసపొటేమియా పోలికలను బట్టి చూస్తే ఇది స్వతంత్ర మయిన అమ్మదేవతల పూజ కాదని, పురుషాధిక్య సమాజానికి లోబడిన పూజ అనీ అర్థం అవుతుంది. పుష్కరానికున్న ప్రముఖ స్థానాన్ని బట్టి ఈ సమాజంలో ప్రధాన మతం అమ్మదేవత పూజే, వర్తకుల ముద్రలమీద వున్న మగ దేవుళ్ళ పూజ కాదు.

దీనిని బట్టి చూస్తే సింధూ నాగరికతకు అదనపు ఆహార ఉత్పత్తిని సమకూర్చిన కర్షకులు తత్పూర్వం అమ్మదేవతలను పూజించిన ఆటవికులు. ఆహార ఉత్పత్తిని వాళ్ళకు అలవర్చిన వ్యక్తులు బయటి నుండి వచ్చారు. వీళ్లు అప్పటికే నాగరికులు. వీళ్ళ పూజలు పురుష స్వామ్యాన్ని సూచిస్తాయి. వీళ్లు స్థానిక ఆటవికులను లోబరుచుకున్నారు. అయితే వాళ్ళను నాశనం చేయకుండ, వాళ్ళ అమ్మదేవత పూజను తమ ఆధిపత్యంలో సంలీనం చేసుకొని దేవాలయాన్ని నిర్మించారు. ఆ పూజనే ప్రధాన పూజగా అంగీక రించారు. ఈ సాంస్కృతిక సంలీనం ఫలితంగా ఆటవికులు ప్రత్యక్ష బలప్రయోగం అవసరం లేకుండ దేవాలయానికి అదనపు ఉత్పత్తిని అప్పజెప్పారు. అది పురోహితుల దక్షిణల రూపంలో చేరిందో లేక దేవతకు ఇచ్చే 'బలుల' రూపంలో చేరిందో తెలియదు. మొత్తానికి బలప్రయోగం ప్రధాన సాధనం కాకుండ అదనపు ఉత్పత్తిని కర్షకులు అప్పజెప్పారు. ("ఇది భారతదేశ చరిత్రలో పదే పదే జరిగింది" అని కోశాంబి అంటాడు[17]).

ఈ అదనపు ఉత్పత్తి సేకరణగానీ పంపకంగానీ పూర్తిగా దేవాలయం బాధ్యతే. వ్యాపారస్తులకు తమ వాటా అందుకోవడం తప్ప వేరే ప్రమేయంలేదు. అందుకే వాళ్ళ పూజలలో దేవుళ్ళేగాని దేవతలు లేరు. అలాగే వర్తకుల లాభాలలో దేవాలయానికి వాటా లేదు.

పాలకవర్గంలో దేవాలయ పురోహితులకూ వర్తకులకూ మధ్యనున్న ఈ నిర్మాణపరమయిన విభజనే సింధూ నాగరికత వెనుకబాటుతనానికి అది ఒకే రూపంలో కరడుగట్టి పోవడానికి కారణమని కోశాంబి అభిప్రాయం. మెసపొటేమియాతో వర్తకం చేసిన ఈ వర్తకులు అక్కడి కాలవ వ్యవసాయాన్ని గానీ, ఆయుధాల తయారీని గాని, అభివృద్ధి చెందిన లిపిని గాని నేర్చుకోలేదు. తమకు వ్యవసాయ ఉత్పత్తితో, అదనపు ఉత్పత్తి సేకరణతో, ప్రమేయం లేదు కాబట్టి వాళ్ళకు అభివృద్ధి అవసరం లేదు. ఉత్పత్తి దారులయిన గ్రామీణ కర్షకులకు ఈ విషయాలు తెలియవు. అదనపు ఉత్ప త్తిని సేకరించే దేవాలయాలకు మౌఢ్యం ప్రధానమయిన సాధనం. అభివృద్ధి ఉత్ప త్తిని పెంచుతుంది గాని మౌఢ్యాన్ని దెబ్బతీస్తుంది. ఈ కారణంగా మెసపొటేమియాతో సింధూ నాగరికతకు సన్నిహిత వర్తక సంబంధం వున్నా అక్కడి అభివృద్ధిని వీళ్లు అలవర్చుకోలేదు.[18] చివరికి బయటినుండి ఆర్యులు దాడి చేసినప్పుడు, ఆర్యులకంటే ఉన్నతమయిన నాగరికత కలిగివుండిగూడ నాశనం కాక తప్పలేదు.

సింధూ నాగరికత పాలకవర్గం బయటి నుండి వచ్చిందన్న కోశాంబి

అభిప్రాయాన్ని పైన ప్రస్తావించాము. సింధు, మెసపొటేమియా, ఈజిప్టు నాగరికతలు మూడూ గూడ ఆయాదేశాల వెలుపలినుండి, ఒకే మూల ప్రాంతంనుండి వచ్చాయేమోనని కోశాంబి ఊహిస్తాడు. క్రీ.పూ. 7000 ప్రాంతంలో టర్కీలోని చతల్ హుయూక్ లోనూ పాలస్తీనాలోని జెరికోలోనూ మొట్ట మొదటి ఆహార ఉత్పత్తి సమాజం, పట్టణ నాగరికత, ప్రారంభమయ్యాయి. జెరికో ఎడారిలోని ఒక ఒయాసిస్ మీద ఆధారపడ్డ నాగరికత. ఆహార వుత్పత్తిని అలవర్చుకోవడం వల్ల ఈ సమాజాల జనాభా పెరిగి విస్తరణ అనివార్యం అవుతుంది. ఈ ప్రజలే నేరుగా సింధూ, మెసపొటేమియా, ఈజిప్టు ప్రాంతాలకు వచ్చారని భావించ నవసరం లేదనీ నిజానికి ఏ విషయాన్నయినా రుజువు చేయడానికి కావలసిన పురావస్తు పరిశోధన సాధ్యం కాదేమోననీ అంటూ అయితే ఈ విస్తరణే అంతిమంగా పై మూడు కంచుయుగం నదీలోయ నాగరికతలకు దారి తీసిందని భావించారేమో నంటాడు.[19]అందుకు నిదర్శనంగా ఈ మూడు నాగరికతలలో దొరికిన ముద్రల మీది చిత్రాల సారూప్యాన్ని వివరిస్తాడు.[20]

చాలా స్వల్పమయిన మూలాలమీద ఆధారపడి కోశాంబి చేసే ఈ నిర్ధారణ 'నిజమా' కాదా అన్న చర్చ అంత ముఖ్యంకాదు. ఎందుకంటే ఏ నిర్ధారణ చేయడానికయినా సింధూ నాగరికత గురించి మనకు అందుబాట్లోవున్న సమాచారం కొంచెమే. అయితే కోశాంబి అనుసరించే పద్ధతిని అర్థంచేసుకోవడం ముఖ్యం. రాజులు రాజ వంశాలు యుద్ధాలు సంగ్రామాలనుకాక ఉత్పత్తి శక్తులనూ ఉత్పత్తి సంబంధాలనూ వాటిలోని మార్పునూ-లేక మార్పులేక పోవడాన్ని-అర్థంచేసుకునే ప్రయత్నం, అందు కోసం ఒక చారిత్రక సిద్ధాంతాన్నీ అధ్యయన పద్ధతినీ ప్రయోగించడం, భౌతిక పరిస్థితులలో సామ్యంవున్న ఇతర నాగరికతల తోటి పోలికలనూ భేదాలనూ వివరించడం ద్వారా ఈ సమాజం స్వరూపాన్ని నిర్ణయించడం, గతం వదిలి వెళ్లిన అవశేషం-'స్నానఘట్టం'గా గుర్తించబడ్డ పుష్కరం-లో గతకాలపు పరిణామాల చిహ్నాలను అన్వేషించడం, ఈ అధ్యయన పద్ధతి మనకు ముఖ్యం.

## ఆర్యులు

సింధూ నాగరికత గురించి కోశాంబి చెప్పిన అభిప్రాయాలనుండి ఒక విషయం స్పష్టమవుతుంది. ఆయన దానిని భారత దేశానికి పరిమితమయిన ప్రత్యేక విషయంగా భావించలేదు. పడమటి ఆసియాలోని ఎడారి ప్రాంతాలలో చిన్న చిన్న నీటివనరుల దగ్గర క్రీ. పూ. 7000 నాడు నాగరికత ప్రారంభమయింది. ఉత్పత్తి శక్తులలోని అభివృద్ధి ఫలితంగా జనాభా పెరిగి ఆ నాగరికత స్వస్థలాన్ని వదిలి విస్తరించింది. తరువాతి దశలో ఎడారి స్వభావంగల నదీ లోయలలో మరింత పెద్ద ఎత్తున స్థావరం ఏర్పరచుకుంది. క్రీ. పూ. 2000 నాటికి తేలిక వ్యవసాయంచేసే కంచు యుగపు నాగరికతలు పడమటి ఆసియానుండి భారత ఉపఖండం వరకు చాలానే వున్నాయి

రాబోయే ఇనుము యుగం కంటె ఇప్పుడు అదనపు ఉత్పత్తి చాలాతక్కువ. అదంతా ఒక రాజన్య-పురోహిత-వర్తక వర్గం చేతిలో కేంద్రీకృత మయింది. అన్నిచోట్లాగూడ విపరీతమయిన మత మౌఢ్యం సమాజాన్ని కట్టిపడేసింది. పరస్పరం కొంత వ్యాపార సంబంధాలున్నా దేనికవి విడివిడిగా జీవిస్తున్నాయి. ఒకరినుండి ఒకరు నేర్చుకున్నది లేదు, కొత్తను ఆహ్వానించింది లేదు. స్వల్పమయిన అదనపు ఉత్పత్తిని అత్యధికంగా కర్మకాండకూ, పితరుల (చనిపోయిన పూర్వీకుల) పూజలకూ వినియోగించారు. ఈజిప్టు రాజుల సమాధులయిన పిరమిడ్లతో పోలిస్తే వాళ్ళ నివాస గృహాలు గిడిసెల లాగ కనబడతాయి.

ఈ కంచు యుగపు నదీలోయ నాగరికతలు కాక ఈ ప్రాంతమంతా ఆ కాలంలో చిన్నచిన్న సంచార ఆటవిక సమాజాలతో నిండివుంది. మన చరిత్రను వీలయినంత వెనక్కి నెట్టడం ఇప్పటికీ మిగిలి పోయిన దురలవాటు కాబట్టి భారత దేశాన్ని గురించి మరొకసారి చెప్పుకోవాలి. క్రీ. పూ. 2000 నాటికి సింధూలోయ మినహాయిస్తే తక్కిన దేశమంతా చిన్నచిన్న ఆటవిక సమాజాలతో నిండివుంది. ఇవ్వాళ చాలా సాంద్రతరమయిన జనాభాను పోషిస్తున్న సారవంతమయిన మైదానాలు (గంగా యమునా లోయలు, తూర్పుతీరం, పడమటి తీర, దక్షిణాన కావేరీలోయ) ఇనుము వాడకం తెలియక పూర్వం దట్టమయిన అడవులతో నిండి వుండేవి. అక్కడ ఆనాటికి ఆహార సేకరణ తప్ప ఆహార ఉత్పత్తి సాధ్యంకాదు. ఇకపోతే మిగిలింది దక్కన్ పీఠభూమి. పీఠభూమి మీద అడవులు కొంత పల్చగావున్నా నేల గట్టిది కావడం వల్ల బరువయిన నాగలి, నాగలికి ఇనుప ముక్క, లేకుండ వ్యవసాయం సాధ్యంకాదు. ఇనుమూ యుగానికి పూర్వం దక్కన్ పీఠభూమి మీద గూడ ఆహార సేకరణే సాధ్యం.

ఈ ఆటవికులు ప్రకృతి అనుకూలంగా వున్నచోట కొంత అదనపు ఉత్పత్తిని సాధించారు గాని దానినంతా గూడ పెద్దపెద్ద బండరాళ్ళ (megaliths) పూజకు వినియోగించారు. బండరాళ్ళను ఒక దాని మీదఒకటి పెట్టి అద్భుత నిర్మాణాలు సాధించి వాటిని పితరుల ప్రతిరూపాలగా భావించి పూజించారు.

దక్షిణయూరప్, మధ్యఆసియా, ఈజిప్టుల నుండి భారత ఉపఖండం వరకు విడి విడిగా జీవిస్తూ, అదనపు ఉత్పత్తి అనేది ఉన్నమేరకు కర్మకాండకు దానినంతా వినియోగిస్తూ కరడుగట్టిపోయిన ఈ ఆటవిక సమాజాలలోనూ కంచుయుగపు నదీలోయ నాగరికులలోనూ విప్లవాత్మకమయిన మార్పును సాధించింది ఆర్యులు. ఇదే ఆర్యుల చారిత్రక ప్రాధాన్యం అని కోశాంబి అభిప్రాయం.[21] "విడివిడిగా వుంటూ తమ విశ్వాసాలనూ ఆదిమ పనిముట్లనూ ఎటువంటి మార్పులేకుండ అట్లాగే మిగుల్చుకొని బిగుసుకుపోయిన ఈ కర్షక సముదాయాల మధ్య అడ్డుగోడలను బద్దలు కొట్టడం ఆర్యుల చారిత్రక ప్రాముఖ్యత" అంటాడు.

ఆర్యులతో వచ్చిందేమిటంటే ఇనుము వాడకం, ఇనుము వాడకంవల్ల సాధ్య

మయ్యే వ్యవసాయ నాగరికత, అందుకు అనువయిన సామాజిక నిర్మాణం. అంటే కొత్త ఉత్పత్తి శక్తులు, కొత్త ఉత్పత్తి సంబంధాలు. విచిత్రమయిన విషయం ఏమిటంటే అప్పటికే ఎంతో కొంత వ్యవసాయం అలవర్చుకున్న కంచుయుగపు సమాజాలకూ కొత్త రాతి యుగపు గణాలకూ ఇనుము సహాయంతో బరువయిన నాగలితో వ్యవసాయం చేయడం నేర్పిన ఆర్యులకు తొలినాడు అసలు వ్యవసాయం తెలీదు. ఇనుము వాడకాన్ని కనిబెట్టిందీ వాళ్లు కారు. వాళ్ళు కంచుయుగానికి చెందిన పశుపోషకులు. కొత్త రాతియుగపు, కంచు యుగపు, సమాజాలకు అప్పటికే ఇనుముతో పరిచయం వుంది. ఉదాహరణకు దక్కన్ పీఠభూమి మీద ఇనుము ఖనిజం భూమి పైపొరల్లోనే విస్తారంగా దొరుకుతుంది. అయితే ఈ ఇనుమును ఉపయోగించుకొని వ్యవసాయాన్ని విస్తరింప జేయడానికి (అంటే ఉత్పత్తి శక్తులలో అభివృద్ధి సాధించడానికి) వాళ్ళ సామాజిక నిర్మాణం (ఉత్పత్తి సంబంధాలు) ఆటంక మయ్యాయి. స్వల్పమైన అదనపు ఉత్పత్తిని మొత్తం కర్మకాండకూ పితరుల పూజలకూ వినియోగిస్తూ కాల ప్రవాహంలో బిగుసుకుపోయిన ఈ సమాజాలు తమ కళ్ళముందున్న అభివృద్ధిని కానలేక పోయాయి. పశుపోషకుల గానూ యుద్ధంలో నిపుణులగానూ వున్న ఆర్యుల సామాజిక నిర్మాణంలో ఇందుకు భిన్నంగా, మార్పును ఆహ్వానించగల వెసలుబాటు వుంది. తరువాతి కాలంలో సమాజానికి పెద్ద పీడగా తయారయిన బ్రాహ్మణ మత మౌఢ్యం అప్పటికి వాళ్ళనింకా ఆవరించలేదు. వాళ్ళు ప్రధానంగా ఈ ప్రాచీన సమాజాలకు సమకూర్చింది ఒక కొత్త సామాజిక నిర్మాణం. ఇనుము యుగానికి చెందిన వ్యవసాయ వర్గసమాజానికి అనుకూలమయిన ఉత్పత్తి సంబంధాలు. మనదేశంలో ఇది వర్ణ వ్యవస్థ రూపం తీసుకుంది.

ఈ ఆర్యులు పశుపోషకులయిన సంచార జీవులు కావడం వల్ల పట్టణాల శిథిలాలు గాని పనిముట్ల అవశేషాలు గాని వదిలి వెళ్ళలేదు. కాబట్టి వీళ్ళ గురించి తెలుసుకోవడానికి పురావస్తు పరిశోధన అంతగా పనికిరాదు. ప్రాచీన సాహిత్యం మీద ఎక్కువగా ఆధారపడక తప్పదు.

'ఆర్యులు' అంటే ఎవరన్నది మొదటి ప్రశ్న. కొంత కాలం క్రితం వరకు మానవాళిని నర వర్గాలగా (race) విభజించడం అలవాటుగా వుండేది. పుర్రె ఆకారం, ముక్కుపొడవు, జుట్టురంగు, మొదలైన వాటిని బట్టి ఈ విభజన చేసేవారు. ఈరకమయిన విభజన నాజీవాదం యొక్క జాత్యహంకారానికి దారితీసిన తరువాత చాలామంది చరిత్రకారులలో 'నరవర్గం' అనే భావన పట్ల వ్యతిరేకత బయలుదేరింది. అసలు 'ఆర్యులు' అనే మాట వాడడం గూడ అశాస్త్రీయమే అనే అభిప్రాయం గూడ బయలు దేరింది.

నరవర్గం అనే భావననూ, ముక్కుపొడవును బట్టి పుర్రె ఆకారాన్నిబట్టి మానవాళిని విభజించడాన్ని కోశాంబి వ్యతిరేకిస్తాడు. ఒకే సమాజంలో వివిధ వర్గాలకు ఈ

కొలతలు వేరువేరుగా వుంటాయని, పైగా జీవన విధానంలో (ముఖ్యంగా ఆహారంలో) మార్పువస్తే ఈ కొలతలు రెండు తరాలలో మారతాయని, అంటాడు.[22] పోనీ 'ఆర్యులది' అనగల భౌతిక సంస్కృతి వుందా అంటే అదీ లేదు. ఆర్యులకు ప్రత్యేకమైన పని ముట్లుగాని కుండలు గాని ఇతర అవశేషాలుగాని లేవు.[23] అయినప్పటికి 'ఆర్యులు' అనేది అర్థరహితమయిన ప్రయోగం అని కోశాంబి ఒప్పుకోడు. ప్రాచీనకాలంలో తమ్ముతాము నిజంగానే 'ఆర్యులు' అని పిలుచుకున్నవాళ్ళు, ఇతరులచేత 'ఆర్యులు' అని పిలవబడ్డవాళ్ళు ఉన్నారు. ఇరాన్‌రాజు మొదటి దారియస్ తన్నుతాను 'ఆర్యుడిని, ఆర్యపుత్రుడిని' అని చెప్పుకొన్నాడు.[24] ఇరాన్ అనే మాటే 'ఆర్యానాం' (ఆర్యుల యొక్క) అనే మాట నుండి వచ్చింది.[25] ఇంత కంటే ముఖ్యమైన మరొక వాదన కోశాంబి చేస్తాడు. దక్షిణ యూరప్ పశ్చిమఆసియాల నుండి దక్షిణ ఆసియాదాక కంచు యుగపు నాగరికతలను నాశనం చేసి ఇనుము యుగానికి దారి తీసినవాళ్ళు పశు పోషకులైన గణ జీవులు. ఈ పశుపోషకుల భాషలు లాటిన్, గ్రీక్, సంస్కృతం, మొదలయినవి. క్రీ.పూ 2000-1000 మధ్య కాలంలో ఈ భాషలు మాట్లాడే పశుపోష కులు ఈ విశాల భూభాగంలోని కొత్తరాతి యుగం గణాలను కంచు యుగం నాగరికత లనూ లొంగదీసుకుంటూ విస్తరించారు. వీళ్ళందరూ ఒకే ప్రాంతం నుండి వచ్చారని భావించడానికి గల కారణం వీళ్ళ భాషలలోని సారూప్యం. భాషలలో పోలిక వుంటే ఆభాషలు మాట్లాడేవారు సన్నిహితులు కావలసిందేనా అంటే కోశాంబి అవుననే అంటాడు. ఇక్కడ ఒక ముఖ్యమయిన సూత్రీకరణ చేస్తాడు. "ఒకేరకమయిన ఉత్పత్తి పద్ధతులతో జీవించే వాళ్ళకు ఒకేరకమయిన ఆచారాలుండడం సంభవం. (అంటే రెండు సమాజాల ఆచారాలలో పోలిక వున్నంత మాత్రాన ఒకే ప్రాంతానికి చెందినవారు కానవసరంలేదు). అయితే రెండు భాషలలో కొన్ని వస్తువులకు ఒకేమాట వుంటే ఆ భాషలు మాట్లాడే ప్రజల మధ్య సంపర్కంవుందని భావించాలి "అంటాడు.[26] సంస్కృతం, గ్రీక్, లాటిన్ తదితర భాషలలో తండ్రి, తల్లి, అన్న మొదలయిన చాలా వాటికి ఒకే మూలం నుండి వచ్చిన మాటలు ప్రయోగిస్తారు.[27] దీనిని బట్టి ఈ భాషలు మాట్లాడిన పశుపోషకులు ఒకే ప్రాంతం నుండి దాదాపు 1000 సంవత్సరాలపాటు విడతలు విడతలుగా విస్తరించి దక్షిణ యూరప్ నుండి దక్షిణ ఆసియాదాక విస్తరించిన విశాల భూభాగాన్ని హింసాత్మకంగా లోబరచుకున్నారని కోశాంబి నిర్ధారిస్తాడు. అంటే 'ఆర్య' శబ్దానికి అర్థం రూపం కాదు, జాతి కాదు, భాషలలోని సారూప్యం.

ఆర్యులు ఒకే ప్రాంతం నుండి వచ్చారని భావిస్తే ఆ ప్రాంతం ఏదో నిర్ణయిం చాలి. దీనికి అనుసరించేపద్ధతి ఏమిటో కోశాంబి వివరిస్తాడు.[28] ప్రాచీన భాషలలో 'చెట్టు' 'జంతువు' మొదలైన జాతి పేర్లుండవు. ఒకొక్క చెట్టుకు, ఒక్కొక్క జంతువుకూ ఒక్కొక్క పేరుంటుంది. అయితే ఒక ప్రజలకు ఏ చెట్టు ఎక్కువగా పరిచయం ఉంటుందో ఆ చెట్టు పేరే క్రమంగా 'చెట్టు' అనే జాతి పేరుగా మారుతుంది.

(స్కూటర్లన్నింటినీ 'వెస్పా' అన్నట్టు). ఈ కారణంగా, గ్రీకు, లాటిన్, సంస్కృతం మొదలైన భాషలలోని వివిధ జాతి పేర్ల సామాన్య మూలాలను నిర్ధారిస్తే ఈ ప్రజలకు తొలి రోజులలో బాగా పరిచయం ఉన్న జంతువులు, చెట్లు, ఏవో నిర్ణయించ వచ్చును. అవి ఎక్కువగా ఏ ప్రాంతంలో ఉంటాయో అది ఆర్యుల తొలి నివాసస్థలం అని నిర్ధారించవచ్చును. ఈ విధంగా ఆర్యులు మధ్య ఆసియా ప్రాంతానికి చెందిన వారని-చాలా మంది చరిత్రకారులలాగే-కోశాంబి నిర్ధారిస్తాడు.[29]

అక్కడి నుండి అలలు అలలగా (బహుశా జనాభా ఒత్తిడి వల్ల) విస్తరించిన ఆర్యుల చరిత్రను స్థూలంగా మాత్రమే అర్థం చేసుకోవడం సాధ్యం అవుతుంది. సంచార జీవులు, పశుపోషకులు, కావడం వల్ల వాళ్ళు వదిలి వెళ్ళిన పురావస్తు ఆధారాలు చాలా స్వల్పం. అన్ని చోట్లా తమకు కనిపించిన సమాజాలను హింసాత్మకంగా రోబరుచుకున్నారుగాని, వాళ్ళ అలవాట్లనూ ఆచారాలనూ కొంత మేరకు స్వంతం చేసుకున్నారు. వాళ్ళతో లైంగిక సంబంధం పెట్టుకొని 'ఆర్య' సమాజాన్ని విస్తరింపజేసారు. వాళ్లెప్పుడు 'పరిశుద్ధం'గా వుండలేదు. అప్పటి వరకు విడివిడిగా వున్న సమాజాలకు ఒక సరళమైన భాష ద్వారా సంపర్కం ఏర్పరచారు. తద్వారా, అంతవరకు కర్మకాండలో కలిసిపోయి ఎక్కడికక్కడ రహస్యాలుగా వుండి పోయిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందరికీ అందజేస్తారు. ఈ క్రమంలో కంచు యుగానికి కాక ఇనుము యుగానికి అనువయిన సామాజిక నిర్మాణాన్ని రూపొందించారు.

భారత ఉపఖండానికి ఈ వలస ప్రధానంగా రెండు దఫాలగా వచ్చిందని కోశాంబి అభిప్రాయం. క్రీ.పూ. 2000 సమీపంలో ఒకసారి, క్రీ.పూ. 1000 సమీపంలో ఒకసారి, పెద్ద ఎత్తున ఆర్యగణాలు వలస వచ్చాయి. మొదట వలస వచ్చిన వాళ్లు క్రీ.పూ. 1750 ప్రాంతంలో సింధూ నాగరికతను నాశనం చేసారని కోశాంబి అంటాడు. ఈ ఆర్యులు గుర్రాన్ని మచ్చిక చేసుకొని గుర్రాలతో లాగబడే బండ్లు (రథాలు) యుద్ధంలో ఉపయోగించారు. సింధూ నాగరికత తమకంటె ఉన్నత మయినది అయినప్పటికీ వాళ్ళకంటే మేలయిన ఆయుధాలను కలిగి వున్నారు. యుద్ధంలో అసాధారణ నైపుణ్యం గలవారనడానికి నిదర్శనంగా పడమటి ఆసియా నుండి భారత ఉపఖండం దాకా తమ కంటె నాగరికులయిన కంచు యుగపు వ్యవసాయకులనూ, తమ కంటే అనాగరికులయిన రాతి యుగపు ఆటవికులనూ ఓడించారు.

సింధూ నాగరికత నాశనానికి ఆర్యుల దండ యాత్రే కారణమని కోశాంబి అభిప్రాయం. దీనిని కొంచెం వివరంగా అర్థం చేసుకోవాలి. కోశాంబి ఈ అభిప్రాయానికి మద్దతుగా రెండు రకాల ఆధారాలను చూపిస్తాడు. ఒకటి పురావస్తు సంబంధమైనది, రెండవది సాహిత్య సంబంధమైనది (రుగ్వేదం).

హరప్పా అవశేషాలలో 1000 సంవత్సరాల పర్యంతం మార్పులు లేవని చూసాం. అయితే చిట్ట చివరి పై పొరలో మాత్రం ఏ క్రింది పొరల్లోనూ లేని కొత్త

విషయాలున్నాయి. ఈ పైపొర 'ఆర్యుల' ఆక్రమణను సూచిస్తుందని గార్డన్ చైల్డ్ గూడ భావించాడు. క్రింది పొరలలోని హరప్పా సమాధులలో శవాలను అడ్డంగా పడుకో బెట్టి పూడ్చిపెట్టారు. పై పొరలో, శవాల మాంసాన్ని పశుపక్ష్యాదులకు వేసి ఎముకలను మాత్రం కుండలో కూర్చోబెట్టి పూడ్చిపెట్టారు. పైగా ఈ కుండలు క్రింది పొరలలోని కుండలలాగ నిరాడంబరమయినవి కాక, చక్కగా బొమ్మలతో అలంకరించబడి వున్నాయి. క్రింది పొరలలో లేనిది పై పొరలో గొడ్డళ్లు వున్నాయి. అలాగే మొహెంజొ దారో పై పొరలో మొట్ట మొదటి సారిగా గుర్రం (లేక గాడిద) బొమ్మ నమూనా వుంది.[30] మొహెంజొదారోను తగల బెట్టి పెద్ద ఎత్తున హింసాకాండ జరిపినట్టు పైపొరలో దాఖలాలున్నాయి.[31]

దీనిని బట్టి ఈ రెండు పట్టణాలను ఎవరో శత్రువులు దాడి చేసి నాశనం చేసారనీ, కొంత కాలం ఆక్రమించుకొని ఆ తరువాత వాటిని శిథిలాలుగా వదిలేసారని అర్థం అవుతుంది. అయితే ఈ శత్రువులు ఆర్యులే ఎందుకు కావాలి? దీనికి గల ఆధారాలను కోశాంబి ఋగ్వేదం నుండి వుటంకిస్తాడు.

హరప్పా, మొహెంజొదారోలను నాశనం చేసిన వాళ్లు ఆ పట్టణాలను ఆక్రమించు కొని ఆ నాగరికతను కొనసాగించలేదు. వాళ్ళ దాడితో ఆ పట్టణాల నాగరికత అంతమ యింది. పోనీ సమీపంలో కొత్త పట్టణాలు నిర్మించారా అంటే అదీలేదు. కాబట్టి ఆ శత్రువులు ఎవ్వరోగాని వాళ్ళకు పట్టణ నాగరికత తెలియదు. అంతే కాక, ఈ పట్టణ నాగరికతకు ఆధారమయిన వరద ముంపు భూములలోని వ్యవసాయాన్ని గూడ వాళ్ళు నాశనం చేసి వుండాలి. లేకపోతే (ఆ వ్యవసాయం అట్లాగే కొనసాగి వుంటే) హరప్పా మొహెంజొదారో పట్టణాల పాలకవర్గాల లాగ ఈ శత్రువులు గూడ గ్రామాల నుండి అదనపు ఉత్పత్తిని సేకరించి పట్టణ నాగరికతను కొనసాగించి వుండవచ్చును. కాబట్టి పట్టణ నాగరికత గానీ వ్యవసాయంగానీ తెలియని వాళ్ళెవరో సింధూ నాగరికత వ్యవ సాయాన్నీ, రెండు పట్టణాలనూ హింసాత్మకంగా నాశనం చేసి వుండాలి.

ఋగ్వేదకాలంలో ఆర్యుల ముఖ్యదేవుళ్లు అగ్ని, ఇంద్రుడు. సోమపానం చేసి శత్రువును ఓడించమని ఋగ్వేద సూక్తాలలో ఇంద్రుడిని ఆహ్వానిస్తారు. నాస్తికుల సంపదను (నిధీ అదేవస్) కొల్లగొట్టిన వీరుడిగా పొగుడుతారు. యవ్యావతీ నది (ఇప్పటి రావి) ఒడ్డున వున్న హరియూపియ (హరప్పా అయివుండాలని కోశాంబి అభిప్రాయం) పట్టణాన్ని ముట్టడించి, కుండను ముక్కలు చేసినట్టు శత్రువుల సైన్యాన్ని ఛిన్నాభిన్నం చేసాడని ఒకచోట ఇంద్రుడిని పొగుడుతారు.[32] నార్మిణీ అనే పట్టణాన్ని అగ్నిదేవుడు దహనం చేసినట్టు ఋగ్వేదంలో అన్నారు. అది మొహెంజొదారో అయివుండాలనీ, మొహెంజొదారో శిథిలాల పై పొరలు ఆ పట్టణాన్ని తగలబెట్టినట్టు వున్న చిహ్నాలను ఈ విధంగా అర్థం చేసుకోవచ్చునని, కోశాంబి భావిస్తాడు.[33]

సింధూ నాగరికత ప్రజలు వరద ముంపు భూమి విస్తీర్ణాన్ని పెంచడం కోసం

నదికి అడ్డుకట్టలు వేసారని చూపాము. ఆర్యులు ఈ అడ్డుకట్టలను నాశనం చేసారనీ ఆ విధంగా సింధూ నాగరికతకు ఆధారమయిన వ్యవసాయం నాశనమయి ఆ నాగరికత గూడ నాశనమయిందనీ కోశాంబి అంటాడు. ఆధారాలు మళ్లీ రుగ్వేదం నుండే ఇంద్రుడిని రుగ్వేదంలో కృత్రిమ మయిన అడ్డుకట్టలను (రోధాంసి కృత్రిమాణి) తొలగించిన వాడు అని స్తుతిస్తారు. ఇంద్రుడికి అప్సుజిత్ (నీటిని జయించిన వాడు) అని పేరు.[34] తన ఒడ్డునంతా వరదనీటితో ముంచిన విబాలీ నదిని తిరిగి మామూలుగా ప్రవహింప జేస్తాడు ఇంద్రుడు. అన్నిటికంటే తరచుగా కోశాంబి ఉదహరించే రుగ్వేద ఘట్టం వృత్రాసురవధ. వృత్రుడు అనే రాక్షసుడు నల్లటి పాములాగ నదికి అడ్డంగా పడుకొని నదినీటిని ప్రవహించ నీయకుండా నిరోధించాడని, ఇంద్రుడు అతన్ని వజ్రాయుధంతో వధించడంతో నేల క్రుంగి, బండలుపొర్లి నదిమళ్లీ రాక్షసుడి శవం మీదుగా ప్రవహించడం మొదలు పెట్టిందని కథ. ఈ వర్ణన చాలా స్పష్టంగా అడ్డు కట్టలను తొలగించడాన్ని సూచిస్తుంది.[35]

ఆర్యులు ఈ అడ్డుకట్టలను ఎందుకు తొలగించాల్సి వచ్చింది అనే ప్రశ్న వస్తుంది. కోశాంబి రెండు కారణాలు సూచిస్తాడు. ఒకటి, నదికి ఎగువ భాగంలో అడ్డుకట్ట వేస్తే దిగువ భాగంలో నీటికి కరువవుతుంది. (కోశాంబి అన్నట్టు ఇప్పటికీ భారత పాకిస్తాన్ దేశాలు ఈకారణంగానే సింధు దాని ఉపనదుల మీది ఆనకట్టల గురించి కలహించు కుంటున్నాయి). రెండవది, వరదముంపు వ్యవసాయం వల్ల నది ఒడ్డున భూమి బురదగా తయారయి పశువులకు తిరగడానికి ఇబ్బంది అవుతుంది. ఇది పశుపోషకులయిన ఆర్యులకు నష్టకరం.

ఇందులో ఊహపాలు కొంచం ఎక్కువగా వుందని ఎవరయినా ఆక్షేపిస్తే బహుశా కోశాంబి ఒప్పుకోవడానికి సిద్ధమేనేమో. అయితే ఆర్యులకు నీటివనరుల గురించి ఆర్యేతరులతో తరచుగా తగాదాలు వచ్చేవనేది స్పష్టమే. మన పురాణాలలో ఋషులు, రాక్షసులు నదులను దారి మళ్ళించి తమకు నీళ్ళు లేకుండ చేస్తున్నారనీ దేవుళ్ళకూ, రాజులకూ మొర పెట్టు కుంటారు. (రాముడిని సహాయం పంపమని దశరథుడిని అడగడానికి వచ్చిన విశ్వామిత్రుడు చెప్పేకారణాలలో ఇది ఒకటి).

సింధూ నాగారికతను ఆర్యులే నాశనం చేసారా లేక ఆర్యులు రాకపూర్వమే వేరే ఎవరయినా ఆటవికులు నాశనం చేసారా అనేది ప్రశ్నార్థకంగానే వుండిపోతుంది. నాశనం చేసింది ఎవరయినప్పటికీ, ఆ నాగరికత కాలప్రవహంలో మార్పుకు అవకాశం లేకుండ బిగుసుకుపోయి వుండడం వల్ల తనకంటే వెనుకబడిన అనాగరికుల చేతిలో ఓడిపోవడానికి సిద్ధంగా వుంది. ఇది దాని ఓటమికి గల ముఖ్యమైన అంతర్గత కారణం. బయటి నుండి ఏశక్తులు పని చేసాయో తేల్చడం అసాధ్యమేనేమో.[36]

## వివరణలు

1. ISIH, Page 57, CCAI, Page 58

2. CCAI, Page 58
3. CCAI, Page 55
4. CCAI, Page 59
5. ISIH, Page 56
6. On the origin and development of silver coinage in India, IN, Page 91
7. ISIH, Page 71
8. ISIH, Page 62
9. ISIH, Page 63
10. ISIH, Page 78, పాదసూచిక 13. చిత్రం 64 వ పేజీలో వుంది.
11. Urvasi and Pururavas, MR, Page 71, CCAI, Page 68
12. Urvasi and Pururavas, MR, Page 71
13. CCAI, Page 68
14. CCAI, Page 68
15. Pilgrim's Progress : A contribution to the pre-history of the Western Deccan Plateau, MR, Page 115
16. Urvasi and Pururavas, MR, Page 81
17. CCAI, Page 70
18. CCAI, Pages 69-70, ISIH, Pages 75-76
19. CCAI, పేజీలు 65-66 ఒకే మూల ప్రాంతం నుండి ఈ మూడు నాగరికతలూ వచ్చాయన్న ఆలోచన ISIHలోనూ వుంది (పేజీ 76) గాని, అది ఏ ప్రాంతం అన్న విషయంలో అప్పటికి (1956) కోశాంబికి స్పష్టమైన అభిప్రాయం లేనట్టుంది.
20. ISIH, Page 58
21. ISIH, Pages 81-85
22. ISIH, Pages 81-82
23. CCAI, Page 76
24. Combined methods in Indology, HS, Pages 13-14 ISIH, Page 82
25. CCAI, Page 75
26. ISIH, Pages 82-83
27. CCAI, Page 75
28. CCAI, పేజీ 75, చేసిన నిర్ధారణ ఎంత ముఖ్యమో పద్ధతీ అంత ముఖ్యం కాబట్టి దానిని వివరించడం జరుగుతోంది.
29. ఋగ్వేదంలో ఒక చోట, ఉషస్సు దీర్ఘకాలం వరుణ లోకంలో వుండి వస్తుందన్న అర్థం గల ఒక వాక్యాన్ని పట్టుకొని ఆర్యులు ఆరు నెలలు పగలు ఆరు నెలలు రాత్రి అయిన ఉత్తరధృవం నుండి వచ్చారని తిలక్ చేసిన నిర్ధారణ ఏరకమయిన శాస్త్రీయ విశ్లేషణా పద్ధతినీ అనుసరించ లేదు కాబట్టే కోశాంబి దానిని 'అద్భుత మయిన ఊహాగానం, అన్నాడు. Urvasi and Pururavas, MR, Page 67, పాదసూచిక.

30. ISIH, Page 73
31. CCAI, Page 55
32. ISIH, Page 72
33. ISIH, Page 73
34. ISIH, Page 88
35. ISIH, Pages 74-75

౩౬. కోశాంబి తన విశ్లేషణను ప్రశ్నార్థకంతోనే ముగించాడు. బహుశా సింధూ నది తన ప్రవాహ మార్గాన్ని మార్చు కోవడం వల్ల సింధూ నాగరికత నాశనమయిందేమోనని ఒక చోట అంటాడు. **CCAI**, పేజీ 71

# 4. వ్యవసాయక వర్గ సమాజం-వర్ణ వ్యవస్థ

ప్రపంచ చరిత్రలో ఆర్యుల పాత్రను మరొక్కసారి గుర్తు చేసుకోవాలి. విడి విడిగా వున్న ఆటవిక సమాజాలకూ కంచు యుగపు వ్యవసాయ నాగరికతలకూ సంపర్కం ఏర్పరచింది ఆర్యులు. ఈ పని వాళ్ళు హింసాత్మకంగా చేసారు. అయితే వాళ్ళు తమదంటూ ఒక ఖచ్చితమయిన నాగరికత లేని పశు పోషకులు కావడం వల్ల తాము ఓడించిన నదీలోయ నాగరికుల సంస్కృతిలోని చాలా లక్షణాలను స్వంతం చేసుకున్నారు. వ్యవసాయం, ఇనుము వాడకం, నేర్చుకున్నారు. వాటిని స్వంతం చేసుకొని విశాల భూభాగంలో విస్తరింప జేసారు. అప్పటి వరకూ ఈ నాగరికతల భాషలో లిపి చాలా భిన్నం కావడమే కాక ఆయా సమాజాల పురోహిత వర్గాల చేతిలో గోప్యంగా, కర్మకాండలో అంతర్భాగమయిన రహస్యంగా, వున్నాయి. ఈ రహస్యాన్ని ధ్వంసం చేసి ఈ ప్రాంతానికంతా ఒక సరళమయిన భాషను (లేక భాషా కుటుంబాన్ని) ఆర్యులు అందిచ్చారు. అన్నిటికంటే ముఖ్యంగా ఇనుము యుగానికి సమాజం మారడానికి అవసరమైన సామాజిక నిర్మాణాన్ని రూపొందించారు. ఈ నిర్మాణాన్ని వాళ్లు స్వతంత్రంగా రూపొందించలేదు. బహుశా అందులోని ముఖ్యవిషయాలను తమ పూర్వుల నుండే అరువు తీసుకున్నారేమో (ఇనుము వాడకం లాగ, వాళ్ళను బల ప్రయోగంతో అణిచేస్తూ వాళ్ళ నుండి నేర్చుకుంటూ వాళ్ళ భౌతిక జీవితంలో (ఉత్పత్తి శక్తులలో) రావడానికి సిద్ధంగా వున్న మార్పుకు అనువయిన సామాజిక వ్యవస్థను (ఉత్పత్తి సంబంధాలను) వాళ్ళ ఆచారవ్యవహారాల నుండే రూపొందించి నిర్మించారు. రసాయనశాస్త్రంలో కేటలిస్ట్ (**catalyst**) అంటారు. కోశాంబి విశ్లేషణలో ఆర్యులు (దక్షిణ యూరప్ నుండి దక్షిణ ఆసియా దాక) కంచుయుగం నుండి కొత్త రాతియుగం నుండి ఇనుము యుగానికి జరిగిన మార్పుకు 'కేటలిస్ట్'గా పనిచేసారు. అయితే రసాయనిక కేటలిస్ట్‌లాగ కాక, ఈ క్రమంలో తమ పూర్వులను ఎంతగా మార్చారో తాము గూడ అంతగా మారరు.

ఇక దక్షిణ యూరప్ గురించీ, పశ్చిమ ఆసియా గురించీ మరచిపోయి మన దేశాన్ని గూర్చి చెప్పుకుందాం. క్రీ.పూ. 2000-1000 మధ్యలో రెండు విడతలుగా వలస వచ్చిన ఆర్యులు పశుపోషకులు. యుద్ధంలో నిపుణులు. గుర్రపు బండ్ల (రథాల) మీద కంచు లేక రాతి ఆయుధాలను ప్రయోగించి సమర్థవంతంగా యుద్ధం చేసేవారు. పశువుల మేత కోసం వెతుకుతూ సంచరిస్తూ జీవించేవారు.

వీళ్ళ సామాజిక వ్యవస్థ గణవ్యవస్థ, అయితే ఆహార సేకరణ చేసే ఆటవికుల

లాగ అది మాతృప్రాధానం కాదు, పితృస్వామికం. దీని ప్రతిఫలనంగా వాళ్ళ దేవుళ్ళు అత్యధికంగా మగ దేవుళ్ళే.[1] పశువులు తమ ప్రధాన సంపద కావడం వల్ల ఆర్యులు తమ కుదురులను గోత్రాలు అనేవారు. ఒక గోత్రం తన పశుసంపదను ఉమ్మడిగా కలిగి వుంటుంది.

గోత్రం అనే మాటకు 'పశువుల కొట్టం' అని అర్థం.[2] మన దేశంలో ఆర్యులు పురావస్తు అవశేషాలు వదిలి వెళ్ళ లేదుగాని ఇరాన్‌లోని పురావస్తు అవశేషాలలో కొన్ని ఆసక్తికరమయిన విషయాలు బయట పడ్డాయి. ఇరాన్‌లోని ఆర్యుల దేవుళ్ళలో 'యిమ రాజు' ఒకడు (యమరాజుకాదు, 'యిమరాజు') ఇతని యిమలోకంలో సుఖం, దుఃఖం, మరణం, జననం అనేవి ఉండవని భావించారు. ఈ యిమరాజు నివాసం ('వార్')కొలతలు ప్రాచీన మత సాహిత్యంలో ఖచ్చితంగా యిచ్చారు. పురావస్తు తవ్వకాలలో సరిగ్గా ఇవే కొలతలు గల రాతికొట్టాలు బయట పడ్డాయి. ఒక్కొక్క కొట్టం ఒక కుదురు. (గోత్రం) తన పశువులను కట్టేసిన కొట్టం చుట్టూవున్న రాతి గోడలలో చిన్నచిన్న గదులున్నాయి. గోత్రీకులంతా ఆ గదులలో (తమ పశువులకు కాపలాగా) నివసించేవారు. వాళ్ళ జీవనానికి అతిప్రధానం అయిన ఈ పశువుల కొట్టం అద్భుత ప్రతిఫలనం ద్వారా సుఖ దుఃఖాలకూ జీవనమరణాలకూ అతీతమయిన యిమలోకంగా మారింది.[3]

గోత్రాలు-గణాల వ్యవస్థను వదిలిపెట్టి వర్ణ వ్యవస్థను రూపొందించుకోవడం మనదేశానికొచ్చిన తరువాత ఆర్యులు మొట్టమొదటి ప్రముఖమైన పరిణామం. ఆదిమ పశుపోషక సమాజాన్ని వదిలి ఇనుము వాడకం తెలిసిన వ్యవసాయ వర్గ సమాజానికి జరిగిన పరిణామం యిది. అక్కడితో గోత్రాలు-గణాలు సామాజికంగా అర్థరహితం అయిపోయాయి. అయితే అన్ని విషయాలలోనూ పాత చెత్తనంతా మిగుల్చుకున్న మనదేశం వాటిని పూర్తిగా వదిలి పెట్టలేదు. గోత్రాలు ఇప్పటికీ బ్రాహ్మణులలో మిగిలి పోయాయి. వివాహ విషయాలలో సగోత్ర వివాహ నిషేధం (clan exogamy) మిగిలి పోయింది. సామాజిక నిర్మాణంలో గోత్రాలు పోయి కులాలు వచ్చాయిగాని ఆచారాలలో ఇప్పటికీ 'కులగోత్రాలు' రెండూ ముఖ్యమే.

ఇదంతా తరువాతి సంగతి.

## వేదాలు

క్రీ. పూ. 2000-1000 మధ్య కాలంలో భారత ఉపఖండానికి రెండు విడతలగా వలసవచ్చిన ఆర్యుల గురించి తెలుసుకోవడానికి పురావస్తు ఆధారాలు తక్కువ. కాబట్టి ప్రధాన ఆధారం ఆర్యుల సాహిత్యం. ఇందులో ప్రధానమయినది, ప్రాచీనమయినది, రుగ్వేదం. రుగ్వేదం కాలం క్రీ. పూ. 1500 అని కోశాంబి భావిస్తాడు. సింధూ నాగరికతను క్రీ. పూ. 1750 ప్రాంతంలో ఆర్యులే హింసాత్మకంగా (నదుల అడ్డు కట్టలను ధ్వంసం చేసి పట్టణాలను ముట్టడించడం ద్వారా)

నాశనం చేసారన్న కోశాంబి అభిప్రాయాన్ని చూసాం. కాబట్టి రుగ్వేద కాలం నాటికి ఆర్యుల చుట్టూవున్నది ఎక్కువగా ఆటవిక గణాలు, బహుశా కొన్ని పశుపోషక గణాలు, సింధూ లోయలలో తేలిక రకం వ్యవసాయం చేసే కర్షక సమాజాలు (హరప్పా, మొహెంజొదారోల అవశేషాలు). ఆర్యులు పశుపోషణతో బాటు కొంత ఆహార సేకరణగూడ చేసేవారు. పశువులతో సంచరిస్తూ తిరిగే ఆర్య బృందాలను (కుదురులు గాని అంతకంటె చిన్న సజాత బృందాలు గాని)'గ్రామాలు' అనేవారు.[4] స్థిర వ్యవసాయం అలవాటయిన తరువాత ఇదే పేరు వ్యవసాయక ఆవాసాలకు వచ్చింది. ఈ సంచార 'గ్రామం' పెద్దను 'గ్రామణి' లేక 'గోపుడు' అనీ, గణం పెద్దలను 'రాజులు' అనీ అనేవారు. మాటలకు చరిత్ర క్రమంలో అర్థం మారు తుందన్న విషయం మరచిపోతే రుగ్వేద కాలంలోనూ వ్యవసాయ గ్రామాలూ రాజులూ రాజ్యాలూ ఉండేవని తప్పుగా భావించడం జరుగుతుంది. పశు సంపదే ఆర్యుల ప్రధాన సంపద కావడం వల్ల చాలా వాటి పేర్లు గోవు సంబంధమయిన శబ్దాలను కలిగి వుంటాయి.[5]

ఆర్యుల పశువులు వ్యవసాయ సమాజాల పాడి ఆవులూ కాడెద్దులూ కావు. ఇవి పాలకోసం పొలం పనులకోసం కాక మాంసం కోసం పోషించిన పశువులు. గో మాంసం ఆర్యుల ప్రధాన ఆహారం. తమ పశు సంపదనూ నీటి వనరులనూ పెంపొందింప జేయడానికి దేవుళ్ళకు మొక్కేవారు. ఆ దేవుళ్ళను స్తోత్రం చేయడం ద్వారా, మంత్రాల ద్వారా, తమ అవసరాలు తీరుతాయని నమ్మేవారు. ఇదంతా ఒక కర్మకాండకూ మంత్ర సాహిత్యానికీ దారితీసింది. అదికాక, సంపదలోనూ సేకరించిన ఆహారంలోనూ వున్న హెచ్చుతగ్గులను ఒక కుదురుకు లేక గణానికి చెందిన వారు పంపకం ద్వారా సవరించుకోవాలి. పై అధ్యాయంలో చెప్పినట్టు ఈ పంపకం కర్మ కాండ యుతంగా జరుగుతుంది. ఈ రెండు లక్ష్యాలు గల కర్మకాండ గణ జీవితంలో సహజంగానే ప్రముఖ పాత్ర వహిస్తుంది. ఈ కర్మకాండ ఆర్యుల యజ్ఞం. యజ్ఞంలో ఎక్కువగా పశువులను బలి యిచ్చేవారు. అయితే నరబలిగూడ వుండేది.

రుగ్వేద సూక్తాలు ఈ యజ్ఞ కాండలో పఠించే మంత్రాలు. రుగ్వేదాన్ని గానం చేసే పద్ధతి సామవేదం. రుగ్వేదం అనంతర కాలంలో రూపొందిన కర్మకాండ సంబంధమయిన మంత్రాలు యజుర్వేదం, అధర్వవేదం. క్లుప్తమయిన సూత్రాల రూపంలో వున్న వేద మంత్రాలను వ్యాఖ్యానించే గ్రంథాలు బ్రాహ్మణాలు. వీటితో అరణ్యకాలు, ఉపనిషత్తులు కలిపి మొత్తాన్ని 'వేద సాహిత్యం' అంటారు. క్రీ.పూ. 1500 నుండి క్రీ.పూ. 600 దాకా ఆర్యుల జీవితాన్ని వివరించడానికి ప్రధాన సాహిత్య ఆధారం ఈ కర్మకాండ సంబంధమైన మంత్ర తంత్రాలూ వాటిని వ్యాఖ్యానించే గ్రంథాలు. ఈ కాలంలో ఆర్యులు పశుపోషక గణ వ్యవస్థ నుండి ఆహారాన్ని ఉత్పత్తి చేసే వర్గ వ్యవస్థకు మారారు. పంజాబు ప్రాంతపు సింధూ లోయల నుండి తూర్పున గంగా

యమునా లోయలకు విస్తరించారు. స్వల్పమైన పురావస్తు ఆధారాలతోనూ మంత్ర తంత్ర సాహిత్యంతోనూ ఈ చరిత్రను అర్థం చేసుకునే సాహసం చేసేటప్పుడు కోశాంబి అనుసరించే సిద్ధాంత దృక్పథాన్ని పద్ధతినీ జాగ్రత్తగా గుర్తుంచుకోవాలి.

పశుపోషక గణ వ్యవస్థ నుండి వ్యవసాయక వర్గ వ్యవస్థకు మారడం అంటే ఉత్పత్తి శక్తులలోనూ ఉత్పత్తి సంబంధాలలోనూ మార్పులు రావాలి. ఇనుము వాడకం నేర్చుకోవాలి, గొడ్డళ్ళు తయారు చేసుకొని భూమిని వ్యవసాయ యోగ్యం చేసుకోవాలి. నాగలి సహాయంతో పశువుల సహాయంతో ఇతర పనిముట్లు సహాయంతో, వ్యవసాయం చేయడం అలవర్చుకోవాలి. ఇవి ఉత్పత్తి శక్తులలోని మార్పులు. ఈ విషయంలో ఆర్యులు స్వంతంగా సాధించింది ఏమీలేదు. ఏదో ఒక రకమయిన నాగలి వాడకం వ్యవసాయం సింధూ నాగరికత కాలం నుండి అలవాటులో వుంది. ఇక ఇనుము మాట కొస్తే, ఆర్యుల రెండవ వలస (క్రీ. పూ. 1200-1000 కాలం) నాటికి మొత్తం పశ్చిమ-దక్షిణ ఆసియా ప్రాంతమంతా ఇనుము లోహంతో పరిచయం వుంది. అయితే ఈ రెండింటినీ జోడించి ఒక ఉన్నత స్థాయిలోని వ్యవసాయక సమాజాన్ని నిర్మించ గల సామాజిక వ్యవస్థ (ఉత్పత్తి సంబంధాలు) ఈ ప్రాంతపు ప్రజలకు లేదు. వాళ్ళ గణ వ్యవస్థ, లేక పౌరోహిత ఆధిపత్యం, ఉత్పత్తి శక్తులలో అభివృద్ధికి ఆటంక మయ్యాయి. ఈ అభివృద్ధికి అవసరమయిన నూతన సామాజిక వ్యవస్థను రూపొందించింది ఆర్యులు. 'రూపొందించారు' అంటే తీరికూర్చుని తయారు చేస్తారని కాదు.[6] తమ చుట్టూవున్న సమాజాలతో నిరంతరం జరిగిన ప్రతి చర్యలో భాగంగా ఆర్యుల ఆధిపత్యంలో ఈ వ్యవస్థ రూపొందింది.

ఈ కొత్త సామాజిక వ్యవస్థను నిర్మించిన క్రమంలో నాలుగు దశలను గుర్తించ వచ్చును.

(అ) విడివిడిగా వుండి పశువుల గురించి, నీటి వనరుల గురించి, నిత్యం కలహించు కున్న[7] ఆర్య ఆర్యేతర గణాలను ఐక్యం చేసి ఒక విస్తృత 'ఆర్య సమాజం'గా మలచడం.

(ఆ) గణంలో, వ్యవసాయ ఉత్పత్తి చేసే వర్గం, అదనపు ఉత్పత్తిని చేజిక్కించు కునే పాలకవర్గం, అనే వర్గ విభజనను సాధించడం.

(ఇ) ఆర్య, ఆర్యేతర గణాలలో బలహీనమయిన వాటిని లోబరచుకొని శ్రామిక వర్గంలో గానీ అంత కంటే హీనమయిన స్థానంలో గాని కలుపుకోవడం

(ఈ) ఆర్యేతర గణాలలో బలమయిన వాటికి-అంటే పూర్తిగా లోబరచుకోవడం కష్టమయిన వాటికి- ఆహార ఉత్పత్తినీ ఇనుము వాడకాన్నీ అలవాటుచేసి ఆ గణాలలో గూడ వర్గ విభజనను ప్రవేశపెట్టి విస్తృత ఆర్యసమాజంలో వారిని కలుపుకోవడం.

ఈ నాలుగు దశల విభజన కేవలం సూత్ర ప్రాయమయినదే. ఇవి ఒక క్రమంలో ఒకదాని తరువాత ఒకటి జరిగాయని భావించగూడదు. ఒక సంక్లిష్టమయిన

చర్య-ప్రతిచర్యల కలయికగా కొన్ని శతాబ్దాల తరబడి ఈ మార్పు సాగింది. దీనిని సోదాహరణంగా కోశాంబి వివరించిన తీరును ఈ అధ్యాయంలోనూ తరువాతి అధ్యాయం లోనూ చూద్దాం.

వివిధ ఆర్యగణాల ఏకీకరణమయినా గణంలో ఒక వర్గాన్ని అణగ దొక్కడ మయినా శత్రుగణాలను లోబరచుకోవడమయినా అన్నీ గూడ బల ప్రయోగం ద్వారా జరగ గల పనులే. జరిగాయి కూడ. అయితే ఆర్యులు అల్పసంఖ్యాకులు కావడం వల్ల హింస కంటె సర్దుబాటును, సామాజిక సాంస్కృతిక సమ్మేళనాన్నీ ప్రధాన సాధనాలగా ఉపయోగించారు. బలప్రయోగం కంటె సామాజిక సాంస్కృతిక అణచివేత ప్రధాన సాధనంగా ఉపయోగించారు. ఈ క్రమంలో లొంగిపోయిన వాళ్ళ అలవాట్లూ ఆచారాలూ పూజా విధానం సామాజిక నిర్మాణం ఏదో ఒక రూపంలో ఆర్యసమాజంలోకి వచ్చి చేరి, చరిత్రకారుడికి ఒక ముఖ్య చారిత్రక ఆధారమయ్యాయి. ఈ క్రమంలోనే 'ఆర్య సంస్కృతి' ప్రధాన లక్షణాలయిన వర్ణ వ్యవస్థ, బ్రాహ్మణ ఆధిక్యం, అ వాస్తవికత, పౌరాణిక అసంబద్ధత, అహేతకుమయిన కర్మకాండ, రూపం తీసుకున్నాయి. అయితే తరువాతి కాలంలో సమాజ పురోగమనానికి పెద్ద ప్రతిబంధ కంగా తయారయిన ఈ లక్షణాలన్నీ ప్రాచీన కాలంలో విప్లవాత్మకమయిన మార్పును సాధించిన పరిణామక్రమం యొక్క ఫలితాలే.

పైన వివరించిన నాలుగు దశలలో మొదటి దశను ప్రతిఫలించే సాహిత్యా ఆధారం రుగ్వేదం. మొదటి విడత వలస వచ్చిన ఆర్యులు ఇరాన్, అఫ్ఘానిస్తాన్‌ల మీదుగా పంజాబు ప్రాంతాన్ని చేరుకున్నారు. ఇప్పుడు అయిదు నదులున్న పంజాబులో అప్పుడు ఏడు నదులుండేవి. మిగిలిన రెండు దృషద్వతి (ఘగ్గర్ అనేది తరువాతి కాలపు పేరు), సరస్వతి (సర్సూతి). ఇవి రెండూ ఆ తరువాత ఎండిపోయాయి. వీటిలో సరస్వతిని రుగ్వేద ఆర్యులు చాలా పవిత్రమైన నదిగా భావించారు. అసలు సరస్వతి అఫ్ఘానిస్తాన్‌లోని హెల్మండ్ నది అనీ అఫ్ఘానిస్తాన్ వదిలి పంజాబుకు వచ్చిన తరువాత ఆపేరే ఇక్కడి సప్తనదులలో ఒకదానికి పెట్టుకున్నారనీ కోశాంబి అంటాడు.[8]

రుగ్వేద కాలంలో ఆర్యులలో వర్ణ వ్యవస్థ లేదు. వివిధ ఆర్యగణాలు, ఆ గణాలలో గోత్రాలు, మాత్రం వుండేవి. వైదిక యజ్ఞాలకు సంబంధించిన కర్మకాండను నిర్వహించే పని ప్రతీ కుదురు లేక కుటుంబంలోనూ కొందరు చేసేవారు.[9] అంటేఒక ప్రత్యేకమయిన బ్రాహ్మణ వర్ణం లేక వర్గం అప్పటికి లేదు. అయితే వేదమంత్రాలను లిపి బద్ధం చేయకుండ రహస్యంగావుంచి, నేర్చుకోదల్చుకున్న వాళ్ళు మొత్తం వేదాన్ని ఒక్క ముక్క పొల్లుపోకుండ కంఠస్తం చేయాలన్న నియమం పెట్టడంలోనే ఒక పురోహిత (బ్రాహ్మణ) వర్గం ఆవిర్భావానికి మూలం వుంది.[10] వేదమంత్రాలు నేర్చుకోదల్చుకున్న వ్యక్తి అడవుల్లో నివాసం ఏర్పరచుకున్న గురువుగారి దగ్గర

నివసించాలి. అతని పశువులనుపోషించాలి, అతని కోసం ఆహారాన్ని సేకరించి పెట్టాలి. అంటే అతని తరఫున పశుపోషణ, ఆహారసేకరణ, చేయాలి. ఈ విధంగా కొన్ని సంవత్సరాల పాటు రుగ్వేద మంత్రాలను కంఠస్తం చేసిన పిదపగాని ఆ శిష్యుడు పౌరోహిత్యానికి అర్హుడుకాడు. ఈ విధంగా యజ్ఞ కర్మకాండకు సంబంధించిన మంత్రాలను లిపిబద్ధం కానీయకుండ కొందరి గుత్తాధిపత్యంలో ఉంచుకోవడంవల్ల పురోహితులకు సమాజంలో అసమానమయిన స్థానం లభించింది. "తరువాతి కాలంలో బలంగా చరిత్రను ప్రభావితం చేసిన శక్తివంతమయిన వర్గంగా మార్చింది."

రుగ్వేదం 'ఆర్యులందరిదీ' కాదు. నిజానికి పైన ఇచ్చిన నాలుగు దశల వివరణను బట్టి, 'ఆర్యులు' అనేది చాలా అస్పష్టమైన మాట అని అర్థం అవుతుంది. రుగ్వేదం కొన్ని గణాల, కొన్ని గోత్రాల సాహిత్యం. దానిని గానం చేసిన వాళ్ళు బ్రాహ్మణుల గోత్రాలకు మూల పురుషులగా చెప్పుకునే ఏడుగురు రుషులు (సప్తర్షులు). ఈ గణాలు తమలో తాము కలహించుకున్నాయి, ఇతర ఆర్య ఆర్యేతరగణాలతో కలహించాయి. కలహించుకునే క్రమంలో ఒక సమాజంగా ఏకమయ్యాయి. ఈ విధంగా ఆర్యగణాలనూ కొన్ని ఆర్యేతర గణాలనూ ఐక్యం చేయడంలో పురోహితులు ప్రముఖ పాత్ర వహించారు. ఎవ్వడు ప్రతి ఫలం ఇవ్వగలడో వాడిని 'ఆర్యుడి'గా పొగడడానికీ, వాడి తరఫున యజ్ఞకాండ నిర్వహించడానికీ పురోహితులు ఎల్లప్పుడూ సిద్ధమే. ఈ విధంగా ఆర్య సమాజాన్ని విస్తరింపజేస్తూ ఆక్రమంలో పురోహితులు ఒక బ్రాహ్మణ వర్గంగా రూపొందారు.

రుగ్వేదకాలంలో ఆర్యుల ప్రముఖ దేవుడు అగ్ని. యజ్ఞాలలో ప్రత్యక్షంగా అగ్నికి బలులు అర్పించేవారు. అగ్నికాక ఇతర దేవుళ్ళయిన వరుణుడు, మిత్రుడు, సూర్యుడు, వాయువు, అశ్వినులు, పర్జన్యుడు మొదలయిన వాళ్ళు చాలా వరకు వివిధ ప్రాకృతిక విషయాల మానవీకృత రూపాలు. ఈ దేవుళ్ళ నాయకుడయిన ఇంద్రుడు యుద్ధంలో నిపుణుడు. అతనికి బలులు అర్పించి మంచి చేసుకున్న ఆర్యగణాలకు ఇతర (ఆర్య ఆర్యేతర) గణాలతో యుద్ధం చేయడంలో సహకరిస్తాడు. ఈ యుద్ధాలు ప్రధానంగా పశు సంపద గురించి, నీటి వనరుల గురించి, జరిగాయి. కోశాంబి తరచుగా ప్రస్తావించే రెండు ఉదాహరణలు ఇక్కడ చూద్దాం.

రుగ్వేదంలో ఆర్యుల శత్రువులగా పిలవబడ్డ వాళ్ళు (1) పణులు (2) దాసులు (లేక దస్యులు).[11] పణులు ధనవంతులనీ లోభులనీ ఆశాపరులనీ వేదంలో వర్ణించారు. తరువాతి కాలంలో ప్రాచుర్యం పొందిన వణిక్ (వ్యాపారస్తుడు), పణం (నాణెము), పణ్యం (సరుకులు) అనే మాటలను బట్టి ఈ పణులు బహుశా సింధూ నాగరికత వ్యాపారస్తుల అవశేషం అయివుంటారని కోశాంబి భావిస్తాడు.[12] ఇంద్రుడు వీళ్ళ సంపదను కొల్లగొడతాడు. వీళ్ళను రాక్షసులనీ ఆర్యులకు శత్రువులనీ ప్రకటిస్తాడు. ఒక సందర్భంలో శునక రూపంలోని సరమా అనే అమ్మదేవతను ఇంద్రుడు

పణుల దగ్గరికి రాయబారిగా పంపి తనకు పశువులను 'కప్పం'గా ఇయ్యాలనీ లేకపోతే అవాంఛనీయ పరిణామాలుండగలవనీ బెదిరిస్తాడు.

'దాసుడు' అంటే తరువాతి కాలంలో సేవకుడు, భృత్యుడు అని అర్థం. అయితే రుగ్వేద కాలంలో దాసులు కేవలం ఆర్యేతర ప్రజలు. ఆర్యులకు ప్రధాన శత్రువులుగా కనబడతారు.[13] వీళ్ళనుగూడ రాక్షసులగా వర్ణించారు. అర్బుదుడు అనే దాసుడిని ఇంద్రుడు తన కాళ్ళ కింద వేసి తొక్కి చంపాడు. నది నీళ్ళకు అడ్డం పడుకున్న వృత్రుడు అనే దాసుడిని వజ్రాయుధంతో వధించి ఆ నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాడు. రెండు నదులకు అధిపతి అయిన నమూచి అనే దాసుడిని గూడ ఇంద్రుడు భీకర యుద్ధం చేసి జయించాడు. ఆ నమూచి సైన్యంలో అందరూ స్త్రీసేనట-దానిని బట్టి దాసులు మాతృస్వామ్య దశకు చెందిన ఆటవికులని అర్థం అవుతుంది. అయితే ఈ దాసులలో కొందరు నదీలోయలలో చిన్న చిన్న పట్టణాలను ('పురము' లను) కలిగి ఉండవచ్చును.[14] ఎందుకంటే ఇంద్రుడు పురములను జయించిన 'పురందరుడు'. శుష్ణ, పిప్రు, శంబర అనే దాసుల పురాలను ఇంద్రుడు నాశనం చేసాడు. బహుశా 'దాసులు' అనేది ఒక గణం పేరుకాక ఆర్యులకు పంజాబులో తారసిల్లిన ఆర్యేతర గణాలన్నింటికి సామాన్య ప్రయోగం కావచ్చును. వీళ్ళలో కొందరు ఆహారాన్ని సేకరించే ఆటవికులు, కొందరు పశుపోషకులు, కొందరు సింధూ లోయలలో చిన్నచిన్న పట్టణాలు కలిగిన కంచు యుగపు నాగరికులు (హరప్పా, మొహెంజొదారోల వారసులు) కావచ్చును.[15]

ఈ 'దాసులు' బానిసలుగాని సేవకులుగాని కారని మరొకసారి గుర్తుచేయాలి. ఆర్యులు వ్యవసాయక వర్గ సమాజాన్ని సాధించి ఈ దాసులలో కొందరిని శూద్రులుగా తమకు లోబరచుకున్న తరువాత వీళ్ళ పేరే బానిసత్వాన్నీ భృత్య లేక సేవక స్వభావాన్నీ సూచించే మాట అయింది. రుగ్వేద కాలానికి అటువంటిదేమీ లేదు. దాసులు కేవలం ఆర్యేతర జనం. వాళ్ళు నల్లటి వాళ్లు (వాళ్ళ పురములను కష్ణగర్భ-అంటే కడుపులో నల్లటి జనాన్ని కలిగినవి-అని వర్ణించారు).[16] చప్పిడి ముక్కులు గల వాళ్లు ('అనాసులు', అంటే ముక్కు లేనివాళ్ళు).[17]

ఈ దాసులు భృత్యులగానూ సేవకులగానూ లొంగిపోకముందే (అంటే రుగ్వేద కాలంలోనే) ఆర్యదాస ముఖ్యుల సమ్మేళనం ప్రారంభమయింది. ఈ సమ్మేళనంలో పురోహితులు ముఖ్యపాత్ర వహించారు. ఆక్రమంలో దాసపురోహితులూ ఆర్య పురోహితులూ ఒకటయి, ఇద్దరూ కలిసి బలమయిన బ్రాహ్మణ వర్ణంగా ఏర్పడ్డారు. సింధూ నాగరికతలోని పురోహిత ప్రాబల్యాన్ని గుర్తుంచుకుంటే, బహుశా ఈ బ్రాహ్మణ వర్ణంలో ఆర్య అంశ కంటె దాస అంశే ఎక్కువ కావచ్చు. ప్రధానమయిన బ్రాహ్మణ గోత్రాలూ రుషులూ చాలా వరకు దాసుల నుండి వచ్చి చేరినవేనని కోశాంబి అభిప్రాయం.[18]

చాలా ముఖ్యమైన ఈ నిర్ధారణను వివరంగా పరిశీలిద్దాం.

రుగ్వేదం చివరి భాగంలో 'దశరాజ్ఞ యుద్ధం' కథవుంది. సుదాః (లేక సుదాసుడు) అనేవాడు భరతగణానికి చెందిన ఒకానొక రాజు. రుగ్వేద కాలంలో ఆహార ఉత్పత్తిగానీ స్థిరవ్యవసాయంగానీ లేవు కాబట్టి రాజులూ రాజ్యాలూ లేవు. ఇక్కడ 'రాజు' అంటే గణముఖ్యుడు అని అర్థం. ఈ సుదాసుడి తండ్రి దివోదాసుడు. దాసుడు అంటే సేవకుడు అనే అర్థం అప్పటికి లేదు కాబట్టి, సుదాసుడు అంటే మంచిదాసుడు అనీ దివోదాసుడు అంటే దేవతల దాసుడు అనీ అర్థం చెప్పుకోవడానికి వీలులేదు. కాబట్టి ఈ 'భరత రాజులు' ఆర్యులు కాక దాసులు అయివుండాలి. ఈ సుదాసుడు మరొక 10 మంది 'రాజు' లతో యుద్ధం చేసాడు. ఆ పది మంది చేసిన తప్పేమిటంటే పరుష్ని అనే నదిని దారి మళ్ళించడం.[19] ఈ నీటి తగాదాను పరిష్కరించడం కోసం సుదాసుడు వాళ్ళతో యుద్ధం చేయగా ఇంద్రుడు అతని పక్షం వహించి గెలిపించాడు. ఓడిపోయిన 10 తెగల పేర్లు శిమ్యు, తుర్వశు, యక్షు, మత్స్య, భృగు, ద్రుహ్యు, పక్తు, భలాన, అలిన, విషాణి. ఇందులో మత్స్య (చేప) అలిన (తుమ్మెద) కుదురు పేర్లుకాగా, తక్కిన వాటిలో భృగు వంటివి ఖచ్చితంగా ఆర్యగణాలే. ఈ విధంగా దాసుడయిన భరతరాజు ఇంద్రుడి సహాయంతో కొందరు ఆర్య, కొందరు ఆర్యేతర గణాలను ఓడించి భరత గణం ఆధిపత్యాన్ని నెలకొల్పాడు. తరువాతి కాలంలో తాము భారతులమని (భరతులసంతతి అని) చెప్పుకోవడానికి ఆర్యావర్తాన్ని ఏలిన రాజులంతా గర్వపడ్డారు. పైగా రుగ్వేదంలో ఈ 'దశరాజ్ఞ' యుద్ధంలో సుదాసుడి విజయాన్ని గానం చేసిన వాడు ప్రముఖ బ్రాహ్మణ రుషి అయిన వశిష్ఠుడు. దీన్ని బట్టి చూస్తే, వర్ణవ్యవస్థ ఏర్పడక పూర్వం (అంటే రుగ్వేద కాలంలో) ఆర్య దాస సమ్మేళనానికి 'వర్ణ సాంకర్యం' అనే అభ్యంతరంలేదు. అందరూ ఇంద్రుడి సహాయాన్ని అర్థించారు. ఇంద్రుడు అందరికీ సహాయం చేసాడు.

ఈ ప్రయత్నంలో పురోహితుల పాత్ర (ఇప్పటికి వీళ్ళ నింకా బ్రాహ్మణులు అనడానికి వీలులేదు) చెప్పకో దగ్గది. ఒకవైపు రుగ్వేదం నిండా దాసులనూ పణులనూ, దూషిస్తూ మరొక వైపు పురోహితులు అదే దాస 'రాజుల' నుండి దక్షిణలు పొంది వాళ్ళకోసం యజ్ఞాలు నిర్వహించారు. పణులలో అగ్రగణ్యుడయిన బృబువు చాలా ఉదారస్వభావుడని ఆర్యుడయిన భరద్వాజుడు పొగిడాడు. తరువాతి కాలంలో దీనిని సర్ది చెప్పడానికి బ్రాహ్మణులు నానా తంటాలు పడ్డారు. వశ అశ్వ్యుడనే పురోహితుడు బల్బూథ తరుక్షులనే దాసుల నుండి 100 ఒంటెలు దక్షిణ పొంది వాళ్ళను పొగిడాడు.[20] రుగ్వేదంలో మొట్టమొదటి గణాలుగా అయిదింటిని (పంచ జనులు) పేర్కొన్నారు. వాళ్ళలో యాదవులు ఒకరు. అయితే ఈ యాదవుల దేవుడయిన కృష్ణుడు నల్లటివాడు, ఇంద్రుడికి శత్రువు.[21]

ఈ క్రమంలో రెండు మార్పులు జరిగాయి. ఒకటి, దాసుల పురోహితులూ

ఆర్యుల పురోహితులూ ఒకటై బ్రాహ్మణ వర్ణంగా ఏర్పడ్డారు. రెండు, తదుపరి కాలంలో వ్యవసాయక వర్గ సమాజంలో శ్రామిక వర్గంగా ఇతర దాసులను లొంగదీసుకొని శూద్రులుగా ప్రకటించి కూలి చేయించుకోవడానికి అనువయిన వర్ణ వ్యవస్థను రూపొందించడంలో ఈ పురోహితులు ముఖ్యపాత్ర వహించారు.

దీన్ని నిరూపించడం కోసం కోశాంబి రుగ్వేదంలో తత్పూర్వకాలపు అవశేషాల కోసం వెతుకుతాడు. ఆర్యులు పితృ స్వామికులు కాబట్టి వాళ్ళ ముఖ్య దేవతలు అంతా పురుషులే. అయితే రుగ్వేదంలో కొందరు స్త్రీ దేవతలుగూడ వున్నారు. వీళ్ళను కోశాంబి ఆర్యేతరుల అమ్మదేవతలుగా గుర్తిస్తాడు. వీళ్ళ కథలలో పైన వివరించిన పరిణామక్రమం చిహ్నాలను గుర్తిస్తాడు.[33]

రుగ్వేదంలోని ముఖ్యమైన స్త్రీ దేవత ఉష (ఉషస్సు) రుగ్వేదంలో ఈమె స్థానం ఒకే రకంగా లేదు. ఇతర వైదిక దేవుళ్ళతో బాటు ఈమె గూడ బలులు అందుకుంటుంది. ఈమెను 21 శ్లోకాలలో స్తుతించారు. అదే సమయంలో ఆమె రంభ ఊర్వశి మొదలయిన అప్సరసలలాగ మగవాళ్ళను ఆకర్షించడానికి తన సౌందర్యాన్ని అర్థ నగ్నంగా ప్రదర్శిస్తుంది. మరొక చోట ఇంద్రుడు ఆమెతో భీకరంగా యుద్ధం చేసి ఆమె బండిని విరిచేసి ఆమెను పారద్రోలినట్టు ఇంద్రుడిని పొగుడుతారు. అయితే ఆమె శాశ్వతంగా పారిపోలేదు. ఆమె ప్రస్తావన వేదంలో మళ్ళీ మళ్ళీ వస్తూనే వుంటుంది.

ఉషస్సు అసలు ఆర్యదేవత కాదనీ, పంజాబు ప్రాంతంలో ఆర్యులు రాక పూర్వం వున్న ఆటవికుల అమ్మదేవత అనీ కోశాంబి అభిప్రాయం. ఊర్వశి, మేనక, రంభ మొదలయిన అప్సరసలు గూడ ఈ ఆర్యపూర్వుల నీటిదేవతలు (అప్ అనే ధాతువుకు నీరు అని అర్థం). రెండవ అధ్యాయంలో చెప్పినట్టు ఈ నీటి దేవతల వల్ల మగవాళ్ళకు చాలా ప్రమాదం. తమతో కలిసిన మగవాడి ప్రాణాన్ని వాళ్ళు బలి కోరుకుంటారు. పురుషాధిక్య పశు పోషక లేక వ్యవసాయక సమాజానికి ఈ ఆటవికులు లొంగిన తరువాత నీటిదేవతలు పురుషులకు ఆనందాన్ని ఇచ్చే దేవవేశ్యలుగా (అప్సరసలుగా) మారిపోతారు. అయినప్పటికి (గతకాలపు అవశేషంగా) మగవాళ్ళకు వాళ్ళ వల్ల ప్రమాదం పూర్తిగా పోదు. వాళ్ళు పురుషాధిక్య సమాజపు గృహిణులలాగ లొంగి పడి వుండరు. 'తలతిక్కగా' ప్రవర్తిస్తారు. వాళ్ళను కోరుకోవడమయినా పెండ్లి చేసుకోవడమయినా ప్రమాదం. శంతనుడు-గంగ, భీష్ముడు-అంబ, పురూరవుడు-ఊర్వశి మొదలయిన కథలలో ఇది స్పష్టంగా కనబడుతుంది. పాండు రాజుకు మాద్రిని కలవకూడదని శాపం. కలవగానే చనిపోతాడు. చివరికి, చాలా కాలం తరువాత రాసిన మను ధర్మ శాస్త్రంలో గూడ, (గంగ, గోదావరి మొదలయిన) నదుల పేర్లున్న అమ్మాయిని వివాహం చేసుకోవడం ప్రమాదం అన్నాడంట.[33]

పంజాబు ప్రాంతంలోని ఆర్యేతరులతో అక్కడికి కొత్తగా వచ్చిన ఆర్యులు తలపడ్డారు. రుగ్వేదంలో ఇంద్రుడు ఉషస్సు ఎడ్ల బండిని విరిచి ఆమెను తరిమేసాడన్న

కథ ఇందుకు ప్రతిఫలనం. అయితే ఈ విధంగా ఓడించిన వాళ్ళను పూర్తిగా నాశనం చేయకుండ, శాశ్వతంగా శత్రుత్వం పెట్టుకోకుండ తమ ఆధిపత్యం కింద తమలో కలుపుకునే ప్రయత్నం చేసారు. ఆమె బండిని ఇంద్రుడు విరిచేసినా ఆమె తిరిగి వచ్చింది. తరువాతి సూక్తాలలో ఆమె ఎడ్లబండి మీద కాక రథం మీద ప్రయాణం చేసినట్టు చెప్తారు. అమ్మ దేవతల పూజలలో విగ్రహాన్ని ఎడ్లబండి మీద ఊరేగించడం ఇప్పటికీ అలవాటే, బ్రాహ్మణుల దేవుళ్ళకు మాత్రం రథాలుంటాయి. (దక్షిణ దేశంలో ప్రతీ గుడికి ఒక 'తేరు' వుంటుంది). దీన్ని బట్టి ఉషస్సు ప్రాచీన స్థానిక దేవత అని అర్థం అవుతుంది.

అదే ఋగ్వేదంలో ఉషస్సును దేవతల తల్లి (మాతాదేవానాం) అనీ అదితి (సూర్యుడి తల్లి) అనీ అన్నారు. అయితే ఆమె స్థానం దిగజారిందనడానికి నిదర్శనంగా ఈ 'దేవతల తల్లి' అర్థ నగ్నంగా దర్శనమిస్తుంది.

ఈ విధంగా ఆర్యేతరులను కలుపుకొనే క్రమంలో భాగంగానే రెండు సమాజాల పురోహితులు ఒకటయ్యారు. ఋగ్వేద సప్తర్షులు తాము ఉషామాత గర్భం నుండి పుట్టినట్టు చెప్పుకున్నారు. ఆ విధంగా పుట్టిన తాము అంగీరసుల మన్నారు. అదే వేదంలో కృష్ణ అంగీరసుడు అనే ఋషి ఉన్నాడు. 'కృష్ణ' అంటే నల్లని అని అర్థం కావడంవల్ల ఈ ఋషి అనార్యుడని అర్థం అవుతుంది.[24]

మరికొన్ని రుజువులు ఋషుల జన్మ కథలలో దొరుకుతాయి. ఋగ్వేద కాలం నాటి ఋషులలో ఒక్క విశ్వామిత్రుడు మాత్రమే ఖచ్చితంగా ఆర్యుడని కోశాంబి అభిప్రాయం. ఈ ఒక్కడూ బ్రాహ్మణుడు కాడు, క్షత్రియుడు. అంటే తొలినాడు బ్రాహ్మణులు అనే పురోహితుల వర్గం లేదని కోశాంబి అర్థం చేసుకుంటాడు. అన్ని గోత్రాలలోనూ లేక కుటుంబాలలోనూ కొందరు పౌరోహిత్యం చేసేవారు. అటువంటి విశ్వామిత్రుడిని తొలగించి భారత గణానికి పురోహితుడయిన వశిష్ఠుడిది విచిత్రమయిన జన్మ కథ. ఇతను ఊర్వశి మనసు నుండి పుట్టాడని ఒక కథ మిత్రుడు, వరుణుడు అనే యిద్దరు ఆర్య దేవుళ్ళ వీర్యం ఒక కుండలో పడగా అందులోంచి పుట్టాడని మరొక కథ. పుష్కరణిలో దొరికాడని మూడవ కథ.[25] వశిష్ఠుడిని తమ మూల పురుషుడిగా పరిగణించే బ్రాహ్మణ గోత్రాలలో పౌష్కర సాది, కౌండిన్య, అనేవి రెండు. పుష్కరంలో ఉండేవారు, కుండలో పుట్టిన వారు అని వీటికి అర్థం (కుండ అనేది ప్రాచీన సంస్కృత పదం).[26] ఊర్వశి నీటిదేవత, కుండ నీటి దేవత ప్రతిరూపం, అలాగే పుష్కరం గూడ అని గుర్తిస్తే వశిష్ఠుడు అసలు ఆర్యుడు కాదనీ ఆర్యేతరుల అమ్మదేవతల పూజలు నిర్వహించిన పురోహితుడనీ అర్థం అవుతుంది. మాతృ స్వామ్యంలో తండ్రికి గుర్తింపు ఉండదు. అటు వంటి మాతృస్వామ్యం పితృ స్వామ్యానికి లోబడినప్పుడు ఇది అభావం చెంది తల్లికి గుర్తింపు పోతుంది. ఒక మగవాడి వీర్యం కుండలోనో, నదిలోనో, చెరువులో

నో (అన్నీగూడ అమ్మదేవతలకూ మాతృ గర్భానికీ ప్రతి రూపాలు) పడగా శిశువు జన్మించినట్టు కథ పుడుతుంది. ఇటువంటి కథలు మన పురాణాలలో కొల్లలు వశిష్ఠుడి లాగే కుండలో పుట్టిన మరొక రుషి అగస్త్యుడు.

వశిష్ఠ విశ్వామిత్రుల కలహాన్ని ఇప్పుడు అర్థం చేసుకోవచ్చును. విశ్వామిత్రుడు ఆర్యుడు. 'క్షత్రియుడు' అన్నారు కాబట్టి గణ ముఖ్యుల కుటుంబానికి చెందినవాడు కావచ్చును. తొలిరోజులలో ఇతను భరత గణం పురోహితుడు. (అసలు ఈ భరత గణమే స్వచ్ఛమైన ఆర్య గణం కాకపోవచ్చునని సుదాసుడి కథలో పైన చూసాము!). క్షత్రియుడు పురోహితుడయ్యాడంటేనే ఆనాటికి పౌరోహిత్యం చేసే ఒక బ్రాహ్మణ వర్ణం లేదని అర్థం. ఇటువంటి విశ్వామిత్రుడిని తొలగించి అతని స్థానంలో భరతుల పురోహితుడయిన వాడు వశిష్ఠుడనే అనార్యపురోహితుడు. ఈవిధంగా ఆర్య-అనార్య సమ్మేళనం జరిగిన క్రమంలోనే ఒక 'బ్రాహ్మణ' వర్ణం ఏర్పడింది. ఆ బ్రాహ్మణ వర్ణానికి మూల పురుషులుగా భావించే సప్తర్షులలో (ఒక్క వశిష్ఠుడేకాదు) ఏ ఒక్కరూ ఆర్యులు కారని కోశాంబి అభిప్రాయం. ఈ విధంగా అనార్య పురోహితులు తమ స్థానాన్ని కాజేస్తుంటే ఆర్యులలో పౌరోహిత్యం చేసే వాళ్ళు కోపగించి తమకూ బ్రాహ్మణులుగా గుర్తింపు కావాలని తంటాలు పడ్డారు. విశ్వామిత్రుడు అందుకోసం పడ్డప్రయాస తెలిసిన కథే.

బ్రాహ్మణుల అనార్య మూలనికి కోశాంబి ఇంకా చాలా ఉదాహరణలిస్తాడు.[27] బ్రాహ్మణులలో కణ్వ (కణ్వాయన) గోత్రం వుంది. అయితే అధర్వవేదంలో కణ్వుడనే వాడు నల్లటి రాక్షసుడు రుగ్వేదంలో కవష ఐలూషుడనే రుషిని ఇతర రుషులు 'దస్యు పుత్రుడు' అని దూషించి తరిమేస్తారు. అతను తన మహిమ వల్ల సరస్వతీ నదిని తనతో ఎడారిలోకి తీసుకుపోతాడు. కణ్వుడి కుమారుడు వత్సుడిని అతని సోదరుడు మేధాతిథి 'దస్యుపుత్రుడు' అని దూషిస్తాడు. బ్రాహ్మణుల గోత్ర నామాల నుండి గూడ ఈ విషయాన్ని అర్థం చేసుకోవచ్చును. ఉదుంబర వృక్షాన్ని కుదురు చిహ్నంగా గల తెగ ఒకటి ప్రాచీన కాలంలో వుండింది. ఈ చెట్టు ఇప్పటికీ పవిత్రమైనదిగా భావించబడు తోంది. గుజరాత్‌లో ఉదుంబర కులం అనే వెనుకబడ్డ కులం వుంది. అయితే బ్రాహ్మణులలోని కాశ్యప గోత్రాలలో ఒక ఉదుంబర గోత్రం వుంది.[28] అంటే రుగ్వేద కాలంలో ఈ ఉదుంబర వృక్షాన్ని కుదురు చిహ్నంగా కలిగివున్న గణం నుండి కొందరు పురోహితులు బ్రాహ్మణులుగా వచ్చి చేరగా, తరువాతి కాలంలో అదే గణం ఆర్యులకు లొంగిపోయి శూద్ర వర్ణంలో కలిసిందని అర్థం చేసుకోవచ్చును.

ఆటవిక సమాజాల పురోహితులు తమ ఆటవిక కుదురులను వదిలి బ్రాహ్మణ గోత్రాలను స్వీకరించిన క్రమాన్ని మొత్తంగా ప్రతిఫలించే కథ ఒకటి కోశాంబి ఉదహరిస్తాడు.[29] శునశ్శేపుడు అనే 'బ్రాహ్మణుడిని' అతని తండ్రి అమ్మేస్తాడు. శునశ్శేపము అంటే కుక్కతోక అని అర్థం. అది కుదురు చిహ్నం. జంతువు శరీరంలోని ఒక అంగం కుదురు చిహ్నం అయిందంటే (split-totem) కుదురు రెండుగా

చీలి రెండు కుదుర్లయిందని అర్థం. ఈ ఆటవిక కుదురుకు చెందిన శునశ్శేపుడిని బలి ఇవ్వబోతున్న వాళ్ళ నుండి విశ్వామిత్రుడు రక్షించి అతనికి దేవరాతుడు అని పేరు పెడతాడు. అయితే ఇప్పటికీ దేవరాత గోత్రీకులయిన బ్రాహ్మణులకు విశ్వామిత్ర గోత్రీకులతో వివాహం నిషిద్ధం కావడంవల్ల, ఈ కథకు అర్థం శునశ్శేపుడనే అనార్య పురోహితుడు ఒక విశ్వామిత్ర గోత్రాన్ని స్వీకరించి 'ఆర్యు'డయ్యాడని.

మరొక ఉదాహరణ ఇంద్రుడు త్వాష్ట్రుడు అనే మూడు తలల రాక్షస పురోహితుడిని చంపుతాడు. ఈ త్వాష్ట్రుడు మరెవరోకాదు, ఇంద్రుడి ఆయుధాలను రథాన్నీ తయారుచేసిన ఋగ్వేద దేవుడయిన త్వష్ట్ర కొడుకు. దీన్ని బట్టి ఉషస్సులాగే త్వష్ట్ర గూడ ఆర్యేతరుల నుండి వచ్చి చేరిన దేవుడని అర్థం అవుతుంది.[30] అయితే ఇంద్రుడు చంపిన త్వాష్ట్రుడు చనిపోలేదు. తన మరణాన్ని ఋగ్వేదంలో తానే గానం చేస్తాడు. పైగా ఉపనిషత్కాలంలో ఈ త్వాష్ట్రుడు ప్రముఖ ఋషి. మరొక విశేషం ఏమిటంటే ఇతన్ని ఇంద్రుడు చంపగా ఇతని మూడు తలలు మూడు పక్షులగా మారి ఎగిరి పోయాయి. వాటిలో ఒకటి 'తిత్తిర' పక్షి. ఈ పక్షి తరువాతి కాలంలో ఒక బ్రాహ్మణ గోత్రనామం అయింది (తైత్తిరీయ) ఈ తైత్తిరీయ గోత్రీకులు రూపొందించిన యజుర్వేద సంప్రదాయమే (తైత్తిరీయ సంహితం) ఇప్పటికీ మిగిలివుంది.[31] ఈ కథను జాగ్రత్తగా పరిశీలిస్తే కోశాంబి చెప్పిన సంఘర్షణ-సమ్మేళనం అనే క్రమం స్పష్టంగా కనబడుతుంది. త్వష్ట్ర ఇంద్రుడి రథాలనూ ఆయుధాలనూ తయారు చేసే 'దేవుడు'. అయితే ఇతని కొడుకు (పురోహితుడయినప్పటికీ) రాక్షసుడు, అంటే ఆర్యేతరుడు. కాబట్టి త్వష్ట్ర గూడ ఆర్యేతర కర్మ కారుల దేవుడే ఈ రాక్షస పురోహితుడిని ఇంద్రుడు చంపేస్తాడు. అయితే (ఉషస్సులాగే) అతను చావడు, ఋషిగా గుర్తింపు పొందుతాడు. తెగిపోయిన ఒక తల నుండి ఒక బ్రాహ్మణ గోత్రం పుడుతుంది. ఋగ్వేదం తరువాత ప్రముఖ వేదమయిన యజుర్వేదాన్ని ఈ గోత్రం వాళ్ళే తరువాతి కాలానికి అందిచ్చారు.

బ్రాహ్మణ గోత్రాలను విశ్లేషించడం ద్వారా ఋగ్వేద కాలంలో జరిగిన ఆర్య-అనార్య సమ్మేళనాన్ని ఆ క్రమంలో (ప్రధానంగా ఆర్యేతర పురోహితుల నుండి) బ్రాహ్మణ వర్ణం ఆవిర్భావాన్నీ కోశాంబి వివరించిన తీరును ఈ విధంగా చెప్పుకుంటూ పోతే ఎప్పటికీ తెగదు. కోశాంబి చేసినా నిర్ధారణ ఎంత ముఖ్యమో ఆయన అనుసరించిన పద్ధతినీ సిద్ధాంతాన్నీ తెలుసుకోవడం అంత ముఖ్యమన్న అభిప్రాయంతో పై వివరాలు ఇవ్వడం జరిగింది.[32]

ఒక చివరి వాదాన్ని మాత్రం తెలుసుకోవాలి.[33]

బ్రాహ్మణులంతా ఆర్యులే అయితే వాళ్ళకు గణంలో అందరితో సమంగా సంపద మీద హక్కు ఉండేది. అయితే ఋగ్వేదంలో పురోహితులు చాలా మంది తమ పేదరికాన్ని గురించి వాపోయినట్టు కనబడుతుంది. వామ దేవుడు వేరే తిండి దొరకక, భార్య దురవస్థను చూడలేక, కుక్క పేగులు వండుకొని తిన్నానని దుఃఖించాడు.

మరొక పురోహితుడు తన దగ్గర పశువులు లేవు కాబట్టి పురుగులు దొలిచేసిన కర్రనే అగ్నికి అర్పిస్తున్నాననీ దయచేసి అందుకోవలసిందనీ వేడుకుంటాడు. ఆర్యేతరుల నుండి విడిపోయి ఆర్యగణాలలో పూర్తిగా కలిసిపోలేక రెంటికీ చెడ్డ పురోహితులయితేనే ఈ దారిద్ర్యం సాధ్యం. దీనివల్లనే ఈ పురోహితులు ఎవడు ప్రతిఫలం ఇస్తే వాడికి పౌరోహిత్యం చేయడానికి సిద్ధపడ్డారు. తద్వారా, ఆర్య-ఆర్యేతర సమ్మేళనాన్ని సాధించారు.

ఇది ఋగ్వేద కాలం నాటి విషయం. పంజాబు ప్రాంతంలో ఆర్య-ఆర్యేతర సంఘర్షణ-సమ్మేళనం అనే క్రమం విస్తృతంగా జరిగింది. సమ్మేళనంలో ముఖ్య పాత్ర వహించిన పురోహితులంతా ఒకటయి, అనార్య అంశ ప్రధానంగా ఒక బ్రాహ్మణ వర్ణం ఏర్పడింది. ఇదంతా ఒకే సారి జరగలేదు. బహుశా క్రీ. పూ. 1500 నుండి 1000 దాకా జరిగింది. అందుకనే తరువాతి కాలంలో బ్రాహ్మణులలో ప్రముఖంగా భావించబడ్డ గోత్రాలకూ ఆ గోత్రాలకు మూల పురుషులయిన ఋషులకూ ఋగ్వేదంలో సమాన ప్రతిపత్తి లేదు. కొన్ని అప్పటికింకా బ్రాహ్మణ గోత్రాలే కాదు. కొందరు ఋషులు ఋషులేకారు. కణ్వాది సంగతి ఇదివరకే చెప్పాము. కాశ్యపులు గూడ తరువాతి కాలంలోనే ప్రముఖు లయ్యారు. భృగువు మాటకొస్తే మహాభారతం ద్వారా చాలా ప్రముఖ స్థానాన్ని పొందిన ఈ ఋషిగోత్రం ఋగ్వేదంలో, దశరాజ్ఞ యుద్ధంలో ఇంద్రుడి చేత ఓడించబడ్డ ఒక గణంగా మాత్రం కనబడుతుంది.

## వర్ణ వ్యవస్థ

క్రీ. పూ. 1200-1000 ప్రాంతంలో (అంటే ఋగ్వేదం అనంతర కాలంలో) ఆర్యుల రెండవ వలస భారత ఉపఖండానికి వచ్చింది. ఈ వలస ప్రభావంవల్ల కొంత, అప్పటికే ఆర్యేతరులతో తమకున్న (సంఘర్షణ-సమ్మేళనం అనే ద్వివిధమైన) సంపర్కం వల్ల కొంత, క్రీ. పూ. 1000 నాటికి ఆర్యుల భౌతిక జీవితంలో మార్పు మొదలయింది. ఇనుము వాడకం విస్తరించి ఆహార ఉత్పత్తి పశుపోషణ కంటె ప్రముఖ జీవనాధారం కావడం మొదలయింది. ఉత్పత్తి శక్తులలో వచ్చిన ఈ మార్పు ఫలితంగా ఉత్పాదకత పెరిగి అదనపు ఉత్పత్తి ఆర్యుల జీవితంలో మొట్టమొదటి సారిగా సాధ్యం అయింది. ఈ అదనపు ఉత్పత్తిని చేజిక్కించుకునే ఒక పాలక వర్గం, అదనపు ఉత్పత్తిని పాలకవర్గం చేతిలోకి చేరవేసే సామాజిక వ్యవస్థ (ఉత్పత్తి సంబంధాలు) ఏర్పడ్డాయి. ఆ సామాజిక వ్యవస్థ పేరు వర్ణ వ్యవస్థ. పాలక వర్గాలు, బ్రాహ్మణులు, క్షత్రియులు. ఈ కొత్త వ్యవస్థ ఏర్పాటు, ఇనుమూ నాగలి వంటి కొత్త ఉత్పత్తి శక్తుల వాడకం, ఆహార ఉత్పత్తి అనే కొత్త జీవన ఆధారం, అన్నీ గూడ క్రీ. పూ. 1000 నాటికి నెమ్మదిగా మొదలయినా అవి క్రీ. పూ. 600 దాకా గణ వ్యవస్థ రూపాన్ని పూర్తిగా వదులుకోలేదు. గణ వ్యవస్థ గర్భంలోనే క్రమంగా

80

నూతన ఆహార ఉత్పత్తి సమాజం - వ్యవసాయక వర్గ సమాజం-రూపొందింది. రూపొంది, ఇంతవరకు పంజాబు ప్రాంతంలోని సింధూ దాని ఉపనదుల లోయలకు పరిమితమయి వుండిన ఆర్యసమాజం నెమ్మదిగా ఈ నాలుగు వందల సంవత్సరాలలో తూర్పుకు విస్తరించి గంగా యమునా లోయల పడమటి కొన అయిన ప్రస్తుత ఢిల్లీ ప్రాంతాన్ని చేరుకుంది.

నైసర్గిక స్థితిని మళ్లీ దృష్టిలో ఉంచుకోవాలి. సింధూ నాగరికత వాసులలాగే ఆర్యులు గూడ మొట్ట మొదట ఎడారి సదృశమయిన సింధూ దాని ఉపనదుల లోయలలో (ప్రస్తుత పంజాబు ప్రాంతంలో) తమ సంచార పశు పోషక సమాజాన్ని ఏర్పరచుకున్నారు. ఇక్కడ వర్ష పాతం తక్కువ కావడం వల్ల అడవులు దట్టంగా లేవు. సంచార జీవనానికీ ఆహార సేకరణకూ ఇది అనుకూలమయిన ప్రాంతం. ఇనుము వాడకం నేర్చుకున్న తరువాత, క్రీ.పూ. 1000 నుండి, ఆర్యులు ఈ సింధూ మైదానానికి తూర్పు దిశగా గంగా, యమునా లోయల వైపు విస్తరించారు. 'ఆర్యులు' అనే వాళ్లు స్వచ్ఛంగా వుండి పోలేదనీ ఆర్యేతరులను కలుపుకుంటూనే వున్నారనీ పైన ఇచ్చిన వివరణను గుర్తుంచుకుంటే ఈ విస్తరణ భౌతిక విస్తరణా (అంటే ఆర్య గణాల వలస ఫలితమా) లేక సామాజిక సాంస్కృతిక విస్తరణా (ఇంగ్లీష్‌లో **diffusion** అంటారు) అనేది కొంత వరకు అర్థరహితమయిన ప్రశ్న అని అర్థం అవుతుంది. రెండూ జరిగాయి. ప్రతీ దశలోనూ కొందరు ఆర్యులు వలస వెళ్లారు, కాని కొత్త సమాజం ఆర్య-ఆర్యేతర సమ్మేళనం ద్వారా ఏర్పడి ఆ తరువాత 'ఆర్య' సమాజంగా గుర్తింపు పొందిందని కోశాంబి భావిస్తాడు.

ఈ విస్తరణ క్రమంలో ఆర్య సమాజం సింధూ లోయలకూ గంగా యమునా లోయలకూ మధ్యనున్న ప్రాంతాన్నీ, గంగా యమునా లోయల పై భాగాన్నీ చేరుకుంది. ఇది ఇప్పటి హర్యానా, ఢిల్లీ, పశ్చిమ ఉత్తరప్రదేశ్, కొంత మేరకు రాజస్థాన్ రాష్ట్రాల భూభాగం. ఇక్కడ గూడ పంజాబు లాగానే వర్షపాతం తక్కువ. కాబట్టి అడవులు పల్చగానే వుంటాయి. కొత్తగా అలవాటయిన ఇనుము సహాయంతో గొడ్డలి తదితర పనిముట్లను తయారు చేసుకొని, అడవులను వ్యవసాయ యోగ్యం చేసి, బరువయిన నాగళ్ళను తయారు చేసుకొని వ్యవసాయక సమాజాన్ని ఈ ప్రాంతంలోనూ తొలినాటి నివాసస్థలమయిన పంజాబులోనూ ఆర్యులు స్థాపించగలిగారు. ఈ క్రమం మొత్తం సాగింది క్రీ.పూ. 1000-600 దాకా. పురావస్తు తవ్వకాలలో జనావాసాలకు చిహ్నంగా బూడిద రంగు కుండ పెంకులు (**Painted Grey Ware**) దొరికాయి. వాటితో బాటు ఇనుప వస్తువులు గూడా దొరికాయి. సాహిత్య ఆధారాలు యజుర్వేదం, అధర్వ వేదం, యజుర్వేదాన్ని వ్యాఖ్యానించే శతపథ బ్రాహ్మణం, కొంత మేరకు మహాభారతం, మొదలయినవి.

రుగ్వేదంలాగే యజుర్వేదం, అధర్వ వేదం గూడ (ప్రధానంగా) కర్మకాండ

సంబంధమయిన మంత్రాల సంకలనాలే. కొత్తగా ఈ మంత్రాలు అవసరమయ్యాయంటేనే సమాజం మారిందని అర్థం. సమాజంలో మార్పు రాకపోతే ఋగ్వేదమే సరిపోయేది. కాబట్టి ఋగ్వేదంలోని విషయాలను యజుర్వేదంతో పోలిస్తే క్రీ.పూ. 1000 ముందు కాలానికీ తరువాతి కాలానికీ వచ్చిన మార్పు అర్థం అవుతుంది. పశు సంపదనో నేల ఫల సాయాన్ని పెంపొందించమనీ యుద్ధంలో విజయం సమకూర్చమనీ, నీటి వనరులు ఎండి పోకుండ కాపాడమనీ వేదాలలో దేవుళ్ళను ప్రార్థించారు. తమ భౌతిక జీవితాన్ని మెరుగు పరచమని దేవుళ్ళను వేడుకున్న క్రమంలో ఆ భౌతిక జీవితాన్ని గురించి చాలా విషయాలు తెలియజేసారు.

యజుర్వేద కాలానికి యజ్ఞ కర్మకాండ చాలా ఎక్కువయింది. బలులు అనూహ్యంగా పెరిగి పోయాయి. బలియివ్వని జంతువుగానీ పక్షిగానీ లేదు.[34] ఒక్కొక్క యజ్ఞం కొన్ని రోజుల తరబడి సాగేది. యజ్ఞం నిర్వహించిన పురోహితులకు ఇచ్చిన దక్షిణలను బట్టి ఈ కర్మకాండ ఎంత పెద్ద ఎత్తున సాగిందో ఊహించవచ్చును. అంగరాజు ఉదమయ ఆత్రేయుడనే బ్రాహ్మణుడికి పదివేల స్త్రీ బానిసలు, పదివేల ఏనుగులు ఇచ్చాడని ఐతరేయ బ్రాహ్మణంలో చెప్పబడింది. అదే బ్రాహ్మణంలో, పట్టాభిషేకం చేసిన బ్రాహ్మణుడికి బంగారం, పశువులు, భూములు, వేల సంఖ్యలో ఇవ్వాలని వుంది.[35] ఉపనిషత్తులలో జనకరాజు యజ్ఞవల్క్యుడికి పదివేల గోవులు బహుమానంగా ఇస్తాడు. ఈ సాహిత్యాన్ని తయారు చేసింది బ్రాహ్మణులే కాబట్టి ఇందులో అతిశయోక్తి వుందనుకున్నా పెద్ద ఎత్తున దక్షిణలు యిచ్చినట్టు మాత్రం తెలుస్తుంది. గణనీయంగా అదనపు ఉత్పత్తి వుంటే తప్ప యిది సాధ్యం కాదు. అంటే ఈ యజుర్వేద కర్మకాండను భరించిన సమాజం పశుపోషకుల సమాజం కావడానికి వీలులేదు. ఆహారాన్ని ఉత్పత్తి చేసిన వ్యవసాయక సమాజం అయి వుండాలి.

సామాజిక సంపదలోనూ మార్పు వచ్చింది. ఋగ్వేద కాలంలో పశువులు ప్రధాన సంపద. వాళ్ళు తమ ప్రపంచంలోని చాలా విషయాలకు 'గోవు' సంబంధమైన పేర్లు పెట్టుకున్నారని చూసాము. ఋగ్వేదంలో 'యవ' అనే ఒక్క ధాన్యం ప్రస్తావన మాత్రం వుంది. అది బార్లీ అయివుంటుందని కోశాంబి భావిస్తాడు. వరి (వ్రీహి), గోధుమ (గోధూమ)ల ప్రస్తావన ఋగ్వేదంలో లేదు.[36] సంస్కృతంలో నాగలికి వాడిన మాట 'హలం' అనేది ఋగ్వేదంలో లేదు. పశువులను చంపి తిన్నారే గాని వ్యవసాయానికి ఉపయోగించలేదు. 'గ్రామం' అంటే స్థిర ఆవాసం కాదు. గ్రామం అంటే పశువులను మేపుకుంటూ సంచరించే గుంపు. అటువంటి రెండు గుంపులు తలపడి నప్పుడు కలహించుకోవడం జరిగేది. దీని నుండే యుద్ధానికి 'సంగ్రామం' అనే మాట వచ్చింది.[37]

క్రీ. పూ. 1000 నాటి నుండి ఇదంతా నెమ్మదిగా మారింది. యజుర్వేదాన్ని బట్టి వరి, బార్లీ, చిక్కుడు, నువ్వులు, గోధుమ, పప్పు, కుయవ ధాన్యాలు (జొన్న,

సజ్జ మొదలైనవి) పండించారు. ఈ తిండి కాక ఇతర సంపద బంగారం, రాగి, కంచు, తగరం, సీసం, ఇనుము. వీటిలో చాల వరకు ఈ ప్రాంతంలో దొరకవు కాబట్టి దూరం నుండి వర్తకం ద్వారా వచ్చినవి అయివుండాలి.[38] దీనిని బట్టి గూడ ఆహారంలో అదనపు ఉత్పత్తి వుందని అర్థం అవుతుంది. తిథులు, నక్షత్రాల ప్రస్తావన ఉండడాన్ని బట్టి రుతుపవనాల మీద ఆధారపడ్డ వ్యవసాయం ప్రారంభ మయిందని అర్థం అవుతుంది. అధర్వ వేదంలో నది నీటిని కాలవలలోకి మళ్ళించేటప్పుడు ఆచరించే కర్మకాండ వుంది. అంతేకాక, ఆరు లేక ఎనిమిది ఎడ్లను నాగలికి కట్టి వ్యవసాయం చేయడాన్ని అధర్వ వేదంలో వర్ణించారు. దీన్ని బట్టి పశువులను తిన డానికే కాక వ్యవసాయానికి వాడడం గూడ మొదలయిందని, బరువయిన నాగళ్లు వాడారనీ అర్థం అవుతుంది. [38]

ఈ దశలో ఆర్యులు కొత్తగా విస్తరించిన ప్రాంతంలో అడవులను వ్యవసాయ యోగ్యం చేసిన పద్ధతి గూడ యజుర్వేద సంబంధమైన సాహిత్యం నుండి అర్థం చేసుకోవచ్చును. ఆ పద్ధతి ఏమిటంటే అడవులను దహనం చేయడం (పోడు వ్యవసాయం చేసే గిరిజనులు ఇప్పటికి ఇదే చేస్తారు). మంత్ర సాహిత్యంలో ఇది అడవులను అగ్నికి అర్పించడంగానో అగ్ని అడవులను భుజించడంగానో వర్ణించ బడుతుంది. వర్షపాతం ఎక్కువగా వున్న దట్టమయిన అడవులలో ఇది సాధ్యం కాదు. మెట్ట ప్రాంతాలలోని పల్చటి అడవులలోనే ఇది సాధ్యం అవుతుంది. అందుకనే క్రీ. పూ. 1000-600 కాలంలో ఆర్యుల విస్తరణ సింధూ గంగా లోయల మధ్య భాగానికి (హర్యానా, ఢిల్లీ) గంగా యమునా లోయల ఎగువ భాగానికి (పశ్చిమ ఉత్తర ప్రదేశ్) పరిమితమయి వుండింది. ఇంకా తూర్పుకు-గంగా యమునా లోయల దిగువ భాగానికి విస్తరించాలంటే ఈ పద్ధతి సరిపోదు. దట్టమయిన అడవులను వ్యవసాయ యోగ్యం చేయడానికి బలమయిన ఇనుప పనిముట్లు విస్తారంగా కావాలి యజుర్వేద కాలానికి ఇనుము వాడకం తెలుసునుగానీ, ఇనుము విరివిగా దొరికే గనులు ఉత్తర భారతదేశంలో లేవు. బీహార్‌లోనే వున్నాయి. కాబట్టి బీహార్ గనుల ఇనుము చేజిక్కే దాకా ఆర్యుల విస్తరణలోని తరువాతి దశ ప్రారంభం కాదు. అది క్రీ. పూ. 600 తరువాత జరిగింది. అందుకే ఇనుము గనులు విస్తారంగా వున్న మగధ మొట్ట మొదటి రాజ్యం అయింది.

ఇదంతా తరువాతి విషయం. యజుర్వేద కాలానికి తిరిగి వస్తే, అడవులను తగల బెట్టడం ద్వారా వ్యవసాయ యోగ్యం చేసిన క్రమం శతపథ బ్రాహ్మణంలో చాలా వివరంగా వర్ణించబడింది. మాధవుడనే విదేహ రాజు, రఘు గణుడనే గౌతమ గోత్రీకుడయిన బ్రాహ్మణుడు, తన వెంటరాగా అగ్ని దేవుడు సరస్వతీ నదికి తూర్పు దిక్కుగా వున్న అడవిని కాల్చుకుంటూ పోయాడంది. సదానీరం అనే నదికి తూర్పున వున్న భాగం ఒకప్పుడు చాలా తేమగా బురదగా వున్న అడవితో నిండి

వుండే దంట, ఎందుకంటే అప్పటికి అగ్ని దానిని రుచి చూడలేదు కాబట్టి. అయితే ఇప్పుడు బ్రాహ్మణులు క్రతువుల ద్వారా ఆ అడవిని అగ్నికి రుచి చూపించారు కాబట్టి ఆ ప్రాంతం వ్యవసాయ యోగ్యమయిందంట.[39] ఇంత కంటే స్పష్టమయిన వివరణ అనవసరం. మహాభారతంలో పాండవులు కృష్ణుని సహాయంతో యమునా నదీ తీరంలో వున్న ఖాండవ వనాన్ని అగ్నికి అర్పించి తమ రాజధాని అయిన ఇంద్ర ప్రస్థాన్ని నిర్మించిన కథ గూడ ఈ చారిత్రక పరిణామాన్ని సూచిస్తుందని కోశాంబి అభిప్రాయం.[40] ఋగ్వేదంలోనే అగ్నికి అడవులను మింగేవాడు అనీ గొడ్డలి అనీ నామాంతరాలు.

కాబట్టి అడవులను దహనం చేయడం ద్వారా వ్యవసాయ యోగ్యం చేసి, ఇనుము సహాయంతో బరువయిన నాగళ్ళను తయారు చేసుకొని ఎడ్లను నాగలికి కట్టి వ్యవసాయం చేసి పలురకాల పంటలు పండించే సమాజం మొదలయింది. అంటే ఆహార సేకరణ పశుపోషణలే కాక ఆహార ఉత్పత్తి చేసే సమాజం ఈ యజుర్వేద కాలానికి ప్రారంభమయింది. ఉత్పత్తి శక్తులలో వచ్చిన మార్పుయిది. అయితే ఇప్పుడు అదనపు ఉత్పత్తి సాధ్యం అవుతుంది. అంటే కొందరు శ్రమచేస్తే అందరూ తిన వచ్చును. శ్రామికులనుండి అదనపు ఉత్పత్తిని చేజిక్కించుకొని పాలక వర్గాలు తమ అవసరాలకు వాడుకోవచ్చును. ఇది జరగాలంటే అందుకు అనువయిన సామాజిక నిర్మాణం (ఉత్పత్తి సంబంధాలు) అవసరం. కొందరు శ్రమ చేయాలి, ఉత్పత్తిని సాధించాలి, వారి మనుగడకు పోగా మిగిలింది వేరే కొందరు చేజిక్కించుకోవాలి.

మనదేశంలో ఈ నిర్మాణం వర్ణ వ్యవస్థ. ఆర్యగణాలలో మూడు వర్ణాలు ఏర్పడ్డాయి. వీళ్ళు క్షత్రియులు, బ్రాహ్మణులు, వైశ్యులు. వైశ్యులు తరువాతి కాలంలో వ్యాపారస్థులయ్యారుగాని క్రీ. పూ. 1000 ప్రాంతం నుండి క్రీ. శ. తొలి శతాబ్దాల దాకా వీళ్ళ ప్రధాన వృత్తి వ్యవసాయం. వ్యవసాయ ఉత్పత్తి చేయడం, అదనపు ఉత్పత్తిని రెండు అగ్రవర్ణాలకు అందజేయడం, వీళ్ళ 'ధర్మం.' ఈ మూడు వర్ణాలు కాక, ఆర్యులకు లొంగిపోయిన ఆర్యేతరులు (దాసులు, ఇతర ఆటవికులు) శూద్ర వర్ణం అయ్యారు. 'దాసుడు' అన్న పేరే ఇప్పుడు సేవక స్థితిని సూచించే పదం అయింది. శూద్రులకు కనీసం వ్యవసాయం చేసే అర్హత గూడ లేదు. పై మూడు వర్ణాలకు సేవ చేయడం వీళ్ళ ధర్మం. వాళ్ల పశువులను పోషించాలి, ఇళ్ళలోనూ పొలంలోనూ చాకిరీ చేయాలి.

ఋగ్వేదంలోని పదవ (చివరి) మండలంలో పురుష సూక్తం అనే సూక్తం వుంది. ఇందులో మొట్టమొదటి సారి వర్ణ వ్యవస్థ ప్రస్తావన వుంది. అది పురుషుడి ముఖం నుండి బ్రాహ్మణులు, భుజాలనుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని ఈ సూక్తం అంటుంది. అయితే ఇది నిజానికి ఋగ్వేదానికి చెందింది కాదనీ, తరువాత చేర్చబడిందనీ ('ప్రక్షిప్తం' అని) చాలా మంది చరిత్ర కారుల లాగే కోశాంబి గూడ భావిస్తారు.[41]

యజుర్వేద సాహిత్యంలో మాత్రం ఎటువంటి సందేహాలకూ ఆస్కారం లేకుండ వర్ణ వ్యవస్థ నిర్మాణం, దాని లక్ష్యం, వివరించబడి వున్నాయి. రుగ్వేదంలో గణంలోని సామాన్య జనాన్ని 'విశ్' ప్రజలు అన్నారు. ఇప్పుడు ఈ మాటను కర్షకులు అన్న అర్థంలో ప్రయోగించడం మొదలయింది. దాని నుండి వైశ్యులు అన్న వర్ణం పేరు వచ్చింది. ఈ 'విశ్' జనానికి సంబంధించిన దేవుళ్ళు మరుత్తులు. ఇంద్రుడికీ మరుత్తులకూ శత్రుత్వం రుగ్వేదంలోనే వుంది. రాజు 'విశ్' జనాన్ని భుజించినట్టుగా ఇంద్రుడు మరుత్తులను భోజనం చేస్తాడని రుగ్వేదంలో అన్నారు. రుగ్వేద కాలంలోనే మామూలు గణ సభ్యులను గణ ముఖ్యులు పీడనకు గురిచేసి వుండాలి. వ్యవసాయక సమాజం వచ్చేసరికి ఈ పీడన చాలా ఎక్కువ అయింది. శతపథ బ్రాహ్మణంలో మరుత్తులను సామాన్య కర్షకులు అన్నారు.[42] ఐతరేయ బ్రాహ్మణంలో వైశ్యుడు ఇతరులకు లోబడి వుంటాడనీ ఇతరుల చేత 'భుజించ' బడతాడనీ, ఇష్టానుసారం పీడించబడతాడనీ, అన్నారు. శూద్రులు సేవకులనీ, ఇష్టానుసారం తొలగించబడతారనీ, ఇష్టానుసారం చంపబడతారనీ అన్నారు యజ్ఞ కర్మకాండ యొక్క లక్ష్యం గూడ ఇప్పుడు కొద్దిగా మారింది. శతపథ బ్రాహ్మణంలో, వైశ్య శూద్ర జనాన్ని పురోహితుల సహాయంతో లోబరచు కోవడానికి రాజన్యులు యజ్ఞాలు చేసారన్న విషయం అర్థమవుతుందంటాడు కోశాంబి. యజ్ఞంలో భాగంగా అగ్నికి ప్రదక్షిణం చేసేటప్పుడు పురోహితులు ఒక చివర, రాజన్యులు ఒక చివర, వుండి శూద్ర వైశ్య జనాన్ని లోబరచుకోవడం కోసం మధ్యలో వుండేలాగ చూడాలని ఆ బ్రాహ్మణంలో అన్నారు.[43]

వైశ్య శూద్ర జనం నుండి పాలకవర్గాలు అదనపు ఉత్పత్తిని ఏ విధంగా చేజిక్కించుకున్నారో తెలుసుకోవాలి. గణవ్యవస్థలో గణసభ్యులు తాము సేకరించిన ఆహారంలోని మిగులును కర్మకాండయుతంగా పంచుకుంటారని గత అధ్యాయాలలో చూసాం. గణ సభ్యులు తాము సేకరించిన ఆహారం మొత్తంగానీ కొంత భాగం గాని గణం పెద్దకు అందజేస్తారు. అతను దాని కర్మకాండయుతంగా దేవుళ్ళకు అర్పించి అందరికీ పంచుతాడు. యుద్ధాలలో గెలుచుకొచ్చిన సంపదను గూడ ఇదే విధంగా దేవుళ్ళకు అర్పించి పంచుకుంటారు. (ఆర్భాటంగా విందులతో జరిగే ఈ పంపకపు కార్యక్రమాన్ని పురామానవ శాస్త్రంలో potlach అంటారు). ఈ విధంగా గణముఖ్యుల ద్వారా దేవుళ్ళకు అర్పించే ఆహారాన్ని 'బలి' అన్నారు. ఆదిమ గణ వ్యవస్థలోని ఈ బలులు అర్పించే ఆచారంలోనే వర్గ విభజనకూ దోపిడీకీ మూలం వుంది. బలులు అందుకొని పంపకం చేసేది గణం పెద్దలు కాబట్టి వాళ్ళు ఇతరుల కంటె ఎక్కువ మిగుల్చుకోవచ్చు. ఆహార సేకరణ దశనుండి ఆహార ఉత్పత్తి దశ వచ్చేసరికి సామాజిక సంపద పెరిగి బలి రూపంలో గణ ముఖ్యులు మిగుల్చుకోనే సంపద మరింత ఎక్కువ ఉంటుంది. ఇదంతా కర్మకాండలో భాగంగా జరుగుతోందని నమ్మించాలి కాబట్టి పురోహితుల అంద

కావాలి. ఈ విధంగా గణం ముఖ్యులు ఒక రాజన్య (క్షత్రియ) వర్ణంగా ఏర్పడి, పురోహితుల (బ్రాహ్మణుల) సహాయంతో వైశ్య శూద్ర ప్రజానీకం నుండి బలుల రూపంలో అదనపు ఉత్పత్తిని సేకరించి చేజిక్కించుకున్నారు.

కర్షకులు, కూలీలు, రాజులు అంటున్నామంటే ఇప్పటికి స్థిర నివాస వ్యవసాయక గ్రామాలూ రాజ్యాలూ ఏర్పడ్డాయని అనుకోకూడదు. ఈ 400 సంవత్సరాలూ (క్రీ.పూ 1000-600) గణవ్యవస్థ నిర్మాణం కొద్ది మార్పులతో కొనసాగింది. క్షత్రియ బ్రాహ్మణ వైశ్య వర్ణాలు గణ వ్యవస్థలో అంతర్భాగంగానే ఏర్పడ్డాయి. రాజులు లేక రాజన్యులు అంటే ఇప్పటికీ గణ ముఖ్యులే. అయితే వీళ్ళ ప్రాబల్యం కొద్ది కొద్దిగా పెరగడం మొదలయింది. ఋగ్వేద కాలంలో 'రాజులు' సర్వ స్వతంత్రులు కారు. గణ ముఖ్యుల 'సభ' వాళ్ళను ఎన్నుకునేది. ఈ సభ ఆధ్వర్యంలో వాళ్ళు నడుచుకొనేవారు. యజుర్వేద కాలం వచ్చేసరికి రాజులు సభనియంత్రణ నుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్టు కనబడుతుంది. దానికి ఒకనిదర్శనం, రాజులకు కొత్తగా వచ్చిన అభిషేక కాండ. రాజుగా ఎన్నుకోబడడం కాక అభిషిక్తుడు కావడం అంటే అతని అధికారానికి మంత్ర సంబంధమయిన లక్షణం ఆపాదించడం అవుతుంది. దీనికి పురోహితుల అండ కావాలి. కాబట్టే అభిషేకి కర్మలు నిర్వహించిన బ్రాహ్మణులకు పెద్ద ఎత్తున దక్షిణలు ఇవ్వడం జరిగింది. ఈ విధంగా క్షత్రియులూ బ్రహ్మణులూ తమ ప్రాబల్యాన్ని పరస్పర సహకారంతో పెంపొందించుకున్నారు.

ఇదంతా క్రమంగా 400 ఏళ్ళపాటు జరిగింది. ఈ కాలంలో ఆహార ఉత్పత్తి మొదలయిందిగానీ స్థిర నివాస గ్రామాలు ఏర్పడ లేదు. అంటే మొదటి అధ్యాయంలో చెప్పిన రెండవ పరిణామం ప్రారంభం కాలేదు. గ్రామం అంటే ఇప్పటికీ ఇంకా ఒక సంచార సజాతుల (రక్తబంధువుల) బృందం అనే అర్థం. ఈ గ్రామాలు వర్షాకాలంలో మెట్టప్రాంతాలలో ఆహారాన్ని ఉత్పత్తి చేస్తూ ఎండాకాలం రాగానే తమ పశువులను నదీలోయలకు తోలుకుపోయి మేపుకొని జీవించేవి. ఒక తేడా ఏమిటంటే ఋగ్వేద కాలంలో లాగ కాక ఇప్పుడు ఈ గ్రామాలకు పశుసంపదే కాక శూద్రులు అనే ఉమ్మడి సేవకుల సంపద గూడ వుంది. వీళ్ళు సంచారానికి బయలు దేరినప్పుడల్లా పశువులనేకాక శూద్రులను గూడ తోలుకు పోయేవారు. ప్రాచీన కాలం నుండి గూడ (ఋగ్వేదం నుండి) మన దేశంలో 'నాలుగు కాళ్ళ పశువులు' 'రెండు కాళ్ళ పశువులు' అనే వ్యవహారం వుంది.

అయితే ఈ శూద్రులు బానిసలు కారు. మనదేశంలో వర్గ సమాజం బానిస వ్యవస్థ రూపంలో రాలేదని, వర్ణ వ్యవస్థ రూపంలో వచ్చిందని, కోశాంబి ఖచ్చితమయిన అభిప్రాయం. ఆదిమ గణ వ్యవస్థ తరువాత బానిస వ్యవస్థ వచ్చి తీరాలని విషయ నిరూపణతో ప్రమేయం లేకుండ వాదించి నందుకు కోశాంబి డాంగేను తీవ్రంగా విమర్శించాడు.[44] గ్రీసు, రోం తదితర పాశ్చాత్య దేశాలలో ఇదే దశలో బానిస వ్యవస్థ వచ్చింది. పెద్ద పెద్ద కామందులు బానిసల ద్వారా వ్యవసాయం తదితర రంగాలలో

ఉత్పత్తి సాగించారు. బానిసలను కొనుక్కున్నారు, అమ్ముకున్నారు. భూమి తదితర ఉత్పత్తి సాధనాలలో స్వంత ఆస్తి వుండడం ఈ రకమయిన దోపిడీకి ప్రాతిపదిక. అయితే భారతదేశంలో ఆహార ఉత్పత్తిని సాధించిన ఆర్యులది స్వంత ఆస్తి సమాజం కాక, భూమినీ పశువులనూ సమిష్టి ఆస్తిగా కలిగిన గణ సమాజం కావడం వల్ల వాళ్ళకు లోబడిన దాస తదితర ఆర్యేతరులు బానిసలు కాలేదు, మొత్తం ఆర్యగణాలకు సమిష్టి భృత్యులు (ఇంగ్లీషులో **helots**) అయ్యారు. శూద్రులయ్యారు. దాసులను బానిసలగా కాక శూద్రులుగా లోబరచుకోవడం వల్ల భారతదేశంలో నిజమయిన బానిస వ్యవస్థ ఏర్పడలేదు. [45] ఈ శూద్రులు ఏ ఒక్కరికీ స్వంత బానిసలు కారు, మొత్తం ఆర్య సమాజానికి సమిష్టి సేవకులు. ఆహార ఉత్పత్తిని సాధించినప్పుడే ఆర్యులు గణ వ్యవస్థనూ సమిష్టి ఆస్తినీ వదిలించుకొని వుంటే, స్వంత ఆస్తి వ్యవస్థను రూపొందించు కొని అప్పుడు తమకు లోబడిన ఆర్యేతరులను గూడ తమలో తాము బానిసలగా పంచుకొని వుండేవారు. భారతదేశంలో గూడ బానిస వ్యవస్థ వచ్చి ఉండేది. కాని దాదాపు 4 శతాబ్దాలపాటు ఆర్యులు సమిష్టి ఆస్థి రూపాన్ని వదులుకోలేదు. కాబట్టి ఆర్యేతరులు సమిష్టి భృత్యులే అయ్యారు. భారతదేశంలో వర్గ సమాజానికి బానిస వ్యవస్థకంటే వర్ణ వ్యవస్థ తగిన సామాజిక నిర్మాణం అయింది. ఆర్యులు తమ సమిష్టిఆస్తి అయిన భూమి మీదగానీ పశువుల మీదగాని దాసులకు హక్కు లేకుండా చేసారు. వాళ్ళకు భూమి కలిగి వుండే హక్కు లేదు. ఆయుధాలూ, పనిముట్లూ కలిగివుండే హక్కు లేదు. వాళ్ళు ఆర్యుల ఇళ్ళలోనూ పొలాలలోనూచాకిరీ చేయాలి. అది వాళ్ళ 'ధర్మం'. ఉత్పత్తి సాధనాల నుండి వెలివేయబడ్డ వాళ్ళు ఇతరుల కోసం కూలిచేయక తప్పదు. కాబట్టి ఈధర్మం, ఫలితంగా బానిసవ్యవస్థ అవసరం లేకుండ. కూలిచేసే వర్గం ఒకటి ఆర్యులకు లభ్యం అయింది. [46]

ఇది స్థూలంగా క్రీ.పూ. 1000-600 నాటి సామాజిక పరిణామం చరిత్ర. ఈ కాలంలో కనబడే మరొక విశేషం ఏమిటంటే కొత్తగా పాలక వర్గంగా ఏర్పడిన బ్రాహ్మణ-క్షత్రియుల మధ్యఅంతఃకలహం వైశ్యుల నుండి, శూద్రుల నుండి దోచుకున్న అదనపు ఉత్పత్తిని పంచుకోవడంలో ఈ తగాదా వచ్చింది. మన ప్రాచీన సాహిత్యం లోని క్షత్రియ-బ్రాహ్మణ కలహాలకు అర్థం యిదేనని కోశాంబి అంటాడు. ప్రముఖమైన ఉదాహరణగా పరశురాముడి కథను చూపుతాడు పరశురాముడు ప్రపంచంలోని క్షత్రీయులందరినీ ఒకటి రెండుసార్లు కాదు, 21సార్లు నాశనం చేసాడు. ఈ పురాణాలు రాసింది బ్రాహ్మణులే కాబట్టి, నిజానికి బ్రాహ్మణులు క్షత్రియుల ధాటికి తట్టుకొలేక తమ అశక్తతను కప్పిపుచ్చుకోవడానికి ఈ వీరోచితమయిన గాథ సృష్టించుకొన్నారని కోశాంబి అనుమానిస్తాడు [47]

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే ఈ దశలో ఆదిమ సమాజం నుండి వ్యవసాయక వర్గసమాజానికి జరిగిన పరిణామం అసంపూర్తిగా వుండిపోయింది.

ఆహార ఉత్పత్తి మొదలయింది కాని అది 'వానాకాలం వ్యవసాయం.' వేసవిలో ఇంకా పశుపోషక సంచార జీవితం పోలేదు. స్థిరనివాస వ్యవసాయక గ్రామాలు ఏర్పడలేదు అదనపు ఉత్పత్తిని దోపిడీ చేయడంఅనే ప్రాథమిక నాగరిక లక్షణం మొదలయింది. కాని దోపిడీ జరిగిన రూపం మాత్రం ఆదిమ గణ సమాజాల యజ్ఞబలులే అసమగ్రమైన ఈ మార్పు పట్ల నిరసన ఆనాడికే వినబడుతోంది అయితే అది దోపిడీ పట్ల నిరసనగా కాక, దోపిడీకి సాధనమయిన యజ్ఞ కర్మకాండ పట్ల బలుల పట్ల నిరసనగా వ్యక్తమవుతుంది. పశువులను బలి ఇవ్వడం, పశుమాంసం తినడం, కొత్తగా ఏర్పడిన కర్షక వర్గానికి (వైశ్యులకు) చాలా హానికర మయిన అలవాటు. గతంలోలాగ పశువులను మాంసం కోసంకాక పాడికోసం పొలం పనుల కోసం ఇకమీదట పోషించాలి అయితే పాత అలవాటు బ్రాహ్మణులకు జీవనాధారం ఆచారం ఈ సంఘర్షణ ఛాయలు శతపథ బ్రాహ్మణంలో ఒకచోట కనబడతాయి [48] గోమాంసం తినడం పాపం అని వాదించగా అంతావిని యజ్ఞ వల్క్యుడనే బ్రాహ్మణ ఋషి (వేదాంతులకు ఈయన మూలపురుషులలో ఒకడు) 'అంతా నిజమే కావచ్చుగాని, పుష్టిగా వుండే నేను తప్పక తింటాను' అని సమాధానం ఇస్తాడు విచిత్రమయిన విషయం ఏమిటంటే తరువాతి కాలంలో బ్రాహ్మణులు మాంసాహారులయిన వ్యవసాయ దారులను తక్కువగా చూసారుగాని తొలినాడు బ్రాహ్మణుల గోమాంస భక్షణానికి వ్యతిరేకంగా వ్యవసాయదారులు తిరగబడాల్సివచ్చింది. ఇది ఈ దశలో కంటె తరువాతి దశలో బౌద్ధ మతం రూపంలో ప్రబలమైన సంఘర్షణగా ముందుకొచ్చింది. ఆ దెబ్బకు తట్టుకోలేక బ్రాహ్మణులు ఒక్క గోమాంసాన్నేకాక అన్ని రకాల మాంసాన్నీ విసర్జించిన తరువాతే తిరిగి నిలదొక్కుకోగలిగారు

ఆహార ఉత్పత్తి సమాజం మొత్తం ఆర్యులందరిలోనూ ఒకేసారి రాలేదు. కొన్ని గణాలలో ముందు వచ్చింది. మహాభారతంలోనూ బౌద్ధ సంప్రదాయంలోనూ మొట్టమొదటి రాజ్యాలుగా పేర్కొన్న వాటిని బట్టి ఈ మార్పు కురు, పంచాల, మద్ర, మత్స్య, మొదలయిన గణాలలో వచ్చిందని భావించ వచ్చును. ఇవన్నీ పంజాబు-ఢిల్లీ-హర్యానా ప్రాంతానికి చెందినవి. ఈ గణాలలోని రాజన్యులు కొందరు గణ బంధనాలను కొంత మేరకు తెంచుకొని సార్వభౌమత్వాన్ని ప్రకటించుకో గలిగారు. అంటే నిజమైన 'రాజులు' కాగలిగారు అయితే ఇంకా పశుపోషక దశలో ఉండిపోయిన ఆర్యగణాలు వేరేవున్నాయి. ఈ గణాలలో గూడ వర్ణ వ్యవస్థను ప్రవేశపెట్టి వాళ్ళకు ఆహార ఉత్పత్తిని అలవాటు చేసి విస్తృతమయిన వ్యవసాయక వర్గసమాజంలో కలుపుకోవలసిన కర్తవ్యం ఇక ముందుంది. ఈ ఆర్యగణాలుకాక అసంఖ్యాకమయిన ఆర్యేతర గణాలున్నాయి. ఈ గణాలను మొత్తం శూద్రులుగా లోబరచుకోవడమో లేక వీటిలోని పురోహితులను బ్రాహ్మణులుగా స్వీకరించి ఒక గోత్రం సృష్టించి, వాళ్ళ సహాయంతో ఇతరులను శూద్రులుగా లోబరచుకోవడమో చేయాలి.

ఈ లోబరచుకునే క్రమంలో అణచివేతతో బాటు సమ్మేళనం గూడ వుంది. కొత్త దేవుళ్ళు కొత్త పురాణాలు కొత్త ఆచారాలు కలగా పులగంగా వచ్చి బ్రాహ్మణ మతంలో చేరతాయి

అంతేకాక, ఆర్యసమాజం పంజాబు-హర్యానా-ఢిల్లి-పశ్చిమ ఉత్తర ప్రదేశ్ ల్లోని తేలిక అడవులను వదిలి పెట్టి దట్టమయిన అడవులున్న దిగువ గంగా-యమునా లోయలలోనికి (తూర్పు ఉత్తర ప్రదేశ్, బీహార్) విస్తరించే దశగూడ ముందుంది క్రీ పూ 600-300 మధ్య జరిగిన ఈ పరిణామాలను తరువాతి అధ్యాయంలో చూద్దాం

## వివరణలు

1 ఆహార సేకరణ మీద ఆధారపడిన గణాలు మామూలుగా మాతృస్వామ్య లేక మాతృ ప్రధాన వ్యవస్థను కలిగివుంటాయి పశుపోషణతో పితృస్వామ్యం (దానితోపాటు మగ దేవుళ్ళు) ప్రారంభమవుతుంది. అయితే చరిత్ర పరిణామ క్రమంలో అప్పుడప్పుడు అమ్మదేవతలను పూజించే పశు పోషకులు కనబడతారు పడమటి దక్కన్‌కు చెందిన అటువంటి ఉదాహరణ ఒకటి ఇస్తూ 'పశుపోషకు లకు మగదేవుళ్ళే ఉండి తీరాలనడం పిడివాదం అవుతుంది' అంటాడు కోశాంబి. **P lgr m's Progress. A Contribution to the pre-h story of the Western Deccan Plateau, MR, Page 188.**

2 **CCAI, Page 86**

8. **ISIH, Page 88.** లోకంలో పాపం అనేది లేనంతవరకే 'యమలోకం' పీటి కన్నింటికీ అతీతంగా వుంటుంది. పాపపు కార్యాలు లోకంలో మొదలుకాగానే జీవులు మరణించడం మొదలయింది 'యమరాజు' తన ప్రజలమీద ప్రేమకొద్దీ పాపాలను తనమీద వేసుకొని తానే మొదటి మృతుడు అయ్యాడు (క్రీస్తు చాలా కాలం తరువాత ఈపనే చేశాడు) ఆర్యులు ఇరాన్ వదిలి భారత ఉపఖండానికి వచ్చేసరికి మొట్టమొదటి మృతుడయిన ఈ 'యిమరాజు' మృతుల లోకానికి అధిపతి అయిన యమధర్మరాజు అయ్యాడు. **CCAI, page 77.**

4 **CCA , Pages 87-88**
**nd an Feudal Trade Charters, HS, Page 103**

5 ఉదాహరణకు గణముఖ్యుడిని గోపుడు లేక గోపతి అనీ, యుద్ధాన్ని గవిష్టి లేక గోష అనీ దూరాన్ని గవ్యూతి అనీ అన్నారు. ఆర్. ఎస్ శర్మ పుస్తకం **Mater a Cu ture and Soc a Format ons n Anc ent Ind a, Page 25**

6 రుషులూ రాజులూ శాస్త్రకారులూ ఉద్దేశ్య పూర్వకంగా చరిత్రను నిర్మిస్తారనే అభిప్రాయం భావవాద చరిత్ర రచనా పద్ధతిలోని ప్రధాన లోపాలలో ఒకటి.

'ఆంధ్ర జ్యోతి'లో ప్రశ్నోత్తరాల శీర్షిక నిర్వహించే అరుణావ్యాస్‌గారిని ఒక పాఠకుడు కన్యాశుల్కం అనే ఆచారం ఎట్లా వచ్చిందని అడుగగా ఆమె అశ్వ లాయనుడు ప్రవేశపెట్టిన ఎనిమిది విధాల వివాహ పద్ధతులలో ఆర్ష వివాహ పద్ధతి ఒకటి ' అంటూ తన సమాధానం ప్రారంభించారు ఇటువంటి వాక్యాలు మన చరిత్ర పుస్తకాలలో కొల్లలు. మన దేశంలో మగవాళ్ళు జుట్టు ' కాష చేయించుకునే పద్ధతి విక్టోరియా రాణి 'ప్రవేశ పెట్టింది' అని ఎవ్వరూ అనరు గాని ప్రాచీన చరిత్రను గురించి మాత్రం మినహాయింపు లేకుండ ఇట్లాగేరాస్తారు

7 ఆర్యగణాలు పశువుల గురించి నీటి వనరుల గురించి, తరచు కలహించు కునేవి అనడానికి ఋగ్వేదంలో ఆధారం వుంది. ISIH, Page 88

8. CCAI, Page 78 ఆర్యులు పంజాబు వదిలి గంగా-యమునా తీర ప్రాంతానికి వచ్చిన తరువాత, అదే సరస్వతి భూగర్భంలో గోప్యంగా ప్రవ హించి ప్రయాగ దగ్గర గంగా-యమునలను కలుస్తుందని కొత్త పురాణ సృష్టించుకున్నారు గతాన్ని ఎంత మాత్రం వదిలి పెట్టడానికి ఇష్టంలేని బ్రాహ్మణ సంస్కృతికి ఇది చక్కటి నిదర్శనం

9 CCA Page 82

10 S H Pages 86-88

11. దాసులూ దస్యులూ ఒకరేనని కోశాంబి అభిప్రాయం. వేరు వేరని భావించే చరిత్ర కారులలో ఆర్ ఎస్ శర్మ ఒకరు

12 CCAI, Page 80

13 S H Page 93

14 పురములు అంటే పట్టణాలు అనే కంటే చుట్టూ రక్షణార్థం కోటలు (fortification) కట్టిన ఆవాసాలు అనవచ్చు (కోశాంబి strongholds అనే మా... వాడతాడు)

15. తరువాతి కాలంలో ఆర్యులు ఇదే విధంగా 'నాగ', నిషాద' మొదలయిన పేర్లను తమకు శత్రువులయిన ఆటవిక తెగలకు సామాన్య వ్యవహారంగా ప్రయోగించారు

16 S H, Page 99

17. CCAI, Page 79

18 On a Marx st approach to Ind an Chrono ogy, HS, Page 82
Urvas and Pururavas, MR, Page 77
CCA Pages 82-83
S H Pages 102-103

19 S H Page 96

20 S H, Pages 92-93

21. CCAI, Page 115

22. ఈ విశ్లేషణ వివరంగా చేసిన వ్యాసం :

Urvas and Pururavas MR, Pages 42-81, ముఖ్యంగా పేజీలు 61-81
23 The Autochtonous e ement n the Mahabharata HS Page 159
24 Soc a and econom c aspects of the Bhagavadg ta MR Page 24
25 Urvas and Pururavas MR, Page 70
CCA , Page 83
26 Urvas and Pururavas, MR, Page 72
27 S H, Pages 102-106
28 Comb ned Methods n ndo ogy, HS, Pages 15-16
The Bas s of Anc ent nd an H story HS, Page 33 పాద సూచిక
29 S H, Page 105
30 CCA , Page 84
31 S H Page 119
32 కోశాంబి విశ్లేషణను వివరంగా తెలుసుకోదల్చుకుంటే ఈ క్రింది వ్యాసం చదవవచ్చును. The or gin of the Brahm n gotras Journal of Bombay branch of Royal Asiatic Society 1950 పేజీలు 21-80 కోశాంబి వ్యాసాల సంకలనాలుగా ఇప్పటికి వెలువడిన వాటిలో ఎందులోనూ ఈ వ్యాసాన్ని చేర్చినట్టు లేదు.
33 S H Page 106
34 CCA Page 87
35 S H Page 133
36 S H 88
37 CCA , Page 88
38. నాగలికి ఇనుప ముక్క వాడారా లేదా అనేది ప్రశ్నార్థకంగా వుండిపోతుంది. పురావస్తు తవ్వకాలలో అటువంటిది ఒక్క చోట మాత్రమే దొరికిందని ఆర్ ఎస్ శర్మ అంటాడు.
39 IS H Page 123
40 The Autochtonous e ement n the Mahabharata, HS Page155
41 S H Page 108 పాదసూచిక 7
42 On a Marx st approach to nd an Chrono ogy HS Page 83
43 CCA , Page 87
44 Marx sm and Anc ent Ind an cu ture, HS, Pages 73-78 డాంగే రాసిన పుస్తకం 'Ind a from pr m t ve commun sm to s avery కి ఈ వ్యాసం సమీక్ష
45 Marxism and Anc ent Ind an cu ture, HS, Page 77
46. On a Marx st approach to Ind an Chrono ogy, HS, Pages 82-84
47 S H, Page 120
48 ISIH, Page 136

# 5. మహాభారతం-బుద్ధుడు

పైన చెప్పినట్టు క్రీ. పూ 600-300 మధ్య కాలంలో వచ్చిన మార్పులలో రెండు అంశాలున్నాయి ఒకటి ఆహారాన్ని ఉత్పత్తి చేసే వ్యవసాయక వర్గసమాజం తన గణ వ్యవస్థ లక్షణాలను పూర్తిగా వదిలించుకొని నాగరిక రాజ్యాల ఏర్పాటుకు దారి తీయడం రెండు ఈ సమాజం ఆటవిక సమాజాలను లోబరచుకొని ఆహార ఉత్పత్తినీ దానితోబాటు వర్ణవ్యవస్థనూ దట్టమయిన అడవులతో నిండిన గంగాయమునా లోయల దిగువ భాగానికి (ఉత్తరప్రదేశ్ బీహార్ రాష్ట్రాలకు) వ్యాపింపజేయడం కోశాంబి ఇందులో మొదటి మార్పును బౌద్ధ తదితర బ్రాహ్మణేతర మతాల ఆధారంగా రెండవ మార్పును మహాభారతం ఆధారంగా, వివరిస్తాడు ఎక్కడికక్కడ ఈ మత సాహిత్య సంప్రదాయాలను పురావస్తు అవశేషాలతోనూ నైసర్గిక పరిస్థితులతోనూ సమన్వయ పరచి అధ్యయనం చేస్తాడు.

ఈ చారిత్రక క్రమంలో సమ్మేళనం జరుగుతూనేవుంది పశు పోషక ఆర్యగణాలనూ ఆర్యేతరులనూ లోంగదీసుకుంటూనే వున్నారు తమ సమాజంలో అట్టడుగు భాగంలో కలుపుకుంటూనే వున్నారు అయితే ఇప్పుడు కొత్త చారిత్రక దశ వచ్చిందని దానికి నిదర్శనంగా పాత బ్రాహ్మణుల స్థానంలో కొత్తవాళ్ళకు ప్రాధాన్యత వచ్చింది. మహాభారతానికి తుదిరూపం ఇచ్చింది భృగు (భార్గవ) గోత్రీకులు. బౌద్ధ సంప్రదాయాన్ని రాసింది ప్రధానంగా కశ్యప (కాశ్యప) గోత్రీకులు[1] ఋగ్వేదంలో భృగువులు కేవలం ఇంద్రుడిచేత ఓడించబడ్డ ఒక గణంగా కనబడతారని చూశాం[2] కశ్యపుల మాటకొస్తే కణ్వులలాగే వీళ్లుగూడ వేదకాలంలో యజ్ఞ కర్మకాండ నిర్వహించడానికి అనర్హులుగా భావించబడ్డారు[3]. తరువాతి కాలంలో వేరే ఏ గోత్రంలేని బ్రాహ్మణులకు కాశ్యపగోత్రం ఇచ్చే అలవాటును బట్టి చూస్తే[4] ఇది ఆర్యేతరుల నుండీ ఆటవికుల నుండీ పురోహితులను స్వీకరించిన సమ్మేళన క్రమంలో ఏర్పడ్డ గోత్రం అనిఅర్థం అవుతుంది

## మహాభారతం

మన పౌరాణిక సాహిత్యంలో చరిత్ర ఏంత వుందనేది చిక్కువిడని ప్రశ్న దీనికి సమాధానం చరిత్రకు మనం ఇచ్చుకునే నిర్వచనాన్ని బట్టి వుంటుంది. చరిత్రను కొన్ని సంఘటనల కలయికగా అర్థం చేసుకొని పౌరాణిక సాహిత్యంలో చారిత్రక సంఘటనల ఆనవాలు కోసం వెతికితే అది వృధాప్రయాస అవుతుందని కోశాంబి

అభిప్రాయం మొత్తం పౌరాణిక సాహిత్యాన్నంతా వదబోస్తే ఆవగింజంతగూడ చరిత్ర దొరకదు అయితే చరిత్రను కొన్ని సంఘటనల కలయికగా కాక సామాజిక సంబంధాల పరిణామ క్రమంగా అర్థం చేసుకుంటే పరిస్థితి కొంత మెరుగుగా వుంటుంది పుక్కిటి పురాణమే అయినా అది రాయబడిందంటే ప్రజలు విస్తృతంగా విశ్వసించారంటే అవి ఏదో ఒక సామాజిక పరిణామక్రమాన్ని ప్రతిఫలించి వుండాలి ఈ ప్రతిఫలనం ఉన్నదున్నట్టుగా కాకపోవచ్చు, సాంకేతాత్మకంగా కావచ్చు. అద్భుతంగా కావచ్చు అభావంగాగూడా కావచ్చు. దీనిని శాస్త్రీయంగా అధ్యయనంచేసి దాని వెనకున్న పరిణామాలనుగుర్తించడం అవసరం అది చేయడానికి నిరాకరిస్తే ఒక విలువైన చారిత్రక ఆధారాన్ని కోల్పోతాం అని కోశాంబి అంటాడు కృష్ణుడు అనేవాడు నిజంగా లేకపోవచ్చు కానికృష్ణుడి ఆరాధన వుంది. అదొకసామాజిక వాస్తవం. ఈ ఆరాధన అన్నికాలాల, లోనూ లేదు ఒకదశలో ముందుకొచ్చింది. అంతవరకు ప్రముఖంగా వున్న ఇంద్రుడి పూజ క్రమంగా క్షీణించిపోయింది. ఇదంతా పుక్కిటి పురాణంగా కొట్టి పారేయకుండ కారణాలను అధ్యయనం చేస్తే మన చరిత్రను కొంతయినా అర్థం చేసుకోగలుగుతాం.

కోశాంబి మహాభారత కథను చాలా వివరంగా విశ్లేషించి, ఒక్క కథగా కనబడేదాన్ని మౌలికంగ మూడు సంప్రదాయాల కలయికగా విడగొడ్తాడు. ఆ మూడు సంప్రదాయాల వెనుకనున్న చారిత్రక పరిణామాలను జాగ్రత్తగా అధ్యయనం చేస్తాడు [5]

మొదటిది కురుపాండవుల యుద్ధం క్రీ. పూ. 600 నాటికి ఆర్యసమాజం ఆహార ఉత్పత్తిని అలవాటు చేసుకొని వర్ణవ్యవస్థను రూపొందించుకొని సింధూ గంగా లోయల మధ్య భాగాన్ని వ్యవసాయ యోగ్యం చేసి ఆక్రమించుకుంది పంజాబు నుండి తూర్పుకు వచ్చి గంగా-యమునా లోయల పై భాగాన్ని ఆక్రమించుకుంది గణ వ్యవస్థను ఛేదించి నెమ్మదిగా రాచరికాలు ఏర్పడడం మొదలయింది. మొట్టమొదట రాచరికం ఏర్పరచుకున్న గణాలలో కురు గణం ఒకటి ఒకమీదట ఈ కురుగుణం యొక్క రాజవంశాన్ని కురు వంశం అనడం మొదలు పెట్టారు భరతుడి సంతతి అయిన కురు మహారాజు తన తపస్సు ఫలితంగా కురు జంగలాన్ని కురుక్షేత్రంగా మార్చాడని ఆది పర్వంలో వుంది. అడవులను (జంగలం) వ్యవసాయ క్షేత్రాలగా మార్చడానికి అవసరమయ్యే భౌతిక శ్రమ యొక్క అద్భుత బ్రాహ్మణీ కృత రూపం ఈ 'తపస్సు అనుకుంటే ఇది చారిత్రక పరిణామమే. ఈ విధంగా ఏర్పడిన కురు రాజ్యం రాజధాని అయిన హస్తినాపురం (ఢిల్లీ) యమునా నది పై భాగాన వుంది. ఆర్యుల సమాజం గణ వ్యవస్థ రూపంలో వున్నంతకాలం రాజులూ రాచరికాలూ లేవు ఒక గణానికి చెందిన సజాతుల (రక్త బంధువుల) గుంపు (కుదురు గాని అంతకంటే చిన్న గుంపుగాని) ఒక ప్రాంతపు సంపదను ఉమ్మడిగా అనుభవించేది అయితే సంఘటనల కలయికగా అర్థంచేసుకొని పౌరాణిక సాహిత్యంలో చారిత్రక సంఘటనల ఆర్యులు దాసులను శూద్రులగా లొంగదీసుకొని ఆహార ఉత్పత్తిని అలవర్చుకొని

అదనపు ఉత్పత్తిని పెంచుకున్న తరువాత ఈ పరిస్థితి మారింది అంతవరకు గణ సభ చేత ఎన్నుకోబడ్డ రాజులు ఇప్పుడు కొత్తగా దొరికిన సంపదను ఆసరా చేసుకొని పురోహితుల అండతో అభిషిక్తులయి సార్వభౌమత్వాన్ని ప్రకటించుకున్నారు ఇది వాళ్ళ సజాతులలో ( దాయాదులు') కొందరికి కంటగింపయింది వాళ్ళు తమకు గూడ రాజ్యాధికారంలో వాటా కావాలని కోరడం, కలహించుకోవడం, అడవులకు బహిష్కరించబడడం, యుద్ధం చేయడం, అన్నీ గూడ సహజమయిన విషయాలే ఇందులో కౌరవులు ఓడిపోయి పాండవులు గెలిచారు మహా భారతం కౌరవుల విలాపంగా ప్రారంభమయి పాండవుల విజయగీతంగా మారిందని కోశాంబి అభిప్రాయం [6]

అయితే కురుక్షేత్ర యుద్ధం మహాభారతంలో వర్ణించి నంతటి మహాసంగ్రామం కావడానికి వీలులేదు 18 రోజుల పాటు సాగిన ఆ యుద్ధంలో 50 లక్షల మంది హతులయ్యారని, 1 30 000 రథాలూ ఏనుగులూ అంతకు మూడు రెట్లు గుర్రాలూ ఉపయోగించబడ్డాయనీ ఆ 'ఇతిహాసం' చెబుతుంది ఇంత పెద్ద ఎత్తున యుద్ధం జరగాలంటే దేశ జనాభా కనీసం 20 కోట్లు ఉండాలని అంచనా వేస్తూ బ్రిటిష్ కాలం దాకా భారతదేశ జనాభా 20 కోట్లు కాలేదని కోశాంబి గుర్తు చేస్తాడు [7] క్రీ పూ 600 నాటి దాకా గంగా యమునా దిగువ లోయలలో, తూర్పు పడమర కోస్తాలలో, దక్కన్ పీఠభూమి మీద ఆహార సేకరణే తప్ప ఆహార ఉత్పత్తి లేదు యుద్ధాలు చేయడానికి రాజులూ రాజవంశాలూ లేవు విస్తారంగా ఇనుము వాడకం సాధ్యపడే దాకా ఈ ప్రాంతాలలో ఆ మార్పు రాదు మహాభారత కథ మొత్తం ఢిల్లీ-మీరట్-మధురా ప్రాంతానికి పరిమిత మయిందని కోశాంబి అభిప్రాయం [8] తరువాతి కాలంలో బ్రాహ్మణులు తమ ప్రాముఖ్యాన్ని పెంచుకోవడం కోసం తమకు తోచిన రాజులనూ రాజవంశాలనూ అన్నింటినీ మహాభారతం లోకి చేర్చారు

మహాభారతం కురు పాండవుల యుద్ధం కథ మాత్రమే అయితే అందులో కృష్ణుడి పాత్ర అర్థం కాదు యుద్ధం చేసిన రెండు పక్షాలలో ఒక పక్షానికి సాయం చేసిన యాదవ ప్రముఖుడిగా వుండేవాడే తప్ప, దేవుడు కావలసిన అగత్యం లేదు. కాబట్టి ఇక్కడ వేరే సంప్రదాయం వచ్చి చేరిందని కోశాంబి భావిస్తాడు కురుగణం నివాస స్థలం ఢిల్లీ-మీరట్ ప్రాంతం కాగా, వాళ్ళకు దక్షిణంగా మధుర ప్రాంతంలో యదుగణం (యాదవులు) నివసించే వారు ఋగ్వేదంలోని పంచగణాలలో యాదవులు ఒకరు వీళ్ళు ఆర్యులు కాక పోవచ్చును గాని వేదకాలపు ఆర్యులలాగ వీళ్ళు పశుపోషకులు. వీళ్ళ దేవుడయిన కృష్ణుడుకి ఆర్యుల దేవుడయిన ఇంద్రుడికి ముందు నుండీ శత్రుత్వమే చివరికి, పశుపోషక సమాజం పూర్తిగా నాశనమయి వ్యవసాయక సమాజం స్థిరపడేసరికి ఇంద్రుడు తన స్థానాన్ని సంపూర్ణంగా కోల్పోయాడు. కృష్ణుడు ప్రముఖ దేవుడయ్యాడు. ఈ పరిణామాన్ని ప్రతిఫలించేది మహాభారతంలో కృష్ణుని పాత్ర.

ఇది రెండవ సంప్రదాయంకాగా మహా భారతంలోని మూడవ సంప్రదాయం

ఆటవికులది శంతనుడిని పెండ్లి చేసుకున్న గంగ, అంబ, ఉలూపి, కృష్ణుడు సరస మాడిన అసంఖ్యాకమైన స్త్రీలు అమ్మదేవతల ప్రతి రూపాలు. మహాభారత కథలో వీళ్ళలో కొందరికి చాలా కీలకమయిన పాత్ర వుంది. ఈ అమ్మదేవతలు కాక, మహా భారత కథలో చాలా ప్రముఖంగా దర్శనమిచ్చే ఆటవిక చిహ్నం నాగుపాము నాగ జాతిని నాశనం చేయడానికి జనమేజయుడు యజ్ఞం చేస్తుండగా యజ్ఞ కర్మకాండలో భాగంగా వైశంపాయనుడు చెప్పిన కథ మహాభారతం అదే నాగుపాము విష్ణువుపడక అయింది, బలరాముడి అంశ అయింది, శివుడి మెడను అలంకరించింది

మహా భారత కథను ఈ మూడు సంప్రదాయాల కలయికగా విడగొడితే అందులో ప్రతి ఫలించిన చారిత్రక పరిణామం అర్థం అవుతుంది కురు గణానికి చెందిన వాళ్ళు ఢిల్లీ-మీరట్ ప్రాంతపు నాగరిక ఆర్యులు. ఆహార ఉత్పత్తి, వర్ణవ్యవస్థ, వాళ్ళ సామాజిక జీవితానికి ప్రాతిపదిక వాళ్ళకు దక్షిణంగా మధుర ప్రాంతంలో యదు గణానికి చెందిన పశుపోషకులున్నారు చుట్టూ (ముఖ్యంగా గంగాయమునా లోయలలో) దట్టమయిన అడవులున్నాయి ఆ అడవులలో ఆటవికులున్నారు ఈ ఆటవికులందరూ ఒకే ఒక నాగజాతి' అయివుండడం అసంభవం ఇవన్నీ విడివిడిగా వుండిన ఆటవిక తెగలయివుండాలి [9] నాగులు లేక నాగజాతి అనేది ఆర్యులు వీళ్ళంద రికీ సామాన్య ప్రయోగంగా ఉపయోగించిన మాట బహుశా వీళ్ళలోఎక్కువ తెగలు పామును కుదురు చిహ్నంగా కలిగి వున్నాయే లేక పాము పూజ చేసేవో ఈ మూడు సమాజాల మధ్య నిరంతరం సంఘర్షణ సాగి వుండాలి. ఇంద్రుడికీ కృష్ణుడికీ పడదు. యాదవులను అంతం చేయాలని ఇంద్రుడు ప్రయత్నిస్తే కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని అడ్డం పెట్టి రక్షిస్తాడు. యాదవులకూ 'నాగజాతి'కీ పడదు యమునా నదికి పోయే తోవకు అడ్డం పడుకున్న కాళియుడిని బాల కృష్ణుడు తన కాలి క్రింద తొక్కి అణిచే స్తాడు (కాని చంపడని కోశాంబి గుర్తుచేస్తాడు) నాగ 'రాజు' అయిన తక్షకుడు ఇంద్రుడి స్నేహితుడు అయితే ఇంద్రుడిని పూజించిన ఆర్యుల రాజయిన జనమే జయుడు తక్షకుడితో సహా నాగ జాతి నంతా అంతం చేయాలని యజ్ఞం చేస్తాడు

త్రికోణంగా సాగిన ఈ సంఘర్షణ తీవ్రంగానే జరిగివుండాలి ఇందులో అంతిమ విజయం ఆర్యులది కాక తప్పలేదు పశుపోషకులయిన యాదవులు, ఆటవికు లయిన నాగులు, వ్యవసాయకులయిన ఆర్యులకు లొంబడక తప్పలేదు. అయితే ఈ లొంగుబాటు ఫలితంగా యాదవులూ ఆటవికులూ పూర్తిగా నాశనం కాలేదు. వాళ్ళు గూడ వ్యవసాయం నేర్చుకున్నారు వర్ణవ్యవస్థను ఆమోదించారు. వాళ్ళలో బలహీను లయిన వాళ్ళు మొత్తంగా ఒక శూద్ర కర్షక వర్గంగా మారిపోయి ఆర్యుల దోపిడీకి లోబడ్డారు కొంత బలవంతులయిన వాళ్ళూ పురోహితులు బ్రాహ్మణులలో చేరారు, గణముఖ్యులు రాజులయ్యారు. వాళ్ళ దేవుళ్ళూ ఆచారాలూ వైదిక ఆచారాలతో కలగలిసి పోయాయి ఆర్యుల ఇంద్రుడు కాక, యాదవుల కృష్ణుడే రాబోయే కాలానికి భగవంతు

దయ్యాడు ఆటవికుల నాగుపాము కృష్ణుడి అన్న (బలరాముడు) అయింది విష్ణువు పడక అయింది భూమిని తన పడగ మీద మోసే ఆదిశేషుడయింది తరువాత పోను పోను శివుడి మెడను అలంకరించింది స్వతంత్రంగా ఇప్పటికీ పూజలు అందు కుంటోంది [10]

కృష్ణుడిని ఆర్యులు అంతగా తలకెత్తుకోవలసిన అవసరం ఏమి వచ్చిందన్న ప్రశ్న వస్తుంది. కృష్ణుడు కేవలం ఒక్క యదుగణం దేవుడే అయితే అంతటి ప్రముఖ స్థానాన్ని అందుకునే వాడుకాడు కాని కృష్ణుడు అప్పటికే ఎందరో దేవుళ్ళ సమ్మేళనం అని కోశాంబి భావిస్తాడు యదుగణం జరాసంధుడి భయానికి మధురను వదిలి పడమటికి (ద్వారకకు) వలస వెళ్ళిందన్న పురాణ గాథకు కోశాంబి చాలా ప్రాముఖ్యం ఇస్తాడు [11] జర అనే రాక్షసి చేత సంధించబడ్డ ఈ జరాసంధుడు ఆటవికుడు పురాణాల ప్రకారం మగధ పాలకుడు మగధకూ మధురకూ మధ్య వున్న దూరాన్ని బట్టి చూస్తే, గంగా యమునాలోయలు దట్టంగా అడవులతో నిండి వున్న ఆనాడు మగధకూ మధురకూ యుద్ధం' జరిగి వుండే అవకాశం లేదుగాని, జరాసంధ-కృష్ణుల వైరం ఒక నిజమైన ఆటవిక-యాదవ సంఘర్షణను సూచిస్తుందని కోశాంబి అభిప్రాయం ఈ సంఘర్షణలో యాదవులు దెబ్బతిన్నారు మధురను వదిలి పడమటికి వలస వెళ్ళారు. ఆ విస్తరణ క్రమంలో వాళ్ళ దేవుడయిన కృష్ణుడి పూజలుగూడ విస్తరించాయి. కృష్ణుని 'లీలల'ను జాగ్రత్తగా విశ్లేషిస్తే అందులో అనేక సంప్రదాయాల కలయిక కనిపిస్తుంది ఒక కృష్ణుడు అమ్మ దేవతల శత్రువు పూతనను చాలా అమానుషంగా చంపాడు. మరొక కృష్ణుడు అమ్మ దేవతలకు చాలా ప్రియమయిన వాడు అసంఖ్యాకమయిన అమ్మదేవతలతో సరసాలాడాడు ఒక కృష్ణుడు నాగజాతికి శత్రువన్న విషయం కాళియమర్దనం కథలోనూ ఖాండవ దహనం కథలోనూ కనబడుతుంది ఇంకొక కృష్ణుడు ఆర్యులకు సన్నిహితుడయి వుండాలి అతని చెల్లెలు సుభద్రను కురురాజ కుమారుడయిన అర్జునుడు అపహరించాడు గోకులంలో అందరినీ అలరించిన బాలకృష్ణుడికీ కురుక్షేత్ర యుద్ధంలో శత్రువులందరినీ కపట ప్రయోగం ద్వారా హత మార్చిన కృష్ణుడికీ అసలు పోలిక లేదు.

ఎన్నో పూజల సమ్మేళనంగా ఏర్పడిన కృష్ణుడు రెండు చారిత్రక పరిణామాల ప్రతిఫలనం ఒకటి, కురు దేశానికి దక్షిణాన వున్న యదుగణం పడమటికి విస్తరించిన క్రమంలో ఆ ప్రాంతంలోని పశుపోషకుల పూజలన్నీ కృష్ణ పూజగా సమ్మేళనం చెందడం. దీనివల్ల, ఆర్యులు కృష్ణుడిని తమ దేవుడిగా స్వీకరిస్తే చాలా మంది పశుపోషకులను లొంగదీసుకో గలుగుతారు [12] రెండవది అత్యంత ముఖ్యమైనది ఆటవికుల అమ్మదేవతలను కృష్ణుడి భార్యలుగా స్వీకరించడంద్వారా ఆటవికుల నాగరీకరణకు దోహదం చేయడం కృష్ణుడి 16 108 'భార్యల' అర్థం యిదే మధురకు సమీపంలోని బృందావనంలో ఇప్పటికీ బృంద (గుంపుదేవత)[13] అనే దేవతకు ప్రతీ సంవత్స

రం కృష్ణుడినిచ్చి వివాహం చేస్తారు బృందకు సంకేతం తులసి చెట్టు వైదిక సంప్రదాయంలో తొలినాడు ఎటువంటి ప్రాముఖ్యంలేని ఈ తులసి చెట్టు ఇప్పుడు బ్రాహ్మణ స్త్రీల పూజలలో ప్రముఖ స్థానాన్ని కలిగివుంది. మగవాళ్ళు నిర్వహించే కర్మకాండలో తులసికి అంతగా ప్రాముఖ్యం ఉండదు అసలు కృష్ణుడు బృందావనంలోకి ప్రవేశించ గలిగాడంటేనే అమ్మ దేవతల పూజ పశుపోషకులకు లొంగి పోయిందని అర్థం. తొలినాడు ఆ వనం'లోకి మగవాళ్ళ ప్రవేశం నిషిద్ధం. పొరబాటుగా ప్రవేశించిన వాళ్ళను అమ్మదేవత బలికోరుకుంటుంది అమ్మదేవతలకు పురుషుల నిచ్చి వివాహం చేసి వెంటనే బలి ఇస్తారు అందుకు సంకేతంగా బృందను కృష్ణుడు ప్రతీ సంవత్సరం కొత్తగా పెళ్ళి చేసుకుంటాడు [14]

బృందకాక కృష్ణుడి భార్యలయిన ఇతర ఆటవిక స్త్రీలు రుక్మిణి (భోజరాజు కుమార్తె-భోజులు అప్పటికింకా ఆటవికులే), జాంబవతి (ఎలుగుబంటిని కుదురు చిహ్నంగా గల ఆటవిక గణ ముఖ్యుని కుమార్తె), మొదలయిన వాళ్ళు. ఇంత మంది ఆటవిక అమ్మదేవతలను కృష్ణుడు పెళ్ళి చేసుకుంటున్నాడంటే –దాని వెనుక రెండు భిన్న సమాజాల సమ్మేళనం వుంది. ఆటవికులు పశు పోషకుల ఆధిపత్యంలో వాళ్ళతో సమ్మేళనం చెంది ఆహార సేకరణ మాని ఆహార ఉత్పత్తి చేపట్టడానికి సిద్ధం అవుతున్నారు. ఈ యిద్దరికీ ఆహార ఉత్పత్తినీ వ్యవసాయక వర్గ సమాజాన్నీ, ఆ సమాజం నిర్మాణ సూత్రమైన వర్ణవ్యవస్థనూ ఉత్తరం నుండి ఆర్యులు అందిచ్చి తమ సమాజానికి లోబరచుకుంటారు అయితే ఈ పరిణామం విజయవంతంగా సాగాలంటే ఆర్యులు కృష్ణుడిని తమ దేవుడిగా అంగీకరించడానికి సిద్ధం కావాలి. కొత్తగా రూపొందుతున్న వ్యవసాయక సమాజానికి ఇంద్రుడి కంటే కృష్ణుడే సరయిన దేవుడు. కృష్ణుడు ఇంద్రుడిలాగ పశుబలులు కోరడు. కృష్ణుడి కథలలోని పశువులు పాడి పశువులేగాని బలి పశువులు కావు. పైగా అమ్మదేవతలకు అత్యంత ప్రీతి పాత్రుడయిన కృష్ణుడు ఆటవికులను లొంగ దీసుకొని కలుపుకోవడానికి చాలా అనుకూలమయిన దేవుడు ఇంద్రుడితో ఆ సౌకర్యం లేదు ఈ విధంగా కొత్త దేవుళ్ళనూ కొత్త పూజలనూ స్వీకరించడానికి కొత్త పురాణాలు రాయడానికి బ్రాహ్మణులు ఎల్లప్పుడూ సిద్ధమే. పూజాకాండ ఎంతగా విస్తరిస్తే వాళ్ళకు అంత ఆదాయం ఒక వేళ పాత బ్రాహ్మణులు సిద్ధం కాకపోతే కొత్త బ్రాహ్మణులు (ఆటవికుల నుండే) పుట్టుకొచ్చారు. కొత్త పురాణాలతో బాటు కొత్త బ్రాహ్మణ గోత్రాలూ పుట్టుకొచ్చాయి. బ్రాహ్మణ గోత్రాలు సప్తర్షులను దాటి అసంఖ్యాకంగా విస్తరించాయి.

క్రీ పూ 300 నాటికి ఈ పరిణామం చాలా వరకు విజయవంతం అయిందనడానికి అలెగ్జాండర్ కాలంలో వచ్చిన గ్రీకుల అభిప్రాయాలు నిదర్శనం. గ్రీకులు ఇంద్రుడిని తమ డయోనీసోస్ (Dionysos) తోనూ కృష్ణుడిని హెరాక్లెస్ (Herakles) తోనూ పోల్చుకున్నారు. గ్రీకుల హెరాక్లెస్ కృష్ణుడి లాగ నల్లటివాడు. కాళీయుని

వంటి హైడ్రా అనే పామును చంపాడు తాము వచ్చే కాలానికి పంజాబులోని పల్లపు ప్రాంతాలలో అందరూ హెరాక్లెస్‌నే ఆరాధిస్తున్నారనీ డయోనీసోస్ పూజ కొండలకు పరిమిత మయిందనీ గ్రీకులు అన్నారు అంటే వ్యవసాయక సమాజం బలపడ్డ పల్లపు ప్రాంతాలలో ఇంద్రుడి స్థానాన్ని కృష్ణుడు ఆక్రమించుకున్నాడనీ ఇంకా పూర్తిగా ఆహార ఉత్పత్తిని చేపట్టక పశుపోషణ ప్రధానంగా వుండిపోయిన కొండ చరియల్లో మాత్రమే ఇంద్రుడికి ప్రధాన దేవుడిగా గుర్తింపు వుందనీ అర్థం అవుతుంది చాలా ముఖ్యమైన గ్రీకుల ఈ అభిప్రాయాన్ని చరిత్రకారులంతా విస్మరించారని కోశాంబి విమర్శిస్తాడు [15]

అయితే కురుపాండవ యుద్ధం కథకు యాదవుల కృష్ణుడి కథలు చేర్చడంతో మహాభారతం అయిపోలేదు. 'నాగజాతి' అయిన తూర్పు ఆటవికులతో జరిగిన సం' ఘర్షణ, దాని అంతిమ పరిష్కారమయిన సమ్మేళనం, మహాభారతం మీద బలంగా ముద్రవేసాయి. ఇందుకు కృష్ణుడిని వివాహమాడిన అసంఖ్యాకమయిన అమ్మదేవతలు సరిపోలేదు వాళ్ళంతా బహుశా యమునకు పడమటి దిక్కున వున్న ఆటవికుల దేవతలయి వుంటారు కాని ఆర్యుల వ్యవసాయక సమాజం ఈ దశలో విస్తరించ వలసింది తూర్పున వున్న దట్టమయిన గంగా యమునా అడవులలోనికి అక్కడి ఆటవికులు 'నాగజాతి' వీళ్ళకు వ్యవసాయం అలవాటు చేయడం, కొందరిని శూద్రు లగా లోబరచుకోవడం, కొందరిలో వర్ణవిభజనను ప్రవేశపెట్టడం, ఒక ముఖ్యమైన చారిత్రక పరిణామం ఇందుకు ప్రతి ఫలనంగా 'నాగ చిహ్నం మహాభారతంలోనికి బలంగా వచ్చి చేరింది. కోశాంబి కంటే పూర్వమే సుక్తాంకర్ హాప్కిన్స్ వంటి వారు మహా భారతం ఒక్కనాడు రూపొందిన కథకాదని, క్రీ పూ 400 నుండి కనీసం క్రీ శ. 200 (బహుశా క్రీ.శ 400) దాకా మార్పులూ చేర్పులూ జరుగుతూ వచ్చాయని, నిరూపించారు [16] మొదట్లో చాలా చిన్నదిగా వున్న కావ్యాన్ని 'జయం అన్నారు. పేరును బట్టే అది కురుక్షేత్ర యుద్ధం కథ అని అర్థం అవుతుంది అయితే కోశాంబి విశ్లేషణ ప్రకారం అది కౌరవుల విలాపంగా ప్రారంభమయి పాండవుల విజయ గీతంగా మారింది ఆ తరువాత పెరిగిన క్రమంలో 25 000 పద్యాల భార తం అయి చివరికి లక్ష పద్యాల మహాభారతం అయింది సుక్తాంకర్ కేవలం కావ్య విశ్లేషణ ద్వారా చేసిన ఈ నిర్ధారణకు కోశాంబి చారిత్రక వివరణ ఇస్తాడు కురుక్షేత్ర యుద్ధం కథకు యాదవుల కృష్ణుడి కథలు వచ్చి చేరాయి. కాలక్రమంలో కృష్ణుడి కథలు మరిన్ని అయి చివరికి కృష్ణుడే మహా భారతంలో ముఖ్యుడా అన్నంతగా ఎదిగాడు. అయితే ఆర్య-యాదవ సమ్మేళనం కంటే ముఖ్యమైన పరిణామం గంగా-యమునా అడవుల వ్యవసాయీకరణ కావడం చేత అక్కడి ఆటవికుల చిహ్నం అయిన నాగుపాము చాలా ప్రముఖంగా భారత కథలోనికి ప్రవేశించింది ప్రస్తుత రూపంలోని మహా భారత కథకు కేంద్రం కురుక్షేత్ర యుద్ధం కాదనీ నాగజాతిని

అంతం చేస్తానని ప్రతిజ్ఞ చేసి జనమేజయుడు చేసిన యజ్ఞం అనీ కోశాంబి అంటాడు. ఆ యజ్ఞం సందర్భంలో వైశంపాయనుడు చెప్పిన కథ మహాభారతం. ఈ రకంగా చూడడమే మహా భారతం అంతిమంగా తీసుకున్న రూపానికి అనుగుణ్యమైన చిత్రం అని కోశాంబి పదే పదే అంటాడు [17]

ఈ సమ్మేళనం చాలా విజయవంతంగా జరిగి మహా భారత కథ బహుళ ప్రాచుర్యం పొందింది ఆ కారణం చేత తరువాతి కాలంలో బ్రాహ్మణులు అప్పటి పాలక వర్గాలకు అవసరమయిన భావాలను ఉపాఖ్యానాల రూపంలోనూ ఉపదేశాల రూపంలోనూ మహా భారతంలోకి ప్రవేశ పెడుతూ వచ్చారు ఈ విధంగా క్రీస్తుశకం తొలి శతాబ్దాలలో (భూస్వామ్యయుగం ఆవిర్భవిస్తోన్న కాలంలో) మహా భారతంలోనికి ప్రవేశించిన ప్రముఖవిషయాలు భూస్వామ్య సమాజ ధర్మాన్ని బోధించే భగవద్గీత, భూస్వామ్య రాజనీతిని బోధించే శాంతి పర్వం మొదటిదాన్ని కృష్ణుడిచేత రెండవ దాన్ని భీష్ముని చేత చెప్పించారు

మహా భారతంలోని నాగ తదితర ఆటవిక చిహ్నాలను కోశాంబి విశ్లేషించే తీరు చాలా ఆసక్తి కరంగా వుంటుంది నిజానికి **The Autochtonous element in the Mahabharata** అనేది కోశాంబి విశ్లేషణా పద్ధతిలోని పటిమకు అనన్యమైన నిదర్శనం. ఇక్కడ కొన్ని ఉదాహరణలు మాత్రమే ఇస్తాను

హస్తినాపురం దగ్గర జరిగిన పురావస్తు తవ్వకాలలో రెండు పొరలలో కుండ పెంకులు దొరికాయి [18] క్రింది పొరలో చాలా మొరటుగా కాల్చిన కుండ పెంకు లున్నాయి ఇవి ఆ ప్రాంతపు ఆటవికుల ఆవాసాలను సూచిస్తాయని కోశాంబి భావి స్తాడు. పైపొరలో చక్కటి బూడిద రంగు కుండ పెంకులున్నాయి, వాటితో బాటు ఇనుము ముడి ఖనిజాన్ని కరిగించిన గుర్తులున్నాయి ఇవి ఆ ప్రాంతాన్ని చేరుకొని అక్కడ ఇనుము వాడకంతో ఆహారఉత్పత్తి ప్రారంభించిన కురుగణం గుర్తులని కోశాంబి అంటాడు వాళ్లు తమ రాజధానికి హస్తినాపురం (హస్తి అంటే పాము అని ఒక అర్థం) అని పేరు పెట్టుకోవడాన్ని బట్టి అది 'నాగజాతి' ఆటవికుల నివాస స్థలమనీ వాళ్ళను ఆర్యులు లోబరచుకున్నారనీ అర్థం అవుతుంది ఇటువంటి ఆట విక చిహ్నాలు మహా భారతం కథలో ఆద్యంతం వున్నాయి

కురువంశం భరతుడిని తన మూల పురుషుడిగా చెప్పుకుంది. భరతుడు దుశ్యం తుడికి శకుంతలకూ పుట్టిన వాడు. శకుంతల మేనక కుమార్తె. మేనక అప్సరస, శకుంతల గూడ శతపథ బ్రాహ్మణంలో అప్సరసగా చెప్పబడింది. పైగా శకుంతలను పెంచిన కణ్వుడిని వేదాలలో రాక్షసుడన్నారు

కురు పాండవులిద్దరికీ తాతగారు భీష్ముడు మహాభారతంలో కృష్ణుడి తరువాత ముఖ్యుడు భీష్ముడే అయితే భీష్ముడి తల్లి అయిన గంగ స్పష్టంగా నీటి దేవతే. ఆమె శంతనుడిని వివాహం ఆడుతుంది గానీ నాగరిక సమాజపు గృహిణి కంటే అమ్మ

దేవత లాగ ప్రవర్తిస్తుంది. పుట్టిన పిల్లలందరినీ తానే స్వయంగా చంపుతుంది భీష్ముడికి ప్రాణాంతకంగా పరిణమించిన అంబ (అమ్మ) గూడ అమ్మదేవతే

మరొక కురు ముఖ్యుడు ద్రోణుడు. ఇతనికి విలు విద్యలో వున్న నేర్పరితనం ఆర్య లక్షణం కాదు, ఆటవిక లక్షణం ఇతడు నల్లటి వాడు గూడ పైగా ద్రోణుడు స్త్రీకి పుట్టిన వాడుకాడు ఒక రుషి వీర్యం కుండలో పడగా అందులోంచి పుట్టాడు కుండ అమ్మదేవత చిహ్నం. ఇటువంటి కథలన్నీ ఆటవిక మూలాన్ని సూచిస్తాయని గత అధ్యాయంలో చూసాం. కౌరవులు గూడ సహజంగా పుట్టిన వారుకారు గాంధారి కడుపులోని పిండాన్ని వంద ముక్కలు చేసి వంద పాత్రలలో పెట్టగా వాటిలోంచి కౌరవులు పుట్టారు పాండవులు గూడ పాండురాజుకు పుట్టలేదు, దేవుళ్ళకు పుట్టలేదు పాండురాజుకు మాద్రితో అసలు కలవకూడదని శాపం [19]

మహాభారతంలో నాగుపాము చిహ్నం గూడ చాలా లోతుగా వుంది నాగజాతికి శత్రువుగా కనబడే కృష్ణుడి అన్న బలరాముడు స్వయంగా నాగుపాము (ఆదిశేషుడి) అంశ. అతని 'ఆయుధం' నాగలి నాగలిని ఆయుధం అనడంలో అర్థం లేదు కాబట్టి బలరాముడు ఆటవిక-వ్యవసాయక సమ్మేళనాన్ని సూచిస్తాడని అర్థం చేసుకోవాలి. ద్రోణుడి కుమారుడయిన అశ్వత్థామకు నాగుపాములాగ తలలో మణి వుంటుంది దాన్ని అతను తీసి భీముడికి అప్పజెప్పడం కౌరవుల ఓటమిలో అంతిమ ఘట్టం అప్పుడు గాని పాండవులకు రాజ్యం సంక్రమించదు అర్జునుడి భార్యలలో ఒకతె అయిన ఉలూపి 'నాగకన్య'. అర్జునుడిని ఆమె ఒక సందర్భంలో నాగమణి సహాయంతో బ్రతికిస్తుంది.

తన తండ్రి మరణానికి ప్రతీకారంగా నాగజాతిని అంతం చేయాలన్న పూనికతో జనమేజయుడు యజ్ఞం చేస్తాడు ఎన్నో 'పాములు' చనిపోతాయి. అయితే నాగజాతి సర్వనాశనం అయిపోయే లోపల ఆస్తికుడనే బ్రాహ్మణుడి చొరవవల్ల యజ్ఞం ఆగిపోతుంది అయితే ఈ 'బ్రాహ్మణుడు' బ్రాహ్మణ తండ్రికీ నాగస్త్రీకి పుట్టినవాడు అంతేకాదు, జనమేజయుడి పురోహితుడయిన సామశ్రవుడు గూడ నాగస్త్రీకి పుట్టిన వాడే [20] నాగజాతి సర్వనాశనం కాకుండ యజ్ఞం విరమించబడిందంటే వ్యవసాయక సమాజానికీ ఆటవికులకూ సామరస్యం కుదిరిందని అర్థం ఆటవికులు వ్యవసాయాన్నీ వర్ణవ్యవస్థనూ అంగీకరించారు కొందరు బ్రాహ్మణులూ క్షత్రియులూ అయ్యారు అత్యధికులు శూద్రులయి ఆర్య సమాజానికి లొంగిపోయారు అయితే వాళ్ళ దేవుళ్ళ ఆర్యుల దేవుళ్ళతో కలిసిపోయారు తరువాతి కాలపు హిందూ మతంలో నాగుపాము పూజ చాలా రూపాలలో కనబడుతుంది

## జనపదాలు

క్రీ. పూ. 600 నాటికి గంగా యమునా లోయల పైభాగాన ఆహార ఉత్పత్తిని ప్రారంభించిన ఆర్యుల వ్యవసాయక సమాజం ఒక తూర్పు దిక్కుగా ప్రయాణించా

లంటే దట్టమయిన గంగా యమునా లోయల దిగువ అడవులను వ్యవసాయ యోగ్యం చేయాలి అక్కడి ఆటవికులను లొంగదీసుకోవాలి, వాళ్ళకు వ్యవసాయం అలవాటు చేయాలి

దట్టమయిన అడవులను వ్యవసాయ యోగ్యం చేయాలంటే ఇనుము విస్తారంగా లభ్యంకావాలి 'కురుదేశం' అంటే ఢిల్లీ-మీరట్ ప్రాంతంలో ఇనుము అంత విస్తారంగా దొరకదు మనదేశంలో ఆనాటికీ ఈనాటికీ ఇనుము విస్తారంగా దొరికే ప్రాంతం బీహార్ రాష్ట్రం-అంటే గంగా యమునా లోయల దిగువ భాగం. అక్కడి ఇనుప గనులను చేరుకునే దాకా గంగా యమునా లోయల మొత్తంగా వ్యవసాయ యోగ్యం కావు అంతదాకా, కొత్తగా ఏర్పడ్డ ఆర్యుల వ్యవసాయక సమాజం గట్టిగా నిలదొక్కుకోదు [21] వర్గ సమాజం ఏర్పడి గూడ ఇప్పటికి ఇంకా ఆర్యుల సమాజం గణవ్యవస్థ రూపాన్ని వదులుకోలేదని చూసాం ఇందుకు ప్రముఖ చిహ్నం, యజ్ఞ బలుల రూపంలో అదనపు ఉత్పత్తిని సేకరించడం. ఇనుము వాడకం విస్తరించి వ్యవసాయం బలమైన పునాది మీద నిలబడేదాక గణవ్యవస్థ నాశనమయి రాచరికాలు ఏర్పడవు. కాబట్టి ఇనుప గనుల అన్వేషణ ఇనుప పనిముట్ల విస్తరణ వ్యవసాయ వర్గ సమాజ వ్యాప్తి రాచరికాల ఆవిర్భావం, ఒక దానినొకటి ఒరుసుకుని సాగాయి. మొట్ట మొదటి 'రాజ్యం'గా పిలవ దగ్గది ఇనుప గనులున్న దక్షిణ బీహార్ ప్రాంతపు మగధ.

ఈ బహు విధమయిన పరిణామం వైదిక ఆచారాలకు వ్యతిరేకమయిన సామాజిక సాంస్కృతిక సంఘర్షణల రూపంలో సాగింది కాబట్టి దీనిని వివరించడానికి బ్రాహ్మణ గ్రంథాల కంటె బౌద్ధ తదితర బ్రాహ్మణ వ్యతిరేక సంప్రదాయాలు బాగా ఉపయోగపడతాయి. ఈ మార్పులకు-ముఖ్యంగా గణ వ్యవస్థ విచ్ఛిన్నం అయి రాచరికాలు ఏర్పడిన పరిణామానికి-బుద్ధుడు చారిత్రక ప్రతినిధి కృష్ణుడి లాగ కేవలం పురాణ పురుషుడు కాక బుద్ధుడు చారిత్రక పురుషుడు కావడం వల్ల, బ్రాహ్మణ సంప్రదాయం కంటే తొలినాటి బౌద్ధ సంప్రదాయానికి వాస్తవిక దృక్పథం చాలా అధికంగా ఉండడం వల్ల, బౌద్ధ సంప్రదాయాన్ని చారిత్రకంగా అర్థం చేసుకోవడం పురాణాల విశ్లేషణ అంత కష్టంగానీ నిరర్థకం గానీ కాదు.

ఆర్యులు బీహార్‌లోని ఇనుప గనులను ఎట్లా చేరుకున్నారు, ఇనుము సహాయంతో వ్యవసాయక సమాజాన్ని దట్టమయిన నదీ లోయ అడవులలోనికి ఎట్లా ప్రవేశపెట్టారు, గణ వ్యవస్థను పూర్తిగా వదిలి పెట్టి నాగరిక రాజ్యాలను ఎట్లా ఏర్పరచుకున్నారు, అనేవి చూడాలి

ఆర్యులు క్రీ. పూ. 1000 నుండి గూడ ఢిల్లీ-మీరట్ ప్రాంతం నుండి తూర్పుకు ప్రయాణం చేస్తూనే వున్నారు అయితే ఇది గంగా యమునా లోయల మధ్య భాగం గుండా కాదు, వేరే రెండు మార్గాల గుండా. ఒకటి, ఉత్తరాన వున్న హిమాలయి-నేపాల్ సరిహద్దు మీదుగా బీహార్ రాష్ట్రం ఉత్తర కొనదాకా వచ్చి అక్కడి

నుండి నిటారుగా దక్షిణానికి రావడం ఈ మార్గ మంతటా గూడ ఆర్యుల వ్యవసాయక ఆవాసాలు ఏర్పడ్డాయి [22] రెండవ మార్గం గంగా యమునా నదుల మీద పడవ ప్రయాణం వారణాసి దగ్గర పురావస్తు తవ్వకాలలో క్రీ. పూ. 800కు చెందిన ఆవాసాలు బయటపడ్డాయి. అప్పటికి నదీ లోయలను వ్యవసాయ యోగ్యం చేసి నివాసాలు ఏర్పరచుకోవడానికి కావలసిన ఇనుము పరిజ్ఞానం గాని ఇనుము వాడకం గాని లేవు కాబట్టి నది మీద ఢిల్లీ ప్రాంతం నుండి బీహార్ ప్రాంతం దాకా ప్రయాణం చేసారని అనుకోవాలి ఈ విధంగా ప్రయాణం చేసిన వాళ్ళు వర్తకులు నది ఒడ్డున, బీహార్ ప్రాంతంలోనూ, క్రీ పూ. 800కు చెందిన రాగి అవశేషాలు దొరికాయి ఇవి పనిముట్లు కావు, వ్యాపారస్తుల నిధి నిక్షేపాలు. ఈ వర్తకులు స్థానికులు కారనేందుకు రుజువుగా ఈ నిక్షేపాలతో బాటు దొరికిన కుండ పెంకులు చాలా మొరటయినవి. అప్పటికి ఆర్యులు అలవర్చుకున్న బూడిద రంగు పెంకులుకావు అంత మొరటయిన కుండ పెంకులు తయారు చేసుకున్న ఆటవికులకు చక్కటి రాగి వస్తువుల తయారీ గానీ వర్తకంగానీ తెలిసివుండే అవకాశం లేదు. కాబట్టి ఇవి స్థానిక ఆటవికుల నిక్షేపాలు కాక, ఆర్యవర్తకులవే అయివుండాలి అంటే నదీ లోయను వ్యవసాయ యోగ్యం చేయడానికి అవసరమయిన ఇనుము పరిజ్ఞానం లేకముందే, ఆర్యులు వర్తక రీత్యా గంగా యమునా నదుల దిగువ భాగానికి పడవల మీద విరివిగా ప్రయాణించేవారు. ఈ క్రమంలో ఇంద్రప్రస్థం నుండి కౌశాంబి దాకా, కౌశాంబి నుండి వారణాసి దాకా నదీతీర ఆవాసాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలోనే వారణాసి దగ్గర గంగా నదిని వదిలి దక్షిణానికి వెళితే రాజగృహం (రాజ్‌గిర్) ప్రాంతపు ఇనుప గనులను చేరుకోవచ్చునని గూడ కనుక్కున్నారు. బీహార్ ప్రాంతపు ఇనుము గనులు ఈ విధంగా ఆర్యులకు లభ్యం అయ్యాయి [23] ఈ గనులను చేజిక్కించుకోవడానికి ఆర్యులు బీహార్ ప్రాంతపు ఆటవికులతో సంఘర్షించిన చిహ్నాలు పురావస్తు మూలాలలో వున్నాయి. గంగకు దక్షిణణా వున్న మిర్జాపూర్ కొండ గుహలలో కొత్తరాతి యుగపు ఆటవికులు వేసిన గుహ చిత్రాలు ఉన్నాయి. వాటిలో నాలుగు గుర్రాల రథం మీదవున్న ఒక యోధుడు 'విష్ణు చక్రం' వంటి ఆయుధంతో నేల మీద వున్న ఆటవికులతో, యుద్ధం చేస్తున్నాడు. రథాలు, 'విష్ణు చక్రం', ఆర్యులవి కాబట్టి ఆ యోధుడు ఆర్యుడు అయివుండాలి [24]

ఇప్పుడు రెండు పరిణామాలు ప్రారంభమయ్యాయి. ఒకటి, హిమాలయ-నేపాల్ సరిహద్దులలో వున్న వ్యవసాయక ఆవాసాలను రాజ్‌గిర్ ఇనుప గనులతో కలుపుతూ, నిట్ట నిలువుగా బీహార్ రాష్ట్రం నడిబొడ్డుగుండా ప్రయాణించే మార్గం ఏర్పడింది. ఈ మార్గం మీదుగా రాజ్‌గిర్ ఇనుము ఉత్తరానికి రవాణా అయి నేపాల్ సరిహద్దు చేరి అక్కడి నుండి హిమాలయాల అంచు మీదుగా 'కురు' రాజధాని అయిన హస్తినాపురం చేరి, అక్కడి నుండి పంజాబు మీదుగా వాయవ్య సరిహద్దుమీద వున్న తక్షశిలను చేరింది. తక్షశిల నుండి ఇతర దేశాలతో ఎగుమతి దిగుమతులు సాగాయి. రాజ్‌గిర్

నుండి తక్షశిల దాకా వెళ్ళిన ఈ ప్రాచీన వర్తక రహదారిని ఉత్తరాపథం అన్నారు. ప్రాచీన కాలపు మొట్ట మొదటి పట్టణాలయిన రాజ్‌గిర్, పాటలీ పుత్రం, వేశాలి, కపిల వస్తు శ్రావస్తి ఈ ఉత్తరాపథం మీదనే వున్నాయి.[25] మొట్టమొదటి రాజ్యాలయిన మగధ కోసల గూడ ఈ మార్గం మీదనే రూపొందాయి.

ఇది ఒక పరిణామం కాగా, రాజ్‌గిర్ నుండి లభ్యమయిన ఇనుముతో గంగా యమునా లోయలు క్రమంగా ఆహార ఉత్పత్తికి లొంగి రావడం రెండవ పరిణామం. వివిధ తెగలు-కొందరు ఆర్యులు, కొందరు ఆర్యేతరులు, కొందరు అయిందీ కానిదీ చెప్పలేనివారు-ఇప్పటి ఉత్తర ప్రదేశ్ బీహార్ ప్రాంతాన్ని నెమ్మదిగా వ్యవసాయ యోగ్యం చేయసాగారు. అయితే వెనువెంటనే స్థిరనివాస గ్రామాలు ఏర్పడలేదు. వ్యవసాయాన్నీ ఆహార_సేకరణనూ కలిపిన సంచార వ్యవసాయ సమాజాలు ఏర్పడ్డాయి. ఒక్కొక్క గణం సంచరించిన ప్రాంతాన్ని (లేక సంచార గణాన్ని) ఒక 'జనపదం' అన్నారు.[26] యజుర్వేద కాలపు ఆర్యులలాగ, ఇవి గూడ స్థిర నివాస గ్రామాల సమాజాలు కావు. ఇనుము వాడకాన్నీ ఆహార ఉత్పత్తినీ నేర్చు కున్నప్పటికీ ఇంకా గణవ్యవస్థనూ సంచార జీవితాన్నీ వదిలిపెట్టి స్థిర నివాస గ్రామా లను గానీ రాచరిక వ్యవస్థను గానీ సాధించని దశ యిది.

ఈ విధంగా క్రీ. శ. 600 తరువాత మొత్తం ఉత్తర భారతదేశంలో గణ వ్యవస్థకూ వర్గ సమాజానికీ మధ్యస్తంగా వున్న సమాజాలు చాలా ఏర్పడ్డాయి. స్థూలంగా అన్నీ గూడ వ్యవసాయ ఉత్పత్తిని అలవర్చుకున్న సమాజాలే. కాని ఏవీ గూడ సంపూర్ణంగా వ్యవసాయక వర్గ సమాజాలు కావు. కొన్నిటిలో వర్ణ వ్యవస్థ స్పష్టంగా ప్రవేశించింది. వైదిక కర్మకాండను ఆర్భాటంగా ఆచరిస్తున్నాయి వైదిక కర్మ కాండలో అర్పించే బలుల రూపంలో అదనపు ఉత్పత్తిని పాలక వర్గాలు సేకరించడం జరుగుతోంది. కొన్నిటిలో ఈ 'ఆర్య' లక్షణాలు అంత స్పష్టంగా లేవు. ఆహార ఉత్పత్తి చేసే కర్షక వర్గం, అదనపు ఉత్పత్తిని సేకరించే గణ ముఖ్యుల పాలకవర్గం అనే విభజన మాత్రమే వుంది. కొన్నిటిలో గణసభ పాత్ర చాలావరకు క్షీణించి రాచరికాలు ఏర్పడుతున్నాయి. కొన్ని ఇంకా గణతంత్ర పద్ధతిలో గణసభ చేత ఎన్నుకోబడ్డ రాజుల పాలనలో వున్నాయి. ఈ గణవ్యవస్థ లక్షణాలను పూర్తిగా ధ్వంసం చేసి స్థిర నివాస గ్రామాలనూ వ్యవసాయక వర్గ సమాజాన్నీ రాచరిక వ్యవస్థనూ ఏర్పరచడం ఇక ముందున్న కర్తవ్యం. క్రీ. పూ. 600-300 కాలంలో ఈ పరిణామం సాగింది. దీనికి ప్రముఖ చారిత్రక చిహ్నం మగధ అత్యున్నత రూపం మౌర్య సామ్రాజ్యం. చరమదశ అశోకుడి పరిపాలన. వైదిక మతం గణవ్యవస్థను ఆసరా చేసుకుంది కాబట్టి ఈ మార్పు వైదిక వ్యతిరేకమయిన తిరుగుబాట్లలో ప్రతిఫలించింది. ఆ తిరుగు బాటు దార్లలో బుద్ధుడు ముఖ్యుడు

క్రీ. పూ. 600 నాటికి భారత ఉపఖండం వాయువ్యం నుండి తూర్పుదాకా-

పంజాబు నుండి బీహార్ దాకా-రూపం తీసుకున్న ఈ జనపదాల సంఖ్య 16 అని సంప్రదాయం. ఇవి 'మహా జనపదాలు'. ఇవికాక వేరే జనపదాలు చాలానే వుండి వుండాలి. వీటిని ప్రధానంగా మూడుగా విభజించవచ్చును ఒకటి, యజుర్వేద కాలపు వ్యవసాయీకరణ ఫలితంగా పంజాబు-ఢిల్లీ ప్రాంతంలో ఏర్పడిన జనపదాలు. రెండు ఆర్యుల తూర్పు విస్తరణ ఫలితంగా హిమాలయ-నేపాల్ సరిహద్దుమీద (ఉత్తరాపథం మీద) ఏర్పడ్డ జనపదాలు. మూడు, రాజ్‌గిర్ ప్రాంతపు ఇనుము ఫలితంగా గంగా యమునా లోయలలో ఏర్పడిన జనపదాలు. పురాణాలలోనూ బౌద్ధ సంప్రదాయంలోనూ పేర్కొన్న జనపదాల పేర్లు కాంబోజ, గాంధార, కురు, పంచాల, మద్ర, మత్స్య, శూరసేన, (పంజాబు-ఢిల్లీ-మధుర ప్రాంతానికి చెందినవి), మగధ, కోసల, విదేహ, మల్ల, శక్య మల్ల, లిచ్ఛావి (ఉత్తరాపథంమీద నున్నవి), కాశి, కుశినార, అవంతి, వత్స, మొదలయినవి (గంగా యమునా లోయలలోనివి).[27]

పురాణ సాహిత్యంలోనూ ఔత్సాహిక చరిత్రకారుల దేశభక్తియుతమైన ఊహాగానాలలోనూ ఈ మహా జనపదాలు ఒక్కొక్కటి ఒక్కొక్క సంపన్న రాజ్యంగానూ, వాటి రాజధానులయిన శ్రావస్తి, కపిలవస్తు, రాజగృహం, అయోధ్య, వారణాసి, ఉజ్జయిని, కౌశాంబి, హస్తినాపురం, తక్షశిల మొదలయినవి సకలైశ్వర్యాలతో విలసిల్లే మహానగరాలగానూ వర్ణించ బడతాయి[28]. ఇది అతిశయోక్తి అని గుర్తించాలి. ఈ 'జనపదాలు' ఇప్పటికింకా రాజ్యాలు కావు, కొంత నాగరికత సాధించిన గణాలు, లేక అవి సంచరించిన ప్రాంతాలు. అవి గణాలు అనడానికి నిదర్శనం కోసలులు, మాగధులు అని బహువచనం వాడడమే నని కోశాంబి సూచిస్తారు.[29] ఈ జనపదాలను తీసేస్తే మిగిలిన ప్రాంతమంతా దట్టమయిన అడవులతోనూ ఆటవికులతోనూ నిండివుంది.

ఉత్తర భారతదేశం పర్యంతం విస్తరించిన ఈ జనపదాలు చుట్టూవున్న ఆటవికులతోనే గాక తమలోతాము గూడ కలహించుకున్నాయి ఇనుము గతంలోకంటె ఎక్కువ లభ్యం అవుతోంది కాబట్టి గతంలో కంటె యుద్ధాలు ఎక్కువగా చేయగలిగారు. ఎవరికి ఇనుము ఎక్కువగా అందుబాట్లోవుంటే వాళ్లు గెలిచారు ఈ క్రమంలో ఆ గణాల 'రాజులు' బలపడి నిజమైన రాజులు కాగలిగారు. బయట గెలిచి ఇంట గెలిచారు. గణ వ్యవస్థలోని ప్రతిబంధకాలను తెంచుకొన్నారు, సార్వభౌములయ్యారు. పురాణ గాథలు వదిలి చారిత్రక రుజువులు లభ్యమయ్యే కాలానికి ఉత్తరాపథంమీద (ఇనుప గనులకు అందుబాట్లో) వున్న కోసల, మగధ, లిచ్ఛావి, మల్ల మొదలయిన గణాలు మిగిలాయి. వాటిలో కోసల, మగధలది పైచేయి అయింది, చివరికి మగధ కోసలను గూడ లోబరచుకుంది. భారత దేశ చరిత్రలోని మొట్టమొదటి సర్వసత్తాక రాజ్యం అయిన మగధ క్రీ. పూ. 530-470 మధ్యకాలంలో రూపొందింది.[30]

మిగిలిన జనపదాలన్నీ ఏమయ్యాయి? కొన్ని నామరూపాలు లేకుండ

పోయాయి పురాణాలలోనేతప్ప ఏ చారిత్రక మూలాలలోనూ వాటి ప్రస్తావన లేదు. అయితే కొన్ని మాత్రం కులాల పేర్లగా శ్రేణుల పేర్లగా వృత్తి నామాలగా మిగిలి పోయాయి ఆదిమ గణాలు వర్ణ వ్యవస్థలో కులాలగా (అత్యధికంగా శూద్ర కులాలగా) పరిణామం చేసుకున్న మౌలికమయిన చారిత్రక క్రమానికి ఇవి ఉదాహరణలుగా కనబడతాయి విదేహ జనపదం పోయిందిగాని వైదేహికులు అనే వ్యాపారస్తుల శ్రేణులు మిగిలాయి మల్ల గణం పోయి మల్లులు అంటే కుస్తీ గానీ వ్యాయామం గాని ప్రదర్శించే వృత్తిని అనుసరించేవాళ్లు అనే అర్థం మిగిలింది మగధ గణానికి చెందిన మాగధులు రాజుల కీర్తిని గానం చేసేవాళ్ళయ్యారు[31] ధర్మశాస్త్రాలలో వీళ్ళందరినీ వర్ణ సాంకర్యంవల్ల ఎర్పడ్డ సంకర కులాలగా పేర్కొన్నారు[32] అయితే గణంలోని వాళ్ళందరూ ఒకే కులాన్నిగానీ వృత్తినిగానీ స్వీకరించారని భావించనక్కరలేదు

ఈ జనపదాల సంఘర్షణయొక్క రాజకీయ సారాంశాన్ని కోశాంబి వివరంగానే నిరూపించగలుగుతాడు ఈ సంఘర్షణలో ముఖ్యపాత్ర వహించినవి ఉత్తరాపథం మీద వున్న మగధ కోసల లిచ్ఛవి మల్ల, జనపదాలు. మాగధులు ఉత్తరాపథం మొదలయ్యే చోట ఇనుప గనులకు నిలయమయిన రాజ్‌గిర్‌ను రాజధానిగా కలిగివున్నారు. కోసలుల రాజధాని శ్రావస్తి నేపాల్ సరిహద్దుమీద వుంది ఈ రెండు జనపదాలమధ్యనున్నవి మల్ల లిచ్ఛవి గణాలు వీటిమధ్య జరిగిన సంఘర్షణలో అంతిమంగా విజయాన్ని నిర్ణయించేది ఇనుము గనులమీది ఆధిపత్యమే. అయితే సామాజిక నిర్మాణానికి (ఉత్పత్తి సంబంధాలకు) సంబంధించిన అంశంగూడ చాలా ముఖ్యమైనది. గణవ్యవస్థ నిర్మాణాన్ని తెంపుకొని రాచరికాన్ని ఏర్పరచుకో గలిగిన జనపదాలే ఈ సంఘర్షణలో నిలువగలుగుతాయి శిక్షిత సైన్యాలు (Stand ng army) గల సార్వభౌములు గెలుస్తారుగానీ, గణప్రముఖులంతా ఆయుధ ధారులయిన గణాలు గెలవవు. ఇప్పుడు విస్తృతంగా లభ్యం అవుతున్న ఇనుమును ఆయుధాలగాగానీ పనిముట్లగాగానీ సమర్థవంతంగా వినియోగించుకోవాలంటే సామాజిక నిర్మాణంలో (ఉత్పత్తి సంబంధాలలో) మార్పురావాలి గణసమాజ నిర్మాణం ఈ మార్పుకు ప్రతిబంధకంగా వుంది. లిచ్ఛవి, మల్ల గణాలు ఈ మార్పును సాధించలేక పోయాయి అవి అప్పటికే బాగా దిగజారి పోయాయి కొత్తగా లభ్యం అయిన ఇనుము ఆధారంతో గణప్రముఖులు గణంలోని సామాన్యులచేత ఆహార ఉత్పత్తి చేయించి పెద్దఎత్తున అదనపు ఉత్పత్తిని సేకరించి తమ ఆస్తిగా స్వంతం చేసుకుంటున్నారు. వీళ్ళ దోపిడీకి గణ సంబంధాలే ప్రాతిపదికగా వున్నాయి గత అధ్యాయంలో వివరించినట్టు ఆహారాన్ని పంపకం కోసం (లేక యజ్ఞబలులకోసం) గణ ప్రముఖులకు అర్పించడం అనే గణ ఆచారం రూపంలో అదనపు ఉత్పత్తి సేకరణ సాగింది దీన్ని తెంపుకొని నాగరిక వర్గసమాజాన్ని ఏర్పరచడం గణ ప్రముఖుల ప్రయోజనానికి వ్యతిరేకమయింది. అందుకే ఈ గణాలు మగధ

చేతిలో ఓడిపోయాయి

సామాజిక నిర్మాణంలో మార్పును సాధించిన మాగధులు కోసలులలో కూడ మొట్టమొదటి రాజులు ఆటవికులు కావడం గమనించదగ్గ విషయం అని కోశాంబి భావిస్తాడు. వీళ్ళు గణ ప్రముఖుల సంతతి కాకపోవడంవల్లనే గణ నిర్మాణాన్ని ఛేదించి నాగరిక రాజ్యాలనూ శిక్షిత సైన్యాన్నీ ఏర్పరచ గలిగారు మల్ల లిచ్ఛవి శాక్య గణాలను లొంగదీసుకో గలిగారు మగధ రాజు బింబిసారుడు శిశునాగ రాజవంశానికి చెందిన వాడని పురాణ సంప్రదాయం ఈ శిశునాగ వంశాన్ని బ్రాహ్మణ పురాణాలలో చాలా హీనంగా చూసారు పైగా నాగ అనేది వైదిక ఆర్యులు ఆటవికులకు పెట్టిన పేరు కాబట్టి ఈ శిశునాగులు ఆటవికులయి వుండాలి కోసల రాజు ప్రసేనజిత్తు విషయం గూడ అంతే అతను తన్నుతాను ఇక్ష్వాకు వంశీయుడిగా చెప్పుకున్నాడుగాని ఆ గొప్పలు ఆనాడు ఎవరూ అంగీకరించలేదు తనకంటే చాలా బలహీనులూ తనకు విధేయులూ అయిన శాక్యులనుండి అతను వియ్యం కోరితే వాళ్ళు తమ గణం స్త్రీని ఇవ్వడానికి ఇష్టపడక నాగముండా అనే ఆటవికస్త్రీ కుమార్తెనిచ్చారు 'నాగ అనేది ఆటవిక నామం కావడమే కాక, 'ముండా' అనేది ఇప్పటికీ బీహార్ ప్రాంతంలో వున్న ఒక ఆటవిక తెగపేరు [33] ఈ విధంగా భారత దేశంలోని మొట్టమొదటి సర్వసత్తాక రాజ్యాలను ఏర్పరచిన సార్వభౌములిద్దరూ ఆటవికులే

గణవ్యవస్థలో గణ ప్రముఖుల సభ వుంటుంది ఈ సభ తనలో ఒకరిని తాత్కాలికంగా 'రాజు'గా నియమిస్తుంది వేదసాహిత్యంలో పేర్కొన్న రాజులంతా ఇటువంటి గణప్రముఖులేగాని నాగరిక సమాజాల రాజులుకారు ఈ 'రాజు' గణసభ అభిమతాన్ని అనుసరించి నడుచుకోవాలి అంటే అతను సార్వభౌముడు కాడు అతని పరిపాలన సర్వసత్తాక రాజ్యంకాదు ఈగణ సంప్రదాయాన్ని ఛేదించి రాచ కాలు ఏర్పడడంతో రాజు చాలా బలవంతుడవుతాడు ఇప్పుడతను గణముఖ్యుల సభచేత నియమితుడు కాక పురోహితులచేత అభిషిక్తుడవుతాడు అతని అధికారానికి ఈ విధంగా అద్భుత లక్షణం ఆపాదించబడుతుంది అది వంశ పారంపర్యంగా అతని పుత్రపౌత్ర తదనంతరులకు సంక్రమిస్తుంది గతంలో లాగ అతనిప్పుడు గణ ప్రముఖులందరితో సమంగా అదనపు ఉత్పత్తిని పంచుకోనక్కరలేదు అదనపు ఉత్పత్తి ఇప్పుడు ప్రత్యక్షంగా తనకే చెందుతుంది. తన నుండే ఇతర ప్రముఖులకు సంక్రమిస్తుంది గతంలో లాగ యజ్ఞ బలుల రూపంలో కాక ఇప్పుడు పన్నుల రూపంలో సేకరిస్తాడు పన్నుల సేకరణ కోసం ఒక అధికార యంత్రాంగాన్ని రూపొందిస్తాడు శిక్షిత సైన్యాన్ని ఏర్పరుస్తాడు పరిపాలన ఈ విధంగా సర్వసత్తాక సార్వభౌమత్వాన్ని పొంది నాగరిక 'రాజ్యం' ఏర్పడుతుంది వ్యవసాయక వర్గ సమాజానికి అనుగుణ్యమైన రాజకీయ రూపం యిది.

ఈ మార్పులను సాధించడంలో రాజులకు పురోహితుల అండ కావాలి

అందులోనూ (బింబిసారుడు, ప్రసేన జిత్తుల లాగ) ఈ మార్పును సాధించిన మొట్ట మొదటి రాజులు గణ ప్రముఖుల సంతతి కాక ఆటవికులయితే మరింత అవసరం. వాళ్ళకు ప్రతిష్టాకరమయిన రాజవంశాలు కావాలి. వాళ్ళ పూర్వీకులు ఇక్ష్వాకులనీ భరతులనీ పురాణాలు కల్పించాలి. మన దేశంలో అన్ని మూలలలోనూ కనబడే 'ఇక్ష్వాకు' రాజవంశాలను బట్టి చూస్తే బ్రాహ్మణులు ఈ కల్పనలు చేయడానికి ఎల్లప్పుడూ సంసిద్ధులేనని అర్థం అవుతుంది.[34] అందుకు ప్రతిఫలంగా ఆస్తులు సంపాదించుకున్నారు బింబిసారుడూ, ప్రసేన జిత్తూ ఇద్దరూ గూడ యుద్ధాలలో విజయం కోరుతూ పెద్ద పెట్టున యజ్ఞాలు చేయడమే కాక బ్రాహ్మణులకు దక్షిణగా మొత్తం గ్రామాలే యిచ్చారు.[35]

కొత్తగా వచ్చిన రాచరికవ్యవస్థ నిర్వహణకు దోహదం చేసే కొత్త భావాలూ విలువలూ పుట్టుకొచ్చాయి. గణవ్యవస్థలో, ఇతర గణాలకు చెందిన వారితో యుద్ధం చేయడం, వాళ్ళను హతమార్చడం, దోచుకోవడం, వాళ్ళ సంపదను నాశనం చేయడం, అన్నీ కూడ నీతివంతమయిన పనులే. కాని గణం లోపల మాత్రం పరస్పరం హాని కలిగించుకోగూడదు. ఒక కుదురుకు చెందిన వారంతా 'సజాతుల' కిందలెక్క. వాళ్ళకు ఏ విధంగానూ హానికలిగించ కూడదు కాని వర్గ సమాజం నీతి సూత్రాలు వేరే. ఆస్తి కోసం, రాజ్యం కోసం తోబుట్టువులను గూడ చంపవచ్చును ఎటువంటి కుటిలనీతి నయినా ప్రయోగించవచ్చును. అది రాజనీతి, క్షత్రియ ధర్మం.[36] ఆస్తి హీనులను ఆస్తిపరులు (ఇద్దరూ గతంలో ఒకే కుదురుకు చెందిన వారయినప్పటికీ) దోచుకోవచ్చును దోచుకో బడడం ఆస్తి హీనుల ధర్మం దోచుకోవడం ఆస్తిపరుల ధర్మం.

కొత్తగా సమాజానికి అవసరమయిన ఈ నీతిని వివరించే శాస్త్రకారులు పుట్టుకొచ్చారు ఒక గ్రంథంగా మనకు దొరికిన మొట్టమొదటి రాజనీతి గ్రంథం కౌటిల్యుడి 'అర్థ శాస్త్రం.' ఈ కౌటిల్యుడు చివరి మగధ రాజవంశమయిన మౌర్యుల కాలానికి చెందిన వాడు. అయితే అర్థ శాస్త్రాన్ని బట్టి, కౌటిల్యుడు ఒక్కడే కాక క్రీ పూ 600-300 కాలంలో అర్థశాస్త్ర సూక్తులను పోలిన నీతి సూత్రాలు చెప్పిన శాస్త్రకారులు చాలా మంది వున్నారని అర్థం అవుతుంది. కౌటిల్యుడి లాగే వీళ్ళలో చాలా మంది బ్రాహ్మణులు. ఆవిషయం వీళ్ళ పేర్లను బట్టే తెలుస్తుంది. భరద్వాజుడు కాత్యాయనుడు, పరాశరుడు, బృహస్పతి వగైరా. వీళ్ళు కాక దీర్ఘచారాయణుడు, కింజల్కుడు, విశాలాక్షుడు, మొదలయిన శాస్త్రకారులున్నారు. వీళ్ళు క్షత్రియులయి వుంటారని కోశాంబి భావిస్తాడు.[37] అంటే, నూతన పాలక వర్గానికి చెందిన రెండు వర్గాల నుండి నూతన సామాజిక నీతిని బోధించే శాస్త్రకారులు పుట్టుకొచ్చారు అయితే ఒక్క కౌటిల్యుడు తప్ప వేరే ఎవ్వరి రచనలూ స్వతంత్రంగా లభ్యం కాలేదు. కౌటిల్యుడు తన సూత్రాలను ప్రతిపాదిస్తూ వీళ్ళందరి అభిప్రాయాలనూ పేరు పేరునా వుటంకించి వ్యాఖ్యానిస్తాడు. దీనిని

బట్టి కొత్తగా రూపొందుతున్న సర్వసత్తాక రాచరిక అధికారానికి వర్గ సమాజానికి అనుగుణ్యమైన భావాలు విస్తృతంగా పుట్టుకొచ్చాయని అర్థం అవుతుంది ఈ భావాలు ఎటువంటి నీతి సంబంధమైన ఆచ్ఛాదన గానీ పరోపకారం అనే ముసుగు గానీ లేకుండ నిర్మొగమాటంగా అధికార దాహాన్ని సమర్థించి, దాన్ని తీర్చుకోవడానికి అవసరమయిన మార్గాలన్నింటినీ నిశ్శంకగా వివరించాయి. అర్థ శాస్త్రంలో ఒకచోట కౌటిల్యుడు, రాజులు రాజకుమారుల కుట్రల పట్ల అప్రమత్తంగా వుండడం ఎంత అవసరమో చెప్పి వెనువెంటనే రాజకుమారులు తమ తల్లిదండ్రుల కళ్ళు ఎలా కప్పాలో చెప్తాడు.[88] ఇదంతా ప్రత్యక్ష రాజకీయాల నుండి నేర్చుకున్నదే ననడానికి నిదర్శనంగా మగధ రాజయిన బింబిసారుడిని అతని కొడుకు అజాత శత్రువు ఖైదు చేసి తిండికి మాడ్చి చంపుతాడు. అర్థశాస్త్రం యుద్ధ తంత్రంలో 'మిత్రభేదం' ప్రయోగాన్ని వివరంగా చెప్తుంది మగధ రాజు అజాత శత్రువు లిచ్ఛవి గణాన్ని ఈ తంత్రం ప్రయోగంతోనే ఓడిస్తాడు వశ్యకారుడనే బ్రాహ్మణుడు మగధ నుండి బహిష్కరించ బడినట్టు నటిస్తూ లిచ్ఛవి గణంలో చేరి వాళ్ళలో వాళ్ళకు భేదాలు కల్పించి వాళ్ళను ఓడించడంలో అజాత శత్రువుకు తోడ్పడతాడు[89]

రాచరికాల ఆవిర్భావం మగధ చరిత్రలో కనబడితే సామాజిక రంగంలో వచ్చిన మార్పులను బౌద్ధ తదితర వైదిక వ్యతిరేక ఉద్యమాలు చక్కగా ప్రతిబింబిస్తాయి. ఇనుము సహాయంతో అపూర్వమయిన పరిమాణంలో ఆహారాన్ని ఉత్పత్తి చేసే శక్తిని సమాజం సంపాదించుకుంది. అయితే ఆ ఉత్పత్తిలో చాలా భాగం యజ్ఞకర్మకాండలో అర్పించే బలుల రూపంలో అగ్రవర్ణాల చేతులలోకి పోతోంది ముఖ్యంగా, పశు బలులు వ్యవసాయక సమాజానికి చాలా హానికరమయినవి అంతేకాక, అదనపు ఉత్పత్తి ఈ విధంగా యజ్ఞ కాండలో వృధా కాకుండ వ్యాపారానికి వినియోగ మయితే సామాజిక సంపద ఇనుమడిస్తుంది ఈ దృష్టితో బ్రాహ్మణుల వైదిక తంతులను వ్యతిరేకించే వ్యవసాయక-వ్యాపార వర్గాలు ఇప్పుడు ముందుకొచ్చాయి.

క్రొత్త సమాజంతో కొత్తగా ముందుకొచ్చి పాత గణ వ్యవస్థ ఆచారాలను వ్యతిరేకించిన ఈ వర్గాల నిర్మాణాన్ని అర్థం చేసుకోవాలి వ్యవసాయకులలో వ్యాపారస్తులలో అందరూ చిన్నవారు కారు. నాగలి పట్టుకొని పొలం దున్నిన కర్షకులే కాక వ్యవసాయకులలో చాలా సంపన్నులు కొందరున్నారు. వ్యవసాయదారులు ప్రధానంగా వైశ్యులు కాగా శూద్రులు వీళ్ళకు కూలి చేసారని గుర్తుంచు కోవాలి అట్లాగని, వీళ్ళను భూస్వాములగా గుర్తించడం సాధ్యం కాదు. అప్పటికింకా భూమిలో సమిష్టి యాజమాన్యమె తప్ప వ్యక్తి యాజమాన్యం లేదు. వ్యవసాయక సజాత బృందాలు (ఇంగ్లీష్‌లో **kinship groups** - తరువాతి కాలపు పోలికను బట్టి ఉమ్మడి కుటుంబాలు అని చెప్పుకోవచ్చును) పెద్ద ఎత్తునే భూమినీ పశు సంపదనూ శూద్ర

సంపదనూ ఉమ్మడిగా కలిగివున్నాయి. ఈ సజాత బృందాల పెద్దలను గృహపతులు (పాళిలో గహపతులు) అన్నారు. వేదకాలంలో గృహపతి అనేది కేవలం కర్మకాండ సంబంధమైన మాట. గృహ కర్మలను ఆచరించే వ్యక్తిని గృహపతి అన్నారు ఇప్పుడు గృహపతి అంటే సంపన్న సజాతుల బృందానికి పెద్ద అనే అర్థం వచ్చింది (బౌద్ధ సంప్రదాయాన్ని రాసిన పాళి భాషలో గహపతి అన్నారు) నూతనంగా ఆవిర్భ విస్తూన్న వర్గ వ్యవస్థలో గహపతులు ముఖ్యులు వీళ్లు గణ వ్యవస్థ యొక్క ఆచారాలకు లోబడి బ్రతకడం లేదు. సజాత బృందాల పెద్దలుగా తమమీద వున్న బాధ్యతవినా వీళ్ళు స్వతంత్రంగా తమ సంపదను అనుభవించ జూస్తున్నారు[40] బుద్ధుడిని ఆదరించిన వర్గాలలో వీళ్ళు ప్రముఖులు.

ఆహారంలో అదనపు ఉత్పత్తి పెద్ద ఎత్తున సాధ్యం అవుతున్నదంటే దానితో బాటు సామాజిక శ్రమ విభజన పెరుగుతుంది. ఒక్క ఆహారమే కాక వేరే అవసరాలు పెరుగుతాయి ముఖ్యంగా పాలక వర్గాలు వ్యవసాయకుల నుండి చేజిక్కించుకున్న అదనపు ఉత్పత్తినంతా ఆహారంగా భుజించారు దానితో కార్మికులను పోషించి విలాస వస్తువులను తయారు చేయించుకుంటారు. ఇతర ప్రాంతాలతో వర్తకం ద్వారా ఇక్కడ లభ్యం కాని వస్తువులు తెప్పించుకుంటారు. దీనంతటికీ ఆసరాగా ఒక వర్తక వర్గం ఆవిర్భవించింది. ఈ వర్తక వర్గం ప్రాముఖ్యత ఎంతటిదంటే పెద్ద వర్తకులను శ్రేష్ఠి (ప్రముఖుడు) అన్నారు పాళి భాషలో శెట్టి అన్నారు. గహపతుల లాగ ఈ శ్రేష్టులు గూడ అదనపు ఉత్పత్తి యజ్ఞ బలుల రూపంలో వృధా కావడాన్ని నిరసించిన వాళ్లు నూతన వర్గ వ్యవస్థలో ముఖ్యులు బుద్ధుడి అనుచరులలో ప్రముఖులు.

పాళి భాషలోని బౌద్ధ సంప్రదాయంలో కొత్తగా ఆవిర్భవించిన వ్యవసాయక వర్గ సమాజపు ప్రముఖులగా ఈ శెట్టి-గహపతులు కనబడతారు బ్రాహ్మణుల సంస్కృత సాహిత్యంలోనూ అర్థశాస్త్రంలోనూ పౌర-జానపదులు అనే వర్గాలను ప్రముఖంగా ప్రస్తావించారు[41] పౌరులు అంటే అప్పటికి కొత్తగా పుట్టుకొస్తున్న పట్టణాల ముఖ్యులు-అంటే వర్తకులు రాజన్యులు, పురోహితులు. జానపదులు అంటే గ్రామీణ ముఖ్యులు. పాళి సంప్రదాయంలోని శెట్టి-గహపతి వర్గాలను చూసినా సంస్కృత సాహిత్యంలోని పౌర-జానపద వర్గాలను చూసినా ఒక విషయం స్పష్ట మవుతుంది. గణ వ్యవస్థ విచ్ఛిన్నమై వర్గ వ్యవస్థ ఏర్పడుతోంది. ధనిక వర్గాలు ఏర్పడుతున్నాయి. గణ ఆచారాల సంకెలలు తెంచుకొని తమ ఇష్టానుసారం సంపదను వినియోగించుకోవాలని ఈ కొత్త వర్గాలు ఉవ్విళ్ళూరు తున్నాయి. ఈ సంపన్నులేకాక సామాన్య కర్షకులు గూడ గణ ఆచారాల నుండి విముక్తిని కోరుకున్నారు. యజ్ఞాలలో పశు బలులు అర్పించే ఆచారం వాళ్ళకు హానికరం అని చూసాం.

ఇదంతా వైదిక కర్మకాండకు వ్యతిరేకమైన ఉద్యమాలకు దారి తీసింది. ఒక్క బుద్ధుడేకాక, క్రీ పూ. ఆరు, అయిదు శతాబ్దాలలో చాలా మంది ఇందులో పాల్గొన్నారు.

మహా వీరుడు తెలిసినవాడే. ఇతనుకాక అజితకేశకంబలి, మఖలి గోశాలుడు, పూరణుడు, కాత్యాయనుడు, చార్వాకుడు మొదలయిన వాళ్లున్నారు వీళ్ళందరిలోకి బుద్ధుడే చరిత్రలో నిలిచి పోవడానికి గల కారణాలలో ఒకటి బుద్ధుడు ఏ విషయం లోనూ 'అతి'కి పోకుండ మితం పాటించడం అని కోశాంబి అంటాడు[42] బౌద్ధాన్ని మాధ్యమిక మార్గం (The Middle way) అని గూడ అంటారు. అయితే అంతకంటే ముఖ్యమైన కారణం, బుద్ధుడు వైదిక కర్మకాండను వ్యతిరేకించడంతో బాటు నూతన వ్యవసాయక వర్గ సమాజానికి అనుగుణ్యమైన విలువలనూ ప్రాపంచిక దృక్పధాన్నీ ప్రతిపాదించాడు నూతన వ్యవసాయక వర్గ సమాజానికి బౌద్ధం సమగ్రమయిన దార్శనిక సిద్ధాంతం

బుద్ధుడు, మహావీరుడు మినహా ఇతరులు రాసిన గ్రంథాలేవీ మనకు లభ్యం కాలేదు వీళ్ళకు వ్యతిరేకులయిన బౌద్ధ, జైన, బ్రాహ్మణ దార్శనిక గ్రంథాలలో వీళ్ళ అభిప్రాయాలుగా చెప్పినవి మాత్రమే మనకు తెలుసును వాళ్లు ఈ అభిప్రాయాలను పూర్వపక్షం చేయడం కోసం వుటంకించారు కాబట్టి అవి ఎంత వరకు విశ్వసనీయమో మనకు తెలీదు. అయితే తెలిసినంతవరకు ఈ తాత్వికులందరిలోనూ ఒకే భావ వాతావరణం కనిపిస్తుంది వీళ్ళను వైదిక సంప్రదాయానికి చెందిన ఉపనిషత్కారులతో పోలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది ఉపనిషత్తులు అధికంగా కాలక్రమంలో కొంత ముందు కాలానికి (క్రీ. పూ. 800-600) చెందినవయినా చారిత్రకంగా ఇదే దశకు చెందినవి. నూతన వ్యవసాయక వర్గ సమాజం ఆవిర్భవిస్తున్న దశకు చెందినవి. అయితే ఉపనిషత్తులు వైదిక మతంలో భాగమయినవి.

ఉపనిషత్తులలో లేవదీసిన ప్రశ్నలే ఈ తాత్వికులూ లేవదీసారు. జీవితం అంటే అర్థం ఏమిటి? చావుకు అర్థం ఏమిటి? ఆత్మ అనేది వుంటే దాని స్వభావం ఏమిటి? మొదలయినవి.[43] పశు సంపద ఇమ్మనీ యుద్ధాలలో విజయం సమకూర్చమనీ ఒకప్పుడు నిత్యజీవిత భౌతిక అవసరాలు తీరడం కోసం యజ్ఞాలు చేసినవాళ్లు ఇప్పుడు నిత్యజీవితంతో సంబంధం లేని తాత్విక ప్రశ్నలు వేస్తున్నారంటేనే అదనపు ఉత్పత్తి, వర్గ సమాజం, వచ్చాయనీ తత్వచింతన చేసే తీరుబడి కొంత మందికి చిక్కిందనీ అర్థం అవుతుంది అయితే ఈ మార్పు సంఘర్షణతో కూడుకొని ఉన్నదనేందుకు నిదర్శనంగా ఈ ప్రశ్నలకు రెండు రకాల సమాధానాలు వచ్చాయి వైదిక సంప్రదాయంలోని ఉపనిషత్తులలో ఆత్మ-పరమాత్మల చర్చ ముఖ్య విషయం కాగా ఈ కొత్త తాత్వికులు చాలా వరకు వాస్తవిక (భౌతిక) దృక్పధం గలవారు. ఉపనిషత్కారులు వైదిక కర్మకాండవల్ల ఫలం దక్కుతుందా లేదా అని చర్చించకుండ దాన్ని ఆధ్యాత్మికంగా వ్యాఖ్యానించే ప్రయత్నం చేసారు. ఈ కొత్త తాత్వికులు వైదిక కర్మకాండ వల్ల ఫలం దక్కుతుందని ఒప్పుకోలేదు. కర్మకాండను ఆధ్యాత్మికంగా వ్యాఖ్యానించలేదు యజ్ఞాలను వ్యతిరేకించారు. యజ్ఞాల సందర్భంలో జరిగిన అపారమయిన

జంతు బలుల పట్ల వీళ్ళ నిరసన చాలా తీవ్రమయింది అది అహింసా సిద్ధాంతానికి దారితీసింది జైనులు ఎక్కడి దాకా వెళ్ళారంటే సూక్ష్మజీవులను చంపడం గూడ పాపంగా భావించారు బౌద్ధం అంతటి 'అతి కి పోలేదుగాని అహింసను 'ఆర్య' మార్గంగా ప్రతిపాదించింది ఈ చారిత్రక దశనుండి మనకు మిగిలిపోయిన బలమైన తాత్విక ఆదర్శం అహింస.

యజ్ఞాలు నిష్ప్రయోజకరమనీ హానికరమనీ తిరస్కరించడం అంటే కేవలం బ్రాహ్మణులను వ్యతిరేకించడం కాదు. ఈ తిరస్కృతితో మొత్తం గణ సమాజ ప్రాపంచిక దృక్పధమే కుప్పకూలి పోతుంది ఇంద్రాది దేవుళ్ళు యజ్ఞ బలులను అందుకుంటారనీ, అందుకు ప్రతిఫలంగా సంపదనూ పశువులనూ నీటి వనరులనూ పుష్కలంగా అందిస్తారనీ అంతవరకు విశ్వసించారు ఇప్పుడు దాని స్థానంలో కొత్త ప్రాపంచిక దృక్పధం కావాలి క్రీ పూ 6వ శతాబ్దపు తాత్వికులలో కొందరు అసలు యజ్ఞఫలమే కాదు దేవుళ్ళు లేరనీ, మంచిచెడ్డలు లేవనీ ఆత్మ అనేది లేదనీ, మనిషి చనిపోయిన తరువాత (పాపపుణ్యాలతో ప్రమేయంలేకుండ) పంచభూతాలలో (గాలి, నీరు, భూమి, అగ్ని ఆకాశం) కలిసిపోతాడనీ, అన్నారు అయితే ఈ ఆదిమ (Primitive) భౌతిక వాదం కంటే ప్రబలంగా వచ్చింది కర్మ సిద్ధాంతం. వేదాలలో గానీ ఉపనిషత్తులలో గానీ కర్మ సిద్ధాంతం లేదు.[44] వేదాలలో 'కర్మలు' అంటే యజ్ఞాల సందర్భంలో ఆచరించే కార్యక్రమం అని అర్థం ఇప్పుడు కొత్తగా వేరే అర్థం వచ్చింది. కర్మలు అంటే గతంలో (బహుశా గత జన్మలో) చేసిన పనులు అనీ అవి భవిష్యత్ మంచి చెడులను నిర్ణయిస్తాయనీ కొత్త సిద్ధాంతం వచ్చింది. ఈ సిద్ధాంతం వ్యవసాయక సమాజంలోనే సాధ్యం అని కోశాంబి భావిస్తాడు మనం నేలలో నాటే విత్తనం మొలకెత్తి ఫలాన్ని యిస్తుంది ఈ అనుభవం నుండే, చేసిన పనులు 'పరిపక్వం' అయి ఫలితానికి దారితీస్తాయన్న సిద్ధాంతం పుడుతుంది.[45] (అసలు కర్మ 'పరిపక్వం' కావడం, 'ఫలం' ఇవ్వడం, అనే మాటలలోనే వ్యవసాయ సంబంధమైన ధ్వని వుంది). ఆహారాన్ని ఉత్పత్తి చేయక ఏరుకుని తినే వాళ్ళకు కర్మ సిద్ధాంతం స్ఫురించే అవకాశం లేదు

క్రీ. పూ. 6వ శతాబ్దంలో ముందుకొచ్చిన కొత్త ఆలోచనలన్నింటిలోనికీ బలంగా నిలిచిపోయినవి అహింసా కర్మ సిద్ధాంతాలు తరువాతి కాలంలో బ్రాహ్మణ మతానికి కీలకమయిన ఈ రెండు భావాలూ బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలలో పుట్టాయి. బౌద్ధంలో రెండూ చాలా ముఖ్యమైనవి పశుపోషణ స్థానంలో వ్యవసాయక వర్గసమాజం, ఆహార సేకరణ స్థానంలో ఆహారఉత్పత్తి, గణవ్యవస్థ స్థానంలో వర్గవ్యవస్థ, ఏర్పడ్డాయని రెండు భావాలూ సూచిస్తాయి. ఒక భూభాగాన్ని పశువులను మేపడం కోసం వినియోగించి ఆ పశు మాంసం తిని బ్రతకడం కంటే, అవే పశువుల సాయంతో నాగళ్ళనూ ఇనుప పని ముట్లనూ ఉపయోగించి వ్యవసాయేం చేస్తే పది రెట్లు జనాభాను పోషించవచ్చునన్న

భౌతిక వాస్తవాన్ని అహింసా సిద్ధాంతం ప్రతి ఫలించింది.[46] కర్మ సిద్ధాంతం గణవ్యవస్థ ప్రాపంచిక దృక్పథంలో తెచ్చిన మార్పు గూడ గణనీయమయినదే గణ వ్యవస్థలో గూడ పునర్జన్మ భావన వుంటుంది. ఒక వ్యక్తి చనిపోయిన తరువాత తన కుదురు చిహ్నమయిన జంతువుగా పుడతాడు కుదురు చిహ్నం పాము అయితే పాముగా పుడతాడు. ఇందులో మంచి చెడ్డల ప్రసక్తి లేదు, పాపపుణ్యాలతో నిమిత్తం లేదు ఒక కుదురు నుండి ఇంకొక కుదురుకు జీవితంలోనే కాదు, మరణానంతరం గూడ మారడం సాధ్యంకాదు. కర్మ సిద్ధాంతం ఇందుకు భిన్నంగా రాబోయే జన్మలో పొందబోయే జీవితం ఈ జన్మలో చేసిన పనులను బట్టి వుంటుందని చెప్పింది మంచి పనులు చేస్తే ఉన్నత జన్మ దక్కుతుంది చెడ్డ పనులు చేస్తే నీచ జన్మ దక్కుతుంది వ్యాపారస్తుడు ఎంత ఎక్కువ మూలధనం కూడబెడితే అంత ఎక్కువ లాభం పొంది నట్టు కర్షకుడు ఎంత జాగ్రత్తగా వ్యవసాయం చేస్తే అంత ఎక్కువ ఫలం పొంది నట్టు, రాబోయే జన్మలోని మంచి చెడులు మనం ఇప్పుడు చేసుకునే పనులను బట్టి వుంటాయి.[47]

ఈ రెండు భావాలూ కొత్త సమాజానికి ఎంతగా అతికాయంటే వాటిని బ్రాహ్మణులుగూడ కాదనలేక పోయారు. తమ మనుగడ కోసం వీటిని ఆమోదించారు. ఆటవికులను లొంగదీసుకుంటూ వాళ్ళ నాగు పామును శివుడి మెడలో వేసినట్టు, బౌద్ధాన్ని దేశం నుండి పారద్రోలుతూ బౌద్ధుల అహింసా కర్మ సిద్ధాంతాలను తాము స్వంతం చేసుకున్నారు. విస్తారంగా ప్రాచుర్యం పొందిన కృష్ణ పరమాత్మచేత ఈ రెండు సిద్ధాంతాలూ చెప్పించి (అవి తమ స్వంతం కావనీ అరువు తెచ్చుకున్నవనీ అనుమానం గూడ రానీయకుండ) ఆ ఉపదేశాన్ని భగవద్గీతగా మహా భారతంలోనికి ప్రవేశపెట్టారు బుద్ధుడు లేకపోతే భగవద్గీత సాధ్యం అయ్యేది కాదు. యజ్ఞ కాండకు వ్యతిరేకంగా పుట్టిన అహింసా సిద్ధాంతం ఈవిధంగా జనమేజయుడు నాగజాతిని హింసాత్మకంగా నాశనం చేయడానికి జరుపుతున్న యజ్ఞం సందర్భంలో వైశం పాయనుడు చెప్పిన కథలోనికి, హింసాకాండకు వెరస్తున్న అర్జునుడికి హింస చేయడం నీ ధర్మం అని కృష్ణుడు చేసే ఉపదేశంలో భాగంగా, ప్రవేశపెట్టబడింది [48]

అహింసా కర్మ సిద్ధాంతాలను ప్రతిపాదించడం మాత్రమే బుద్ధుడి పాత్ర అయివున్నా మనదేశ చరిత్రలో బుద్ధుడు అత్యంత ప్రముఖుడు అయి వుండేవాడు. అయితే బుద్ధుడు అక్కడితో ఆగిపోలేదు. పశుపోషణ నుండి వ్యవసాయానికి జరుగుతున్న అనాటి చారిత్రక పరిణామాన్ని బుద్ధుడు అన్ని కోణాల నుండి ప్రతిఫలించాడు.

బుద్ధుడు శక్యగణానికి చెందినవాడు. శక్యగణం ఉత్తరాపథం మీదవున్న గణా లలో ఒకటి. బుద్ధుడిని 'రాజకుమారుడు' అనడంలో అర్థం లేదు. శాక్యులలో అప్పటికి రాచరికం లేదు. గణ ముఖ్యుల సభ తమలో ఒకడిని తాత్కాలికంగా రాజుగా ఎన్నుకో వచ్చును. కాబట్టి బుద్ధుడు ఒక శాక్య ముఖ్యుడి కొడుకు. బుద్ధుడిలాగే, జైన మత

ప్రారంభకుడయిన మహావీరుడు లిచ్ఛావి గణానికి చెందినవాడు. గణ సమాజాలలో పుట్టిన ఈ యిద్దరూ తమ గణాలను వదిలి, గణ బంధాల్ని తెంచుకొని భిక్షువులయి, నూతన వ్యవసాయక వర్గ సమాజానికి అనుకూలమయిన సిద్ధాంతాలు చేయడం గమనించ దగ్గ విషయం అని కోశాంబి భావిస్తాడు. అంటే సమర్థవంతులయిన వ్యక్తులకు స్థానం కల్పించగల శక్తిని గణ వ్యవస్థ కోల్పోయింది [49] అది అవసాన దశలో వుంది

చరిత్రలో విప్లవాత్మక పరిణామాలెప్పుడూ బాధతోనూ సందిగ్ధంతోనూ కూడు కొని వుంటాయి. పైగా కొత్తగా వస్తూన్న సమాజం వర్గ సమాజం (అంటే దోపిడీమీద, అణచివేత మీద, ఆధారపడ్డ వ్యవస్థ) కావడంతో బాధకూ దుఃఖానికీ తావు ఎక్కువ ఉంటుంది. బుద్ధుడు ఈ బాధకూ కష్టాలకూ స్పందించాడు. వాటిని నివారించే మార్గం కోసం వెతికాడు అయితే నూతన సమాజాన్ని తిరస్కరించి వెనక్కి పోవాలని అనుకో లేదు. ఆ సమాజం పరిధిలోనే బాధలకు నివారణ మార్గాన్ని కనుక్కోవాలని ప్రయ త్నించాడు. అందువల్లనే నూతన వ్యవసాయక వర్గ సమాజ నిర్మాణానికి దోహదం చేయగల కొత్త ఆలోచనలను భావాలనూ తత్వాన్నీ ప్రవేశపెట్టగలిగాడు. నూతన సమాజాన్ని పూర్తిగా నెత్తికెత్తుకొని వుంటే బుద్ధుడిలో మానవత్వం లోపించి వుండేది. తిరోగామి దృక్పథంతో తిరస్కరించివుంటే చరిత్రలో ఏ ప్రాముఖ్యమూ లేకుండ పోయి వుండేవాడు. పురోగామి దృక్పథంతో తిరస్కరించడం అప్పటికి బుద్ధుడికి చారిత్రకంగా సాధ్యంకాదు [50] కొత్త సమాజాన్ని ఒక అనివార్యమైన విషయంగా ఆమోదిస్తూ ఆ సమాజంలోనూ ఆ సమాజం ఏర్పడే పరిణామ క్రమంలోనూ వున్న బాధనూ దుఃఖాన్నీ ఉపశమింపజేసి, ఈ 'నాగరిక' సమాజాన్ని నిజంగానే వీలయినంత నాగరికం చేసేందుకు బుద్ధుడు అన్వేషించాడు.

అన్వేషించిన పద్ధతి (ఆనాటి స్థాయికి) చాలా శాస్త్రీయమయినది. అన్ని సమస్య లకూ కారణాల్ని వెతకడం, ఆ కారణాల్ని అభావంచేసే మార్గాన్ని అర్థంచేసు కోవడం, బుద్ధుడి పద్ధతి [51] సంపదనూ సుఖాలనూ కోరుకోవడం దుఃఖానికీ బాధలకూ మూలం దుఃఖాన్ని జయించడానికి ఎనిమిది విధాల నియమబద్ధమయిన జీవితాన్ని గడపాలి. ఆ సూత్రాలను బట్టే సమాజంలో వచ్చిన మార్పుతెలుస్తుంది. దొంగతనం చేయకూడదు, ఇతరుల ఆస్తిని కాంక్షించగూడదు, అక్రమ లైంగిక సంబంధాలు పెట్టుకో కూడదు. సంపదలో స్వంత ఆస్తి, నియమబద్ధమైన లైంగిక ఆచారాలు (కుటుంబ వ్యవస్థ) లేకుంటే ఈ నియమాలకు అర్థం లేదు. గణ వ్యవస్థలో ఒక గణానికి చెందిన సంపద అందరి ఉమ్మడి ఆస్తి ఇతర గణాల సంపదను కోరుకోవడం, దొంగిలించడం, మనకార్యాలు ఇతర నియమాలు గూడ వ్యవసాయక వర్గ సమాజం అవసరాలను ప్రతిబింబిస్తాయి. అబద్ధాలు ఆడకూడదు, హింస కూడదు, స్వచ్ఛమైన, మార్గాన్ని అనుసరించాలి, సమాజానికి హాని కలిగించే రీతిలో ఆదాయం సంపాదించకూడదు, వగైరా. ఈవిధంగా నియమ బద్ధంగా జీవిస్తే అచిరకాలంలో కర్మఫలం పూర్తిఅయి

సంసార చక్రంనుండి విముక్తి లభిస్తుంది. అది నిర్వాణం. నిర్వాణం అంటే ఏమిటి అని బుద్ధుడు స్పష్టంగా చెప్పలేదు. తరువాతి కాలంలో నిర్వాణాన్ని వేదాంతులు మోక్షంతో పోటీపడే శూన్యస్థితిగా అర్థం చేసుకున్నారుగాని, బుద్ధుడు దేవుడిని గురించీ ఆత్మను గురించీ ఏరకమయిన 'ఆధ్యాత్మ' విషయాలను గురించీ అసలు మాట్లాడ లేదని గమనించాలి. బుద్ధుడు సామాజిక సమస్యలకు సామాజిక ఆచరణలో పరిష్కారం చూపాడు-అయితే ఆ పరిష్కారం కర్మసిద్ధాంతం చట్రానికి లోబడివుంది. కోశాంబి బుద్ధుడి నిర్వాణ భావనకు వేరే రకంగా అర్థం చెబుతాడు. ఆహారాన్ని సేకరించడం మానేసి, వ్యవసాయ ఉత్పత్తి చేసే వర్గ సమాజానికి పరిణామం చెందిన మానవులు తమ పాత గణ వ్యవస్థను ఒక అందమయిన జ్ఞాపకంగా మిగుల్చుకున్నారు. ఉత్తర భారతదేశంలో మొట్టమొదట రాచరికాన్ని స్థాపించిన గణాలలో ఒకటి కురు గణంకాగా, ఈ కురు ప్రజలలో ఒక శాఖ (ఉత్తర కురుగణం) గురించి ఒక అందమయిన పురాణం మిగిలిపోయింది. వీళ్లు వ్యవసాయక మైదానాలకు దిగిరాకుండ మేరు పర్వతం మీద ఆదర్శవంతమయిన జీవితం గడుపుతున్నారనీ, అక్కడ సేద్యం చేయాల్సిన అవసరం లేకుండ భూమి తనంతట తానే పుష్కలంగా ఫలం ఇస్తుందనీ (ఆహారాన్ని ఏరుకుని తినే వారికి ఇదే స్వర్గతుల్యం), మద మాత్సర్యాలూ అనారోగ్యం వుండవనీ ఈ పురాణం చెబుతుంది.[52] వర్గాలుగా విభజించబడి కష్టసాధ్యంగా ఆహారాన్ని ఉత్పత్తి చేస్తూ జీవించే వ్యవసాయకులు, గణ వ్యవస్థలోని తరతమ భేద రాహిత్యాన్నీ అనాయాసమయిన ఆహార సేకరణనూ అందమయిన కలగా గుర్తుంచుకున్నారు. ఆ స్థితికి తిరిగి పోవాలన్న కోరిక-అన్ని దేశాలలోనూ అన్ని సంస్కృతులలోనూ-వివిధ రూపాలలో పదేపదే వ్యక్తం అవుతుంది. గణ వ్యవస్థ విచ్ఛిన్నానికి దుఃఖించిన బుద్ధుడి నిర్వాణంలోని అభేద స్థితికి (undifferentiated state) ఈ కోరికే మూలమేమోనని కోశాంబి అంటాడు.[53]

వ్యవసాయక వర్గసమాజాన్ని బుద్ధుడు ఒక వాస్తవంగా అంగీకరించాడు. అయితే వర్ణవ్యవస్థను వ్యతిరేకించాడు. సమాజంలో వర్గ విభజనపట్ల బుద్ధుడు అభ్యంతరం తెలపలేదుగాని, ఎవరు ఏ వర్గానికి చెందుతారనేది జన్మరీత్యా నిర్ణయించే వర్ణ వ్యవస్థపట్ల అభ్యంతరం తెలిపాడు.[54] కోశాంబి ఒక ఉదాహరణ తరచుగా ఇస్తాడు. దేశ వాయువ్య ప్రాంతాన్ని ప్రస్తావిస్తూ, 'అక్కడ ఆర్యులు, దాసులు అని రెండే జాతులున్నాయంట. ఆర్యుడయినవాడు దాసుడు కావచ్చునంట, దాసుడయినవాడు ఆర్యుడు కావచ్చునంట, అని బుద్ధుడు అశ్వలాయనుడనే బ్రాహ్మణునితో వాదించినట్టు మధ్యమ నికాయం అనే బౌద్ధ గ్రంథంలో ఒక సన్నివేశం వర్ణించబడింది.[55]

బుద్ధుడు వైదిక కర్మకాండను వ్యతిరేకించడం, వర్ణవ్యవస్థను వ్యతిరేకించడం, ఒకే గాటన కట్టగలవి కావు. బుద్ధుడిని 'బ్రాహ్మణ వ్యతిరేకి'గా అర్థం చేసుకుంటే ఈ తేడా కనబడదు. వైదిక కర్మకాండ పశుపోషక గణ వ్యవస్థకు చెందింది. బుద్ధుడి

కాలానికి అది వ్యవసాయక సమాజం ఆవిర్భావానికి పెద్ద ప్రతిబంధకమయింది. దానిని బుద్ధుడు విజయవంతంగా విమర్శించాడు. కాని వర్ణవ్యవస్థ అటువంటిది కాదు. బుద్ధుడి సామాజిక చింతనకు ఏ వ్యవసాయక వర్గసమాజం ప్రాతిపదికగా వుండిందో అదే వ్యవసాయక వర్గసమాజానికి ఒక నిర్మాణ సూత్రంగా ముందుకొచ్చింది వర్ణవ్యవస్థ. దానిని జయించడం బుద్ధుడికి అంత సులభం కాదు. బుద్ధుడి కాలానికి వర్ణవ్యవస్థ నూతన వ్యవసాయక సమాజానికి ఇంకా ఏకైక నిర్మాణ సూత్రం కాదు. సమకాలిక సామాజిక ప్రముఖులనూ బౌద్ధ సాహిత్యంలో 'శెట్టి-గహపతి' వర్గాలగానూ సంస్కృత సాహిత్యంలో 'పౌర-జానపద' వర్గాలగానూ వర్ణించారేతప్ప కుల విభజనపరంగా పిలవలేదు. ఈ దశనుండి చాలా కాలందాకా బౌద్ధుల సామాజిక చింతన, బ్రాహ్మణుల వర్ణవ్యవస్థ, వ్యవసాయ వర్గసమాజ నిర్మాణ సూత్రాలుగా పోటీపడ్డాయి. వ్యవసాయ వర్గసమాజాన్ని ఆటవికులలోనికి ప్రవేశపెట్టడంలో పోటీ పడ్డాయి. రెండూ ఈక్రమం లోనే బలపడ్డాయి. చివరికి స్వయంపోషక గ్రామాలు ఏర్పడడంతో వర్ణవ్యవస్థ బౌద్ధాన్ని ఓడించగలిగింది. ఈ క్రమాన్ని తరువాతి **అధ్యాయాలలో చూద్దాం.** యజ్ఞ కర్మకాండను వదిలిపెట్టకుండ నూతన సమాజానికి అనుకూల నిర్మాణంగా వర్ణ వ్యవస్థను రూపొందించిన బ్రాహ్మణమతం, బౌద్ధం ధాటికి తట్టుకోలేక యజ్ఞ బలులను వదిలిపెట్టి, బౌద్ధం నుండి నూతన సమాజానికి అనుకూలమయిన లక్షణాలను స్వీక రించి, అంతిమంగా బౌద్ధాన్ని ఓడించి కుల విభజనే వ్యవసాయక వర్గసమాజానికి ఏకైక నిర్మాణ సూత్రంగా నిలబెట్టింది.

బుద్ధుడి దగ్గర సెలవు దీసుకొనేముందు మరికొన్ని విషయాలు చూడాలి. బౌద్ధ ధర్మం నూతన వ్యవసాయక వర్గ సమాజానికి అనుకూలమయిన సామాజిక నీతి అని పైన చూసాం. అయితే బుద్ధుడు తత్కాలానికి అవసరమయిన నీతిని ప్రతిపాదించ డంతో ఊరుకోక, నాగరిక సమాజం ఇంకా చాలా కాలానికి గానీ సాధించలేని కొన్ని విలువలను ప్రతిపాదించాడు. ఈ విలువలు అప్పటికి ఇంకా సుదూర భవిష్యత్తులో ఫలించబోయే బీజాలగా నూతన నాగరిక సమాజం గర్భంలో వున్నాయి. వాటిని ధర్మ సూత్రాలగా కాకున్నా కనీసం ఆదర్శాలగా చరిత్ర ముందుంచడం గొప్ప విషయమే. దీఘనికాయం అనే బౌద్ధ గ్రంథంలోని రెండు కథలను కోశాంబి ఇందుకు ఉదాహరణలగా చెబుతాడు.[58] ఒక కథలో ఒక పురోహితుడు రాజుతో, ప్రజలు సంపన్నులు కావాలన్నా, దొంగతనాలూ, దోపిడీలూ జరగకుండాలన్నా యజ్ఞాలు చేస్తే ఎంతమాత్రం ఉపయోగం లేదనీ రైతులకు విత్తనాలు, వర్తకులకు పెట్టుబడి, పనిచేయగల వాళ్ళందరికీ పని, కల్పిస్తే ఎవరిపనుల్లో వాళ్లు నిమగ్నులయి వుంటారని, తిరుగుబాట్లు అల్లరి వుండవని, అందరూ పన్నులు చెల్లిస్తారనీ ఖజానా నిండుగా వుంటుదనీ అంటాడు. మరొక కథలో నేరాలనూ దొంగతనాలనూ అరికట్టడానికి బల ప్రయోగం ఎంత నిరర్థకమో దానధర్మాలుకూడ అంతే నిరర్థకమనీ, నేరానికి మూలం

పేదరికమనీ బుద్ధుడు అంటాడు. ఉద్యోగులకు సక్రమంగా జీతాలిస్తే వాళ్ల లంచగొండ్లయి జనపదాలను పీడించకుండ ఉంటారని ఉద్బోధిస్తాడు.[57] యజ్ఞ బలులు ఇంకా సమసిపోని కాలంలో ఇంత నాగరికంగా ఆలోచించగలగడం అసాధారణమేనన్న కోశాంబి అభిప్రాయంతో ఏకీభవించక తప్పదు. కొత్తగా ఆవిర్భవించిన వర్గ సమాజానికి అనుకూలమయిన సామాజిక నీతిని ప్రతిపాదిస్తూ, అదేసమయంలో ఆ సమాజం ఇంకా చాలా కాలందాకా గుర్తించబోని ఆదర్శాలను బుద్ధుడు ప్రవేశపెట్టాడు. బ్రాహ్మణ మతం ఇందుకు భిన్నంగా వర్గసమాజానికి ఎప్పటికప్పుడు అవసరమయిన నిర్మాణ తాత్విక పరమయిన మార్పులను సమకూరుస్తూనే వచ్చింది. గానీ తత్కాల అవసరాలను మించిన ఆదర్శాలను ఎన్నడూ ప్రతిపాదించలేదు. బౌద్ధం, ఇస్లాం, క్రైస్తవం, ఆ పని చేసాయి. హైందవం తత్కాల సామాజిక వ్యవస్థాపరమైన అవసరాలను మించి మాట్లాడితే అది కైవల్యాన్ని గురించే తప్ప సామాజిక ఆదర్శాల గురించి కాదు.

## వివరణలు

1. ISIH, Page 127
2. అందుకేనేమో ఈ భృగువులు తమ ప్రాముఖ్యాన్ని ఎవ్వరూ ప్రశ్నించకుండ ఉండడం కోసం భగవద్గీతలో కృష్ణుడిచేత 'మహర్షులలో నేను భృగువును' అని చెప్పించారు.
   Social and Economic aspects of the Bhagavad-Gita, MR, Page 41, పాదసూచిక 7
3. ISIH, Page 104
4. The Autochthonous element in the Mahabharata, HS, Page 160
5. The Autochthonous element in the Mahabharata, HS, Pages 143-166. Social and Economic aspects of the Bhagavadgita, MR, Pages 12-41, CCAI, Pages 91-95, 114-120. ISIH, Pages 125-132. కోశాంబి మహాభారతానికి ఇంత ప్రాముఖ్యం ఇచ్చాడుగాని ఆయన రచనలలో రామాయణం ప్రస్తావన గూడ ఎక్కడా కనబడదు.
6. The Autochthonous element..., HS, Page 165
7. Social and Economic aspects of the Bhagavad-Gita, MR, Page 12-13
8. CCAI, Page 95
   The Autochthonous element..., HS, Page 163
9. The Autochthonous element..., HS, Page 156
10. The Autochthonous element..., HS, Pages 156-157
11. The Autochthonous element .., HS, Page 153-154
    ISIH, Page 126
12. The Autochthonous element..., HS, Page 154

13. CCAI, Page 116
14. Urvasi and Pururavas, MR, Page 57, Social and Economic aspects of the Bhagavad-Gita, MR, Page 25
15. CCAI, Page 117
16. ISIH, Page 142, పాదసూచిక 8
    · The Autochthonous element..., HS, Page 143
17. The Autochthonous element..., HS, Page 144
    CCAI, Pages 92-93
18. The Autochthonous element ..., HS, Page 165
19. మన దగ్గర హేతువాద ఉద్యమం ఫలితంగా ఇటువంటి జన్మ గాథలను అపహాస్యం చేయడం అలవాటు అయింది. అందులో తప్పు లేదుగాని, అభూత కల్పనలు ఈ రూపంలోనే ఎందుకుండాలో వివరించగలగాలి. అసహజ జన్మలున్న వాళ్ళంతా కుండలలోనూ చెరువులలోనూ నదులలోనూ ఎందుకు పుడతారు? వీళ్ళ జన్మ కారకులు ఎప్పుడూగూడ దేవుళ్లగానీ రుషులుగానీ ఎందుకవుతారు? కుండలో నీటి వనరులూ ఇప్పటికిగూడ అమ్మదేవతల పూజలలో ప్రముఖంగా ఎందుకున్నాయి? ఈ పూజలు బ్రాహ్మణుల వైదిక తంతుతో సంబంధంలేని లక్షణాలను ఎందుకు కలిగివున్నాయి? ఇవి ప్రధానంగా శూద్రకులాల పూజలగా ఎందుకున్నాయి? మౌఢ్యాన్ని మౌఢ్యంగా గుర్తిస్తే చాలదు. అది మౌఢ్యమే అయినప్పటికీ ఎందుకు నిలిచి పోయిందో వివరించ గలగాలి. వ్యవసాయక వర్గ సమాజం ఆటవికులను లోబరచుకొని అడవులను వ్యవసాయ యోగ్యం చేసి ఆటవికులను శూద్రులగానూ పంచములగానూ కలుపుకున్న క్రమంలో కలగా పులగంగా వచ్చి చేరిన ఆటవిక సంప్రదాయాలగా తప్ప ఈ అభూత కల్పనలను అర్థం చేసుకోలేము. ఆ విధంగా వివరించగలిగినప్పుడే ఇవన్నీ నిజమని నమ్మేవాళ్ళను కాదని ఒప్పించ గలుగుతాం. అపహాస్యం చేయడం వల్ల ఎవ్వరినీ ఒప్పించలేం.
20. CCAI, Page 93
21. క్రీ. పూ. 1000-600 కాలానికి చెందిన పురావస్తు అవశేషాలలో బూడిద రంగు కుండ పెంకులతో బాటు ఇనుప వస్తువులుగూడ దొరికాయని చెప్పాము. అయితే వీటిలో పనిముట్లకంటె ఆయుధాలు ఎక్కువ. Material culture and Social farmation in Ancient India, ఆర్. ఎస్. శర్మ, పేజీ 60
22. CCAI, Page 90
23. CCAI, Page 89
24. ISIH, Page 263
25. CCAI, Pages 136-137 లోని చిత్ర పటం
26. 'పదం' అంటే పాదం. 'జన' అనేది ప్రాచీన సంస్కృతంలో గణానికి లేక తెగకు వాడిన మాట. కాబట్టి జనపదం అంటే సంచార గణం లేక గణం సంచరించిన ప్రాంతం అన్న అర్థం స్పష్టంగానే వుంది. CCAI, పేజీ 122

27. ISIH, Page 149-153
28. విశ్వనాథ సత్యనారాయణ రాసిన 'పురాణవైర గ్రంథమాల' నుండి తెలుగులో ఇప్పటి దాకా వస్తున్న 'చారిత్రక నవలలు' చదవండి (ఓపిక వుంటే)
29. CCAI, Page 122
30. CCAI, Page 131
31. ISIH, Page 154, CCAI, Page 130
32. The Basis of Ancient Indian History, HS, Page 32
33. ISIH, Page 160
34. The Basis of Ancient Indian History Page 37
35. CCAI, Page 128
36. కురుక్షేత్ర యుద్ధమప్పుడు అర్జునుడి సందేహాలూ కృష్ణపరమాత్మ సమాధానాలూ ఈ సందిగ్ధాన్ని చక్కగా చూపిస్తాయి.
37. CCAI, Page 121
38. ISIH, Page 158
39. ISIH, Pages 161-162
40. CCAI, Page 101
41. ISIH, Page 153
42. CCAI, Page 105
43. CCAI, Pages 102-103
44. CCAI, Page 107
45. ISIH, Page 168
46. ISIH, Page 167
47. CCAI, Pages 107-108, ISIH Page 167
48. Social and Economic aspects of the Bhagavad Gita, MR, Pages 16-17
ISIH, Page 167
49. ISIH, Page 160
50. ISIH, Pages 170-171
51. ISIH, Page 171
52. ISIH, Page 125
The Autochthonous element...HS, Page 156
53. ISIH, Page 171
54. అందుకే మన అంబేద్కర్‌ను బౌద్ధమతం ఆకర్షించింది.
55. ఇక్కడ బుద్ధుడు గ్రీస్ దేశపు బానిసవ్యవస్థ గురించి చెప్తున్నాడని కోశాంబి భావించాడు. ISIH, పేజీ 169, On a Marxist approach to Indian chronology, HS పేజీ 85 అయితే తరువాత రాసిన ఒక వ్యాసంలో, బహుశా భారత ఉపఖండం వాయువ్య ప్రాంతంలో గ్రీసును పోలిన బానిసవ్యవస్థ ఏర్పడిందేమో అంటాడు. Combined Methods in Indology, HS, పేజీ 21.
56. ISIH, Page 170
57. CCAI, Page 113

# 6. ఉత్తరాపథం-దక్షిణాపథం

క్రీ. పూ. ఆరు-మూడు శతాబ్దాల మధ్యకాలం చరిత్రను ఇంకొంచెం వివరంగా తెలుసుకోవచ్చును.

ఇనుము వాడకం అలవర్చుకున్న వ్యవసాయక వర్గ సమాజం గంగా యమునా లోయలలో ఏ విధంగా ఆవిర్భవించి స్థిరపడిందీ పై అధ్యాయంలో చూసాము. ఇతోధికంగా ఇప్పుడు సాధ్యమయిన ఆహార ఉత్పత్తిలో చెప్పుకోదగ్గ భాగం కొద్ది మంది ధనికుల చేతిలో చేరి వర్తకపు వస్తువయింది. ఈ వర్తకం ఎక్కువగా పాలక వర్గాల విలాస వస్తువుల మారకం. ఉత్తరాపథం మీదుగా ఈ వర్తకం బీహార్ ప్రాంతాన్ని తక్షశిలకూ తద్వారా పడమటి దేశాలకూ కలిపింది. ఈ వ్యాపారం మగధ రాజుల కాలంలో ఉన్నత దశను చేరి, చివరి మగధ రాజవంశం అయిన మౌర్యుల కాలం నుండి క్రమంగా క్షీణించింది.

ఈ ఉత్తరాపథం వర్తకమే కాక, బీహార్ నుండి 'దక్షిణాపథం' మీదుగా దక్కన్‌కు వర్తకపు రాకపోకలు సాగాయి. అప్పటివరకు ఆటవిక ప్రాంతంగా వున్న దక్కన్ పీఠభూమి ఈ వర్తకం ఫలితంగా ఇనుము వాడకాన్నీ ఆహార ఉత్పత్తినీ అలవర్చుకుంది. అక్కడి ఆటవికులలో వర్గ విభజన ఏర్పడి వ్యవసాయ నాగరికత ప్రారంభమయింది. క్రీ. పూ. 600 ప్రాంతంలో గోదావరి లోయలో ప్రారంభమయిన ఈ పరిణామం ఆ లోయ వెంబడి పడమట మహారాష్ట్రకూ తూర్పున ఆంధ్రప్రాంతానికీ విస్తరించింది. గతంలో లాగ నాగరిక సమాజం అక్కడి ఆటవికులకు వ్యవసాయం అలవాటుచేసి వాళ్ళను తనకు లోబరచుకొని, వాళ్ళ ఆచారాలనూ పూజలనూ తనలో సంలీనం చేసుకుంటూ ముందుకు సాగింది. కొత్త దేవుళ్ళూ పూజలూ బ్రాహ్మణ మతంలోకి వచ్చి చేరాయి.

## ఉత్తరాపథం

మగధ రాజు అజాతశత్రువు కోసలను జయించిన తరువాత మగధ ఒక సామ్రాజ్యమై వాయువ్యాన పంజాబు నుండి తూర్పున బీహార్ దాకావున్న నాగరిక సమాజాలను చాలావరకు లొంగదీసుకుంది. వాయువ్య సరిహద్దు మీద వున్న గణాలు మాత్రమే మొదట్లో మగధకు లొంగలేదు. అలెగ్జాండర్ దండయాత్ర ఫలితంగా ఈ గణాలు బలహీనమయిన తరువాతే వాటిని లొంగదీసుకోవడం సాధ్యం అయింది. అది

చివరి మగధ రాజులయిన మౌర్యుల కాలంలో జరిగింది.

పెద్ద ఎత్తున విస్తరించిన మగధ సామ్రాజ్యంలో వర్తకం ప్రముఖ పాత్ర నిర్వహించింది. పాలకవర్గాలు సేకరించిన అదనపు ఉత్పత్తి వ్యాపార వస్తువయి వాళ్ళ విలాసాలకు ఉపయోగపడింది. మగధ నుండి ఉత్తరాపథం మీదుగా వాయువ్య దిశలో వున్న గాంధార రాజధాని అయిన తక్షశిలకు వస్తువులు ఎగుమతి అయ్యాయి. అక్కడి నుండి పడమటి ఆసియా, యూరప్, ప్రాంతాల వస్తువులు దిగుమతి అయ్యాయి. ఈ వ్యాపారానికి కేంద్రమయిన తక్షశిల మొదట్లో మగధ సామ్రాజ్యంలో భాగం కాదు. గాంధారకూ మగధకూ మధ్య పంజాబు ప్రాంతపు గణాలున్నాయి. వాటిని ఓడించి మగధలో కలుపుకున్నవాడు చంద్రగుప్త మౌర్యుడు. మౌర్యుల కాలం దాకా తక్షశిల మగధ నుండి స్వతంత్రంగానే వుంది. కొంత కాలం పర్షియా రాజ్యంలో భాగంగానూ కొంత కాలం స్వతంత్రంగానూ వుంది. ఈ స్వాతంత్ర్యమే తక్షశిలకు వ్యాపారంలో ప్రముఖ స్థానాన్ని కల్పించింది. ఈ స్థానాన్ని విశ్లేషించడం ద్వారా కోశాంబి మగధ కాలపు రాజకీయ ఆర్థిక చరిత్రనూ, ముఖ్యంగా మౌర్యులతో (క్రీ. పూ. 4వ శతాబ్దం తొలి సంవత్సరాలలో) వచ్చిన మార్పులను, చక్కగా వివరిస్తాడు.

ఈ విశ్లేషణకు ఆధారం తక్షశిలలో దొరికిన రెండు ప్రాచీన కాలపు నాణాల నిక్షేపాలు. ఈ నిక్షేపాలు 1924 తవ్వకాలలో బయట పడ్డాయి. ఇందులో అడుగున వున్న నిక్షేపం క్రీ.పూ. 317కు చెందిందని, రెండవ నిక్షేపం క్రీ. పూ 250కి చెందిందని, కోశాంబి నిర్ధారణ.[1] మౌర్య రాజవంశం క్రీ. పూ. 312లో అధికారానికి వచ్చింది కాబట్టి, మొదటి నిక్షేపంలోని నాణాలు మౌర్యులకు పూర్వపు మగధ కాలానికి చెందినవి, రెండవ నిక్షేపం మౌర్యుల కాలానికి చెందినవి. కాబట్టి ఈ రెండు నిక్షేపాలను శాస్త్రీయంగా అధ్యయనం చేస్తే మగధ రాజకీయార్థిక చరిత్రను అర్థంచేసుకోవచ్చును. తక్షశిలలోనే కాక కొన్ని ఇతర ప్రాంతాలలో లభ్యమయిన నాణాల నిక్షేపాలనుగూడ (మన రాష్ట్రంలోని అమరావతి, ఉత్తరప్రదేశ్ ఖేరి జిల్లాలోని పైలా, కర్నాటకలోని బోడే నాయకనూర్‌లలో దొరికినవి) కోశాంబి అధ్యయనంచేసి మగధ కాలపు చరిత్రను వివరిస్తాడు.

ప్రాచీన కాలపు నాణాలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఇంగ్లీష్‌లో న్యూమిస్మాటిక్స్ అంటారు. తెలుగులో పణశాస్త్రం అనవచ్చును. నాణాలను గణాంక శాస్త్రం సహాయంతో అధ్యయనంచేసే కొత్తపద్ధతిని (గణాంక పణశాస్త్రం లేక స్టాటిస్టికల్ న్యూ మిస్మాటిక్స్) కోశాంబి ప్రవేశ పెట్టాడు. తక్షశిల తదితర నిక్షేపాలను గణాంక పణ శాస్త్రం సహాయంతో విశ్లేషించి చాలా సమర్థంగా చారిత్రక చిత్రాన్ని ప్రతిపాదించాడు. తన విశ్లేషణను ప్రామాణికంగా వివరించే వ్యాసం **The study and Metrology of silver punch-marked coins** అని కోశాంబి భావించాడు.[2] అయితే ఈ వ్యాసం రాసిన పద్ధతి సులభంగా అర్థమయ్యేది కాదు. గణాంక శాస్త్రం

నుండి సంస్కృత పదాల విశ్లేషణ దాకా అన్నీ కలగాపులగంగా కలిసిపోయిన వ్యాసం యిది. పైగా సామాన్య పాఠకుడికి సులభంగా అందుబాట్లో లేని ఇతర పణశాస్త్ర వేత్తల అభిప్రాయాలను వివాదాత్మకంగా (**polemical** గా) పూర్వపక్షం చేయడం ఈ వ్యాసం యొక్క ప్రముఖ ఉద్దేశ్యం కావడం వల్ల అర్థం కావడం మరింత కష్టం. కోశాంబి అవలంబించిన పణశాస్త్ర అధ్యయన పద్ధతిని సులభగ్రాహ్యంగా వివరించే వ్యాసాలు: **The chronological order of Punch-marked coins-I, II, III.** పణశాస్త్రం మీద కోశాంబి రాసిన అన్ని వ్యాసాలు **Indian Numisuratics** అన్న పేరుతో సంకలనం చేయబడ్డాయి. అందులో ఈ మూడు వ్యాసాలూ 8,9,10 అధ్యాయాలగా వున్నాయి.

మన దేశంలో ఇనుము వాడకం, ఇనుము సహాయంతో చేసే ఆహార ఉత్పత్తి ఆర్యులతో వచ్చాయి గాని వ్యాపార సంప్రదాయం మాత్రం సింధూ నాగరికత కాలం నుండి అవిచ్ఛిన్నంగా వచ్చిందని కోశాంబి అభిప్రాయం. సింధూ నాగరికత ప్రధానంగా వర్తక నాగరికత. సింధూ నాగరికతలో రాజులు లేరు, ఆర్భాటమయిన దేవాలయాలు లేవు, కాని వ్యాపారస్తుల నిక్షేపాలు మాత్రం పురావస్తు తవ్వకాలలో అధిక పరిమాణంలో బయట పడ్డాయి. ఆయుధాలు ఎంత మొరటయినవో నాణాల తూకాల ప్రమాణాలు అంత సున్నితమయినవి. సింధూ నాగరికత నాశనమయిన తరువాత గూడ ఈ వర్తక సంప్రదాయం నిలిచింది, కొనసాగింది.[3] ఆర్యులు రుగ్వేదంలో తమకు శత్రువులుగా చెప్పిన సంపన్నులయిన 'పణులు' ఈ వర్తకులే నన్న కోశాంబి అభిప్రాయాన్ని రెండవ అధ్యాయంలో చూసాం. ఈ 'పణి' అన్న పేరు నుండే సంపదకు పణ్యం అనీ నాణాలకు పణములు అనీ వ్యాపారస్తులకు వణిక్ అనీ పేర్లు వచ్చాయి. మొహెంజొదారోలో నాణాలే కాక, నాణాల ప్రామాణికతను కొలిచే తూకపు రాళ్ళు గూడ దొరికాయి. తక్షశిలలో దొరికిన (మగధ కాలానికి చెందిన) నాణాల నిక్షేపాలు సగటున సరిగ్గా ఇదే తూకానికి వున్నాయి. వ్యాపార సంప్రదాయం తనతూకపు ప్రమాణాలను గూడ వదిలి పెట్టకుండా అవిచ్ఛిన్నంగా కొనసాగిందని దీనిని బట్టి కోశాంబి అర్థం చేసుకుంటాడు. మొదట్లో వ్యవసాయంగానీ తదనుబంధమయిన వ్యాపారంగానీ తెలియని ఆర్యులు ఇనుము సహాయంతో వ్యవసాయం చేయడం అలవర్చుకొని వ్యాపారాన్ని చేబట్టినప్పుడు పాత (సింధూ) సంప్రదాయాన్నే కొనసాగించారు. ఆర్యులు 'స్వచ్ఛంగా' ఎన్నడూ ఉండ లేదని ఆర్యేతరులనుకలుపుకుంటూ పోయారనీ గుర్తుంచుకుంటే ఇందులో ఆశ్చర్యం ఎంత మాత్రం వుండదు.

వర్తక సంప్రదాయం అదే ఆయినా, ఈ వర్తకం భిన్నమయిన సామాజిక వ్యవస్థలో సాగుతోంది. మొహెంజొదారో రాజులూ రాచరికాలూ లేని సమాజం కాగా, మగధ కాలానికి వర్తకం రాచరిక వ్యవస్థలో భాగంగా సాగుతోంది. మౌర్య రాజ వంశం వచ్చే సరికి ఈ రాచరిక వ్యవస్థ బాగా బలపడి దేశంలో చాలా భూభాగాన్నే

కాక సమాజ వ్యవహారాలన్నింటినీ తనకు లోబరచుకుంది. ఈ మూడు దశలకు గల తేడా పణ శాస్త్ర అధ్యయనంలో బయట పడుతుంది. మొహెంజొదారో నాణాల మీద రాజుల రాజవంశాల ముద్రలు గానీ చిహ్నాలు గానీ లేవు. వ్యాపారస్తులే ఒక నియమిత ప్రమాణాన్ని అనుసరించి నాణాలను తయారుచేసారు. మగధ కాలానికి పరిస్థితి మారింది. భారతదేశ చరిత్రలో మొట్ట మొదటిగా రాజులూ రాజవంశాలూ వచ్చాయి. ఇప్పుడు వర్తకులు కాక రాజులే నాణాలు ముద్రవేయించారు. తక్షశిలలో దొరికిన మొదటి నిక్షేపంలోని అన్ని నాణాలకూ రెండు వైపులా ముద్రలు ఉన్నాయి. ముందు భాగంలో వున్న ముద్రలు ఆ నాణాలను ముద్రించిన రాజునూ అతని వంశాన్నీ సూచిస్తాయి. తక్షశిలకు ఈ నాణాలు వర్తకంలో భాగంగా చేరాయి. అక్కడి వ్యాపారస్తులు ఈ నాణాలను కొన్ని సంవత్సరాలకు ఒకసారి తూకం వేసి తూకం సరిగ్గా వున్న పక్షంలో ఆ విషయాన్ని సూచిస్తూ వెనుక భాగంలో ముద్రవేసారు. ఈ విధంగా మగధ కాలానికి చెందిన మొదటి తక్షశిల నిక్షేపంలో అన్ని నాణాలకూ ముందు వైపున ముద్రించిన రాజవంశం చిహ్నం ఉండగా, వెనుక వైపున ప్రామాణికతను సూచిస్తూ ఒకటి గానీ అంతకంటే ఎక్కువగానీ ముద్రలున్నాయి. తక్షశిలలో దొరికిన రెండవ నిక్షేపానికి వచ్చేసరికి (అంటే మౌర్యుల కాలానికి) ముందు భాగం లోని రాజవంశం చిహ్నం వుందిగానీ వెనుక భాగంలో ముద్రలు లేవు. ఇప్పుడు తక్షశిల స్వతంత్ర ప్రాంతం కాదు. అక్కడికి చేరిన మగధ నాణాలు 'విదేశీ' నాణాలు కావు. వాటి ప్రామాణికతకు స్థానిక వర్తకులు గానీ పరిపాలకులు గానీ హామీ ఇయ్యనవసరం లేదు. ఇప్పుడు తక్షశిల (మొత్తం పంజాబు ప్రాంతంతో బాటు) మౌర్యసామ్రాజ్యంలో భాగమే. రాజవంశం ముద్రవున్న నాణాలన్నీ (తూకంలో ప్రామాణికత వున్నా లేకున్నా) అక్కడ చలామణి అవుతాయి.

తక్షశిల నిక్షేపాలు రెండింటినీ వివరంగా అధ్యయనం చేసి, ముందు భాగాన వున్న రాజవంశం ముద్రలనూ వెనుక వైపున వున్న పూచీ ముద్రలనూ విశ్లేషించి, తద్వారా కోశాంబి మగధ రాజవంశాల చరిత్రను నిరూపించగలుగుతాడు. బ్రాహ్మణ పురాణాలలోనూ బౌద్ధ జైన తదితర బ్రాహ్మణేతర సాహిత్యంలోనూ ఈ రాజవంశాల పట్టికలున్నాయి. అవి పరస్పరం అన్ని విషయాలలోనూ ఏకీభవించవు. ఒకే రాజుకు ఒక్కొక్క సంప్రదాయంలో ఒక పేరుంటుంది. ఒక సంప్రదాయంలో పేర్కొన్న రాజులు కొందరు మరొక సంప్రదాయంలో వుండరు.[4] కొందరు బ్రాహ్మణ పురాణాలలో రాజులయితే బౌద్ధ సంప్రదాయంలో రాక్షసులు![5] కాబట్టి రాజవంశాల అనుక్రమణికను నిర్దుష్టంగా తెలుసుకోవడం కష్ట సాధ్యమే. ఈ అనుక్రమణికను నిర్ణయించడం కోసం కోశాంబి నాణాల మీది ముద్రల విశ్లేషణను చాలా సృజనాత్మకంగా ప్రయోగిస్తాడు.[6]

ఇక్కడ ముఖ్యమైన విషయం ఏమిటంటే నాణాలన్నీ ఒకే తూకపు ప్రమాణానికి వేసినా అవి కాల క్రమంలో నెమ్మదిగా అరిగిపోతాయి. ఒక నిక్షేపంలోని నాణాలతో,

ఎక్కువగా అరిగిపోయిన వాటిని పాత నాణాలగా గుర్తించవచ్చును. నాణాల మీది ముద్రలను బట్టి అవి ఏ రాజు ముద్రించినవో తెలుసుకుంటే తద్వారా రాజుల, రాజ వంశాల, అనుక్రమణికను తెలుసుకోవచ్చును. ఎక్కువగా అరిగిపోయిన నాణాలను ముద్రించిన రాజులు పూర్వులు, తక్కువగా అరిగిన వాటిని ముద్రించిన వాళ్లు తద నంతరులు.

ఈ పద్ధతిని ప్రయోగించడంలో రెండు ఇబ్బందులున్నాయి. ఒకటి, ఎంత ఖచ్చితమయిన తూకపు ప్రమాణాలను బట్టి ముద్రించినా, నాణాలన్నీ ఒకే బరువు కలిగి వుండవు. ఆధునిక టంకశాలలలో ముద్రించిన నాణాలు సహితం ఖచ్చితంగా ఒకే బరువు కలిగివుండవు. కొద్ది హెచ్చు తగ్గులుంటాయి. అయితే నాణాలను అధిక సంఖ్యలో తీసుకొని సగటు బరువు తూకం వేస్తే అది ప్రమాణానికి చాలా సన్నిహితంగా వుంటుంది. కాబట్టి, ఈ మొదటి ఇబ్బందిని అధిగమించాలంటే ఒక రాజు వేసిన ఒక నాణాన్ని విడిగా తూచకుండ, ఒక రాజువేసిన నాణాలు (దొరికినన్ని) మొత్తంగా తూచి సగటు బరువును విశ్లేషణకు ఉపయోగించాలి. ఈ రకమయిన సగటు బరువుల విశ్లేషణ చేయడానికి గణాంక శాస్త్రం సహాయం కావాలి. అందుకోసమే కోశాంబి పణశాస్త్ర అధ్యయనంలో గణాంక శాస్త్రాన్ని ఉపయోగించాడు.

రెండవది, మధ్యయుగాల రాజుల లాగ ప్రాచీన కాలపురాజులు తాము ముద్రించిన నాణాల మీద తమ బొమ్మలుగానీ పేర్లుగానీ వేయించలేదు. తక్షశిల నిక్షేపాలలోని నాణాల ముందు భాగంలో చెట్లు, జంతువులు, తదితర చిహ్నాల ముద్ర లున్నాయి. వీటినుండి ఆ నాణాలను ముద్రించిన రాజవంశం ఏది అయిందీ రాజు ఎవరు అయిందీ నిర్ధారించాలి. దీనికి గణాంక శాస్త్రం పనికిరాదు. జంతుతదితర చిహ్నాలలో కుదురు సంకేతాలను గుర్తించడం, సంస్కృత పాళీ భాషల పదాల మూలాలను విశ్లేషించడం, అవసరం. అందుకే కోశాంబి రాసిన పణ శాస్త్ర సంబంధ మయిన వ్యాసాలు అంత కలగా పులగంగా-కొంత గణాంక శాస్త్రం, కొంత పురాణ చర్చ, కొంత పాళీ సంప్రదాయ విశ్లేషణ-వుండి చదవడానికి క్లిష్టంగా వుంటాయి. ఇక్కడ కోశాంబి విశ్లేషణ సారాంశాన్ని క్లుప్తంగా ఇస్తాను.

ఈ విశ్లేషణకు వెండి నాణాలు మాత్రమే పనికి వస్తాయి. బంగారు నాణాలు మారకం కోసం కాక సంపదను దాచుకోవడానికి ఎక్కువగా ఉపయోగిస్తారు. కాబట్టి వాటిలో అరుగుదల అంతగా వుండదు. అంటే అవి చరిత్ర క్రమాన్ని సూచించవు. రాగి తదితర చవక నాణాల ముద్రణలో ప్రామాణికత వుండదు.[7] వెండి నాణాలు మాత్రమే ఉభయత్రా యోగ్యమైనవి. మొహెంజొదారో కాలం నుండి మౌర్యుల కాలం దాకా వెండినాణాలు ఒకే ప్రమాణానికి ముద్రించారు. వీటిని కార్షాపణములు అన్నారు. వీటి ప్రామాణిక మయిన తూకం 3.42 గ్రాములు అయివుంటుందని కోశాంబి అంచనా.[8]

నిక్షేపాలలో దొరికిన ప్రతీ వెండి నాణానికి ముందు భాగాన అయిదు ముద్ర లుంటాయి. వీటిలో మొదటిది (అన్నింటిలోనూ) సూర్యుని బొమ్మ. ఇది - అన్నిటికి సామాన్యం కాబట్టి దీనినుండి మనం తెలుసుకునేది ఏమీ వుండదు. రెండవది ఆరు ఊచలు (Spokes) వున్న చక్రం. కోశాంబి దీనిని షడర చక్రం అంటాడు. ఈ షడర చక్రం ఊచల చివర రకరకాల సంకేతాలుంటాయి. అవి ఆ నాణాన్ని ముద్ర వేసిన రాజవంశాన్ని సూచిస్తాయి. ఉదాహరణకు, రెండవ తక్షశిల నాణాల నిక్షేపం లోని అన్ని నాణాలూ ఒకే షడర చక్రాన్ని కలిగివున్నాయి. అది మౌర్య రాజవంశం షడర చక్రం. ఆ నిక్షేపంలోని అన్ని నాణాలూ ఒకే రాజవంశం (మౌర్య రాజ వంశం) చేత ముద్రించబడినవి. మూడవ ముద్రగూడ రాజవంశాన్ని సూచిస్తుంది. ఈ ముద్రలో సాధారణంగా మూడు లేక అయిదు తోరణాలు (arches) ఉంటాయి. వాటి మీద ఒక బొమ్మ ఉంటుంది. తోరణాలు స్వర్గాన్ని లేక ఆకాశాన్ని సూచిస్తాయి. కాబట్టి తోరణాల మీది బొమ్మ ఆ రాజవంశం దేనినుండి 'దిగివచ్చిందో' సూచిస్తుంది.[9] ఉదాహరణకు పురాణాలలో మౌర్యులది 'చంద్రవంశం' అన్నారు. అందుకు తగ్గట్టుగా రెండవ తక్షశిల నిక్షేపంలోని అన్ని నాణాలలోనూ మూడవ ముద్రలో మూడు తోరణాలూ ఆ తోరణాల మీద అర్ధ చంద్రాకారం వున్నాయి. కాబట్టి మూడవ ముద్ర గూడ రెండవ ముద్రలాగే రాజవంశాన్ని సూచిస్తుంది.

నాలుగవ ముద్ర రాజు యొక్క స్వంత ముద్ర. దానికి అతని పేరుతో ఏమయినా సంబంధం వుందేమో తెలియదు. అయిదవ ముద్ర - మారుతూ వుంటుంది. అది టంకశాల అధిపతిది కావచ్చుననీ లేకపోతే యువరాజుది కావచ్చుననీ కోశాంబి భావిస్తాడు. ఒక్కొక్కసారి ఒక గుంపు నాణాలలో అయిదవ ముద్రగా వున్నది తరువాతి గుంపు నాణాలలో నాల్గవ ముద్రగా కనబడుతుంది. అంటే తొలుత యువ రాజుగా వున్న వ్యక్తి తరువాత రాజయ్యాడని అర్థం. ఉదాహరణకు మౌర్య చక్రవర్తి అశోకుడి స్వంత ముద్ర అయిన నాలుగవ ముద్ర అతని తండ్రి బిందు సారుడి నాణాలలో అయిదవ ముద్రగా కనబడుతుంది.[10]

ఈ విధంగా ఒక నాణాల నిక్షేపంలోని వివిధ నాణాలలో ఏవేవి ఒకే రాజు కాలంలో ముద్రించబడ్డాయో ముందు భాగంలోని అయిదు ముద్రలను బట్టి గుర్తించ వచ్చును. ఒకే రాజుచేత ముద్రించబడిన నాణాలన్నీ ఒక చోట చేర్చి, ఎంతమంది రాజులు పరిపాలించారో అన్ని నాణాల కుప్పలు చేయవచ్చును. ఇప్పుడు ఈ కుప్పలను కాలక్రమానుసారంగా అమర్చాలి. దానికి ఒక పద్ధతి, వాటి సగటు బరువు తూకం వేయడం. సగటు బరువు తక్కువగా వున్న కుప్పలు పూర్వపువి, ఎక్కువగా వున్నవి తదనంతర కాలానివి.

కాలక్రమాన్ని గుర్తించడానికి వేరొక పద్ధతి గూడ వుంది. మొదటి తక్షశిల నిక్షేపంలోని నాణాలకు ముందు భాగంలోని అయిదు ముద్రలే కాక వెనుక భాగంలో

ఒకటి నుండి 20 దాకా ముద్రలున్నాయి. ఈ ముద్రలు బొమ్మలు కావు, కేవలం 'చెక్' చేసినట్టు సూచించే గుర్తులు మాత్రమే. దీని అర్థమేమిటో పైన చెప్పాము. తొలినాడు తక్షశిల స్వతంత్రంగా వుంది. మగధనుండి వ్యాపార రీత్యా తక్షశిలను చేరిన నాణాలను తరచుగా తూకం వేసి మరీ ఎక్కువగా అరిగిపోని వాటిని మాత్రమే చలామణికి ఒప్పుకున్నారు. ఈ తూకానికి చిహ్నంగా వెనుక భాగంలో ముద్రలు వేసారు. ఈ విధంగా 12 సంవత్సరాల కొకసారి తూకం వేసారని కోశాంబి ఊహిస్తాడు.[11] ఒక నాణెం మీద వెనుక భాగాన ఎన్ని ముద్రలుంటే అది అంత పాతదని అర్థం. ఈ విధంగా, వెనుక భాగానవున్న పూచీ ముద్రల సంఖ్యను బట్టి గూడ ఏ కుప్ప పాతదో ఏది తరువాతిదో తెలుస్తుంది. ఈ రెండు పద్ధతుల ద్వారా చేసే కాలక్రమ నిర్ణయం ఒకే నిర్ధారణకు దారితీస్తుందని కోశాంబి గణాంక శాస్త్రపద్ధతుల ద్వారా నిర్ద్వంద్వంగా నిరూపిస్తాడు.[12]

ఈ రకంగా ఒక నిక్షేపంలో దొరికిన నాణాలను కాలక్రమాను సారంగా అమర్చవచ్చును. ఇప్పుడు వాటి సహాయంతో ఆకాలపు రాజకీయ, ఆర్థిక చరిత్ర తెలుసుకో వచ్చును. ముందు భాగంలోని నాలుగవ ముద్ర మారితే రాజుమారినట్టు. మూడవ ముద్ర మారితే రాజవంశం మారినట్టు. ఈ మార్పు శాంతియుతంగా కాక హింసాత్మకంగా జరిగితే అప్పుడు పాత ముద్రల మీదనే బలవంతంగా కొత్త ముద్రలు వేసినట్టు కనబడుతుంది.

ఈ పద్ధతిని కోశాంబి తక్షశిలలో దొరికిన రెండు నాణాల నిక్షేపాలకూ అన్వయిస్తాడు. మగధ రాజవంశాల గురించి బ్రాహ్మణ బౌద్ధ జైన సంప్రదాయాలు విభేదిస్తాయి. బ్రాహ్మణ సంప్రదాయం ప్రకారం మగధను పరిపాలించిన తొలి రాజవంశం శిశునాగవంశం. ఇందులో చరిత్రకు తెలిసిన మొదటి రాజు బింబిసారుడు, అతని కొడుకు అజాత శత్రువు. బౌద్ధ సంప్రదాయం దీనితో విభేదిస్తుంది. బౌద్ధ సంప్రదాయం ప్రకారం బింబిసారుడు అజాత శత్రువుల తరువాత అయిదవ రాజును శిశునాగుడు అనే అమాత్యుడు ఒక తిరుగుబాటు ద్వారా అధికారం నుండి తొలగించి తాను రాజవుతాడు. శిశునాగవంశం అప్పటి నుండి ప్రారంభం అవుతుంది, బింబిసారుడితో కాదు.[13] తక్షశిలలో దొరికిన మొదటి నిక్షేపం బౌద్ధ సంప్రదాయాన్నే సమర్థిస్తుంది. ఆ నిక్షేపంలో అత్యంత ప్రాచీనమయిన నాణాలలోని మూడవ ముద్ర (రాజవంశం కుదురును లేక పూర్వీకులను సూచించేది) ఒక కొమ్ము గల జంతువు. జైన సంప్రదాయంలో అజాత శత్రువును 'కూణీకుడు' అన్నారు. కూణీకము అంటే సంస్కృతంలో జంతువు కొమ్మని అర్థం.[14] ఆ తరువాతి నాణాలన్నీ ఇందుకు భిన్నంగా వున్నాయి. వీటిలో ఆ స్థానంలో అయిదు తోరణాల మీద ఒక జంతువు పిల్ల ('శిశువు') చిహ్నం వుంది. ఈ చిహ్నం 'శిశునాగ' వంశాన్ని సూచిస్తుందనుకుంటే, బింబిసారుడితో ప్రారంభమయింది వేరే రాజ వంశమనీ, శిశునాగ రాజవంశం మధ్యలో వచ్చిందనీ అర్థం అవుతుంది. పైగా ఈ 'శిశువు' చిహ్నం వున్న నాణాలు తత్పూర్వపు నాణాల మీద బలవంతంగా ముద్రించ

బడి వుండడం గూడ[15] బౌద్ధం సంప్రదాయంలో చెప్పినట్లు తిరుగు బాటు ద్వారా (హింసాత్మకంగా) రాజవంశం మారిందని సూచిస్తుంది.

బ్రాహ్మణ సంప్రదాయం ప్రకారం శిశునాగ రాజ వంశం చివరివాడయిన నంది (లేక మహానంది)ని మహాపద్మ నందుడనే తక్కువ కులానికి చెందిన వ్యక్తి కూలదోసి నందరాజ వంశాన్ని స్థాపిస్తాడు. అతనితో కలిపి మొత్తం తొమ్మిది మంది నందులు (నవనందులు) పరిపాలిస్తారు. తక్షశిల మొదటి నిక్షేపాన్ని బట్టి చూస్తే 'శిశువు' చిహ్నాన్ని మూడవ ముద్రగా గల నాణాల తరువాత, ఎటువంటి బలప్రయోగ చిహ్నాలూ లేకుండ, అయిదు తోరణాల మీద ఎద్దు (నంది) చిహ్నం గల నాణాలు వస్తాయి. అంటే శిశు నాగవంశం చివరి దశలో కొందరు రాజులు (రాజవంశంలో మార్పులేకుండ) నందిని తమ వంశాంకురంగా ప్రకటించుకున్నారని అర్థం. అయితే ఈ 'నంది' వంశ రాజులను ఓడించిన 'నవనందులు' తొమ్మిది మంది కావడానికి ఆస్కారం లేదు. 'నంది' రాజు తరువాత ఒక్క రాజు మాత్రమే వున్నాడు. అతని తరువాత మౌర్యచంద్ర గుప్తుడి నాణాలున్నాయి. కాబట్టి 'నవనంది' అంటే తొమ్మిది మంది నందులు అని కాక కొత్తనందుడు అని అర్థం చేసుకోవాలి. శిశునాగవంశం చివరి రాజులు తమ్మకాము 'నంది' వంశం రాజులగా ప్రకటించుకోగా, వాళ్ళను ఓడించిన మహా పద్మనందుడు నవనందుడు (కొత్త నందుడు) అయ్యాడు. ఆసక్తి కరమయిన విషయం ఏమిటంటే జైన సంప్రదాయంలో నవనందుడు అంటే కొత్త నందుడనే అర్థం.[16] సారాంశంలో, మగధ రాజవంశాల చరిత్ర గురించి బ్రాహ్మణ పురాణాలకంటే బౌద్ధ జైన సంప్రదాయాలు విశ్వసనీయమయినవి. మగధ రాజులయిన శిశునాగులు వైదికేతర మతాలను ఆదరించారని పురాణాలు వాళ్ళను హీనంగా చూసాయి.[17] కాబట్టి ఆ రాజవంశం గురించి పురాణాలలో చెప్పిన విషయాలు విశ్వస నీయం కాక పోవడంలో వింత లేదు.

రాజవంశాల చరిత్రేకాక ఆర్థిక చరిత్ర గూడ పణశాస్త్ర అధ్యయనం ద్వారా తెలుసుకోవచ్చును. తక్షశిల మొదటి నిక్షేపంలో దొరికిన 1175 నాణాలలో 1059 మగధ నాణాలే. తక్షశిలకు చెందిన నాణాలు చాలా తక్కువ. తక్షశిల ఆ కాలంలో తరచుగా పర్షియా రాజ్యంలో భాగంగా వున్నప్పటికీ పర్షియా నాణాలుగూడ చాలా తక్కువగానే వున్నాయి. అంటే తక్షశిల రాజకీయంగా పర్షియాలో భాగమయినా గూడ ఆర్థికంగా మగధ ప్రభావంలోనే వుందని అర్థమవుతుంది.[18] తక్షశిలలో దొరికిన నాణాలలో మగధకు చెందినవి ఇంత ఎక్కువగా వున్నాయంటే దాని అర్థం, తక్షశిల మగధల వ్యాపారంలో వర్తకపు మిగులు తక్షశిల వైపే వుందని. మగధకు ఎగుమతి అవుతున్న సరుకులకు మారుగా సరుకులుకాక తక్షశిలకు నాణాలు దిగుమతి అవు తున్నాయి. గణాంక శాస్త్ర పద్ధతుల ద్వారా ఈ పరిస్థితి ఒక 200 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా సాగిందని కోశాంబి నిరూపిస్తాడు.[19] ఇది తక్షశిల చరిత్రలో అత్యు

న్నత దశ.

తక్షశిలలో దొరికిన రెండవ నిక్షేపం (మౌర్యుల కాలానికి చెందినది) మొదటి నిక్షేపం కంటే రెండు రకాలుగా భిన్నంగా వుంది. వీటిలోని రాజవంశం ముద్రలలో మార్పులేదు. అన్ని నాణాలలోని ముందు వైపున్న ముద్రలలోనూ ఒకే షడర చక్రం వుంది. మూడవ స్థానంలో మూడు తోరణాల మీద అర్ధ చంద్రాకార చిహ్నం (చంద్ర వంశాన్ని సూచించేది) వుంది. అయితే వెనుక వైపున మొదటి నిక్షేపం నాణాలలాగ పూచీ ముద్రలు లేవు. ఒకే ఒక ముద్రవుంది. దీని భావం ఇదివరకే వివరించాము. ఇప్పుడు తక్షశిల మౌర్య సామ్రాజ్యంలో భాగం కాబట్టి, తక్షశిలకు చేరిన నాణాల ప్రామాణికతకు పూచీ ముద్రలు వేసే ప్రసక్తిలేదు. కేవలం స్థానిక అధికారి తన ముద్రవేసి చలామణికి విడుదల చేస్తాడు.

రెండవ తేడా ఏమిటంటే మౌర్య నిక్షేపం నాణాలు తొలి నిక్షేపమంత స్వచ్ఛమైనవీ కావు, అంత ప్రామాణికంగా అచ్చువేసినవీ కావు. మొదటి నిక్షేపం కంటే వీటిలో రాగి కల్తీ ఎక్కువ. పైగా, నాణాల తూకంలో వైవిధ్యం ఎక్కువ. అజాగ్రత్తగా అసమర్థంగా వేసినట్లున్నాయి.[20] దీనిని బట్టి, మౌర్యుల కాలానికి వచ్చిన రెండు ఆర్థిక పరిణామాలను కోశాంబి గ్రహిస్తాడు. ఒకటి, సామ్రాజ్య విస్తరణతోబాటు వర్తకం బాగా విస్తరించింది. అంతకు ముందు ఉత్తరాపథానికి పరిమితమయిన వర్తకం ఇప్పుడు దక్షిణానికిగూడ వ్యాపించింది. ఉదాహరణకు, ఉత్తర భారత దేశంలో దొరికిన అన్ని నాణాల నిక్షేపాలలోనూ మౌర్యుల కాలపు నాణాలూ మౌర్యుల పూర్వ నాణేలూ కలిసి వుండగా, దక్షిణ భారత దేశంలో దొరికిన నిక్షేపాలలో కేవలం మౌర్యులకాలపు నాణాలు మాత్రం వున్నాయి. అంటే తత్పూర్వం వ్యాపార సంబంధాలు లేని కొత్త ప్రాంతాలతో వ్యాపార సంబంధాలు ఏర్పడ్డాయని అర్థం అవుతుంది. ఇంతగా విస్తరించిన వ్యాపారానికి నాణాలు పెద్ద సంఖ్యలో అవసరమవుతాయి. కాబట్టి వెండిలో రాగి తదితర లోహాలు కలిపి స్వచ్ఛత తగ్గించక తప్పదు.[21]

పోతే, నాణాల తూకంలో ప్రామాణికత తగ్గిందంటే అది వర్తక వర్గాలు బలహీనమయ్యాయని సూచిస్తుంది. మౌర్యులకు పూర్వం వర్తక శ్రేణులు చాలా బలంగా వుండేవి. ఉత్తరా పథం మీది వ్యాపారాన్ని స్వేచ్ఛగా నిర్వహించేవి. దీనికి సూచనగా నాణాల ముద్రణలో ప్రామాణికత హెచ్చుగా వుండేది. మౌర్యుల కాలానికి వర్తకం చాలా విస్తరించిందిగానీ వర్తక శ్రేణులు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం వర్తకంలో జోక్యం చేసుకోవడం ఎక్కువయింది. కౌటిల్యుడి అర్థ శాస్త్రాన్ని బట్టి చూస్తే రాజులు వర్తకుల మీద రకరకాల ఆంక్షలు పెట్టి తమకు అధీనులుగా వుంచుకున్నారు. వర్తక శ్రేణుల స్వయం ప్రతిపత్తి క్షీణించింది. నలుదిశలా వ్యాపారం పెరిగే కొద్దీ ఉత్తరా పథం మీద గుత్తాధిపత్యం సంపాదించుకున్న వర్తక శ్రేణులు దెబ్బతినడం సహజమే. దీనితో బాటు నాణాల ముద్రణలోని ప్రామాణికత గూడ దెబ్బతినింది.[22]

వర్తకశ్రేణులే కాదు, క్రమంగా తక్షశిలగూడ తన ప్రముఖ స్థానాన్ని కోల్పోయింది. ఒకప్పుడు రెండు రాజ్యాల (పర్షియా, మగధ) మధ్య మారకపు కేంద్రంగా వుండిన తక్షశిల ఇప్పుడు మౌర్య సామ్రాజ్యంలో ఒక మారుమూల పట్టణం అయింది. తత్ఫలితంగా తక్షశిల ఆర్థికంగా దెబ్బతినింది. తన తండ్రి అయిన బిందుసారుడు రాజ్యం చేస్తున్న కాలంలో తక్షశిల అధికారిగా వున్న యువరాజు అశోకుడు ఒక తిరుగుబాటును అణచివేసినట్టుగా బౌద్ధ సంప్రదాయంలో ఒక కథ వుంది. క్షీణించిన తక్షశిల స్థితిని ఇది సూచిస్తుందని కోశాంబి భావిస్తాడు.[28]

## బ్రాహ్మణం-బౌద్ధం

క్రీ. పూ. 6వ శతాబ్దంనుంచి దక్షిణ భారతదేశంలో (మొట్టమొదట దక్కన్ పీఠభూమి మీద) గూడ ఇనుము వాడకం, ఆహార ఉత్పత్తి, ప్రారంభమయ్యాయని కోశాంబి అభిప్రాయం. ఇవి రెండూ ఉత్తరం నుండి వచ్చాయి. వాటితో బాటు బ్రాహ్మణ బౌద్ధ మతాలుగూడ దక్షిణానికి వచ్చాయి.

దక్షిణ భారతదేశాన్ని నైసర్గికంగా రెండుగా విభజించవచ్చును. ఒకటి, ఎత్తయిన దక్కన్ పీఠభూమి, రెండు సముద్రతీర ప్రాంతం. సముద్రతీర ప్రాంతం రెండు రుతుపవనాల తాకిడికి భారీ వర్షాన్ని పొందుతుంది. ప్రాచీన కాలంలో ఇది మొత్తం దట్టమయిన అడవి అయి వుండాలి. క్రీస్తుశకం దాకా ఇక్కడ ఆహార ఉత్పత్తి గాని నాగరిక సమాజం గాని లేవని కోశాంబి అభిప్రాయం. తూర్పుదేశాల నుండి (బహుశా మలయానుండి) కొబ్బరి పంటను ప్రవేశ పెట్టడంతో కోస్తా ప్రాంతంలో (ముఖ్యంగా పడమటి కోస్తాలో) ఆహార ఉత్పత్తి ప్రారంభమయిందని కోశాంబి భావిస్తాడు.[24] పడమటి కోస్తాలో ఇవ్వాళ కొబ్బరితోటలు చాలా ప్రముఖమయినవి కాగా, క్రీస్తుపూర్వం మనదేశానికి వ్యాపార రీత్యావచ్చి ఇక్కడి విషయాలను గురించి రాసిన గ్రీకు తదితర రచయితలెవ్వరూ కొబ్బరిచెట్ల గురించి రాయలేదు.[25] అయితే ఈ విశ్లేషణను కోశాంబి ముందుకు తీసుకుపోలేదు. ఆయన ఎక్కువగా అధ్యయనం చేసింది దక్కన్ పీఠభూమి ప్రాంతాన్నే.

దక్కన్ పీఠభూమి మీద అడవి సాపేక్షికంగా పల్చగా వుంటుంది గాని నేల చాలా గట్టిది. దానిని వ్యవసాయయోగ్యం చేయడానికి విస్తారంగా ఇనుము వాడకం అవసరం. బరువయిన నాగళ్లు అవసరం (ఇప్పటికీ మన రాష్ట్రంలో అదిలాబాద్‌లో వాడినంత బరువయిన నాగళ్లు కృష్ణా జిల్లాలో వాడరు). క్రీ. పూ 6వ శతాబ్దం రెండవ భాగంలో ఇనుము వాడకం, వ్యవసాయం, రెండూ ఉత్తర భారతదేశంనుండి దక్కన్ పీఠభూమి చేరుకున్నాయని కోశాంబి అభిప్రాయం.[26]

ఉత్పత్తి శక్తులలో ఈ మార్పు రావాలంటే ఉత్పత్తి సంబంధాలలో (సామాజిక నిర్మాణంలో) మార్పు అవసరమయింది. గణ వ్యవస్థ స్థానంలో వర్గవ్యవస్థ రావాలి.

కొత్త సామాజిక నిర్మాణం, ధర్మసూక్తులూ, నీతి సూత్రాలూ కావాలి. దీనికి బౌద్ధం బ్రాహ్మణం రెండూ కృషిచేసాయి. ఇవిరెండూ కేవలం మతాలు (అభిప్రాయాలు) కావనీ, సామాజిక నిర్మాణ సూత్రాలనూ నీతి నియమాలనూ తమలో నిక్షిప్తం చేసుకున్న ప్రాపంచిక దృక్పథాలనీ గుర్తుంచుకోవాలి. వ్యవసాయ సమాజ వ్యాప్తి ఈ రెండు మతాల వ్యాప్తిగా అందుకే కనబడుతుంది. ఈ వ్యాప్తి ఫలితంగా ఉత్తర భారత దేశపు వ్యవసాయక వర్గసమాజం ఇక్కడి ఆటవికులను తనకు లోబరచుకొని వాళ్ళను వ్యవసాయకులను చేసింది. వర్గ విభజన, వర్ణవ్యవస్థ, బ్రాహ్మణ బౌద్ధ మతాలు, కర్మ కాండ, నీతి నియమాలు, ఇక్కడ ప్రవేశపెట్టబడ్డాయి. అదే సమయంలో సామాజిక సమ్మేళనం ఫలితంగా ఇక్కడి ఆటవికుల పూజలూ కుదురు చిహ్నాలూ దేవతలూ ఆచారాలూ బ్రాహ్మణ మతంలోకి ప్రవేశించాయి.

మగధ ప్రాంతపు ఇనుము లభ్యం కావడం మొదలైన నాటినుండి ఉత్తరా పథంమీద పెద్దఎత్తున వ్యాపారం సాగిందని చూసాం. ఉత్తరాపథం రాజ్‌గిర్ నుండి బయలుదేరి ఉత్తర దిశగా కపిలవస్తు, శ్రావస్తి పట్టణాల మీదుగా తక్షశిల చేరుకుంది. అదే కాలంలో శ్రావస్తినుండి దక్షిణానికి ఒక వర్తక మార్గం ఏర్పడింది. ఈ 'దక్షిణా పథం' శ్రావస్తినుండి నిలువుగా దక్షిణానికి వెళ్ళి గంగా యమునా లోయలలోని అయోధ్య, కౌశాంబి పట్టణాలను చేరి, అక్కడినుండి పడమటి దిక్కుగా ప్రయాణించి వింధ్య పర్వతాలను అనుకొనివున్న ఉజ్జయినిని చేరుకొని, ఉజ్జయిని నుండి దక్షిణానికి ప్రయాణించి నర్మదా, తపతీ నదులను దాటి గోదావరీ తీరాన (ప్రస్తుత మహారాష్ట్రలో) వున్న పైఠాన్‌ను చేరింది.[27] ఉత్తరా పథానికీ దక్షిణా పథానికీ జంక్షన్‌గా వున్న శ్రావస్తి కోసలుల మొట్టమొదటి రాజధాని. అది నేపాల్ సరిహద్దుమీద వుంది. గంగా యమునా లోయలను ఇనుము సహాయంతో వ్యవసాయ యోగ్యం చేసిన తరువాతే కోసలులు తమ రాజధానిని శ్రావస్తినుండి దక్షిణానికి, నదీతీరాన వున్న అయోధ్యకు, మార్చారు. మగధ రాజధానిగూడ అదేవిధంగా రాజ్‌గిర్‌నుండి నదీతీర పట్టణమయిన పాటలీపుత్రానికి (పాట్నాకు) తరలింది.

గంగా యమునా లోయలు వ్యవసాయ యోగ్యం అయినప్పటినుండీ అక్కడ బ్రాహ్మణ బౌద్ధ మతాలు పరస్పర విరోధ భావంతో సహజీవనం చేస్తున్నాయి. బౌద్ధం స్వభావాన్ని గురించి గత అధ్యాయంలో కొంత చూసాము. బ్రాహ్మణం సంగతి చూడాలి. ఈ బ్రాహ్మణం వేదకాలపు వైదిక మతంకాదు. యజ్ఞాలు ఇంకా నిర్వహిస్తూనే వున్నారు గాని సమాజంలో వాటికి ఆమోదం తగ్గిపోతోంది. అయితే నూతన వ్యవ సాయ వర్గ సమాజానికి నిర్మాణ సూత్రంగా బ్రాహ్మణ మతం ముందుకు తెచ్చిన వర్ణ వ్యవస్థ ఇప్పుడు బలపడుతోంది. దానితోబాటు ఇతర విలువలలోనూ అలవాట్ల లోనూ నూతన సమాజానికి అనుకూలమయిన ఆలోచనలు పుట్టుకొస్తున్నాయి. మద్య పానం పట్ల మాంసాహారంపట్ల, వ్యతిరేకభావం అంకురిస్తోంది. కుటుంబ వ్యవస్థగూడ

బలపడి స్త్రీల స్వేచ్ఛాయుత ప్రవర్తనపట్ల వ్యతిరేకత పుడుతోంది. ఈ మార్పులు ఎక్కువగా తూర్పున గంగా యమునా లోయలలో రాగ, పడమటి (పంజాబు) ఆర్యులు ఇంకా వేదకాలంనాటి అలవాట్లను పూర్తిగా వదులుకొలేదు. ఎడారి సదృశమైన పంజాబు, యజుర్వేద కాలపు పరిణామాలను దాటి పెద్దగా ముందుకు పోలేదు. ఇనుము వాడకం తెలియాలేగాని, గంగా యమునా లోయే వ్యవసాయానికి నిజంగా యోగ్యమైన ప్రాంతం. వ్యవసాయక సమాజం సమగ్రంగా అక్కడే అభివృద్ధి చెందింది. ఇక్కడి బ్రాహ్మణులు వేదమంత్రాలనూ స్వచ్ఛమైన సంస్కృతాన్నీ నేర్చుకొనడానికి పడమటికి పోయి వస్తూనే వున్నారు. అయితే పంజాబు ప్రాంతపు ఆర్యుల జీవితం వీళ్ళకు 'అనార్యం'గా కనబడడం మొదలయింది.. ఈ విమర్శ మహాభారతంలో కర్ణుడి చేత చెప్పించారు.[28] మద్ర-గాంధార-కాంభోజ రాజ్యాలలో వర్ణవ్యవస్థను పాటించడంలేదు, ఒకడు పౌరోహిత్యం చేస్తే వాడి తమ్ముడు వ్యవసాయం చేస్తాడు, మరొకడు సైనికుడు కావచ్చు, మంగలి కావచ్చు. ఇదంతా ఈ కొత్త బ్రాహ్మణులకు విడ్డూరంగానూ ధర్మం యొక్క అతిక్రమణ గానూ కనబడింది.[29] పైగా పడమటి స్త్రీలు చాలా విచ్చల విడిగా ప్రవర్తిస్తారట, మగవాళ్ళతో సమంగా మద్యం తాగుతారు, మాంసం తింటారు, బహిరంగంగా నాట్యం చేస్తారు. వాళ్ళ లైంగిక సంబంధాలలో గూడ ఆటవిక లక్షణాలు చాలావున్నాయి. మహాభారతంలో అర్జునుడు సుభద్రను అపహరించి పెళ్లి చేసుకున్నాడు. పాండురాజు కోసం మద్ర గణానికి చెందిన మాద్రిని భీష్ముడు కొను క్కొచ్చాడు. ఈ కొత్త బ్రాహ్మణులు వీటిని అనార్యమయిన గంధర్వ అసుర వివాహ పద్ధతులుగా భావించారు.[30]

వీళ్ళకు యజ్ఞయాగాలకంటె వర్ణవ్యవస్థ ముఖ్యం. ఆహార ఉత్పత్తిని అలవర్చు కుంటున్న తొలిదశలో (అంటే యజుర్వేద కాలంలో) అదనపు ఉత్పత్తిని పాలక వర్గాలు చేజిక్కించుకొనడానికి యజ్ఞబలులు ఒక సాధనంగా ఉపయోగపడ్డాయి. అయితే ఈ బలుల పట్ల వ్యవసాయక-వ్యాపార వర్గాలలో తీవ్ర నిరసన రావడంతో ఆ సాధనం సామాజిక ఆమోదాన్ని కోల్పోయింది. నూతన వ్యవసాయక సమాజంలో అదనపు ఉత్పత్తిని చేజిక్కించు కొనడానికి వర్ణవ్యవస్థ అంత కంటే సమర్థమయిన సాధనంగా పని చేసింది. వైశ్యులూ శూద్రులూ శ్రమ చేసి బ్రాహ్మణ క్షత్రియ వర్ణాలకు సేవ చేయాలనీ, అది వాళ్ళ 'ధర్మం' అనీ వర్ణధర్మం ప్రతిపాదించింది. దీనికి సామాజిక ఆమోదం పొందడం ముందున్న కర్తవ్యం. అయితే ఇదే సమయంలో బౌద్ధం గూడ కొత్త సమాజానికి అనుగుణ్యమైన నీతిని ప్రతిపాదిస్తూ ముందు కొచ్చింది. యజ్ఞ బలులను నిరసించింది కాబట్టి మొదట్లో వ్యవసాయక-వాణిజ్య వర్గాల మద్దతు బౌద్ధానికి బాగానే లభించింది. అయితే అదే ఏకైక సామాజిక మతం కాలేదు. మగధ కాలంలో రెండు మతలకూ మొత్తం మీద సమానమయిన ఆదరణ లభించింది. అజాత శత్రువును బౌద్ధ జైన గ్రంథాలే కాక ఉపనిషత్తులు గూడ గొప్పవాడని పొగిడాయి.[31] అశోకుడి

శాసనాలలో బౌద్ధాశ్రమణులకూ బ్రాహ్మణులకూ సమాన గౌరవం చూపాడు.[32]

ఇక ముందు ఈ రెండు మతాలలో ఏది నిలుస్తుందనేది అవి నిర్వహించగల మూడు కర్తవ్యాల మీద ఆధారపడి వుంటుంది. ఒకటి, రాజ వంశాల మద్దతు పొందడం. రెండు, ఇంకా అధిక సంఖ్యలో మిగిలి వున్న ఆటవికులను నాగరిక సమాజానికి లోబరచి వాళ్ళను వ్యవసాయకులను చేసే క్రమానికి దోహదం చేయడం. మూడు, ఆహార ఉత్పత్తిని అలవర్చుకున్న ఈ కొత్త సమాజాన్ని మరొక అడుగు ముందుకు తీసుకుపోయి స్వయం పోషక గ్రామీణ వ్యవస్థనూ అంతిమంగా భూస్వామ్య వ్యవస్థనూ ప్రవేశపెట్టడం. ఇందులో మొదటి రెండు విషయాలలో బ్రాహ్మణం బౌద్ధం సమంగానే పోటీ పడ్డాయి. మూడవ కర్తవ్యంలో బ్రాహ్మణుల వర్ణవ్యవస్థ (దాని పరిణత రూపం అయిన కుల వ్యవస్థ) అంతిమంగా బౌద్ధం మీద విజయాన్ని సాధించింది.

ఆటవికులను నాగరీకరించడంలో ఈ రెండు మతాలూ దోహదం చేసిన తీరును ఈ అధ్యాయంలో చూద్దాం.

బ్రాహ్మణులు గతంలో లాగే తాము నేర్చుకున్న మంత్ర తంత్రాలతో ఆటవికుల దగ్గరికి చేరారు. ధర్మశాస్త్రాలు ఎంత వద్దంటున్నా వినకుండ ఆటవికుల పూజలు తాము నిర్వహించారు. ఒక్కొక్క చోట వాళ్ళ పురోహితులకు ఒక గోత్రం ఇచ్చి తమ మంత్రాలు నేర్పి తమలో కలుపుకున్నారు. బ్రాహ్మణ గోత్రాలు ఈ విధంగా అపరిమితంగా పెరిగి పోయాయి. వేదకాలంలో నల్లటి వ్యక్తి ఆర్యుడయి వుండడానికి వీలు లేదని భావించగా, ఉపనిషత్తులలో బ్రాహ్మణులయిన భార్యా భర్తలు నల్లటి కొడుకు కావాలంటే ఏ కర్మలు ఆచరించాలి, తెల్లటి కొడుకు కావాలంటే ఏ కర్మలు ఆచరించాలి, అని వివరించారు.[33]

ఆటవిక పురోహితులను బ్రాహ్మణులుగా స్వీకరించడమే కాక, ఆటవిక గణ ముఖ్యులు గనక బలవంతులయితే వాళ్ళను క్షత్రియులుగా స్వీకరించి సూర్యవంశమో చంద్రవంశమో కల్పించి అవసరమయితే అందుకోసం ఒక పురాణం గూడ రాసారు. వాళ్ళ నుండి యధోచితంగా ప్రతిఫలం పొందారు.[34] ఆటవిక గణముఖ్యులు బలవంతులు కాకపోతే వాళ్ళను మొత్తం ఒక శూద్ర లేక పంచమ కులంగా లోబరచుకొని తమ వ్యవసాయక సమాజంలో కలుపుకున్నారు. ఈ విధంగా ఆటవిక సమాజాలలోకి వ్యవసాయక వర్గ సమాజ నిర్మాణ సూత్రమయిన వర్ణ వ్యవస్థను ప్రవేశ పెట్టారు. అంటే నూతన సమాజానికి అవసరమయిన ఉత్పత్తి సంబంధాలను కల్పించారు. వాళ్ళు ఇనుము వాడకం, వ్యవసాయం, నేర్చుకొని వ్యవసాయకులయ్యారు. వాళ్ళ పూజా వస్తువులు (చెట్లుగాని, పశులుగాని, జంతువులుగాని) బ్రాహ్మణ మతంలోనికి పవిత్ర చిహ్నాలుగా వచ్చి చేరాయి.

ఇదంతా బ్రాహ్మణులు ఉద్దేశ్యపూర్వకంగా (నాగరికత వ్యాప్తి కోసం) చేసారని భావించనక్కర లేదు. కొద్దిగా 'ఎంటర్‌ప్రైజ్' వున్న యువకుడెవడయినా మద్ర

దేశానికో గాంధారకో పోయి నాలుగు వేద మంత్రాలు నేర్చుకొని వచ్చి ఆ పాండిత్యంతో ఆటవికులను మభ్యపెట్టి తన జీవనం అనాయాసంగా సాగించుకో వచ్చును. వైదిక ఆచారాలు ఎంతగా విస్తరిస్తే బ్రాహ్మణులకు జీవనం అంతగా దొరుకుతుంది. ఈ క్రమంలోనే వాళ్ళు తమకే తెలియకుండా నాగరికత వ్యాప్తికి తోడ్పడ్డారు[35]

వ్యవసాయ సమాజ విస్తరణ కోసం వర్ణ వ్యవస్థను వ్యాపింపజేయడమే కాక, దానికి సమంగా ముఖ్యమైన మరొక పని గూడ బ్రాహ్మణులు చేసారు. అది ఆటవికులకు కాలమానాన్ని అందజేయడం.[36] రుతుపవనాల మీద ఆధారపడ్డ వ్యవసాయానికి కాల మానం అవసరం. ఆహారాన్ని ఏరుకొని తినే వాళ్ళకు అవసరం లేదు. బ్రాహ్మణుల పంచాంగం ఆ అవసరాన్ని తీర్చింది. ఇక్కడ పంచాంగం అంటే శకునాలూ రాహు కాలం చూసుకునే పుస్తకం అని కాక, 'క్యాలెండర్' అని అర్థం చేసుకోవాలి. క్యాలెండర్‌గా దాని కంత ప్రాముఖ్యం ఉండబట్టే తమ ఉదర పోషణకు ఉపయోగపడే మూఢ నమ్మ కాలను బ్రాహ్మణులు పంచాంగంలోకి ప్రవేశపెట్టారు. లేక పోతే పిల్లి శకునాలూ బల్లి శకునాలూ పంచాంగంలో రాయాల్సిన అగత్యం ఎంత మాత్రం లేదు.

రోజులను (తిథులను) చంద్రుడిని బట్టి లెక్క పెట్టడం సులభం. చంద్ర బింబం పున్నమి నుండీ అమావాస్యకూ అమావాస్య నుండి పున్నమికీ ఒక క్రమ పద్ధతిలో తగ్గుతూ హెచ్చుతూ వుంటుంది. ఈ కాలమానాన్ని చంద్రమానం అంటారు. ఆహారాన్ని ఏరుకుని జీవించే ఆటవికులకు ఈ కాలమానం సరిపోతుంది. అయితే చంద్రమానం రుతువులను సరిగ్గా సూచించదు, కాబట్టి అది వ్యవసాయక సమాజానికి సరిపోదు. రుతువులు సూర్యమానాన్ని అనుసరిస్తాయి. సూర్యుడికి చంద్రుడి లాగ 'కళలు' ఉండవు. కాబట్టి సూర్యమానం ప్రకారం లెక్కించడం కష్టం. దీనికి కొంత నిపుణత కావాలి. సూర్యుడు భూమి చుట్టూ తూర్పు నుండి పడమరకు తిరిగే (తిరిగి నట్టు కనిపించే) పథం ఎల్లప్పుడూ సరిగ్గా నడినెత్తిన వుండదు. జనవరి 14 నాడు నడి నెత్తికి దక్షిణంగా అత్యంత దూరం వుంటుంది. అక్కడి నుండి క్రమంగా ఉత్తరానికి జరిగి ఆరు నెలల తరువాత నడి నెత్తికి ఉత్తరంగా అత్యంత దూరం వుంటుంది. ఈ ఆరు నెలలను ఉత్తరాయనం అంటారు. అక్కడి నుండి మరొక ఆరు నెలలు (దక్షిణా యనం) వెనక్కి ప్రయాణించి మొదటి స్థానాన్ని చేరుకుంటుంది. ఈ ప్రయాణం క్రమ బద్ధంగా జరుగుతుంది కాబట్టి సూర్యుడి పథం సరిగ్గా ఎక్కడుందో తెలుసుకుంటే ఏ రుతువు అయిందీ చెప్పవచ్చును. ఇందుకోసం సూర్యుడి పథం ప్రయాణించే మొత్తం నిడివిని (దక్షిణం చివరి నుంచి ఉత్తరం చివరిదాకా) కొన్ని భాగాలుగా విభజించి, సూర్యుడి పథం ఏ విభాగంలో ఎంత కాలం వుండేదీ లెక్కగడతారు. సూర్యుడి పథం ఏ విభాగంలో వుందన్న దాన్ని బట్టి ఏ రుతువయిందీ తెలుస్తుంది. ఈ విభజనకు మనదేశంలో రెండు సంప్రదాయాలున్నాయి. 12 భాగాలుగా (రాశులు) విభజించడం ఒక పద్ధతి అయితే 27 భాగాలుగా (నక్షత్రాలు) విభజించడం రెండవ

పద్ధతి. ఇందులో రెండవది మనదేశంలో పుట్టిందనీ, మొదటిది గ్రీకుల ప్రభావం వల్ల అలవడిందనీ చాలా మంది లాగే కోశాంబి గూడ భావిస్తాడు.[37] ఎట్లాగయితేనేం, ఈ తిథులూ రాశులూ నక్షత్రాల పరిజ్ఞానం వ్యవసాయ విస్తరణకు చాలా అవసరం. ఆ పరిజ్ఞానాన్ని ఆటవికులకు అందజేయడం గూడ బ్రాహ్మణులు చేసిన ముఖ్యమయిన పనులలో ఒకటి.[38]

## దక్షిణాపథం

ఇక బౌద్ధుల సంగతి. నిజానికి దక్కన్ పీఠభూమి ప్రాంతంలోనికి వ్యవసాయ సమాజం విస్తరించడంలో బ్రాహ్మణుల కంటె బౌద్ధులు ఎక్కువ పాత్ర వహించారని కోశాంబి భావిస్తాడు.[39] బౌద్ధం ప్రచారాత్మకమయిన మతం (**missionery religion**). జంతు బలులను అనుసరించే ఆటవికులకు అహింసను, మాధ్యమిక మార్గాన్నీ, బోధించడం బౌద్ధుల ప్రధాన కర్తవ్యం. దీనికోసం, జంతు బలులిచ్చే ఆటవికులు జీవించే ప్రాంతాలను బౌద్ధ భిక్షువులు వెతుక్కొని మరీ వెళ్ళేవారు. బౌద్ధాన్ని వర్తకులు ఆదరించారు కాబట్టి ఈ భిక్షువులు వర్తక మార్గాలను అనుసరించి, వర్తక బృందాలకు తోడుగా, ఆటవిక ప్రాంతాలకు వెళ్ళారు. ఈ వర్తకులు బౌద్ధ ఆరామాలను కట్టించారు. భిక్షువులు ప్రచారం చేసుకోనడానికి అనువుగా వాళ్ళ జీవితం గడవడానికి అవసరమయిన మూలధనాన్ని కల్పించారు. ఈ విధంగా దక్కన్ పీఠభూమి మీది అడవి ప్రాంతాలలో సంపన్నమయిన బౌద్ధ ఆరామాలు, వర్తక కూడలులూ ఏర్పడ్డాయి. ఈ వర్తకం ప్రభావంగా ఇక్కడి ఆటవిక తెగలలో వర్గ విభజన ఏర్పడింది. గణ ముఖ్యులు సంపన్నులయ్యారు. వ్యవసాయాన్నీ ఇనుము వాడకాన్నీ భిక్షువుల నుండీ వర్తకుల నుండీ నేర్చుకున్నారు. కొత్త సమాజానికి అవసరమయిన సామాజిక నీతిని గూడ భిక్షువుల నుండి నేర్చుకున్నారు.

ఈ క్రమాన్ని నిశితంగా విశ్లేషించిన వ్యాసాలను పరిశీలిద్దాం.[40] శ్రావస్తి నుండి దక్షిణాన పైఠాన్ దాకా సాగిన దక్షిణా పథాన్ని పైన వర్ణించాము. ఈ దక్షిణా పథం మీద క్రీ. పూ. 600 నుండి వర్తకం నడిచింది. కోసల, మగధ ప్రాంతపు వర్తకులు సరుకులను గోదావరి లోయకు తీసుకొచ్చి ఇక్కడి ఆటవికులకు విక్రయించి వారి నుండి (వాళ్ల సేకరించిన) వస్తువులను కొనుక్కొని వెళ్ళారు. ఈ క్రమంలో ఆ ఆటవికులలో కొందరు ధనవంతులయి, వాళ్ళలో వర్గ విభజన ఏర్పడి, వాళ్ల గూడ వ్యవసాయం వర్తకం నేర్చుకున్నారు. ఇనుము దక్కన్ పీఠభూమి మీద బాగానే దొరుకుతుంది గాని, ఇనుము వాడకం ఉత్తరాది నుండే నేర్చుకున్నారని కోశాంబి అభిప్రాయం.

ఈ సందర్భంలో జాతక కథల నుండి ఒక ఉదంతాన్ని కోశాంబి తరచుగా ప్రస్తావిస్తాడు.[41] బావరి అనే కోసల బ్రాహ్మణుడు దక్షిణాపథం మీదుగా 'అశ్వక'

గణం నివసించే ప్రాంతం అయిన పైఠాన్‌కు వచ్చారట. అక్కడ అతనూ అతని శిష్యులూ కందమూలాలు సేకరించి తింటూ జీవించారు. క్రమంగా అక్కడ వ్యవసాయం మొదలయి ఒక పెద్ద గ్రామం ఏర్పడింది. ఈ గ్రామం నుండి సేకరించిన సంపదతో బావరి ఒక మహాయజ్ఞం గూడ నిర్వహించాడంట. అయితే వేద మంత్రాల పరిజ్ఞానంతో సంతృప్తి చెందక తన శిష్యులను బుద్ధుడి దగ్గరికి పంపి కొన్ని తాత్విక ప్రశ్నలు అడగమన్నాడు. బుద్ధుడు ఇచ్చిన సమాధానంతో బావరి ఎంతగా సంతృప్తి చెందాడంటే అతను బౌద్ధమతాన్ని స్వీకరించి భిక్షువు అయ్యాడు. శాతవాహనుల కుదురు చిహ్నం గుర్రం కావడంవల్ల[42] ఈ 'అశ్వకులు' శాతవాహనుల పూర్వీకులయిన గణ జీవులనీ, ఈ జాతక కథలో చెప్పిన విధంగా క్రీ.పూ. 6వ శతాబ్దం చివరి భాగంలో ఉత్తరాదినుండి వచ్చిన బ్రాహ్మణుల నుండీ బౌద్ధుల నుండీ వ్యవసాయాన్ని నేర్చుకొని నాగరికులయ్యారనీ, క్రమంగా వీళ్ళే దక్కన్ పీఠభూమి మీది మొట్ట మొదటి రాచరికాన్ని స్థాపించారనీ కోశాంబి వ్యాఖ్యానిస్తాడు.

మహారాష్ట్రలోని బౌద్ధ విహారాలను అధ్యయనం చేయడం ద్వారా కోశాంబి ఈ విషయాన్ని చక్కగా రుజువు చేస్తాడు. పడమటి కనుమలలోని గుహలలో బౌద్ధ విహారాలు చాలావున్నాయి. జున్నార్, కార్లె, నాసిక్, అజంతా మొదలయినవి ప్రఖ్యాత మయినవి. ఇవికాక మరికొన్ని భాజా, బేడా, కరాడ్, కొండాణె, ఠాణాళె, కర్‌సాంబ్లె, కన్హేరి, మొదలయినవి.[43] ఈ గుహలున్న ప్రాంతాలలో ప్రాచీనకాలపు కాలిబాటలు, ఆ కాలిబాటల దగ్గర చిన్నరాతి పనిముట్ల అవశేషాలు (microlith deposits) వున్నాయి పనిముట్లను బట్టి అవి ఆటవికులవని తెలుస్తుంది. పశువుల తోలు తీయడానికి, తోలుతో వస్త్రాలు కుట్టడానికి, అవసరమయిన రాతి పనిముట్లున్నాయి. ఇప్పటికీ ఆ ప్రాంతంలో నివసించే ధన్‌గార్ అనే గొర్రెల కాపర్లు అటువంటి పనిముట్లనే వాడతారు. దీనిని బట్టి, బౌద్ధ విహారాలు రాకపూర్వం అక్కడి పరిస్థితిని ఊహించవచ్చును. కొండ దిగువ ప్రాంతం దట్టమయిన అడవి అయివుంటుంది. కొండ చరియల మీద గొర్రెలు తదితర జంతువుల మందలను కాస్తూ బ్రతికే పశుపోషకులు ఉండాలి. ఇటువంటి తెగలు సంచార జీవితం గడుపుతూ అప్పుడప్పుడు పరస్పరం ఆహారం మార్పిడి చేసుకొనడం కోసం కలుసుకునేవారు. ఇలా కలుసుకునే ప్రదేశం రెండు కాలి బాటల కూడలిగా కనబడుతుంది. ఆహారమార్పిడి వ్యాపారంగా కాక కర్మకాండయుతంగా సాగుతుంది కాబట్టి ఈ కూడలుల దగ్గర కూడలి దేవతలయిన అమ్మదేవతల పూజా స్థలాలుంటాయి. ఆహార మార్పిడి జరిగే సందర్భంలో ఈ అమ్మ దేవతలకు పెద్ద ఎత్తున బలు లివ్వడం, బలి పశువుల రక్తాన్ని పూజరాయికి పూయడం, జరుగుతుంది. పడమటి దక్కన్‌లోని ప్రముఖ అమ్మ దేవతల పూజా స్థలాలు ఇటువంటి కాలి బాటల కూడలుల దగ్గరే వున్నట్టు కోశాంబి గమనిస్తాడు. గమనార్హమయిన విషయం ఏమిటంటే బౌద్ధ విహారాలు గూడ ఎక్కువగా ఇటువంటి కూడలుల దగ్గరే వున్నాయి.

దీనికి గల కారణాన్ని బౌద్ధ మతం స్వభావం నుండి అర్థం చేసుకోవచ్చును. హింసాత్మకమయిన జంతు బలులు ఇచ్చే ఆటవికులను సంస్కరించి వాళ్ళకు నాగరిక మయిన మధ్యమిక మార్గాన్ని నేర్పించడం బౌద్ధ భిక్షువుల ప్రధాన కర్తవ్యం. అత్యంత ప్రాచీన బౌద్ధ గ్రంథమయిన సుత్తనిపాతంలో బుద్ధుడు, భిక్షువులు రాత్రి పూట గ్రామాలలోగాని పట్టణాలలోగాని నివసించకూడదనీ కొండ మీద, శ్మశానం వద్ద, గుహలలో, నిర్భయంగా నివసించాలనీ అన్నాడు. సరిగ్గా ఇవే ఆటవికుల పూజా స్థలాలని కోశాంబి గుర్తుచేస్తారు. పైగా "విచిత్రమైన పూజలను గాని భయంకర మయిన కర్మకాండను గాని చూసి భిక్షువు భయపడ కూడదు" అన్నాడు బుద్ధుడు. ఈ విచిత్రమయిన పూజలు అనుసరించే వాళ్ళను సంస్కరించడం భిక్షువుల కర్తవ్యం. బుద్ధుడు స్వయంగా ఆ పని చేసాడు.[44]

ఈ సమాచారాన్నంతా సమీక్షిస్తే వ్యవసాయ విస్తరణలో బౌద్ధమతం పాత్ర అర్థం అవుతుంది. క్రీ.పూ. 600 నాటికి పడమటి దక్కన్ కొండ చరియల మీద ఆటవికులు నివసిస్తున్నారు. ఈ గణాలు సేకరించిన ఆహారాన్ని కర్మ కాండ యుతంగా మారకం చేసుకొనిన కూడలులు ప్రముఖమైన అమ్మదేవతల పూజా స్థలాలయ్యాయి. రక్తబలులకూ ఆటవిక కర్మకాండకూ కేంద్రాలయ్యాయి. మగధ కోసల తదితర ప్రాంతాల నుండి దక్షిణా పథం మీదుగా వచ్చిన వర్తకులు గూడ తమ సరుకులను అమ్మడం కోసం ఆటవికుల కాలి బాటలను అనుసరించి ఈ కూడలుల దగ్గరికే వచ్చి వుండాలి. ఈ కాలిబాటలే తరువాతి కాలంలో వర్తక మార్గాలయ్యాయి. కూడలులు 'అంగ'ళ్ళయ్యాయి. వర్తకులతో బాటు వచ్చిన భిక్షువులకు సహితం తమ ధర్మ ప్రచారాన్ని ఇటువంటి రక్త బలుల కేంద్రాలలోనే చేయాలని బుద్ధుని ఆదేశం. ఈ కారణంగా బౌద్ధ విహారాలుగూడ అమ్మదేవతల పూజా స్థలాలలాగ ఈ కాలిబాటల కూడలుల దగ్గరే ఏర్పడ్డాయి.

ఇదంతా కొన్ని విచిత్రమయిన పరిణామాల రూపంలో నిలిచిపోయింది. బౌద్ధం ఒక మతంగా మన దేశంలో నశించి పోయింది, కాని మహారాష్ట్రలోని బౌద్ధ గుహలు మిగిలాయి. ఏ అమ్మదేవతల పూజలనయితే మాన్పించాలని బౌద్ధం ప్రయత్నించిందో, స్వయంగా బౌద్ధ గుహలలోనే అవి కొనసాగుతున్నాయి. అమ్మదేవతలను బౌద్ధ గుహలలో ఆరాధించే జనానికి ఇవి బౌద్ధ విహారాలన్న స్పృహ గూడ లేకపోవచ్చును. జున్నార్‌లోని ఒక గుహలో తుళజాదేవిని, మరొక గుహలో మానమోడిని, ఆరాధిస్తారు.[45] నానోలి గుహలో ఫిరంగి బాయిని ఆరాధిస్తారు.[46] అయితే ఒకప్పటి బౌద్ధ ప్రచారానికి జ్ఞాపకంగా జున్నార్‌లోని దేవతలిద్దరూ రక్తబలులను ఒల్లరు. బలి ఇవ్వ దల్చుకుంటే దూరంగా ఇవ్వాలి గాని గుహలో ఇవ్వకూడదు. అదే విధంగా యమాయి అనే దేవతను బేడ్సా విహారంలోనూ కార్లే గుహలోనూ ఆరాధిస్తారు. కార్లేలో ఆమె పూజరాయి ఏదీ లేదు కాబట్టి, బౌద్ధ స్థూపాన్నే యమాయి విగ్రహంగా భావించి దానికే

మొక్కుకుంటారు, దాని చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు![47]

ఉత్తర భారత దేశం నుండి వచ్చిన వర్తకం దక్కన్‌లోని ఆటవిక ప్రాంతాలలో వ్యవసాయక వర్గ సమాజాన్ని ఏ విధంగా ప్రవేశ పెట్టిందీ సూచించాము. ఆ వర్తకులు తమ సరుకులను ఇక్కడి ఆటవికులు సేకరించిన లోహాలు మొదలయిన వస్తువులతో మారకం చేసారు. దీని ఫలితంగా ఆటవిక గణ ముఖ్యులు సంపన్నులై గణవ్యవస్థలో వర్గ విభజన ఏర్పడింది. ఇక అదే వర్తకుల నుండి ఇనుము వాడకాన్నీ వ్యవసాయాన్నీ నేర్చుకోవడమే తరువాయి.

వర్తక శ్రేణులతో బాటు ధర్మ ప్రచారానికై ఇక్కడికి వచ్చిన భిక్షువులు ఈ నూతన వ్యవసాయక వర్గ సమాజానికి అవసరమైన సామాజిక నీతిని బోధించారు. అంతేకాక, బౌద్ధవిహారాలు ఆటవికుల నాగరీకరణలో ఇంకా ప్రత్యక్షమైన ఆర్థిక పాత్ర నిర్వహించాయి. వర్తకులు పుణ్యం సంపాదించుకోవడం కోసం భిక్షువులకు విహారాలు కట్టించి, వాళ్ళు సుఖంగా ధర్మప్రచారం చేసుకోగలందుకు మూలధనాన్ని కల్పించారు. తత్ఫలితంగా విహారాలు చాలా సంపన్నమయిన వ్యాపార కేంద్రాలయ్యాయి. వర్తక బృందాలకు సరుకులు సరఫరా చేసిన గోదాములయ్యాయి. బ్యాంకులుగా పని చేసాయి. బౌద్ధ విహారాలు నిర్వహించిన ఈ ఆర్థిక పాత్రను చైనా చరిత్ర నుండి అర్థం చేసుకోవచ్చును. చైనా విహారాలు బౌద్ధంలోని మహాసాంఘిక శాఖకు చెందినవి (ఇది మహాయాన బౌద్ధానికి పూర్వరూపం). పడమటి దక్కన్‌లోని కార్లె తదితర గుహలు కూడ అదే శాఖకు చెందినవి. చైనాలోని మహాసాంఘికులు తాము భారతీయ సంప్రదాయాన్ని అనుసరిస్తున్నట్టు చెప్పుకున్నారు. దానిని బట్టి చైనా చరిత్రలో విహారాలు ఏ ఆర్థిక పాత్ర నిర్వహించాయో పడమటి దక్కన్‌లోని విహారాలు కూడ అదే పాత్రను నిర్వహించాయని భావించవచ్చును.[48]

విహారాల ఈ సంపద చుట్టూవున్న ఆటవికులలో వర్గ సమాజాన్నీ వ్యవసాయ వర్తకాలనూ ప్రవేశ పెట్టింది.[49] విహారాలకు సరుకులు సరఫరా చేసిన ఆటవిక గణ ముఖ్యులు సంపన్నులయి రాజులుగా మారారు.[50] కొత్త సమాజానికి అవసరమయిన సామాజిక నీతిని కూడ బౌద్ధ భిక్షువులు బోధించారు. ఇనుము వాడకాన్నీ వ్యవసాయాన్నీ ఆటవికులకు అలవాటు చేసారు.

దూరప్రాంత వర్తకంతో బౌద్ధానికి ఉన్న ఈ అవినాభావ సంబంధమే వినాశ హేతువయింది. వ్యవసాయక సమాజం ఏర్పడుతున్న కొత్తలో వ్యవసాయ విస్తరణకు (పైన వివరించిన విధంగా) దూరప్రాంత వర్తకం చాలా తోడ్పడింది. అయితే ఈ దశ దాటి తరువాతి దశలో స్వయంపోషక గ్రామీణ వ్యవస్థ ఏర్పడడం మొదలు కాగానే దూరప్రాంత వర్తకం దెబ్బతినింది. స్వయంపోషక గ్రామాలు తమ అవసరాలను తామే తీర్చుకోవడం మొదలుపెట్టాయి. దానితో వర్తకమే కాక, వర్తకంతో ముడిపడివున్న బౌద్ధ విహారాలుకూడ క్షీణించాయి. బౌద్ధమతానికి గల సామాజిక

పునాది పోయింది. అందుకు భిన్నంగా బ్రాహ్మణుల కుల వ్యవస్థ స్వయంపోషక గ్రామాలకు సరిగ్గా అతికింది కాబట్టి అది బలం పుంజుకుంది. ఒకవెయ్యి సంవత్సరాల ఘర్షణ అనంతరం బౌద్ధం పోయి బ్రాహ్మణమే నిలిచింది. ఇది తరువాతి అధ్యాయాల కథ.

దక్కన్ పీఠభూమి మీద వ్యవసాయక సమాజం ఆవిర్భావానికి బౌద్ధంలాగే బ్రాహ్మణమతం గూడ దోహదం చేసింది· దోహదం చేసిన పద్ధతిని మొదట్లో చూసాము. ఆధారాలు ఇప్పుడు చూడాలి. ప్రధానమయిన ఆధారాలు పడమటి దక్కన్ ప్రాంతంలో అమ్మదేవతల పూజలలో వచ్చిన పరిణామాలు. అమ్మదేవతల బ్రాహ్మణీకరణ, వాళ్ళ పూజా స్థలాల స్థానభ్రంశం, వ్యవసాయక సమాజం ఆవిర్భవించిన తీరును చక్కగా చూపిస్తాయి. ఈ విశ్లేషణ చేసిన రెండు వ్యాసాలు[51] కోశాంబి అనుసరించే అధ్యయన పద్ధతికి చక్కటి నిదర్శనాలు.

దక్కన్ పీఠభూమి మీద, పడమటి కనుమలలో పుట్టి తూర్పుకు ప్రవహించే నదులున్నాయి-గోదావరి, భీమ మొదలయినవి. ఈ నదీలోయలు ప్రాచీన కాలంలో దట్టమయిన అడవితో నిండివుండాలి. అక్కడ ఆహార సేకరణ తప్ప వేరే ఆనాటికి సాధ్యంకాదు. ఇక్కడ ఆటవిక గణాలు నివసించివుండాలి. కొండ చరియల మీద మాత్రం అడవి పల్చగా వుండి పచ్చిక బయళ్లుండబట్టి గొర్రెలు తదితర జంతువుల పోషణ సాధ్యం అవుతుంది. క్రీ. పూ. 600 నాటికి ఈ ఎత్తయిన కొండచరియల మీద పశుపోషకులున్నారు.

ఆహారాన్ని సేకరించే ఆటవికుల దేవతలు అమ్మదేవతలు. వీళ్ళందరి పేర్లు 'ఆయి' అన్న శబ్దంతో అంతమవుతాయి. : తుకాఆయి, యమాయి, ఫిరంగాయి, బోల్హాయి, సటవాయి, వగైరా. కొండ చరియలలో గొర్రెలనూ పశువులనూ పోషించిన పశుపోషకుల దేవుళ్లు మగవాళ్ళు. వాళ్ళ పేర్లు విఠోబా, ఖండోబా, మహసోబా, బీరోబా, బాపూజీబాబా, వేతాల్, మొదలయినవి. ఇప్పటికీ వీళ్ళను ఆరాధించేవాళ్ళు ధన్‌గార్‌లు అనే గొర్రెల కాపరులు. వీళ్ళ ఆలయాలు ఎక్కడున్నా 'అవిధన్‌గార్‌లతో వచ్చాయి' అని స్థానికంగా అంటారు. అమ్మదేవతలు పురుష ద్వేషులయితే వీళ్ళు స్త్రీ ద్వేషులు. అమ్మదేవతల పూజా స్థలాల దగ్గరకు పురుషులు పోతే ప్రాణాపాయం. అలాగే ఈ వేతాళుడు తదితర దేవుళ్ళు బ్రహ్మచారులు కావడమే కాక, వాళ్ళను ఉపాసించే భక్తులు స్త్రీలను చూడకూడదు, ఉపాసించేటప్పుడు గాజుల శబ్దం సహితం వినకూడదు.

ఈ పశుపోషకులకూ లోయలలోని ఆటవికులకూ సంపర్కం ఏర్పడడంతో మొదట సంఘర్షణ, అంతిమంగా సమ్మేళనం జరుగుతాయి. మగదేవుళ్లూ అమ్మదేవతలూ జంటలవుతారు.[52] అయితే ఈ సామరస్యం సులభంగా కుదరలేదనడానికి గుర్తుగా ఈ జంటల కథలు చాలా విచిత్రంగా వుంటాయి. చివరికి, క్రీ. పూ. 6వ శతాబ్దం తరువాత ఉత్తరాదినుండి ఇనుము వాడకం, వ్యవసాయం, రావడంతో బ్రాహ్మణ మతం గూడ ప్రవేశించి, ఈ జంటలు బ్రాహ్మణీకరణ చెందుతారు. 'ఆయి'

లంతా అత్యధికంగా దుర్గ లేక లక్ష్మి అంశలగా గుర్తింపు పొందుతారు. మగదేవుళ్ళలో విఠోబా విఠలుడయి విష్ణువు ప్రతిరూపం అయితే వీరోబా వీరభద్రుడవుతాడు. అయితే వ్యవసాయక సమాజంపైపు జరిగిన ఈ పరిణామంలో ఆటవికులయినా పశుపోషకు లయినా పూర్తిగా తుడిచిపెట్టుకు పోలేదు. నూతన సమాజంలో ఒక శూద్ర కులంగా చేరారు. అందుకు చిహ్నంగా బ్రాహ్మణీకరణ చెందిన అనంతరంగూడ వాళ్ళ దేవుళ్ళ పేర్లు గానీ పాత రూపాలుగానీ పాత పూజలుగానీ పోలేదు. మరీ అనాగరికమయిన లక్షణాలను వదులుకొని మిగిలిన వాటిని-ఏరకమైన నైతిక ప్రామాణికతా లేకున్నా-బ్రాహ్మణ మతంలోకి తమతో తీసుకొచ్చారు.[53] కాలిబాటల కూడలుల దగ్గర అమ్మ దేవతలకు బలులు యిచ్చే ఆటవిక సంప్రదాయం బ్రాహ్మణ మతంలో ఒక అవైదిక ఆచారాన్ని ప్రవేశపెట్టింది. బ్రాహ్మణ మతం పితృస్వామికం కాబట్టి వైదిక ఆచారంలో పితరులకు మాత్రమే 'పిండం' పెడతారు. అయితే ప్రాచీన సాహిత్యంలో ఒక్కొక సందర్భంలో మాతలకు గూడ పిండం పెట్టడం అనే ఆచారం ప్రస్తావన వుంది. పైగా దీనిని 'బలి' అన్నారు. పితరులకు పిండం ఇంటిదగ్గరే పెట్టగా, మాతలకు మాత్రం 'బలులు' ఊరి బయట కూడలుల దగ్గర పెట్టారు. శూద్రకుడి 'మృచ్ఛకటికం' నుండి, బాణుడి 'హర్షచరితం' నుండి ఈ మాతృ బలుల ప్రస్తావనను వుటంకించి విచిత్రమయిన ఈ అవైదిక ఆచారానికి మూలం ఏమయివుంటుందా అన్న మీమాంసతోనే కోశాంబి తన చర్చను ప్రారంభిస్తాడు.[54]

.... విషయాన్ని ఇంకొంచెం వివరంగా, పురావస్తు అవశేషాల ఆధారంగా, పరిశీలిద్దాం. మహారాష్ట్రలో కృష్ణానది తీరంలో పంఢర్‌పూర్ అనే పవిత్రస్థలం వుంది. అక్కడ విఠలుడు అనే దేవుడిని విష్ణువు ప్రతిరూపంగా ఆరాధిస్తారు. ప్రస్తుతం ఈ పంఢర్‌పూర్‌కు సంవత్సరంలో రెండుసార్లు తీర్థయాత్రలకు వెళ్తారు, ఒకసారి జూలై నెలలో, రెండవసారి అక్టోబర్ నెలలో. వ్యవసాయకులకు సరిగ్గా ఈ జూలై-అక్టోబర్ నెలలలోనే పని ఎక్కువ ఉంటుంది. కాబట్టి ఈ ఆచారం వ్యవసాయక సమాజంలో పుట్టింది కావడానికి వీలులేదు. తత్పూర్వపు ఆటవిక సంప్రదాయం అయివుండాలి. ఈ తీర్థయాత్రకు పడమటి ప్రాంతంవారు అనుసరించే బాటను జాగ్రత్తగా విశ్లేషించి కోశాంబి దీని భావాన్ని వివరిస్తాడు.

ఆటవికులకు స్థిర నివాసం ఉండదు. సంచార జీవనం చేస్తారు. తిండి, నీరు, పశువులకు మేత, వెతుక్కుంటూ నైసర్గిక పరిస్థితులు అనుకూలంగా వున్న ప్రాంతాలకు పోతారు. పడమటి కనుమలలో వర్షపాతం చాలా పెద్ద ఎత్తున వుంటుంది. తూర్పున పీఠభూమి మీద తక్కువగా వుంటుంది. వర్షా కాలంలో పడమటి కనుమల దగ్గర ఆహార సేకరణ కష్టం. నివాసాలు ఏర్పరచుకోవడం కష్టం. పశువులను మేపుకోవడం కష్టం. అందుచేత జూలై నెలలో పడమటి కనుమలను వదిలి తూర్పున వున్న నదీ లోయలకు వలస వెళ్తారు. ఈ వలస వెళ్ళిన బాట అంతటా ఇప్పుడు పెద్ద

పరిమాణంలో పురావస్తు అవశేషాలు ఉన్నాయి. నిజానికి ఈ అవశేషాలను బట్టే బాటను గుర్తు పట్టవచ్చును. ఈ అవశేషాలు ప్రధానంగా చిన్నరాతి పనిముట్లు. అవశేషాలలో ఇనుము లేకపోవడమే కాక కుండ పెంకులు గూడలేవు-అందే ఆహారాన్ని నిలువ చేసుకోవడానికి తోలు సంచులు వాడుకున్నారని భావించాలి[55] తోలు సంచులు కుట్టడానికి కావలసిన సున్నితమయిన రాతి పరికరాలు అవశేషాలలో వున్నాయి. ఈ బాట అంతటా అమ్మదేవతల పూజా స్థలాలున్నాయి. ఇప్పటికీ పంధర్‌పూర్ వెళ్ళే యాత్రికులు తోవలో ఆగి అమ్మదేవతలకు పూజలు చేసిపోతారు. పూజా స్థలాల దగ్గర రాతి పనిముట్ల అవశేషాలు పెద్ద ఎత్తున వుండడాన్ని బట్టి పూజా స్థలాలు ఈ సంవత్సరిక వలసలో (ఇంగ్లీషులో దీనిని **booly** లేక **trans humance** అంటారు) మజిలీలని అర్థం అవుతుంది.

పడమటి కనుమలలోని పూనా ప్రాంతం నుండి తూర్పున కృష్ణా నది లోయలోని పంధర్‌పూర్ దాకా ఈ బాటను కోశాంబి వివరంగా పరిశీలించారు. జూలై నెలలో పంధర్‌పూర్‌కు బయలుదేరిన ఈ వలస, వర్షాకాలం అయిపోగానే తిరిగి అక్టోబర్ నెలలో పంధర్‌పూర్ నుండి పడమటి కనుమలకు వెళ్ళింది. మొత్తం 400 మైళ్ళ ఈ వలస ఒక పెద్ద పర్యటన ఆటవికుల జీవితంలో ఒక ప్రధాన ఘట్టం. ఈ వలసకు చివరి మజిలీ అయిన పంధర్‌పూర్ పవిత్ర స్థలం కావడం సహజమే. తరువాతి దశలో అది విఠోబా దేవాలయమయి తదనంతరం బ్రాహ్మణీకరణ చెంది వైష్ణవ తీర్థం అయింది. ఒకప్పుడు పంధర్‌పూర్‌కు వెళ్ళడం, పంధర్‌పూర్ నుండి తిరిగి రావడం అనే రెండు ప్రయాణాలు ఇప్పుడు పంధర్‌పూర్‌కు నాలుగు నెలల్లో రెండు సార్లు వెళ్ళే తీర్థ యాత్రలగా మారింది.[56]

కొండ చరియల పై భాగంలో, అడవి పల్చగా వున్నచోట, మగదేవుళ్ళను పూజించిన పశుపోషకులున్నారని చూసాము. ఇప్పటి ధన్‌గార్ గొర్రెల కాపరులను కోశాంబి వాళ్ళ వారసులగా అర్థం చేసుకుంటాడని గూడ చూసాము. వీళ్ళ దేవుళ్ళు మగ దేవుళ్ళే గాని ఆటవిక స్వభావం గలవాళ్ళు. ఈ పశుపోషకులకూ కింది ప్రాంతపు ఆటవికులకూ మధ్య జరిగిన ఘర్షణ పూజల మధ్య సంఘర్షణగా కనబడు తుంది. ఈ ఘర్షణ అంతిమంగా సామరస్య పూరితమయిన ఐక్యతగా మారిందని గూడ పూజలలోని పరిణామాలను బట్టి తెలుస్తుంది. ఉదాహరణకు, పశుపోషకుల మగ దేవుడయిన మహసోబా మహిషా సురుడయి అమ్మదేవతలయిన జోగుబాయి తుకాయిల చేత చంపబడతాడు. ఈ దేవతలిద్దరూ దుర్గ ప్రతిరూపాలు. అయితే మహిషాసుర మర్దనాన్ని సూచించే రాతి బొమ్మల సమీపంలోనే మహసోబా అదే జోగుబాయికి భర్తగా తుకాయికి అనుచరుడిగా కనబడతాడు. మళ్ళ సమీప గ్రామాలలో మహసోబాకు అసలు భార్యే లేదంటారు. మహసోబా ఈ విధంగా ఏక సమయంలో మహిషాసురుడు, శివుడు, అయ్యాడు! నిజానికి ఈ మహసోబా (లేక మహతోబా)ది చాలా వింతకథ. ఇతను

వాకాడ్ అనే గ్రామంలో జోగు బాయికి భర్త. అయితే అక్కడికి రాకపూర్వం దాన్క మాన్ అనే చోటి నుండి ఏడుగురు కన్యలను అపహరించి నీటిలో ముంచి చంపేసాడంట. అమ్మదేవతలతో ఇతనికి ఉండే వైరాన్ని ఇది సూచిస్తుంది. అయితే ఇతన్ని పూజించిన పశుకాపరులు అమ్మదేవతలను పూజించిన ఆటవికులను పూర్తిగా తుడిచిపెట్టేయలేదు. కాబట్టి చివరికి సామరస్య పూరితంగా వాకాడ్ దగ్గర ఇతన్ని జోగుబాయికి ఇచ్చి పెళ్ళి చేసారు. పైగా ఆటవికుల కోపపూరితమైన జ్ఞాపకాలకు చిహ్నంగా అదే జోగుబాయి దుర్గ రూపంలో, మహిషాసురుడిగా భావించబడిన మహసోబాను చంపుతుంది![57]

ఈ సంఘర్షణ, సామరస్యం, ఇతర పూజా స్థలాలలో గూడ కనబడతాయి. పంధర్‌పూర్‌లోని పాండురంగ విఠలుడు లేక విఠోబా అని పిలవబడే విష్ణువు భార్య, రఖుమాయి అని పిలవబడే లక్ష్మి. ఈమెకు వేరే పేరు ఉండడమే కాక, పంధర్‌పూర్‌లో విఠలుని దేవాలయంలో వుండక, వేరే తన స్వంత దేవాలయంలో వుండి స్వతంత్రంగా పూజలు అందుకుంటుంది (వెంకటేశ్వరుని పద్మావతిలాగ) పంధర్‌పూర్‌లో విఠలుని దేవాలయమే మొదటిది అయివుంటే లక్ష్మికి వేరే పేరుగాని వేరే పూజలుగాని వేరే దేవాలయం గాని ఉండాల్సిన అవసరం లేదు. అసలు ఆటవికుల అమ్మదేవత అయిన రఖుమాయి ఇక్కడి మొదటి దేవత అయివుండాలి. విఠోబాను పూజించిన పశుపోషకులు ఈ ఆటవికులను లొంగ దీసుకున్న తరువాత వీళ్ళిద్దరికి పెళ్ళిచేసారు.[58] అయితే ఆటవికులు లొంగిపోయినా పూర్తిగా నాశనం కాలేదు కాబట్టి రఖుమాయి స్వతంత్రం గానే పూజలు అందుకుంది. తరువాతి దశలో వ్యవసాయం, ఇనుము వాడకం, వచ్చిన తరువాత ఈ రెండు పూజలూ బ్రాహ్మణీకరణ చెంది విఠోబా విష్ణువయి రఖుమాయి లక్ష్మి అయింది. అయితే వ్యవసాయక సమాజాన్ని తీసుకొచ్చిన 'ఆర్యులు' ఇక్కడి ప్రజలను శూద్రులుగా లొంగదీసుకున్నారే తప్ప నాశనం చేయలేదు కాబట్టి ఈ దేవుళ్ళ పాత పేర్లూ పాత పూజలూ మిగిలి పోయాయి.[59] అమ్మదేవతలంతా ఈ విధంగా లక్ష్మిగానో లేక (అత్యధికంగా) మహిషాసురమర్దిని అయిన దుర్గగానో మారిపోగా మగదేవుళ్ళలో వాఘోబా వ్యాఘ్రేశ్వరుడవుతాడు, పైఠాన్‌లోని ఖండోబా శివుడవుతాడు, మహసోబా ఏక సమయంలో మహిషాసురుడూ శివుడూ గూడ అవుతాడు.

వ్యవసాయ సమాజం ఆవిర్భావం పూజల పరిణామాలలోనే కాక, పూజా స్థలాల స్థానభ్రంశంలో గూడ కనబడుతుంది. ఇప్పటి గ్రామాలు ఎక్కువగా నీటి వనరుల దగ్గర, నదీ తీరాలలో వుంటాయి. కాని తొలినాడు నదీ లోయ ప్రాంతాలు దట్టమయిన అడవులుగా వుండి సంచార ఆటవిక జీవితానికి అయోగ్యంగా వుండి వుండాలి. తొలి నాటి ఆటవిక ఆవాసాలు మెట్ట ప్రాంతంలోనే వుండగలవు. ఇనుము వాడకం తెలిసిన తరువాతే కిందికి దిగి నదీతీర ప్రాంతాలలో వ్యవసాయ గ్రామాలు ఏర్పరచుకోగలుగు తారు. దీనికి గుర్తుగా, తొలినాటి పూజరాళ్ళు ఇప్పటి గ్రామాలలో కాక, గ్రామానికి కొంత దూరంగా ఎత్తయిన చోట కనబడతాయని కోశాంబి గమనిస్తాడు. అనే అమ్మ

దేవతకు గ్రామం లోపల కొంచెం నాగరికమయిన గుడి వుంటుంది. దుర్గ గానో లక్ష్మి గానో గుర్తించ బడుతుంది. పైగా ఆ దేవత గ్రామం బయటి నుండి గ్రామంలోకి వచ్చిందని (చారిత్రక పరిణామానికి గుర్తుగా) చెప్పుకుంటారు గూడ. మగదేవుళ్ళ విషయం గూడ అంతే. కోశాంబి చాలా ఉదాహరణ లిస్తాడు. తుకాయి అనే అమ్మ దేవతకు ప్రముఖ పూజా స్థలం కొండన్‌పూర్ అనే గ్రామం. అయితే తుకాయి తొలినాటి పూజరాయి కొండన్‌పూర్‌కు అయిదు మైళ్ళ దూరంలో ఎత్తయిన గుట్ట మీద వున్న తటాకం దగ్గర వుంది. అక్కడి నుండి ఆమెను హీరాబాయి అనే స్త్రీ గ్రామంలోకి తీసుకొచ్చిందని చెప్పుకుంటారు. పాతకాలపు ఆచారానికి అవశేషంగా ఈ తుకాయికి పూజలు నిర్వహిస్తారు.[60] ఈ ఆచారం చాలా తెగలలో వుంది-అది పితృ స్వామిక సమాజంలో మాతృస్వామ్యం అవశేషాన్ని సూచిస్తుంది. ఈ విధంగా పూజా స్థలాలు మెట్ట ప్రాంతాల నుండి నదీ తీరప్రాంతాలకు స్థాన భ్రంశం చెందిన అనేక ఉదాహరణలు కోశాంబి ఇస్తాడు.[61]

దక్కన్ పీఠభూమి వ్యవసాయీకరణ చరిత్రను ముగించే ముందు, మన (ఆంధ్రుల) చరిత్రను గురించి రెండు మాటలు చెప్పుకోవాలి. ఇనుము వాడకం వ్యవసాయం క్రీ.పూ. 6వ శతాబ్దం నుండి దక్షిణాపథం మీదుగా గోదావరి తీరాన్ని చేరిందన్న కోశాంబి అభిప్రాయాన్ని చూసాము. అక్కడి నుండి పడమటికి విస్తరించి మహారాష్ట్ర ప్రాంతంలో ఆటవికులకు ఆహార ఉత్పత్తిని అలవర్చిన తీరునుగూడ చూసాము. అదే సమయంలో ఈ కొత్త సమాజం తూర్పుకు గూడ విస్తరించింది. బుద్ధుడి సమకాలికులయిన పైఠాన్ ప్రాంతపు అశ్మకులు (అశ్వకులు) అనబడే గుర్రం కుదురు చిహ్నంగా గల గణజీవులు ఇనుము వాడకాన్నీ వ్యవసాయాన్నీ అలవర్చుకున్నారు. వాళ్ళ గణముఖ్యులు శాతవాహనులయి తూర్పు దక్కన్ ప్రాంతపు తొలి రాజ్యాన్ని స్థాపించారు. దక్కన్ పీఠభూమికి వ్యవసాయ వర్గసమాజ వ్యాప్తిలో భాగంగా వచ్చిన బ్రాహ్మణ బౌద్ధ మతాలను రెండింటినీ సమంగానే ఆదరించారు.[62]

కాబట్టి మన 'ఆంధ్రుల చరిత్ర' లన్నీ శాతవాహనులతో ప్రారంభం కావడం సహజమే. అయితే ఆహార సేకరణ నుండి ఆహార ఉత్పత్తికి జరిగిన ఏ విప్లవాత్మకమైన పరిణామమయితే శాతవాహనుల రాజ్యానికి కారణం అయిందో ఆ పరిణామం యొక్క అధ్యయనాన్ని కొనసాగించకుండ, చరిత్ర అంతాగూడ శాతవాహనులు-ఇక్ష్వాకులు-చోడులు-పల్లవులు-అంటూ రాజవంశాల అనుక్రమణికగా మన పుస్తకాలలో రాస్తారు. కోశాంబి సూచించిన పద్ధతిని అనుసరించేటట్టయితే పూర్తిగా వేరే చరిత్ర రాయాల్సి వుంటుంది. కోశాంబి అధ్యయనం చేసిన పడమటి దక్కన్‌లాగ తూర్పు దక్కన్‌కు చెందిన తెలంగాణ గూడ అమ్మదేవతల పూజలకు ప్రముఖ కేంద్రం. తెలంగాణలోని చెరువుల కట్టలు కాకతీయులచేతగాని తదనంతర కాలంలోగాని నిర్మించినవి కావచ్చు, కాని నీటి వనరులగా అవి చాలా ప్రాచీనమయినవి. ఈ చెరువు

లన్నీ ఇప్పటికీ ప్రముఖమైన అమ్మదేవతల పూజాకేంద్రాలు. తెలంగాణలో జరిగే బోనాల పండగతో పోల్చదగ్గ అమ్మదేవతల పండుగలు దేశంలో చాలా కొద్ది సంఖ్యలోనే వుంటాయి. హైదరాబాద్‌లోని హుసేన్‌సాగర్ ఇటువంటి అమ్మదేవతల పూజలకు ప్రముఖ కేంద్రం అయి వుండాలి. ఇప్పటికీ హుసేన్ సాగర్ చుట్టూ అమ్మదేవతల పూజామందిరాలు అసంఖ్యాకంగా వున్నాయి. చెరువు కట్టకు పడమటి దిక్కున, బొంబాయి రైలుమార్గం అవతల, ఒక్క ఫర్లాంగు నిడివిలో ఖైరతాబాద్ మెయిన్‌రోడ్ల మీదనే ఇద్దమ్మ, పెద్దమ్మ, గడ్డలమ్మ, నీళ్ళపోచమ్మ, ఊరపోచమ్మ మొదలయిన పేర్లుగల అమ్మదేవతల పూజా మందిరాలు కనీసం ఒక్క డజను వున్నాయి. ఇంత మంది దేవతలూ ఒకే ప్రాంతంలో ఆరాధించబడి వుండడానికి వీలులేదు. వ్యవసాయక సమాజం విస్తరించిన క్రమంలో వీళ్ళ పూజలతో బాటు పూజాస్థలాలు గూడ స్థానభ్రంశం చెంది వుండాలి. వీళ్ళ పూజలలోని మార్పులను, పూజాస్థలాలలోని మార్పులను, బోనాల పండగలో వచ్చిన పరిణామాలను, పురావస్తు అవశేషాలతోనూ కాలిబాటల మార్గాలతోనూ జోడించి అధ్యయనం చేయడం అవసరం. ఆహారసేకరణ నుండి ఆహార ఉత్పత్తికి జరిగిన మార్పును ఇవి సూచిస్తాయి. ఆహారాన్ని సేకరించడం మాని ఉత్పత్తి చేయడం మొదలు పెట్టడంతో చరిత్ర పూర్వదశ (pre-history) అంతమయి చరిత్ర మొదలవుతుందను కుంటే 'ఆంధ్రుల చరిత్ర' క్రీ.పూ. 6వ శతాబ్దం నుండి తెలంగాణలో మొదలయింది. కొన్ని శతాబ్దాల తరువాత గాని కోస్తా జిల్లాలలోని డెల్టా అడవులను వ్యవసాయ యోగ్యం చేసేస్థాయికి అది ఎదగలేదు. 19వ శతాబ్దంలో కృష్ణ గోదావరి నదుల మీద బ్రిటిష్ వాళ్ళు బ్యారేజీలు కట్టేదాకా డెల్టా ప్రాంతంలో అడవులు మిగిలే వున్నాయి. ఇక ప్రాచీన కాలం సంగతి చెప్పనవసరం లేదు.

ఈ చరిత్రను తెలుసుకోవడానికి అధ్యయనం ప్రారంభించాల్సింది శాతవాహనుల శాసనాలతోకాదు, పోచమ్మ పూజలతోనూ బోనాల పండుగతోనూ. అక్కడే మన చరిత్ర మూలం దొరుకుతుంది. ఇప్పటిదాకా రాసిన 'ఆంధ్రుల చరిత్ర' పుస్తకాలలో- ఏటుకూరి బలరామమూర్తి, కంభంపాటి సత్యనారాయణల వంటి మార్క్సిస్టుల పుస్తకాలతో సహా-ఈ స్పృహ అవగింజంతయినా లేదు. కోశాంబి నుండి ఉత్తేజం పొందినట్టు కనిపించే కంభంపాటి సత్యనారాయణ గారికి అసలు కోశాంబి అధ్యయన పద్ధతే అర్థం కాలేదు.

## వివరణలు

1. Scientific Numismatics, IN, Pages 152, 154
2. ISIH, Page 184, పాదసూచిక 4
3. The origin and development of silver coinage in India, IN, Page 91

4. Scientific Numismatics, IN, Page 153
The study and metrology of silver punch-marked coins, IN, Pages 69-70
5. The study and metrology of silver punch-marked coins, IN, Page 24
6. కోశాంబి పద్ధతిని వివరణాత్మకంగా తెలిపేవ్యాసం :
The chronological order of punch-marked coins-I : A re-examination of the older Taxila hoard, IN, Pages 107-122
7. Scientific Numismatics, IN, Page 150
8. The chronological order of punch-marked coins-I, IN, Page 121
9 The study and metrology of silver punch-marked coins-I, IN, Page 67
10. The chronological order of punch-marked coins-I, IN, Page 115
11. The study and metrology of silver punch-marked coins, IN, Page 52
12. The study and metrology of silver punch-marked coins, IN, Pages 46-47
13. ISIH, Page 176
14. The chronological order of punch-marked coins-I, IN, Page 121
15. The study and metrology of silver punch-marked coins, IN, Page 71
ISIH, Page 176
16. The chronological order of punch-marked coins-I, IN, Page 119
17. పురాణాలు చదివే ఓపిక లేకుంటే విశ్వనాథ సత్యనారాయణగారి పురాణవైర గ్రంథమాల చదివితే ఈ విషయం అర్థం అవుతుంది.
18. The origin and development of silver coinage, in India, IN, Pages 49- 93
19. Scientific Numismatics, IN, Page 154
20. The origin and development of silver coinage in India, IN, Page 91
21. The origin and development of silver coinage in India, IN, Page 92
22. ISIH, Page 183
23. The origin and development of silver coinage in India, IN, Page 93
24. CCAI, Page 189
Pilgrim's progress : A contribution to the pre-history of the Western Deccan Plateau, MR, Page 130
ISIH, Pages 273-274
25. Dhenukakata, HS, Page 198

26. Pilgrim's progress...,MR, Page 114
27. CCAI, Pages 136-137లలోని చిత్రపటం చూడండి
28. ఈ విమర్శ సూత పుత్రుడయిన కర్ణుని చేత చేయించడం వింతేనని కోశాంబి అంటాడు. Combined methods in Indology, HS, Page 21
29. CCAI, Page 119
30. Combined methods in Indology, HS, Page 22
31. Social and Economic aspects of the Bhagavad-Gita, MR, Page 19
32. ISIH, Page 192
33. ISIH, Pages 134-135.
34. What constitutes Indian History ? HS, Page 70
35. ISIH, Page 134
36. The Basis of Ancient Indian History, HS Page 29
37. The Study and metrology of silver Punch-Marked coins IN, Page 19
ఇప్పటికీ రాశులను అనుసరించి చెప్పే జ్యోతిష్యాన్ని పాశ్చాత్య జ్యోతిష్యం అనీ నక్షత్రాలను అనుసరించే దాన్ని భారతీయ పద్ధతి అనీ అంటారు.
38. జ్యోతిష్యాన్ని గురించి ఇక్కడే రెండు మాటలు చెప్పుకుంటే సరిపోతుంది. తొలినాటి వ్యవసాయక సమాజంలో ఋతుక్రమాన్ని తెలుసుకోవడానికి రాశుల నక్షత్రాల పరిజ్ఞానం అత్యవసరమయింది. అయితే ఈ ప్రాముఖ్యం త్వరలోనే తలకిందులయి రాశులూ నక్షత్రాలూ జీవితాన్ని శాసించే శక్తులుగా భావించబడ్డాయి. ఆదిమకాలంలో కార్యకారణ సంబంధాల గురించి స్పష్టత లేని దశలో ఒక సూచికగానో సంకేతంగానో వున్నది. హేతువుగా, కారణంగా భ్రమించబడుతుంది. ఋతుక్రమాన్ని సూచించే నక్షత్రాలు జీవితాన్ని శాసించేవి అయ్యాయి. ఈ నమ్మకం బ్రాహ్మణులకు లాభదాయకం కావడం వల్ల పెంచి పోషించబడింది. జ్యోతిష్యం తప్పని ప్రయోగాత్మకంగా 'రుజువు' చేయాల్సిన అవసరం లేదు. అది చరిత్రలో ఎందుకు పుట్టిందో అర్థం చేసుకోగలిగితే చాలు దాని మీదున్న విశ్వాసానికి పునాది పోతుంది. ఇది ఒక్క జ్యోతిష్యానికే కాదు ఏ మూఢ విశ్వాసానికయినా వర్తిస్తుంది.
39. Pilgrim's Progress...MR, Page 114.
40 Pilgrim's progress : A contribution to the pre-history of th Western Deccan Plateau, MR, Pages 110-152
At the cross-roads : A study of mother goddess cult sites MR, Pages 82-109.
41. Pilgrim's Progress... MR, Page 111;
CCAI, Pages 111-112.
42. Combined methods in Indology, HS, Pages 17-18
43. The Buddist Caves of Western India,

Times of India Annual numse, 1961.
44. At the cross-roads... MR, Page 100
45. At the cross-roads... MR, Page 98
46. Pilgrim's Progress... MR' Page 116
47. At the cross-roads... MR, Pages 96-97
48. CCAI, Pages 184-185
49. ISIH, Page 268
50. The Buddhist Caves of Western India, Times of India Annual number, 1986
51. ISIH, గూడ చూడవచ్చు.
52. At the cross-roads... MR, Page 86
53. Pilgrim's Progress... MR, Page 141
54. At the cross-roads... MR, Pages 82-83
55. Pilgrim's Progress... MR, Page 129
56. Pilgrim's Progress... MR, Page 130
57. Pilgrim's Progress... MR, Pages 122-123
58. At the cross-roads... MR, Page 86
59. కనీసం పంధర్‌పూర్‌లోని విఠల దేవాలయాన్నీ, లక్ష్మి దేవాలయాన్నీ కలిపి ఒకే దేవాలయం చేసి ఉండ వచ్చును. కాని ఎన్ని గుళ్లుంటే బ్రాహ్మణులకు అంత లాభం కాబట్టి వాళ్ళు ఆ పని గూడ చేయలేదు.
60. Pilgrim s Progress... MR, Pages 115
61. Pilgrim's Progress MR, Pages 114-125
62. ISIH, Page 244
63. ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర (రెండు సంపుటాలు)

# 7. వ్యవసాయువిస్తరణ-స్వయంపోషక గ్రామాలు

ఆహార సేకరణ నుండి ఆహార ఉత్పత్తికి జరిగిన పరిణామం క్రీ పూ.300 నాటికి గంగా యమునా లోయలలో ఒకకొలిక్కి వచ్చింది. ఆహారాన్ని ఉత్పత్తి చేసే వ్యవసాయక వర్గసమాజం రాచరికం ఏర్పడ్డాయి. అంతేకాక ఇప్పుడు యజుర్వేద కాలంలో లాగ వానాకాలం వ్యవసాయం-వేసవికాలం సంచారం అనే పద్ధతిపోయి, చాలావరకు స్థిరవ్యవసాయం ఏర్పడింది. అందే మొదటి అధ్యాయంలో చెప్పిన మూడు పరిణామాలలో రెండవది గూడ రూపం తీసుకుంది. 'గ్రామం' అనే మాటకు ఇప్పుడు సంచార సజాతుల బృందం అనే అర్థం పోయి వ్యవసాయ ప్రధానమయిన స్థిర ఆవాసం అనే ఆధునిక అర్థం వచ్చింది. యజ్ఞ బలుల రూపంలో కాక కర్షకుల నుండి అదనపు ఉత్పత్తిని పన్నుల రూపంలో తీసుకుంటున్నారు. (అయితే పాత ఆచారానికి అవశేషంగా పన్నులలో 'బలి' అనేది ఒకటి నిలిచిపోయింది). పట్టణా లలో సంపన్నులైన రాజులు, శ్రేష్ఠులూ పురోహితులు వున్నారు. గ్రామాలలో భూమినీ పశుసంపదనూ ఉమ్మడిగా కలిగిన సజాత వ్యవసాయక బృందాలున్నాయి.

ఇదంతా నాగరికత విస్తరించిన ప్రాంతాలలో. అయితే ఇంకా చాలా భూభాగంలో ఆటవికులున్నారు. అడవులున్నాయి. ఈ అడవులలో ఇనుము వాడకాన్నీ వ్యవసాయక వర్గసమాజాన్నీ ప్రవేశపెట్టే కర్తవ్యం ఇంకా మిగిలేవుంది. ఇదికాక, స్థిర వ్యవసాయ గ్రామాలు మరొక్క అడుగు ముందుకు పోయి స్వయంపోషకం కావలసి వుంది. ఇది మొదటి అధ్యాయంలో చెప్పిన మూడవ పరిణామం. వ్యవసాయానికి అనుబంధమయిన వ్యవసాయేతర ఉత్పత్తి అప్పుడు అధికంగా గ్రామంలోనే జరుగు తుంది. ఇనుము, ఉప్పు వంటివి కొన్ని తప్ప మిగిలిన నిత్యజీవిత అవసరాలన్నీ గ్రామంలోనే తయారవుతాయి. దీనికి కావలసిన సామాజిక నిర్మాణం రూపొందాల్సి వుంది.

వ్యవసాయ విస్తరణలో బౌద్ధ బ్రాహ్మణ మతాలు గతంలో లాగే పనిచేసాయి. కాని స్వయంపోషక గ్రామాల ఆవిర్భావంలో మాత్రం బ్రాహ్మణ మతానిదే పైచేయి అయింది. బ్రాహ్మణుల వర్ణవ్యవస్థ మరింత పరిణతం చెంది కులవ్యవస్థ అయి స్వయంపోషక గ్రామీణ సమాజానికి నిర్మాణ సూత్రం అయింది. బౌద్ధం ఈ పని చేయలేకపోగా, గ్రామీణ స్వయంపోషకత్వం వల్ల దెబ్బతిన్న దూరప్రాంత వర్తకంతో బాటు తానుగూడ దెబ్బతిని తన పునాది కోల్పోయింది. బౌద్ధుల సామాజిక నీతిగూడ

మగధ సమాజానికి తగినంతగా, స్వయంపోషక గ్రామీణ జీవితానికీ దానిమీద ఆధారపడ్డ భూస్వామ్య వ్యవస్థకూ తగిందికాదు. బ్రాహ్మణులు భూస్వామ్య వ్యవస్థకు సరిగ్గా అతికే భక్తిభావాన్ని కల్పించి, భగవద్గీతలో కృష్ణుడిచేత చెప్పించి మహాభారతంలోనికి ఇరికించారు. బౌద్ధమతం నాశనం కావడానికి శంకరాచార్యుడి తార్కిక శక్తి కారణంకాదు, స్వయంపోషక గ్రామీణవ్యవస్థ ఆవిర్భావం బౌద్ధానికి సామాజిక పునాది లేకుండ చేసి బ్రాహ్మణ మతాన్ని కాపాడింది. అయితే దక్కన్‌లో మారుమూలలకు వ్యవసాయక వర్గ సమాజాన్ని విస్తరింపజేసే పరిణామక్రమం ఇంకా చాలా కాలం సాగుతూనే వుంది కాబట్టి ఆ విస్తరణలో తన కర్తవ్యాన్ని గతంలోలాగ నిర్వహిస్తూ వచ్చిన బౌద్ధం చాలాకాలం నిలిచింది.

## కౌటిల్యుడు - అశోకుడు

మగధ రాజ్యం, దాని చివరిదశ అయిన మౌర్య సామ్రాజ్యాల గురించి ఇదివరకే చాలాసార్లు ప్రస్తావించాము. క్రీ. శ. 312లో స్థాపించబడిన మౌర్య సామ్రాజ్యం భారత ఉపఖండంలో చాలా మేరకు విస్తరించింది. వాయవ్య దిశలో గాంధార నుండి తూర్పున కళింగ దాకా, దక్షిణాన మైసూరుదాకా మౌర్యుల అధికారం చలామణి అయింది. ప్రాచీన తమిళ సాహిత్యంలో 'మొరియార్' సైన్యం మధురదాకా వచ్చి తిరిగి వెళ్ళిందన్న అస్పష్టమైన ప్రస్తావన [1] మౌర్యుల గురించే అయితే మైసూరు నుండి ఇంకా దక్షిణానికి గూడ మౌర్య సామ్రాజ్యం విస్తరించిందని అర్థం చేసుకోవాలి.

అయితే ఉపఖండ వ్యాప్తమయిన 'సామ్రాజ్యం' అంటున్నామంటే ఆ భూభాగాన్ని ఆధునిక నమూనాలో ఊహించుకోకూడదు. అది స్థిర వ్యవసాయ గ్రామాలతో నిండి వుందని భావించకూడదు. అప్పటికి ఆ 'సామ్రాజ్యం'లో మూడు రకాల భాగాలున్నాయి. కొన్ని స్థిర నివాస గ్రామాలున్నాయి. కొన్ని వ్యవసాయక సంచార బృందాలున్నాయి. చాలా భాగం ఇంకా ఇనుము వాడకం వ్యవసాయం తెలీని అడవి ప్రాంతాలూ పశుపోషక గణాలూ వున్నాయి.[2] మౌర్యులు దక్కన్‌నూ తూర్పు భారత దేశాన్ని 'జయించారు' అంటున్నామంటే ఇక్కడ వ్యవసాయక సమాజాలూ రాజ్యాలూ ఉన్నాయనీ ఆ రాజులను మౌర్యులు ఓడించారనీ కాదు. మౌర్యుల సమకాలికులలో తూర్పు దక్షిణ భారత దేశానికి చెందిన రాజులెవ్వరూ లేరు. రాజ్యాలు లేవు. వివిధ దశలకు పరిణతి చెందిన గణాలు మాత్రమే ఉన్నాయి. అశోకుడికి అహింస వైపు బుద్ధి మళ్ళించిన కళింగ యుద్ధం సంగతి అందరికీ తెలిసిందే. ఆ యుద్ధాన్ని గురించి అశోకుడు ఒక శాసనంలో చెప్పాడు గానీ తాను ఓడించిన రాజు ఎవ్వరో చెప్పలేదు. ఆ యుద్ధంలో లక్ష మందిని చంపి లక్షా యాభై వేల మందిని చెరపట్టి తెచ్చానని చెప్తాడు గాని వాళ్ళ రాజు వలాన అనలేదు. కాబట్టి చెప్పుకోదగ్గ జనాభాను పోషించగల స్థితికి

అప్పటికి కళింగ ప్రాంతపు గణాలు ఎదిగాయి గానీ ఇంకా రాజ్యాలూ రాచరికాలూ ఏర్పడ లేదు.[3] దక్షిణ భారత దేశం గూడ అంతే. ఒక శాసనంలో అశోకుడు తన రాజ్యం పరిసరాలలో వున్న దేశాలను ప్రస్తావిస్తూ 'చోడులు, పాండ్యులు, సతియ పుతులు, కేరళపుతులు, యవన రాజు అంతియకుడు (Antiochus), అతని ఇరుగు పొరుగు రాజులు' అంటాడు. వాయవ్యాన్ని గురించి చెప్పేటప్పుడు రాజుల ప్రస్తావన తెచ్చి, దక్షిణ భారత దేశానికి వచ్చేటప్పటికి మాత్రం 'చోడులు, పాండ్యులు' అంటున్నాడంటే అవి రాజ్యాలు కావు, గణాలని అర్థం అవుతుంది.[4] మొత్తం అశోకుడి శాసనాలలో అంటియోకస్, మాగస్, టాలెమియాస్, అలెగ్జాండ్రాస్ అనే గ్రీకురాజుల పేర్లున్నాయిగానీ ఒక్క భారతీయ రాజు పేరూ లేదు.[5]

గణాలు ఇంత అధిక సంఖ్యలో ఉండడమేకాక, వ్యవసాయం అలవడిన ప్రాంతాలలో సహితం అప్పటికింకా స్థిర వ్యవసాయం సర్వత్రా లేదు. పశుపోషణకు అనుబంధమయిన వ్యవసాయం మిగిలి వుంది. స్థిర వ్యవసాయం అభివృద్ధి చెందిన చోట గూడ గ్రామీణ శ్రమ విభజన ఇంకా అపరిణతంగా వుంది. మౌర్యుల చివరి రోజులదాకా గ్రామాల వ్యవసాయేతర అవసరాలు (పనిముట్లు, వస్త్రాలు, వగైరా) గ్రామాలలోనే తయారయ్యే స్వయం పోషక వ్యవస్థ ఆవిర్భవించలేదు. అప్పటికి ఇంకా కర్షకుల వ్యవసాయేతరమయిన అవసరాలను పట్టణ ప్రాంత వృత్తి శ్రేణులు, వర్తకశ్రేణులు, తీరుస్తున్నాయి. ఈ శ్రేణులు మగధ రాజ్యం ఆవిర్భవించిన నాటి నుండి పట్టణాలలో బలమైన వర్గాలుగా వున్నాయి. మౌర్యుల కాలంలో మన దేశానికి వచ్చిన మెగస్తెనీస్ మన దేశంలో 7 వర్గాలను గుర్తించాడు. వాటిలో గ్రామీణ కర్షకులు ఒకటికాగా, వృత్తిపని వాళ్ళనూ వ్యాపారస్తులనూ కలిపి ఒక పట్టణ ప్రాంత వర్గంగా చెప్పాడు.[6] అదే స్వయం పోషక గ్రామాల ఆవిర్భావం తరువాత అయివుంటే వృత్తి పనివాళ్ళనూ రైతులనూ ఒకటిగా (ఒక గ్రామీణ వర్గంగా) చెప్పి, వర్తకులను వేరేగా చెప్పి వుండేవాడు.

ఇటువంటి సామ్రాజ్యంలో అదనపు ఉత్పత్తి చాలా స్వల్పంగా, 'పల్చ'గా, వుంటుంది. దానిని చెప్పుకోదగ్గ మొత్తంలో సేకరించాలంటే పరిపాలన కేంద్రీకృతంగా వుండాలి. శిస్తుసేకరణ కర్కశంగా వుండాలి. వీలయిన మేరకు వ్యవసాయేతర సరుకుల ఉత్పత్తీ వర్తకం గూడ కేంద్రీకృతంగానే సాగాలి. ప్రపంచంలోని అన్ని దేశాలలోనూ ఈ దశలో-అంటే ఇనుము యుగానికి చెందిన వ్యవసాయ వర్గ సమాజం స్థిరపడిన తొలి రోజులలో-పెద్ద పెద్ద 'సామ్రాజ్యాలు' వచ్చాయి. రోమన్ సామ్రాజ్యం నుండి మౌర్య సామ్రాజ్యం దాకా ఈ కోవకు చెందినవే. ఇవి పేరుకు మాత్రమే సామ్రాజ్యాలు, వీటి పునాది అయిన అదనపు ఉత్పత్తి చాలా పల్చనయినది. అయితే దాన్ని మొత్తం కేంద్రీకృతంగానూ క్రూరంగానూ సేకరించి వినియోగించడం వల్ల చాలా ఆర్భాటమయిన రాచరికాలూ, వలుదిశలా విస్తరించే వ్యాపారాలూ సాగితాయి.

సామాజిక అభివృద్ధి ఇంకొంచెం పురోగమించడంతో ఈ సామ్రాజ్యాలు కూలిపోతాయి. కర్షకుల అవసరాలు సమర్ధ వంతంగా తీరాలంటే శ్రమ విభజన పెరగాలి. మన దేశంలో నయితే వ్యవసాయేతర గ్రామీణ అవసరాల ఉత్పత్తిగూడ గ్రామంలోనే జరగడం మొదలవుతుంది. వడ్రంగి కమ్మరి కుమ్మరి శాలి గ్రామాలలోనే స్థిరపడతారు. వృత్తి శ్రేణులూ వర్తకపు శ్రేణులూ తమ ఉనికిని కోల్పోతాయి. పైగా అప్పుడు ఉత్పాదకత పెరుగుతుంది కాబట్టి అదనపు ఉత్పత్తి సేకరణ (శిస్తువసూలు) కేంద్రీకృతంగా సాగనక్కరలేదు. వికేంద్రీకరణ చెందడం అప్పుడు సాధ్యం. గ్రామం స్థాయిలో భూస్వాములు, ఆపైన సామంతులు, ఆపైన రాజులు, మహా రాజులు, చక్రవర్తులు,-పాలకవర్గం ఒక దొంతరగా ఏర్పడగలదు. కేంద్రీకృత పాలన ఇప్పుడు పోయి కింది వాడు పై వాడికి శిస్తు చెల్లించి, వాడికి అవసరమయినప్పుడు తన సైన్యాన్ని పంపించే ఒప్పందం మీద పైవాడు కిందివాడి పరిపాలనా స్వయంప్రతిపత్తిని గుర్తిస్తాడు. ఇది (స్థూలంగా) భూస్వామ్యవ్యవస్థ లక్షణం. గంగాయమునా లోయలలో మౌర్యుల పతనంతో స్వయంపోషక గ్రామాలు ఏర్పడి, వాటిని ప్రాతిపదికగా భూస్వామ్య వ్యవస్థ ఆ తరువాతి శతాబ్దాలలో రూపొందింది. యూరప్‌లో రోమన్ సామ్రాజ్యం పతనంతో భూస్వామ్య వ్యవస్థ ప్రారంభ మయింది. రాజ్యాలూ వర్తక వాణిజ్యాలూ ఎంత ఆర్భాటంగా వుంటే అంత గొప్ప అని భావించే బూర్జువా చరిత్రకారులు ఈ దశను 'చీకటియుగం' అనడం కద్దు. అయితే ఉత్పత్తిచేసే రైతును అడిగితే తన బ్రతుకు మునుపటి కంటే ఇప్పుడే నయం అంటాడు. తనకు కావలసిన పనిముట్లూ గుడ్డలూ గ్రామంలోనే దొరుకుతాయి. అవసరమయితే ఆ పనిముట్లతో తాను గూడ ఆయుధాలు తయారు చేసుకోవచ్చును. తనను దోచుకునే వాడు ఎక్కడో పాటలీ పుత్రంలో వుండే రాజు కాక, ప్రత్యక్షంగా కనబడే 'దొర' అవుతాడు.

మన దేశంలోని మొట్ట మొదటి వ్యవసాయిక రాజ్యం అయిన మగధ ఆవిర్భావాన్నీ అభివృద్ధినీ పణశాస్త్ర అధ్యయనం సహాయంతో కోశాంబి వివరించిన తీరును కిందటి అధ్యాయంలో చూసాము. 'నందరాజుల' కాలానికి వచ్చేసరికి మగధ పెద్ద రాజ్యం అయింది. మౌర్యులతో ఇంకా విస్తరించింది. అశోకుని కాలానికి అత్యున్నత దశను చేరుకుని క్రమంగా క్షీణించింది. ఈ పరిణామాన్ని నడిపిన ఆర్ధిక వైరుధ్యాలను కోశాంబి శాసన సాహిత్య మూలాల ఆధారంగా విశ్లేషిస్తాడు. కేంద్రీకృత రాజ్యం ఆవిర్భవించి కర్కశంగా అదనపు ఉత్పత్తిని సేకరించి దానిని కేంద్రీకృతంగా వర్తకానికి వినియోగించిన దశను కౌటిల్యుడి అర్ధ శాస్త్రం ఆధారంగాను, ఈ కేంద్రీకృత రాజ్యం తన అంతర్గత వైరుధ్యాలను పరిష్కరించుకునేందుకు విఫల ప్రయత్నం చేసి నాశనమయి స్వయంపోషక గ్రామీణ వ్యవస్థకు దారి విడిచిన దశను అశోకుడి శాసనాల ఆధారంగానూ వివరిస్తాడు.

కౌటిల్యుడు ఎప్పుడు పుట్టాడు ఎప్పుడు చనిపోయాడు అనేది అంత ముఖ్యం

కాదు. అర్థశాస్త్రంలో వివరించిన సమాజం ఏ కాలానికి చెందింది అనేది ముఖ్యం. అర్థశాస్త్రం తొలి మౌర్యుల కాలానికీ తత్పూర్వులయిన 'నందరాజుల' కాలానికీ చెందిందనీ, ఆనాటి రాజనీతికి అది ప్రత్యక్షవ్యాఖ్య అనీ కోశాంబి వివరంగా నిర్ధారిస్తాడు.[7] కౌటిల్యుడు మొదటి మౌర్యరాజయిన చంద్రగుప్తుడి అమాత్యుడన్న సంప్రదాయంగూడ ఇందుకు సరిపోతుంది.

పల్చగా విస్తరించిన వ్యవసాయక సమాజం నుండి అదనపు ఉత్పత్తిని కర్కశంగా సేకరించడం, ఆ అదనపు ఉత్పత్తిని రాజ్యాంగయంత్రం పర్యవేక్షణ క్రింద వ్యవసాయేతర సరుకుల ఉత్పత్తికీ వర్తకానికీ వినియోగించడం, ఆటవిక ప్రాంతాల లోనికి వ్యవసాయాన్ని విస్తరింపజేయడం అనే మూడు కర్తవ్యాలను అర్థశాస్త్రం రాజ్యాంగ యంత్రానికి ప్రబోధిస్తుంది. ఏ రకమయిన అలంకారికమయిన ఆకర్షణగానీ పదాడంబరంగానీ నీతి సంబంధమయిన ఆచ్ఛాదనగానీ లేకుండ చేసిన రచన అర్థశాస్త్రం. పూర్వ ఆచార్యుల అభిప్రాయాలను క్రోడీకరించి "ఈ ప్రపంచాన్ని లోబరచుకుని పరిపాలించే పద్ధతులను" తన గ్రంథం తెలుపుతుందని ఆదిలో రచయితే అన్నాడు.[8] ధర్మం, అర్థం, కామం అనే మూడింటిలోనికి అర్థమే ముఖ్యం, ఎందుకంటే తక్కిన రెండింటికీ అదే మూలం అనిగూడ నిర్మొగమాటంగా అన్నాడు. సంస్కృత సాహిత్యంలో ఈ రకమయిన రచన అసాధారణమయినది. తరువాతి కాలపు బ్రాహ్మణులకు ఈ నిర్లజ్జ సులభంగా మింగుడు పడలేదు. అందుకే రచయిత అసలు పేరు కౌటిల్యుడుకాగా అతనిని కుటిలుడిగా భావించిన తదనంతరులు ఆ పేరును కౌటల్యుడిగా మార్చారని కోశాంబి అంటాడు.[9]

ఈ సమాజం ఆర్థిక స్వరూపం ఈవిధంగా వుంది. గ్రామీణ ప్రాంతాల ప్రముఖులు జానపదులు. వీళ్ళను భూస్వాములు అనడానికి వీలులేదు. భూమిలో స్వంత ఆస్తి ఇప్పటికింకా లేదు. గ్రామీణ ప్రాంతాలలో భూమినీ పశువులనూ సమిష్టిగా కలిగి వున్న సజాత బృందాలున్నాయి. వాటి పెద్దలు ఈ జానపదులు. అర్థశాస్త్రంలో ఆస్తి వారసత్వాన్ని చర్చించిన చోట భూమి ప్రస్తావన లేకపోవడాన్ని బట్టి ఇది ఇంకా ఉమ్మడి ఆస్తే తప్ప స్వంత ఆస్తికాదని అర్థం అవుతుంది.[10] ఈ జానపదులు చాలా ముఖ్యులు. పట్టణ ప్రాంతాల ప్రముఖులయిన పౌరుల కంటే జానపదుల గురించే రాజు ఎక్కువ శ్రద్ధ తీసుకోవాలని కౌటిల్యుడు అన్నాడు.[11]

జానపదుల భూములలో కూలిచేసిన శూద్రులు 'అర్థసీతకులు'. వీళ్ల పొలంలో శ్రమ చేసి, పండించిన పంటలో సగం జానపదులకు అప్పజెప్పారు. శూద్రుల నుండి పంటలో సగం తీసుకున్న జానపదులు రాజుకు శిస్తుగా ఆరవవంతు చెల్లించారు. మిగిలింది తమ స్వంతం.[12] అయితే ఇందులోంచి మళ్ళీ చిల్లర పన్నులు, కానుకలు, బహుమానాలు, రాజులకు చెల్లించేవారు. వీళ్ళ భూములు కాక 'సీతా' భూములని వేరే ఉండేవి. ఇవి ప్రభుత్వం ఆధ్వర్యంలో వ్యవసాయయోగ్యం చేయబడిన బీడు భూములు.

ఈ బీడు భూములను ఎవ్వరూ ఆక్రమించుకోకుండ ప్రభుత్వమే శూద్ర కూలీలను ప్రయోగించి వ్యవసాయం చేయించాలన్నది అర్థశాస్త్రంలోని ముఖ్యమైన సూచనలలో ఒకటి. శూద్రులే ఎందుకంటే, "వాళ్ళయితేనే అన్ని రకాల దోపిడీ సాధ్యం అవుతుంది కాబట్టి" అంటాడు కౌటిల్యుడు.[13] 100 నుండి 500 దాకా శూద్ర కర్షకులను ఈ సీతా భూములలోనికి పంపించాలి. దానిని వాళ్ళు వ్యవసాయ యోగ్యం చేయాలి. అయితే ఈ శూద్ర కర్షకులు బానిసలుకారు, శిస్తుచెల్లించే రైతులు. వాళ్ళ స్వేచ్ఛ మీద మాత్రం రకరకాల పరిమితులున్నాయి. ఒక కుటుంబం నాగలి కిందికి తెచ్చిన భూభాగం వాళ్ళ జీవిత పర్యంతం (మాత్రమే) వాళ్ళది అవుతుంది. దానిని అమ్మ డానికిగాని కుదువ పెట్టడానికి గాని వీలులేదు. జనపదాలలో పన్నులు ఆరవవంతుకాగా సీతా భూములలో నాల్గవ వంతు. సీతాగ్రామాల వ్యవహారాలను ప్రభుత్వ ఉద్యోగులూ వైద్యులూ పశువైద్యులూ చూసుకుంటారు.

ఈ సీతా భూముల వ్యవసాయానికి కౌటిల్యుడు చాలా ప్రాముఖ్యం ఇస్తాడు. దీనికి కారణం ఆర్థిక పరంగా నిర్మొగమాటంగా వివరిస్తాడు. జనపదాల నుండి వసూలు చేసుకునే ఆరవ వంతుపన్ను మీద ప్రభుత్వం ఐతకలేదని చెప్తూ రెవెన్యూ అవసరాల కోసం ప్రభుత్వమే వ్యవసాయీకరణ చేపట్టాలంటాడు. ఇతర రాజ్యాల మీద యుద్ధం చేయడం గూడ అందుకోసమే. ఆ దేశాలను లూటీ చేయడం, లోబరచుకోవడం మొదలయిన లక్ష్యాల కంటె ముఖ్యమయినది, ఆ రాజ్యంలోని బీడు భూములలోనికి శూద్రులను ప్రవేశపెట్టి వాటిని సీతా భూములుగా మార్చడం. యుద్ధాలు ఇందుకోసమే చేయాలన్నాడు.[14] కళింగ యుద్ధంలో అశోకుడి సైన్యాలకు లొంగిపోయిన లక్షా యాభై వేలమందిని అశోకుడు సీతా భూముల పైన కర్షకులుగా నియమించాడు.[15] ఈ విధంగా వ్యవసాయ విస్తరణను ఒక పబ్లిక్ సెక్టర్ పరిశ్రమగా నిర్వహించే దృక్పథం కౌటిల్యుడు ఎంత సంపూర్ణంగా ప్రదర్శించాడంటే, సీతా గ్రామాలలో ఎటువంటి అసంతృప్తి గానీ, అలజడిగానీ చెలరేగకుండ అన్ని కట్టుదిట్టాలూ చేసాడు. అసంతృప్తికి సాధనాలు కాగలవన్నీ అక్కడ నిషిద్ధాలు. సీతా గ్రామ వాసులయిన శూద్రులు ఆయుధాలు ధరించడానికి వీలులేదు.[16] ఏ రకమయిన సమావేశాలూ జరుపుకోవడానికి వీలులేదు. ఈ గ్రామాలలోనికి ఏ రకమయిన ఆటగాళ్ళు గానీ పాటగాళ్ళు గానీ పోవడానికి వీలులేదు. బౌద్ధ శ్రమణులు గానీ భిక్షువులు గానీ పోవడానికి వీలులేదు. పురోహితులకు మాత్రం కొంత భూమిని శిస్తు మినహాయింపుతో యిచ్చి ఈ గ్రామాలలో వాళ్ళనివాసాలు ఏర్పరచారు.[17] "గ్రామీణులు అసహాయులయితేనే పని మీద దృష్టి కేంద్రీకరిస్తారు. శిస్తు, శ్రమ, సంపద, ధాన్యం, తద్వారా పెరుగుతాయి" అని కౌటిల్యుడు అన్నాడు.[18]

మొత్తం రాజ్యంలోని వ్యవసాయక భూభాగంలో అత్యధిక భాగం ప్రభుత్వ నిర్వహణలో శూద్ర కౌలు రైతులు సేద్యం చేసిన ఈ సీతా భూములేనని కోశాంబి

అభిప్రాయం.[19] ఈ భూ భాగం విస్తృతి ఎంతటిదంటే దేశంలోని భూమి అంతా రాజుకే చెందుతుందని సమకాలిక గ్రీకు పరిశీలకులు భావించారు.[20] ఇక్కడ గమనించ వలసిన ముఖ్య విషయం ఏమిటంటే మౌర్యుల కాలం దాకా అసంకల్పితంగా సాగిన వ్యవసాయ విస్తరణ ఇప్పుడు ప్రభుత్వ రెవెన్యూ అవసరాన్ని తీర్చడంకోసం సంకల్ప పూర్వకంగా-ఒక పరిశ్రమగా-సాగింది. అదనపు ఉత్పత్తి చాలా పల్చగా వున్న ఈ దశలో ఈ రకమయిన 'పబ్లిక్ ఫైనాన్స్' అనివార్యమయింది. దీని పర్యవ సానాలను తరువాత చూద్దాం.

జానపదుల నుండీ సీతా భూముల నుండి శిస్తును సేకరించాలి. దానిని పాలక వర్గాలకు అవసరమయిన విలాస వస్తువులుగా మార్చాలి. శిస్తును సేకరించే ఉద్యోగులకు కొన్ని గ్రామాలను మాన్యంగానో జాగీరుగానో ఇచ్చి ఆ గ్రామాల శిస్తును వాళ్ళు ఉంచుకునే ఏర్పాటు (మనదేశంలో భూస్వామ్య వ్యవస్థకు కీలకమయిన ఏర్పాటు) అప్పటికింకా సాధ్యం కాదు. ఉత్పాదకత ఇంకా చాలా తక్కువగా వుంది, పైగా జనపదాలనూ సీతా భూములనూ మినహాయిస్తే ఇంకా వ్యవసాయానికి లొంగని అడవులు చాలా వున్నాయి. కాబట్టి అదనపు ఉత్పత్తి చాలా పల్చగా వుంది. ఈ రకమయిన పంపకాలకు ఇప్పుడప్పుడే తావులేదు. ఈ దశలో శిస్తు అంతా కేంద్రీకృతమయి ప్రభుత్వానికి అందాలి. సేకరించిన ఉద్యోగులకు జీతం మాత్రమే దక్కుతుంది.

వ్యవసాయేతర ఉత్పత్తికీ వ్యాపారానికీ గూడ ఇదే గతిపట్టింది. అదనపు ఉత్పత్తి వ్యాపారస్తుల చేతులలోకి ఎక్కువగా పోకూడదంటే వ్యాపారాన్ని కట్టుదిట్టం చేయాలి. అర్థశాస్త్రంలో వ్యాపారస్తుల గురించీ వృత్తిపనివారి గురించీ చాలా నీచమయిన మాటలు అన్నారు. వర్తకుడిని 'కంటకం' (ముల్లు) అన్నారు. వర్తకుడు, వృత్తి పనివాడు, భిక్షగాడు, కనుకట్టువాడు, నటుడు, "వీళ్ళంతా దొంగలు అని పిలవబడని దొంగలు" అని కౌటిల్యుడు అన్నాడు. ఒక జనపదం నుండి మరొక జనపదానికి సరుకులు తీసుకొనిపోతే బయలుదేరిన చోటా తీసుకుపోయిన చోటా గూడ పన్నులు వసూలు చేసారు. ఏ వస్తువునూ కొన్నచోటే అమ్మడానికి వీలులేదన్నారు. దేశీయ సరుకులయితే 5 శాతం, విదేశీ సరుకులయితే 10 శాతం కన్న ఎక్కువ లాభం వర్తకులు పొందడానికి వీలులేదన్నారు.[21] వర్తకులు ఈ విధంగా తమ సామాజిక స్థానాన్ని కోల్పోయిన ఫలితంగా మౌర్యకాలపు కార్షాపణాలు ప్రామాణికత కోల్పోయాయని గత అధ్యాయంలో చూసాము.

వర్తకుల మీద ఈ ఆంక్షలు పెట్టడమేకాక చాలా వ్యాపారాలను ప్రభుత్వం తానే స్వయంగా చేపట్టింది. కొత్తగా ఆవిర్భవించిన పట్టణ నాగరికతకు చిహ్నాలయిన మూడు వ్యసనాలు-జూదం, వ్యభిచారం, మద్యపానం - ప్రభుత్వం ఆధిపత్యంలో నడిచేవి. అంతకంటె చాలా ముఖ్యమైనది, గనుల మీద, ఖనిజాల మీద, ప్రభుత్వ గుత్తాధి పత్యం. వ్యవసాయ నాగరికతకు ఇనుము తదితర లోహాల కీలకమయిన ప్రాముఖ్యతను

కౌటిల్యుడు గుర్తించాడు. "ఖజానాకు గనులు మూలం, సైన్యానికి ఖజానా మూలం" కాబట్టి ప్రపంచాధిపత్యం సంపాదించాలంటే గనుల మీద అజమాయిషీ కావాలి.[2] ఇతర దేశాలమీద యుద్ధం చేయడంలో గూడ బీడు భూములను చేజిక్కించుకోవడం ఒక ముఖ్య ప్రోద్బలం అయితే అక్కడి గనులను చేజిక్కించుకోవడం రెండవ ప్రోత్సాహకం.

ఇతర పరిశ్రమలుగూడ కొన్ని ప్రభుత్వమే నడిపేది. శిస్తును రైతులనుండి వస్తు రూపంలో (ధాన్యం, నూనెగింజలు, వగైరా) వసూలు చేసేవారు. ధాన్యాన్ని పొట్టుతీయడం, పిండి చేయడం, గింజలనుండి నూనె తీయడం, మొదలయిన పరిశ్రమ లన్నీ ప్రభుత్వమే నిర్వహించేది. అర్థశాస్త్రంలో వీటి వివరాలు ఎంత క్షుణ్ణంగా చర్చించబడ్డాయంటే అది రాజనీతి గ్రంథం కాదు, ఫ్యాక్టరీ మాన్యువల్ అనిపిస్తుందని కోశాంబి అంటాడు.[23]

ఈ విధంగా ప్రభుత్వరంగం పన్నులు నిష్కర్షగా వసూలు చేయడమేగాక అన్ని వ్యవహారాలలోనికి విస్తరించాలంటే పరిపాలనా యంత్రాంగం చాలా భారీగా వుండాలి. రవాణా సౌకర్యాలూ ప్రసార సౌకర్యాలూ చాలా అపరిణతంగా వున్న ఆ రోజులలో ఈ బరువును ప్రభుత్వం మోయడం కష్టసాధ్యం. వర్తకులలోనూ జానపదుల లోనూ ప్రభుత్వ అధికార్లలోనూ అవినీతి అరికట్టడం, శిస్తులు ఎవరూ ఎగవేయకుండా చూడడం, సులభమయిన విషయాలుకావు. అర్థశాస్త్రంలోని కుటిలత్వానికి ఈ వైరుధ్యమే మూలం. ప్రభుత్వం మొత్తం గూఢచారులతో నడవాలి. గూఢచారులమీద గూఢచారులు, వాళ్ళమీద గూఢచారులు, ఉండాలి. శిస్తు ఎగవేతకు శిక్ష కఠినంగా వుండాలి. అయిన దానికీ కానిదానికీ జుర్మానాలు వసూలు చేయాలి. ఇతర రాజులనూ గణాలనూ లొంగ దీసుకోవడానికి నిష్కారణమయిన బలప్రయోగం నుండి వచ్చి మోసందాకా ఏ పద్ధతి నయినా ప్రయోగించ వచ్చును. స్నేహం బంధుత్వం అనే భావాలకు పాలకులలో తావులేదు. ప్రజలను ఎంతగా మోసంచేసి అయినా డబ్బు సంపాదించవచ్చును. అసాధారణమయిన సుంకాలు ఆకస్మాత్తుగా విధించవచ్చును. స్వచ్ఛందంగా విరాళాలు ఇమ్మని ఆహ్వానించి, గూఢచారులలో ఒకడు పెద్దఎత్తున విరాళాలు ఇచ్చినట్టు నటించి తద్వారా ప్రజలచేతగూడ పెద్దఎత్తున ఇప్పించవచ్చును. ప్రభుత్వం తాను ప్రదానం చేసే బిరుదులనూ పతకాలనూ అమ్మవచ్చును. దేవాలయ ఆస్తులను భద్రపరిచే మిషమీద ఎత్తుకొని పోవచ్చును. గూఢచారులు కొత్త పూజాస్థలాలను సృష్టించి ప్రజలను మభ్యపెట్టి గుళ్ళుకట్టిస్తామని విరాళాలు సేకరించవచ్చును. ఈ పని అర్థశాస్త్రం రికమెండ్ చేయడమే కాదు, మౌర్యులు నిజంగా చేసారని పాణిని వ్యాకరణానికి భాష్యం రాసిన పతంజలి అన్నాడు.[24]

అర్థశాస్త్రంలో వివరించిన పద్ధతిలో పరిపాలనా యంత్రాంగం నిజంగా నడిచిందా అనే చర్చకంటే ముఖ్యం, ఈ అమానుషమయిన సిద్ధాంతాల వెనుక ఒక నిజమైన

వైరుధ్యం వుందని గుర్తించడం.

వ్యవసాయం విస్తరించి స్థిర వ్యవసాయ గ్రామాలు మరిన్ని ఏర్పడేకొద్దీ ఈ వైరుధ్యం మరింత తీవ్రతరం అయింది. పరిపాలనా యంత్రాంగంమీద భారం చాలా పెరిగింది. ఇంకా ఎక్కువ గ్రామాలనుండి ఎక్కువ దూరంనుండి శిస్తు వసూలు చేయాల్సివచ్చింది. ఎక్కువమంది మీద పర్యవేక్షణ పెట్టాల్సివచ్చింది. స్థిర వ్యవసాయ గ్రామాలు పెరిగేకొద్దీ ప్రభుత్వ నియంత్రణలోని వర్తకం వాటికి అవసరమయిన వ్యవసాయేతర సరుకులను సరఫరా చేయడంలో మరిన్ని ఇబ్బందులను ఎదుర్కొంది. తన రెవెన్యూ అవసరాలకోసం అర్థశాస్త్ర ప్రభుత్వమే సీతా గ్రామాలద్వారా అత్యధిక భూభాగంలో వ్యవసాయ విస్తరణను ప్రోత్సహించింది కాబట్టి తన భారాన్ని తానే మోపెడు చేసుకుంది. వ్యవసాయం విస్తరించేకొద్దీ లోహాల సరఫరాకు మగధ ప్రాంతపు గనులు సరిపోలేదు. దక్కన్ ప్రాంతపు గనులనుండి గూడ లోహాలు ఉత్పత్తి చేయాల్సి వచ్చింది. అందే గనుల కేంద్రీకృత నిర్వహణ కష్టమయిపోయింది.[25] పరిమాణాత్మకమయిన మార్పు గుణాత్మకమైన మార్పుగా పరిణమించడం అనే గతితార్కిక సూత్రానికి మగధ రాజ్యపు ఈ సంక్షోభం ఒక ఉదాహరణ అని కోశాంబి అంటాడు.[26] గ్రామీణ స్వయంపోషకత్వమే (కమ్మరి వడ్రంగి వృత్తి పనివాళ్ళ శ్రేణులను వదిలి పెట్టి గ్రామాలలో కులాలగా స్థిరపడడమే) ఈ వైరుధ్యాన్ని అంతిమంగా పరిష్కరించ గలదు.[27]

అశోకుడు రాజయ్యేనాటికి ఈ వైరుధ్యాల భారం రాజ్యంమీద బలంగా పడింది స్థిరవ్యవసాయం విస్తరిస్తోంది. ఆటవిక ప్రాంతాలు వ్యవసాయాన్ని అలవర్చుకుంటు న్నాయి. కుటిలమయిన బలప్రయోగం ద్వారా కేంద్రీకృతంగా పరిపాలించడం అసాధ్యం అవుతోంది. ఈ వైరుధ్యాన్ని పూర్తిగా పరిష్కరించడం అశోకుడి చేతులలో లేదు. అంతిమంగా వ్యవస్థ స్వయంపోషక గ్రామాల నిర్మాణానికి పరిణామం చెంది నప్పుడే అది పరిష్కారం అవుతుంది. అయితే పూర్తిగా అసంగతంగానూ అమానుషం గానూ తయారయిన మౌర్య రాజ్యాంగ యంత్రాన్ని పరిపాలనా నీతినీ కొంత మానవీయంగా మార్చే ప్రయత్నం అశోకుడు చేసాడు. ప్రఖ్యాతమయిన అశోకుడి మనః పరివర్తన ఒక వ్యక్తి తన మతం మార్చుకోవడం కాదు. మన దేశంలో ఎంతో మంది రాజులు బ్రాహ్మణ బౌద్ధ జైన మతాలలో ఒకదానినుండి ఒకదానికి మారారు. ఆ పరివర్తనలేవీ ప్రఖ్యాతం కానిది అశోకుడు 'బౌద్ధమతం' స్వీకరించడం ఒక చరిత్రా త్మక సంఘటన అయిందంటే అందుకు కారణం అది ఒక వ్యక్తి మతం మార్పిడి కాక, సామాజిక నిర్మాణంలో మొత్తంగా వచ్చిన మార్పు కావడమే.[28] ఆ మార్పు ప్రధాన లక్షణం ఏమిటంటే పరిపాలనలో బలప్రయోగం స్థానంలో 'ధర్మం' అనే భావనను మతాన్ని ప్రవేశపెట్టడం. ఈ ధర్మం బ్రాహ్మణుల వర్ణధర్మం కాదు. అదెట్లాగూ (చెల్లుబాటు వున్న మేరకు) వర్గసమాజాన్ని నిలబెట్టడంలో తన కర్తవ్యాన్ని నిర్వహి

స్తోంది. అశోకుడి ధర్మం బౌద్ధుల ధర్మాన్ని పోలిన సామాజికనీతి. అందుకే బహుశా అశోకుడు బౌద్ధానికి ఆకర్షితుడయి బౌద్ధుడయ్యాడు. అయితే ఇక్కడ మతం మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వడం పొరబాటు. బౌద్ధుడైన తరువాతగూడ అశోకుడు అన్ని మతాలనూ సమంగా ఆదరించాడు. ఇక్కడ ప్రాధాన్యత ఇవ్వవలసింది రాజనీతిలో వచ్చిన మార్పుకు, దానికి ప్రాతిపదికగా ఉత్పత్తిరంగంలో వస్తూన్న మార్పుకు, ఈ మార్పులకు అనుగుణ్యంగా అశోకుడి 'ధర్మం' అనే భావన పుట్టింది. అది లక్షణాలలో బౌద్ధాన్ని పోలిందే అయినా అందులో ప్రత్యేకించి 'బౌద్ధం' అనదగ్గ స్వభావం ఏమీలేదు.[29] "అశోకుడు తన శాసనాలలో ప్రచారం చేసింది బౌద్ధమతం కాదు, సాధారణ నీతి సూక్తులూ కావు. బలప్రయోగం కంటె ధర్మం, సామాజికనీతి, ఉన్నతమయినవని ప్రచారం చేసాడు" అని కోశాంబి అంటాడు.[30]

కౌటిల్యుడు అన్నిటినీ రెవెన్యూ దృష్టితో చూసి నట్టే మతాన్ని గూడ చూసాడు. రాజ్యాంగ యంత్రానికి ప్రధాన ఆర్థిక ఆధారం అయిన 'సీతా' గ్రామాలలోనికి భిక్షువులు పోవడానికి వీలు లేదన్నాడు. అంటే రాజ్యంలోని అత్యధిక భూభాగం నుండి భిక్షువులను బహిష్కరించాడు. ప్రజలెవ్వరూ ముసలితనం వచ్చేదాకా సన్యసించడానికి వీలు లేదన్నాడు. అశోకుడు అందుకు భిన్నంగా, ఏ మతం వారయినా రాజ్యంలో ఎక్కడైనా నివసించవచ్చునన్నాడు. కౌటిల్యుడు భిక్షువులను గూఢచర్యంకోసం వాడుకోవాలని సూచించాడు. అశోకుడు అందుకు భిన్నంగా 'బ్రాహ్మణులనూ శ్రమణులనూ గౌరవించాలి' అని తన శాసనాలలో చెప్పాడు. సామాజిక భద్రతను కేంద్రీకృతమయిన బలప్రయోగం ద్వారా కాక మత ప్రచారకులు చేసే ధర్మ బోధ ద్వారా నిలబెట్టాలని అశోకుడి ప్రయత్నం.

ఈ చారిత్రక అవసరాన్ని సాధించే క్రమంలో అశోకుడు దానిని మించి చాలా దూరంపోయాడు. అప్పటికి కాదు, ఇంకా చాలా శతాబ్దాలదాకా ప్రభుత్వాలు ఆమోదించబోని ఆదర్శాలను ప్రకటించాడు. అసలు ధర్మ ప్రచారానికి శాసనాలను వాడుకోవడం అనేదే చరిత్రలో కొత్త విషయం. అశోకుడి సమకాలికులయిన పాశ్చాత్య రాజులు తమ గొప్పలు చాటుకోవడానికి శాసనాలు ప్రకటించారు. అశోకుడి శాసనాలను పర్షియా చక్రవర్తి అయిన దారియస్ శాసనాలతో కోశాంబి పోలుస్తాడు. దారియస్ తన్నుతాను "గ్రీకుల రాజు, రాజాధిరాజు, సకల దేశాలకు రాజు, సుదూర భూమండలానికి రాజు...." అని వర్ణించుకొని, తనకు రాచరికం దేవుడిచ్చాడనీ, దేవుడి కోరికను అనుసరించి తాను ప్రపంచాన్ని చక్కబెట్టాననీ అంటాడు.[31] అశోకుడు అందుకు భిన్నంగా తన్నుతాను 'ప్రియదర్శి' అని 'దేవానంపియ' (దేవుళ్ళకు ప్రియమైనవాడు) అని మాత్రం వర్ణించుకున్నాడు. రాజుగా తన కర్తవ్యాన్ని శాసనాలలో చాలా ఆదర్శవంతంగా ప్రకటించాడు. 'ప్రజలంతా నా బిడ్డలు...' అనీ 'ప్రజల పట్ల నా బాధ్యత నెరవేర్చడంలో అధికారులు సహకరించగలందుకుగాను ఈ ఆదేశాలు జారీ చేస్తున్నాను'

అనీ అన్నాడు. దేశంలోపల పాళీ (మాగధి) భాషలోనూ వాయువ్య సరిహద్దు ప్రాంతంలో గ్రీకు అరమాయిక్ భాషలలోనూ శాసనాలు ప్రకటించాడు. మగధ సామ్రాజ్యం విస్తరణ ఫలితంగా మాగధి భాషకూ బ్రాహ్మి లిపికీ దేశవ్యాప్తమయిన విస్తరణ లభించింది. అయితే ప్రజలందరూ ఇదే భాష మాట్లాడుతున్నారని అర్థం కాదు. వర్తకానికి పరిపాలనా వ్యవహారాలకూ ఈ భాష మాధ్యమం అయింది. నిజానికి ప్రజలు ఆయా ప్రాంతాలలో అసంఖ్యాకమయిన భాషలు మాట్లాడుతున్నారు కాబట్టే శాసనాలన్నింటినీ మాగధిలో ప్రకటించడం జరిగింది. ప్రభుత్వ అధికారులు ఆ శాసనాలను సంవత్సరానికి మూడుసార్లు ప్రజలకు గట్టిగా చదివి వినిపించాలి. వాటిలోని ఆదేశాలను అనుసరించి పరిపాలన సాగించాలి.[32]

అశోకుని శాసనాలలోని ముఖ్య విషయాలు:

రాజ్యంలో జంతువులను చంపకూడదు, జీవహింస చేయకూడదు. యజ్ఞబలులు, ఇతర (ఆటవిక) బలులు, నిషిద్ధాలు. యజుర్వేదకాలం నుండి యజ్ఞబలులకూ గోమాంస భక్షణకూ వ్యతిరేకంగా సాగిన అలజడి ఇప్పుడు మొట్టమొదటి సారిగా రాజశాసనంలో ఆమోదాన్ని పొందింది. పశుపోషక సమాజం మీద వ్యవసాయక సమాజం తన ఆధిపత్యాన్ని నెలకొల్పింది.[33]

బంధువులనూ బ్రాహ్మణులనూ (బౌద్ధ) శ్రమణులనూ గౌరవించాలి. తల్లిదండ్రులనూ పెద్దలనూ ఆదరించాలి. స్నేహితుల పట్ల ఉదారంగా వుండాలి. సంపాదనలోనూ ఖర్చులోనూ మితాన్ని పాటించాలి. అధికారులు మనుషులకూ పశువులకూ వైద్య సౌకర్యం కల్పించాలి. బావులు తవ్వించాలి, నీడకోసం చెట్లు నాటించాలి. నేరవిచారణ న్యాయంగా వుండాలి, శిక్ష నిష్పాక్షికంగా వుండాలి. మరణ శిక్ష విధించబడ్డవాళ్ళకు మూడు రోజులు గడువు ఇవ్వాలి. ఆ మూడు రోజులలో వాళ్ళ బంధుమిత్రులు స్థానిక అధికార్ల నుండి క్షమాభిక్ష కోరవచ్చును. అటువంటి బంధుమిత్రులెవరూ లేకుంటే నేరస్తుడు కనీసం తన మరణానంతర సౌఖ్యం కోసం ప్రార్థనలు చేసుకోవచ్చును.[34] జైళ్ళలో వున్న ఖైదీలకు పిల్లలుంటే అధికారులు వాళ్ళకు ధన సహాయం చేయాలి. ఖైదీలకు మతి స్థిమితం లేకపోతే సంకెలలు తీసివేయాలి. ముసలివాళ్ళయితే విడుదల చేయాలి. అన్ని విషయాలలోనూ ప్రభుత్వాధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు తయారుచేసి రాజుకు-అది రాత్రయినా పగలయినా-తెలియజేయాలి.

ఈ ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించేందుకు అశోకుడు ధర్మమహామాత్రులను నియమించాడు. బ్రాహ్మణులు, బౌద్ధులు, జైనులు, ఆజీవకులు ఒక్కొక్క మతం వ్యవహారాలను చక్కబెట్టడానికి ఒక్కొక్క ధర్మ మహామాత్రుడిని నియమించాడు.[35]

ప్రభుత్వాలు చెప్పే నీతులన్నీ ఆచరించవు. పైగా, రాచరికం అనేది ఒకటి వుండగా రాజు 'ప్రజలంతా నా బిడ్డలు' అనడం అసంగతమయిన విషయం. అయితే అశోకుడి ధర్మ పన్నాలు ఎంతవరకు ఆనాడు అమలయ్యాయి అని చర్చించడం కంటె

ఒక కొత్త ఆదర్శం చరిత్రలోకి వచ్చిందని గుర్తించడం ముఖ్యం. పరిపాలనకు బల ప్రయోగంకాక సామాజికనీతి ప్రాతిపదిక కావాలన్నది ఉన్నతమయిన ఆదర్శం. వర్గసమాజంలో ఈ ఆదర్శం ఆచరణ సాధ్యం కాదు. బ్రాహ్మణ మతం చేతులలో ఈ 'ధర్మం' కులధర్మంగానూ మత మౌఢ్యంగానూ పరిణామంచెంది బలప్రయోగానికి నీతికాక మతం ప్రత్యామ్నాయమయింది.[36] అయితే ఆచరణ సాధ్యంకాని ఆదర్శాలన్నీ నిరుపయోగం కావు. ఏ భౌతిక పరిస్థితులు ఆ ఆదర్శాలను ఆచరణ సాధ్యం చేయ గలవో ఆ పరిస్థితులను అవి ఆహ్వానిస్తాయి. అనుకూలమయిన భౌతిక పరిస్థితులు ఏర్పడగల కాలానికి రెండు సహస్రాబ్దాలు ముందే ఆ ఆదర్శాలను ప్రకటించగలగడం గొప్పతనం అనుకుంటే అశోకుడు (బుద్ధుడిలాగ) గొప్పవాడే.

అశోకుడి మరణానంతరం 60 సంవత్సరాలకు వాయువ్య దిశనుండి దేశం మీదికి దండయాత్రలు ప్రారంభమయ్యాయి. యవనులూ శకులూ కుషానులూ ఒకరి తరువాత ఒకరు దండెత్తి వచ్చారు. వీళ్ళలో కుషానులు మాత్రమే ఒక రాజ్యాన్ని స్థాపించారు. అందరూ పెద్ద ఎత్తున సంపదను కొల్లగొట్టారు. అంతకు పూర్వం మగధ రాజవంశాల పాలనలో ధనికుల చేతిలో పోగయిన అదనపు ఉత్పత్తి వీళ్ళ వాత పడింది.

అంతకంటె ముఖ్యమైన పరిణామం పునాదిలో సాగుతోంది. కేంద్రీకృత రాజ్యం నాశనమయి గంగా యమునా లోయలలో స్వయం పోషక గ్రామీణ వ్యవస్థ ఆవిర్భవిస్తోంది. దీనిని ఆధారం చేసుకొని చిన్న చిన్న రాజ్యాలూ రాజవంశాలూ చాలా వచ్చాయి. స్వయం పోషకమయి ఉత్పత్తినీ సంపదనూ ఇతోధికంగా పెంచిన నూతన గ్రామీణ వ్యవస్థ ఇప్పుడు గతంలోలాగ ఒక్క కేంద్రీకృత రాజ్యాన్ని మాత్రమే కాక చాలా మంది చిల్లర రాజులనూ రాజ్యాలనూ పోషించగలిగింది. యుద్ధాలనూ దాడులనూ భరించ గలిగింది.[37] అదనపు ఉత్పత్తి ఇప్పుడు ఇదివరకటంత 'పల్చ'గా లేదు. పేర్లను బట్టి చూస్తే ఈకొత్త రాజ్యాలు ఆటవికుల నాగరీకరణ ఫలితంగా ఏర్పడినవని అర్థం అవుతుంది. మౌర్యులకూ గుప్తులకూ మధ్య పాలించిన రాజులలో 'నాగ' అనే పేరుగల రాజులున్నారని పురాణాలను బట్టి తెలుస్తుంది. సముద్ర గుప్తుడి చేతిలో ఓడి పోయిన ముగ్గురు రాజుల పేర్లు నాగదత్తుడు, గణపతినాగుడు, నాగసేనుడు.[38] పురాణా లలోనూ క్రీ.శ. రెండవ శతాబ్దపు శాసనాలలోనూ పేర్కొన్న మరొక రాజవంశం అభీరులు.[39] వీళ్ల ఇవ్వాళ్టి అహీర్ అనే పశుపోషక కులం పూర్వీకులు-అంటే పశుపోషక గణజీవులుగా వుండి వ్యవసాయ నాగరికతను అలవర్చుకోగా వీళ్ళలో వర్గవిభజన ఏర్పడి కొందరు అదే గణంపేరుతో రాజ్యాన్ని స్థాపించారని అర్థంచేసుకోవాలి. గర్ధభిలులు అనే రాజవంశంలో ఏడుగురు రాజులున్నట్లు పురాణాలు చెప్తాయి. 'భిల్లులు' ఇప్పటికీ వున్న ఆటవిక గణం. దీన్ని బట్టి గర్ధభిలులు గూడ ఆటవిక దశనుండి వ్యవసాయక దశకు పరిణామంచెంది ఒక చిన్న రాజ్యాన్ని స్థాపించిన వాళ్ళయి వుండాలి.[40]

సారాంశంలో, మౌర్యుల అనంతరం-క్రీ. పూ. 2వ శతాబ్దం నుండి-ఉత్తర భారత దేశంలో స్వయం పోషక గ్రామీణ వ్యవస్థ ఏర్పడడం ప్రారంభమయింది. చాలా పల్చగా వున్న అదనపు ఉత్పత్తిని కఠినమయిన పద్ధతుల ద్వారా సేకరించి కేంద్రీకృతంగా వర్తకానికి వినియోగించిన సామ్రాజ్యం తన అంతర్గత వైరుధ్యాల వల్ల నాశనమయి, వికేంద్రీకృతమయిన ఉత్పత్తినీ గ్రామీణ స్వయం పోషక వ్యవస్థనూ చేపట్టింది. ఎక్కువ సంఖ్యలో దోపిడీ వర్గాలనూ రాజ్యాలనూ విదేశీ దాడులనూ భరించ గలిగింది. గంగా యమునా లోయల భూభాగం మొదటి అధ్యాయంలో చెప్పిన మూడవ దశను అందుకుంది.

## దక్కన్‌లో వ్యవసాయ విస్తరణ :

గతంలో లాగే ఇప్పుడు గూడ దక్కన్ పీఠభూమి గంగా యమునా లోయలలో కంటె రెండు మూడు శతాబ్దాలు వెనుక బడివుంది. క్రీ. పూ. 600 నుండి మొదలయిన ఆహార ఉత్పత్తి మౌర్యుల అనంతరం గానీ దక్కన్‌లో స్థిర వ్యవసాయ గ్రామీణ సమాజాన్ని (అంటే మొదటి అధ్యాయంలో చెప్పిన మూడు దశలలో రెండవ దశను) అందుకోలేదు. గంగా యమునా లోయలు సర్వత్రా చాలా సారవంతమయినవి కాగా దక్కన్ పీఠభూమి అక్కడక్కడ మాత్రమే సారవంతమయినది కావడం ఈ చారిత్రక అలసత్వానికి మూలం. మౌర్యుల అనంతర కాలంలో ఒక కొలిక్కి చేరుకున్న నూతన వ్యవసాయక సమాజాన్ని ప్రాతిపదికగా శాతవాహనుల రాజ్యం ఏర్పడింది. ఈ శాతవాహనులు 'ఆంధ్ర' గణానికి చెందినవారనీ వీళ్ళను పాళీ సాహిత్యంలో అశ్మకులు (అశ్వకులు) అనడాన్ని బట్టి వీళ్ళది గుర్రం కుదురు చిహ్నం అయివుంటుందనీ ఇదివరకు చెప్పుకున్నాము. ప్రాకృతంలో శాతి వాహన, సంస్కృతంలో శప్తికర్ణి, 'గుర్రం నుండి ఆవిర్భవించిన' అనే అర్థాన్ని ఇస్తాయని కోశాంబి ఒక వ్యాసంలో వివరణాత్మకమైన పద విశ్లేషణ ద్వారా నిరూపిస్తాడు.[41] ఆర్యుల ద్వారా మనదేశానికి వచ్చిన గుర్రాల మచ్చిక గోదావరి తీరంలో కొందరికి అలవడి వుంటుందని, తత్ఫలితంగా వాళ్ళు వేటలోనూ యుద్ధంలోనూ ఇతరుల కంటె సమర్థులయి, ఆహార ఉత్పత్తి ప్రారంభమయిన తరువాత ఇతర గణాలను లొంగదీసుకొని మొదటి రాజ్యాన్ని ఏర్పరచి వుంటారనీ కోశాంబి భావిస్తాడు. శాత వాహనుల కంటె ఇంకొంచెం ఆలస్యంగా తమిళ ప్రాంతంలో గూడ ఆహార ఉత్పత్తి గణనీయమయిన పరిమాణాన్ని అందుకొని మొట్ట మొదటి తమిళ రాజ్యాలు (క్రీ. శ. 1వ శతాబ్దంలో) పాండ్య చోళ చేర గణాలలో ఏర్పడ్డాయి. అశోకుడి కాలానికి ఇవి రాజ్యాలు కావు, గణాలని చూసాం.

స్వయం పోషక గ్రామాలు ఏర్పడుతున్న గంగా యమునా లోయలలో బౌద్ధ మతం తన చారిత్రక ప్రాముఖ్యతను క్రమంగా కోల్పోతోంది. కాని దక్కన్‌లో ఇంకా

ఆటవికుల వ్యవసాయీకరణ సాగుతూనే వుంది కాబట్టి బౌద్ధ విహారాలు తమ పాత్రను నిర్వహిస్తూనే వున్నాయి. క్రీ. పూ. 6వ శతాబ్దం నుండి వ్యవసాయక వర్గ సమాజపు అవిర్భావంలో దూరప్రాంత వర్తకం నిర్వహించిన కీలకమయిన పాత్రను ఇదివరకే చూసాము. గంగా యమునా లోయల నుండి వర్తకులు సరుకులను దక్కన్‌లోని ఆటవిక ప్రాంతాలకు తీసుకొచ్చారు. ఆటవికులకు సరుకులమ్మి వాళ్ళ నుండి వాళ్లు సేకరించిన వస్తువులు కొన్నారు. అంతేకాక, విదేశాలతో జరిగిన సముద్ర వ్యాపారం పడమటి తీరం గుండా సాగింది. కాబట్టి ఆ ఎగుమతి సరుకులు గూడ దక్కన్‌లోని ఆటవిక ప్రాంతాలను దాటి పడమటి కనుమల లోయల గుండా తీరాన్ని చేరాలి. త్రోవలో వర్తకుల దైనందిన అవసరాలకోసం గూడ ఆటవికులతో మార్పిడి జరిగింది. ఈ క్రమంలో ఆటవికులలో వర్గ విభజన ఏర్పడి వాళ్ళకు వ్యవసాయం అలవడింది. ఈ పరిణామంలో బౌద్ధం నిర్వహించిన పాత్రనూ, తత్ఫలితంగా బౌద్ధ పురావస్తు అవశేషాలలో నిక్షిప్తమయి కనిపించే ఈ చారిత్రక పరిణామం చిహ్నాలనూ ఇదివరకే కొంత చూసాము. బౌద్ధ విహారాలకు వర్తక శ్రేణులు, వృత్తిపని వారిశ్రేణులు, పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చాయి. ఈ విరాళాలుకు 'పుణ్యం' ఒక ప్రోద్బలం అయితే దొంగలనుండి రాజులనుండి వర్తకులు తమ పెట్టుబడిని కాపాడుకోవడానికి అదొక మార్గం.[42] విరాళాలు బ్యాంకు డిపాజిట్లలాగ విహారాలలో వుండేవి. వాటిని భిక్షువులు వడ్డీకి యిచ్చి ఆ లాభంతో తమ అవసరాలు తీర్చుకునేవారు. వర్తకులకు మార్గ మధ్యంలో ఇటువంటి బ్యాంకులు అవసరం. విహారాలు ఆహారం తదితర అవసరాల కోసం చేసిన ఖర్చు చుట్టుపక్కలవున్న ఆటవికులలో శ్రమ విభజననూ వర్గవిభజననూ ప్రవేశపెట్టాయి. ధనం కొంత సంపాదించుకున్న ఆటవిక గణ ముఖ్యులు ఇనుము వాడకాన్ని, వ్యవసాయాన్ని ప్రోత్సహించి తామొక పాలక వర్గంగా స్థిరపడ్డారు. నూతన వ్యవసాయక సమాజానికి అవసరమయిన సామాజిక నీతిని బౌద్ధభిక్షువులు ప్రచారం చేసారు. క్రీ. పూ. 600 నుండి సాగుతున్న ఈ పరిణామం ఇప్పుడు మరింత ఉన్నత స్థాయిలో సాగింది. శాతవాహన రాజ్యం ఆర్థిక అభివృద్ధిలో బౌద్ధ విహారాలు ప్రముఖమయిన పాత్ర వహించాయని కోశాంబి భావిస్తాడు.[43] పడమటి దక్కన్ లోని బౌద్ధ విహార గుహలన్నీ గూడ దక్కన్ పీఠభూమినుండి పడమటి తీరానికి దారితీసే కనుమలలోని వర్తక మార్గాలవెంబడి వున్నాయని కోశాంబి వివరంగా నిరూపిస్తాడు.[44] గ్రీసు తదితర దేశాలతో జరిగిన సముద్ర వ్యాపారం ఈ మార్గాల మీదుగానే సాగింది. ధేనుకాకటం అనే పడమటి తీరంలోని గ్రీకు ఆవాసం లోని వర్తకులు ప్రముఖమయిన కార్లె గుహలోని చైత్య నిర్మాణానికి విరాళాలిచ్చారని ఆ గుహ గోడలమీది రాతలను బట్టి తెలుస్తుంది.

దక్కన్‌లో అప్పటికి స్వయంపోషక గ్రామాలు లేవనడానికి చిహ్నంగా వృత్తి పనివాళ్ళ శ్రేణులు గూడ వర్తకులలాగే బౌద్ధ విహారాలకు పెద్ద ఎత్తున విరాళాలిచ్చాయి.

స్వయంపోషక గ్రామాల ఆవిర్భావంతో వృత్తిశ్రేణులు నశించి కులాలగా మారి గ్రామాలకు తరలాయి. ఆపైన వృత్తిపనివాళ్ళు విరాళాలిచ్చే ప్రసక్తిలేదు. ఈ దశలో మాత్రం రాజులు, రాజాధికారులు, శ్రేష్ఠులు, గృహపతులతో బాటు కమ్మరులు, వర్ధంగులు, మాలీలు, గంధికులు, వెదురుపని చేసేవాళ్లు, లేఖకులు గూడ తమ శ్రేణుల ద్వారా విరాళాలిచ్చారు అన్న విషయం నాసిక్ కార్లె కన్హేరి గుహలను బట్టి తెలుస్తుంది.[45]

శాతవాహనుల నాటి నాణాల ప్రాశస్త్యం అప్పటి వ్యాపారం విస్తృతిని తెలుపుతుంది. ఒకేఒక్క నిక్షేపంలో 20వేల వెండి నాణాలు దొరికాయి.[46] ఈ వర్తకానికి అనుబంధంగా వున్న బౌద్ధ విహారాలు గూడ చాలా సంపన్నమయ్యాయి. బుద్ధుని ఆదేశం ప్రకారం భిక్షువుకు భిక్షపాత్ర, ఒంటిమీద గుడ్డతప్ప వేరే ఆస్తి ఉండకూడదు. భోజనం అడుక్కొని తినాలేతప్ప కొనుక్కోకూడదు. అయితే ఆయన అనుచరులు ఈ సరికి వర్తకుల విరాళాలను పెట్టుబడిగా చేసుకొని ఆర్భాటమయిన విహారాలలో జీవిస్తున్నారు. తమ అవసరాలన్నీ కొనుక్కుంటున్నారు. వాళ్ళ విహారాల గోడలమీద వున్న అందమయిన శృంగార చిత్రాలు బౌద్ధ శ్రమణుల మతాన్నికాక విరాళాలిచ్చిన వర్తకుల సంపదనూ సంస్కృతినీ ప్రతిబింబిస్తున్నాయి. అయితే ఈ దశలో ఇంకా వర్తక విస్తరణ ద్వారా వ్యవసాయక నాగరికత వ్యాప్తి జరుగుతోంది. కాబట్టి బౌద్ధమతం తన సామాజిక పునాదిని పూర్తిగా కోల్పోలేదు. వ్యవసాయ విస్తరణ మరికొంత ముందుకు పోయి స్వయంపోషక గ్రామాలు ఏర్పడేసరికి బౌద్ధ విహారాలు తమ సామాజిక పాత్రను కోల్పోవడమేకాక సమాజానికి ఆర్థిక భారంగా తయారయ్యాయి. దానితో బౌద్ధమతం నాశనం కాక తప్పలేదు.[47]

## స్వయంపోషక గ్రామాలు

మౌర్యుల పతనం అనంతరం గంగా యమునా లోయలలో స్వయంపోషక గ్రామాలు ఏర్పడడం మొదలయిందని అన్నాము. విస్తరిస్తున్న వ్యవసాయ నాగరికత కేంద్రీకృత మగధ సామ్రాజ్యాన్ని సంక్షోభంలో పడేయగా, స్వయంపోషక గ్రామాలు ఆ సంక్షోభానికి పరిష్కారమయ్యాయని గూడ చూసాము. మన దేశంలో భూస్వామ్య వ్యవస్థకు స్వయంపోషక గ్రామాలు పునాదిరాళ్ళ వంటివి.

మగధ కాలపు ఉత్తర భారతదేశంలోనూ శాతవాహనుల దక్కన్ లోనూ వర్తక శ్రేణులేకాక వృత్తి శ్రేణులుగూడ బలంగా వున్నాయన్నాము. వ్యవసాయేతర ఉత్పత్తి వృత్తి శ్రేణులచేత చేయబడి, వర్తక శ్రేణుల ద్వారా దూర ప్రాంతాలకే కాక గంగా యమునా లోయల గ్రామాలకు గూడ చేరేది. అయితే, రవాణా ప్రసార సౌకర్యాలు చాలా అపరిణతంగావున్న ఆ రోజులలో ఈ వ్యవస్థకు చాలా పరిమితులుంటాయి. ఆహార ఉత్పత్తి పల్చగా వున్నంతవరకే ఇది సాధ్యం. స్థిర వ్యవసాయ గ్రామాలు

విస్తరించేకొద్దీ ఈరకమైన ఉత్పత్తి విధానం నిలువదు. పైగా, శ్రేణుల వర్తకమే వ్యవసాయ విస్తరణకు దోహదం చేసింది కాబట్టి ఈ వ్యవస్థ తన నాశనాన్ని తన గర్భంలోనే కలిగివుంది. వర్తకంతో సంపర్కం ఏర్పడ్డ ఆటవిక తెగలు కొన్నింటిలో వర్గవిభజన ఏర్పడి అవిగూడ వ్యవసాయక సమాజంలో చేరాయి. మరికొన్ని తెగలు తాము ఒక వృత్తి లేక వర్తకశ్రేణిగా మారాయి. ఆటవికులు తెగలనుండి కులాలుగా మారిన మౌలికమయిన చారిత్రక పరిణామాన్ని ఇప్పటికే చాలాసార్లు ప్రస్తావించాము. ఈ పరిణామంలో మధ్యదశగా శ్రేణులు కనిపిస్తాయి. ఒకరకమయిన వస్తువును సేకరించే ఆటవికులు వర్తకం సంపర్కంతో ఆ వస్తువును సేకరించి అమ్మే శ్రేణిగా మారి ఆతరువాత అదే వస్తువును ఉత్పత్తి చేసేకులంగా మారారు. ఉదాహరణకు అంబష్ఠులు మహాభారతంలో ఒక గణం, మనుస్మృతిలో ఒకచోట వైద్యం శ్రేణి, మరొకచోట బ్రాహ్మణుడికి వైశ్యస్త్రీకి పుట్టిన సంకర కులం. ఆయుధాల వాడకం తెలిసిన ఆటవికులలో వర్గ విభజన ఏర్పడి అవి వ్యవసాయక సమాజాలుగా మారిపోగా, ఆయుధాల వాడకం తెలియని గణాలు శ్రేణులుగా మారాయని కోశాంబి ఈ సందర్భంలో సూత్రీకరిస్తారు.[48]

మొత్తంమీద, శ్రేణులద్వారా గ్రామీణుల వ్యవసాయేతర అవసరాలను తీర్చిన సమాజం తన ఉనికిని తానే దెబ్బతీసుకుంది. స్థిర వ్యవసాయ గ్రామాల సాంద్రత పెరిగేకొద్దీ అది నిలవలేకపోయింది. క్రమంగా వృత్తులు గ్రామాలకు తరలడం మొదలయింది. స్వయంపోషక గ్రామాలు ఏర్పడి కేంద్రీకృత రాజ్యానికి చారిత్రకంగా అవసరంలేకుండ చేసాయి. ఇప్పుడు సామాజిక సంపదగూడ ఈ విస్తరణ ఫలితంగా పెరిగింది కాబట్టి చిన్నచిన్న రాజులనూ, విదేశీ దాడులనూ సమాజం 'భరించ' గలిగింది.

ఈ నూతన గ్రామీణ సమాజానికి నూతన నిర్మాణం కావాలి. పూర్వదశకు తగిన సామాజిక నీతినీ నిర్మాణాన్నీ అందిచ్చిన బౌద్ధమతం దీనికి తగదు. ఇంకా ఆటవిక గణాల లోకి వర్తకం ద్వారా వ్యవసాయం విస్తరిస్తూన్న ప్రాంతాలలో (ఉదాహరణకు దక్కన్ పీఠభూమిమీద) మాత్రమే బౌద్ధానికి సామాజిక పాత్ర ఇంకా మిగిలివుంది. ఉత్తర భారతదేశంలో బౌద్ధ విహారాలు సమాజంమీద ఒక భారంగా తయారయ్యాయి. వర్తకుల విరాళాలతో అవి చాలా సంపన్నమయినాయి. రాజులు మరిన్ని విరాళాలిచ్చి పోషిస్తున్నారు. దక్కన్‌లోని బౌద్ధ విహారాలకు విరాళాలిచ్చిన వాళ్ళలో వృత్తిపనివాళ్ళు గూడ చాలామంది ఉండగా ఉత్తర భారతదేశంలోని కుషానుల రాజ్యంలో బౌద్ధ విహారాలకు ఇచ్చిన విరాళాలు అన్నీ రాజులవీ, ధనిక వర్తకులవీ మాత్రమే. సాంచీ స్థూపానికి విరాళాలిచ్చిన 407 మందిలో ఒక్క రజను గూడ వృత్తిపనివాళ్ళు కారని కోశాంబి లెక్కగడతాడు.[49] క్రీ. శ. 2వ శతాబ్దంలో దక్కన్‌లోని బౌద్ధ విహారాలకు కమ్మరులూ, బెస్తలూ విరాళాలిచ్చారుగాని సమకాలిక

ఉత్తర భారతదేశంలో అటువంటిది ఊహించడం గూడ సాధ్యం కాదని మరొక చోట అంటాడు.[50]

సామాజిక పునాదిలో వచ్చిన ఈ మార్పుకు ప్రతిఫలనంగా బౌద్ధమతంలో చీలిక వచ్చింది. కుషానుల కాలంలో బౌద్ధం మహాయాన-హీనయానాలగా చీలిపోయింది. మహాయానం ఉత్తర భారతదేశంలోని సంపన్న విహారాల మతం అయింది. తన భాషను పాళీనుండి సంస్కృతానికి మార్చుకుంది. ఆర్భాటమయిన పూజా విధానాన్నీ, తత్వచింతననూ అలవర్చుకుంది. దక్కన్‌లో ఇంకా వ్యవసాయ సమాజం ఆవిర్భావంలో తన పాత్రను కోల్పోని బౌద్ధమతం హీనయానం అయింది. అది ఇంకా కొంతమేరకు బుద్ధుడు ప్రచారంచేసిన నిరాడంబర జీవితాన్ని అనుసరిస్తోంది. అయితే ఈ ఉత్తర-దక్షిణ విభజన ఎక్కువకాలం నిలువలేదు. శాతవాహనుల అనంతరం దక్కన్‌లోగూడ స్వయంపోషక గ్రామాలు ఆవిర్భవించడంతో ఇక్కడగూడ బౌద్ధం తన పాత్రను కోల్పోయింది. మహాయానం దక్షిణానికి గూడ విస్తరించింది. ప్రఖ్యాతుడయిన మహాయాన తాత్వికుడు నాగార్జునుడు క్రీ. శ. రెండవ శతాబ్దంలో కృష్ణానది ఒడ్డున జీవించాడు.[51]

బౌద్ధం ఈ విధంగా తన పునాదిని కోల్పోయింది. గాని, బ్రాహ్మణ మతం మాత్రం నూతన గ్రామీణ సమాజానికి అనుగుణ్యమైన మార్పులను సాధించి తాను బలపడింది. బ్రాహ్మణ మతం అన్ని చారిత్రక దశలలోనూ ఇదేపని చేసింది. హిందువుల ఆచారాల నన్నింటినీ 'అనాది'గా వస్తున్నవని భావించడంవల్ల బ్రాహ్మణ మతానికి ఉన్న ఈ ప్రముఖ లక్షణం విస్మరించబడుతోంది. యజ్ఞబలులను కేంద్ర అంశంగా కలిగివున్న వైదిక మతం దాని తొలినాటి రూపం. అది పశుపోషక ఆదిమ సమాజానికి తగింది. ఆహార ఉత్పత్తి దానిపైన ఆధారపడ్డ శ్రమదోపిడీ వచ్చిన తరువాత వర్ణవ్యవస్థ ఆవిర్భవించింది. యజ్ఞబలులు తమ ప్రాముఖ్యాన్ని కోల్పోయాయి. వర్ణధర్మాన్ని ఆధారం చేసుకున్న శ్రమ దోపిడీ కేంద్ర స్థానాన్ని పొందింది. క్షత్రియులు యుద్ధాలు చేస్తారు, పరిపాలన సాగిస్తారు, యజ్ఞాలు చేస్తారు. బ్రాహ్మణుల యజ్ఞ కర్మకాండ నిర్వహిస్తారు. వైశ్యులు వ్యవసాయాన్ని వ్యాపారాన్నీ నిర్వహిస్తారు. బలుల రూపంలో పన్నుల రూపంలో అదనపు ఉత్పత్తిని రెండు అగ్ర వర్ణాలకు అప్పజెపుతారు. శూద్రులు ఆయుధాలు ధరించే హక్కుగాని, భూమిని కలిగి వుండే హక్కుగాని లేక పై మూడు వర్ణాలకు సమిష్టి భృత్యులుగా (helots) పని చేస్తారు. తొలినాటి వ్యవసాయక సమాజానికి ఈ నిర్మాణం సరిపోయింది. శ్రమ విభజన అపరిణతంగా వుండడం వల్ల నాలుగు వర్ణాలు సరిపోయాయి. అయితే స్థిర వ్యవసాయ గ్రామాల సంఖ్య పెరిగే కొద్దీ సంపద పెరగడం, ఎక్కువ అవసరాలు తీరడం, జరిగింది. ఈ అవసరాలు తీర్చడానికి వర్తక శ్రేణులూ వృత్తి శ్రేణులూ వచ్చాయి. ఆటవిక తెగల నాగరీకరణ ఫలితంగా గణాలు వృత్తిశ్రేణులుగా మారాయని చూసాము.

ఈ వర్తకులనూ వృత్తిపని వారినీ వైశ్యులు లేక శూద్రులు అనవచ్చునుగాని నిజానికి ఈ శ్రేణులు చాతుర్వర్ణ్యం పరిధిలో పూర్తిగా ఇమడవు. ఈ సంధి దశలో చతుర్వర్ణ వ్యవస్థకు సర్వత్రా ఆమోదం లేదు. సమాజంలో చాలా ప్రబలంగా వున్న బౌద్ధ మతం దాన్ని వ్యతిరేకించింది. మగధకు చెందిన అర్థశాస్త్రం బ్రాహ్మణ గ్రంథమే అయినా అందులో సామాజిక నిర్మాణం వర్ణాల పరంగా వివరించబడలేదు. పాలక వర్గాలను పౌర-జానపదులు అన్నారు.[52] ఈ మాటలకు అర్థం ఇదివరకే చూసాము. అదే కాలంలో భారతదేశాన్ని గురించి రాసిన మెగస్తెనెస్‌కు గూడ నాలుగు వర్ణాలుకాక ఏడు వర్గాలు కనిపించాయి. మన ఆచారాలన్నీ 'అనాది'గా వస్తున్నాయని భావించడం వల్ల మెగస్తెనెస్ రచనను అభూతకల్పనగా కొట్టివేయడం జరిగిందిగాని నిజానికి అప్పటికి నాలుగు వర్ణాలవ్యవస్థ సార్వత్రిక ఆమోదం పొందలేదని అర్థం చేసుకోవాలి.[53] శాతవాహనుల దక్కన్‌లోగూడ ఇదే పరిస్థితి కనిపిస్తుంది. బౌద్ధ జాతక కథలలోని గాథలు బుద్ధుడి కాలం నుండి వస్తున్న సంప్రదాయం కావచ్చుగానీ ఆ కథలలోని వాతావరణం మాత్రం శాతవాహనుల దక్కన్‌కు చెందిందని కోశాంబి అభిప్రాయం.[54] ఆ కథలలోనూ ఆ కాలపు శాసనాలలోనూగూడ వర్ణవ్యవస్థ సార్వత్రిక వ్యాప్తి పొందలేదన్న విషయం కనబడుతుంది. జాతక కథలలో సంపన్న వర్గాన్ని శెట్టి-గహపతులు అన్నారు. పెద్ద ఎత్తున అమ్మకపు సరుకులను ఉత్పత్తి చేసిన వృత్తిపని వాళ్ళ శ్రేణులున్నాయి. కొన్ని గ్రామాలకు గ్రామాలే ఈ శ్రేణులతోనిండి వున్నాయి. గహపతులు వర్ణం రీత్యా సంపన్నులయిన వైశ్యులేగాని వాళ్లు వాణిజ్యం నుండి వ్యవసాయం వడ్రంగం దాకా అన్నీ నిర్వహించారు. ఒక జాతక కథలో తల్లిదండ్రులు తమ కొడుకు ఏ వృత్తి చేపట్టాలా అని చర్చించిన ఉదంతాన్ని ప్రస్తావించి, వర్గ వ్యవస్తే నిజంగా వుండి వుండే ఈ చర్చకు ఆస్కారంలేదని కోశాంబి అంటాడు.

గంగా యమునా లోయలలో స్వయం పోషక గ్రామాలు ఏర్పడడం మొదలయ్యాకనే బ్రాహ్మణ ధర్మం సర్వ వ్యాప్తం కావడం మొదలయింది. అయితే నాలుగు వర్ణాల వర్ణ వ్యవస్థ ఇప్పుడు సరిపోదు. తొలినాటి వ్యవసాయక సమాజం ఇప్పుడు చాలా పరిణతి చెంది చాలా రకాల వస్తువులను ఉత్పత్తి చేస్తోంది. ఈ ఉత్పత్తి కారులందరినీ టోకున 'శూద్రులు' అనే నాలుగవ వర్ణంలోకి చేర్చేయడం సిద్ధాంతరీత్యా సాధ్యమే (ఆ పని చేసారుగూడ) కాని చారిత్రక క్రమంలో అందరూ ఒకేసారి వచ్చి స్వయం పోషక గ్రామాలలోనికి చేరలేదు కాబట్టి వాస్తవంలో అది సాధ్యం కాదు. జరిగిందేమిటంటే ఒక్కొక్క వృత్తిశ్రేణీ నశించి కార్మికులు గ్రామాలలో స్థిరపడ్డారు. ఒక్కొక్కటీ ఒక్కొక్క 'కులం' అయింది. ఇక మీదట నాగరిక సమాజంలోకి వచ్చి చేరిన గణాలుగూడ శ్రేణులగా కాక నేరుగా కులాలగానే వచ్చిచేరాయి.

ఈ నూతన గ్రామీణ వ్యవస్థ ఆవిర్భావంలో సంపన్నమయిన బౌద్ధ విహారాలు ఎటువంటి పాత్రనూ నిర్వహించలేక పోయాయని చూసాం. బ్రాహ్మణులు అందుకు

భిన్నంగా గ్రామాలలోనే వచ్చి స్థిరపడ్డారు. కులవ్యవస్థను పెంపొందించారు. కులాలగా మారిన ఆటవికుల లేక శ్రేణుల దేవతలనూ దేవుళ్ళనూ బ్రాహ్మణీకరించి గుళ్లు కట్టారు. ఆ గుళ్ళలో పూజలు నిర్వహించి తమ పొట్టపోసుకోవడమే కాక, కులవ్యవస్థను కట్టుదిట్టం చేసారు. కర్మకాండనూ పూజలనూ ఆమోదించని బౌద్ధ మతం ఈ పనులు చేయలేకపోయింది. బౌద్ధం వైఫల్యానికి ఇదొక ముఖ్య కారణం.

ఆటవిక గణాలను స్వయంపోషక గ్రామ సమాజంలో కలుపుకునే క్రమంలో కులాలు ఏర్పడ్డాయి కాబట్టి, కులాలకు గణాల లక్షణాలు అంటుకున్నాయి. కుల వ్యవస్థకు గల రెండు ప్రధాన లక్షణాలూ గణ వ్యవస్థ నుండి వచ్చినవేనని కోశాంబి అభిప్రాయం.[55] ఒకటి, కులాలకు తమ స్వంత ఆచారాలూ స్వంత దేవతలూ పూజలూ పవిత్రదినాలూ ఉండడం. గణాల పూర్వ ఆచారాలు ఇక్కడ కుల ఆచారాలగా మారాయి. అయితే అవి బ్రాహ్మణీకరణ చెంది 'హిందూమతం'లో భాగం అయ్యాయి. వాటిని బ్రాహ్మణీకరించడం ద్వారా ఆటవికులను బలప్రయోగం అవసరం లేకుండ వ్యవసాయక సమాజంలోనికి కలుపుకు రావడం బ్రాహ్మణ మతం నిర్వహించిన ప్రముఖమైనపాత్ర అన్న కోశాంబి అభిప్రాయాన్ని చాలా సార్లు ప్రస్తావించాము. వ్యవసాయ సమాజ విస్తరణకు ఈ విధంగా దోహదం చేసిన ఈ లక్షణమే అసంఖ్యాకమైన పూజలకూ ఆచారాలకూ నమ్మకాలకూ తావిచ్చి భవిష్యత్తులో ఆర్థిక ప్రగతికి తద్వారా సాంస్కృతిక పురోగమనానికి ఆటంకమయింది.[56]

కులవ్యవస్థకుండే రెండవ ప్రముఖ లక్షణం పరస్పర సంపర్కం పైన నిషేధం. ఇదిగూడ గణవ్యవస్థ నుండి వచ్చిందే. గణాల మధ్య సహపంక్తి భోజనంగాని వివాహ సంబంధంగాని నిషిద్ధం. 'బాహ్యనిషేధం' గణసమాజ ఆచారాలలో ముఖ్యమైనది. అది కులవ్యవస్థకు గూడ సంక్రమించింది. ఒక కులం వాళ్లు మరొక కులంతో కలిసి భోజనం చేయరు, వివాహసంబంధం పెట్టుకోరు. అయితే గణాల మధ్య హెచ్చు తగ్గుల ప్రసక్తి లేకపోగా, కులాలు వర్గ సమాజంలో భాగం కావడం వల్ల వాటి మధ్య హెచ్చు తగ్గుల వివక్ష (స్థూలంగా ఆర్థిక స్థాయిని బట్టి) ఏర్పడింది. అందే గణాల మధ్య బాహ్య నిషేధం ఇరుపక్షాలకూ సమమైనది కాగా, కులాల మధ్య సంపర్కనిషేధం అసమానమయినది. క్రింది కులంతో సంపర్కం పై కులానికి నిషేధం. క్రింది వాళ్లు ఆ నిషేధాన్ని పైవాళ్ళ మీది 'గౌరవం' కొద్దీ పాటిస్తారే తప్ప వాళ్ళకు ఆ నిషేధం ఉండదు.

గణాలు వ్యవసాయక సమాజంలో రెండు రకాలగా చేరాయన్న కోశాంబి అభిప్రాయాన్ని ఇదివరకు చూసాము. ఆయుధాల వాడకం తెలిసిన బలమయిన గణాలలో వర్గ విభజన ఏర్పడి ఆయుధాలు కలిగిన గణముఖ్యులు పాలకవర్గంగా ఏర్పడ్డారు. ఇతరులు ఒక శ్రామిక కులంగా మారారు. ఆయుధాల వాడకం తెలియని బలహీనమయిన గణాలు ఒక శ్రేణిగానో శూద్ర కులంగానో మారి శ్రమదోపిడీకి లొంగిపోయాయి.

మొదటిరకం గణాలలో వర్గవిభజన ఏర్పడాలంటే గణాల ఉమ్మడితత్వం నశించాలి. వ్యవసాయ విస్తరణను ఒక పబ్లిక్ సెక్టర్ పరిశ్రమగా భావించిన కౌటిల్యుడు ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తించాడు. ఆటవికులను రాజు ఏ విధంగా లొంగదీసుకోవాలో చర్చిస్తూ ఒక ఎత్తుగడ చెప్తాడు. "గూఢచారులు గణంలోనికి ప్రవేశించి గణంలో విభేదాలనూ ద్వేషాన్నీ ఏ విధంగా ప్రవేశపెట్టాలో తెలుసుకోవాలి. గణం ముఖ్యులు సామాన్య గణ సభ్యులతో సహపంక్తి భోజనం చేయకూడదనీ వివాహ సంబంధం పెట్టుకోకూడదనీ రెచ్చగొట్టాలి" అంటాడు.[57] గణాల సమిష్టి జీవితాన్ని నాశనంచేసి వాళ్ళను సామాజికంగా లొంగదీసుకొవాలంటే అంటరానితనాన్ని ప్రవేశపెట్టాలన్న కుయుక్తిని ఇంత స్పష్టంగా చెప్పారు. మాటలలో ఇంత నిర్మొగమాటంగా చెప్పింది ఒక్క కౌటిల్యుడే అయినా హైందవమతం ఈ కుటిల నీతిని ఆనాటి నుండి ఈనాటి దాకా ఆచరిస్తూనే వుంది.

ఇక్కడ గమనించ వలసిన ముఖ్యమైన విషయం ఏమిటంటే ఈ కులవ్యవస్థకూ యజుర్వేదకాలపు వర్ణ వ్యవస్థకూ గల సామాజిక పునాదులు పూర్తిగా భిన్నమయినవి. ఆహార ఉత్పత్తి కొత్తగా అలవడ్డ దశలో, ఆర్యులకు లొంగిపోయిన ఆర్యేతరులచేత శ్రమ చేయించి ఆహారం ఉత్పత్తి చేయించుకోవడానికి ఒక 'శూద్ర' వర్ణం సరిపోయింది. ఆర్యుల లోపలి సామాన్యజనాన్నీ పాలకవర్గాన్నీ వేరుచేయడానికి వైశ్యులు, బ్రాహ్మణ-క్షత్రియులు అనే విభజన సరిపోయింది. స్వయంపోషక గ్రామాలకు ఈ చాతుర్వర్ణ్యం ఎంతమాత్రం చాలదు. వ్యవసాయ విస్తరణ క్రమంలో నూతన గ్రామీణ సమాజం ఏర్పడ్డ క్రమంలోనే వర్ణవ్యవస్థతో ప్రమేయం లేకుండ అనేక 'శూద్ర' కులాలు ఏర్పడ్డాయి. చరిత్ర శాస్త్రకారుల అనుమతితో నడవదు. ఇకమీదట నిజమయిన వ్యవసాయ దారులు, వృత్తిపనివారు, ఈ శూద్రులే. వైశ్యులు వర్తకానికి పరిమితమవుతారు. శూద్రుల సంఖ్య అపరిమితంగా పెరిగిపోగా, వైశ్యులు అల్పసంఖ్యాకులవుతారు.[58]

ఈ కొత్త పరిణామం బ్రాహ్మణులను చాలా ఇబ్బంది పెట్టింది. చతుర్వర్ణ వ్యవస్థ చట్రంలోనికి ఈ నూతన సమాజాన్ని ఎట్లా ఇరికించాలో వాళ్ళకు అర్థంకాలేదు. గతాన్ని ఎంతమాత్రం వదులుకోవడం ఇష్టంలేనివాళ్ళు కాకపోతే ఈ దశలో వర్ణ వ్యవస్థను కాదని కొత్తశాస్త్రాలు రాసేవారు. కాని యజ్ఞ బలులను వదిలిపెట్టి 2500 సంవత్సరాలు దాటినా ఇప్పటికీ వేదమంత్రాల పఠనాన్ని వదలనట్టే, వర్ణ వ్యవస్థకు కాలం చెల్లిపోయి కుల వ్యవస్థ ఏర్పడినప్పటికి కొత్త వ్యవస్థను పాత సూత్రాల చట్రం లోనే నిర్వచించే ప్రయత్నంచేసారు. నాలుగు వర్ణాల విభజనను వదిలిపెట్టకుండ అసంఖ్యాకమయిన కులాలకు అర్థం చెప్పారు.[59] అసాధ్యం అనిపించే ఈ కార్యాన్ని అమోఘమయిన కుతర్కంతో సాధించినవాడు మనువు. నాలుగు ప్రధాన వర్ణాల మధ్య వర్గ సంకరం జరిగిన ఫలితంగా కులాలన్నీ ఏర్పడ్డాయని మనువు ఒక కల్పన చేసాడు. తరువాతి శాస్త్ర కారులు దీనిని కొనసాగించారు.

మనుధర్మశాస్త్రం ఈ నూతన గ్రామీణ సమాజాన్ని వివరించే ప్రధాన సాహిత్య మూలం. మనుస్మృతిని అర్థశాస్త్రంతో పోలిస్తే ఈ కొత్త సమాజం లక్షణాలు అర్థం అవుతాయి. అర్థశాస్త్రం సమాజాన్ని కేంద్రీకృతంగా పరిపాలించాలని బోధించింది. ప్రభుత్వ ఉద్యోగులు అన్ని విషయాలలోనూ జోక్యంచేసుకొని పరిపాలన నిర్వహిస్తారు. మనువు అందుకు భిన్నంగా, రాజు ఆయా కులాల శ్రేణుల ఆచారాలను దృష్టిలో వుంచుకొని నిర్ణయాలు చేయాలంటాడు. వివిధ కులాల లేక శ్రేణుల అంతర్గత వ్యవహారాలను వాళ్ళకే వదిలేసి రెండు కులాల మధ్య సంబంధాలను మాత్రమే రాజు నియంత్రిస్తాడు.[60] కొత్తగణాలను కులాలగా కలుపుకునే క్రమంలో ఈ వికేంద్రీకరణ అనివార్యమయింది అర్థశాస్త్రంలోని రాజ్యం సర్వసత్తాక రాజ్యం. మనుస్మృతిలోని రాజ్యం స్వయంపోషక గ్రామాలను ప్రాతిపదికగా గల చిన్న రాజ్యం. ప్రభుత్వ నిర్వహణలోని సీతాభూముల ప్రస్తావనగాని గనులపైన ప్రభుత్వ గుత్తాధిపత్యంగాని లేవు. ఆర్థిక రంగం అర్థశాస్త్రమంత ఆర్భాటంగా లేదు. సంపన్నులైన పౌర జానపద వర్గాల ప్రస్తావన లేదు. వెండి నాణాలు పోయి రాగి నాణాలు వచ్చాయి. వెండి నాణాలను 'పురాణం' అన్నారు-అంటే అవి అసలు వినియోగంలో లేవని అర్థమవుతుంది.[61] ఈ దశనుండి కార్షాపణములు అందేనే రాగి నాణాలు అనే అర్థం వచ్చింది.[62] పన్నులు గూడ ఇప్పుడు తక్కువగానే వున్నాయి. అర్థశాస్త్రంలో పన్నులు పంటలో నాలుగవ వంతు నుండి ఆరవ వంతుకాగా, మనుస్మృతిలో ఆరవ వంతు నుండి పన్నెండవ వంతు మాత్రమే. ప్రభుత్వ ఉద్యోగుల కిచ్చే జీతంగూడ తక్కువే. నిజానికి దిగువ స్థాయికి చెందిన ఉద్యోగులకు మాత్రమే నగదు జీతాలిచ్చినట్టుంది. పై స్థాయి అధికార్లకు కొన్ని గ్రామాలనుండి సేకరించిన పన్నుగాని, కొంత భూమిగాని, జీతంగా ఇచ్చారు.[63] మన దేశంలో భూస్వామ్య వ్యవస్థకు ఇది ప్రధానమయిన లక్షణం. దీని బీజాలు మౌర్యుల పతనం అనంతరం ఏర్పడిన స్వయంపోషక గ్రామీణ సమాజం తొలిరోజులలోనే అంకురించినట్టు మను ధర్మశాస్త్రం ద్వారా తెలుస్తుంది.

కుల వ్యవస్థతో బాటు కులతత్వం అన్ని రంగాలలోనికి విస్తరించింది. నేరానికి శిక్ష కులాన్నిబట్టి వుంటుంది. అప్పుకు వడ్డీ కులాన్నిబట్టి వుంటుంది. బ్రాహ్మణుల నుండి 24 శాతం, క్షత్రియుల నుండి 36 శాతం, వైశ్యులనుండి 48 శాతం, శూద్రుల నుండి 60 శాతం, వడ్డీ తీసుకోవచ్చును. ఋణగ్రస్తుడు అప్పు తీర్చలేని పక్షంలో, అతనిది తక్కువకులం అయితే చాకిరీ చేసి తీర్చాలి. కాని ఎక్కువ కులం అయితే చాకిరీ చేయించుకోవడానికి వీలులేదు. అతను సంపాదించినప్పుడే అప్పు తీరుస్తాడు. స్వయం పోషక గ్రామీణ సమాజం ఆవిర్భవించేదాక కులవ్యవస్థ లేదని, తత్పూర్వ రూపమయిన వర్ణ వ్యవస్థకు సార్వత్రికమైన ఆమోదం లేదనీ అన్నాం. అందుకు మరొక నిదర్శనంగా, అర్థశాస్త్రంగూడ బ్రాహ్మణ గ్రంథమే అయినప్పటికీ అందులో ఇటువంటి కుల వివక్షలేదు.[64]

మౌర్యుల కాలం వరకు గూడ వ్యవసాయరంగానికి చెందిన ధనికులను 'భూస్వాములు, అనడానికి వీలులేదని చూసాం గృహపతులు, జానపదులు, అని పిలువబడ్డ వాళ్ళు సజాత వ్యవసాయ బృందాల ముఖ్యులు. భూమి ఈ బృందాల ఉమ్మడి ఆస్తి కాగా, ప్రభుత్వ నిర్వహణలో బంజర్లను వ్యవసాయ యోగ్యం చేసిన 'సీతా' గ్రామాల శూద్ర కర్షకులకు తమ జీవితాంతం మాత్రమే భూమి మీద హక్కువుంది. ఈ నూతన (స్వయం పోషక) గ్రామీణ సమాజం సంగతి ఏమిటి?

మన దేశంలో వ్యవసాయ సమాజం ఆవిర్భవించిన తీరువల్ల భూమిలో ఉమ్మడి యాజమాన్యం చాలా కాలం నిలిచి పోయింది. గణాలు తాము వ్యవసాయయోగ్యం చేసి నాగలి కిందికి తెచ్చిన భూమిని తమ సమిష్టి ఆస్తిగానే కలిగి వున్నాయి. కాబట్టి గ్రామాలలోని ప్రధాన వ్యవసాయ క్షేత్రాలు సమిష్టి ఆస్తిగానే కొనసాగాయి. అయితే గ్రామ శివార్లలోని బంజర్లను మాత్రం ఎవరికి వారు తమ స్వంత శ్రమతో నాగలి కిందికి తెచ్చారు. ఆ భూమి వాళ్ళ స్వంత ఆస్తి కావడం ఈ దశలో మొదలయింది. 'దుప్పిని ఎవడు మొదట కొడితే అది వాడిదే అయినట్టు భూమిని ఎవడు ముందర వ్యవసాయ యోగ్యం చేస్తే అది వాడిదే అవుతుంది' అని మనువు అన్నాడు. సమకాలిక బౌద్ధ సాహిత్యంలోనూ అదే అభిప్రాయం వుంది. గ్రామంలోని ప్రధాన వ్యవసాయ క్షేత్రాన్ని గూడ, సజాత బృందంలోని అందరూ అంగీకరిస్తే విభజించవచ్చునని మనుస్మృతి నుండి పరోక్షంగా నిర్ధారించ వచ్చునేమోనని కోశాంబి భావిస్తాడు[65]

అర్థశాస్త్రానికీ మను ధర్మశాస్త్రానికీ ఎన్ని తేడాలున్నా ఒక్కవిషయంలో మాత్రం ఏకీభావం వుంది. రెండూ గూడ తమ ధర్మపన్నాల వర్గ స్వభావాన్ని రాజ్యాసికుండే అణచివేత స్వభావాన్ని నిర్మొగమాటంగా చెప్పాయి. "రాజు బలప్రయోగంతో శూద్రుల చేత, వైశ్యుల చేత వాళ్ళ విధులు చేయించాలి. ఈ రెండు వర్ణాలు తమ విధులు నిర్వహించకపోతే ప్రపంచం మొత్తం అస్తవ్యస్తం అయిపోతుంది " అంటాడు మనువు.[66] "ప్రభుత్వమూ పురోహితుడు ఉత్పత్తి దారుడి చేత తనవిధి నిర్వహింప జేయడంలో ఐక్యమవుతారు. అదే జరగకుంటే వాళ్ళకు పంచుకోవడానికి అదనపు ఉత్పత్తి ఉండదు" అని కోశాంబి వ్యాఖ్యానిస్తాడు.

మనం 'హిందూమతం'గా ఇవ్వాళ గుర్తించే ఆచారాలన్నీ ఈ దశనుండి రూపం తీసుకున్నాయి. తత్పూర్వకాలపు బ్రాహ్మణ మతాన్ని 'హిందూమతం' అని ఇవాల్టి అర్థంలో పిలవలేము. అది కేవలం అవశేషాల రూపంలో ఈ కొత్త హిందూమతంలో మిగిలింది. హిందూమతం స్వయంపోషక గ్రామాలలో పుట్టింది. అక్కడి నుండి భూస్వామ్య వ్యవస్థ అభివృద్ధి చెందే క్రమంలో దానికి అనుకూలంగాతానూ మారుతూ పోయింది. మన ఆచారాలన్నీ అనాదిగా వస్తున్నాయని భ్రమించడం వల్ల హైందవంలోని చారిత్రక పరిణామాలు మరుగున పడుతున్నాయని కోశాంబి అభిశంసిస్తాడు. బ్రాహ్మణ పూజలలోనూ కర్మకాండలోనూ ఇవ్వాళ కొబ్బరికాయలకు ఉన్నప్రాముఖ్యాన్ని ప్రస్తా

విస్తూ ఇది క్రీస్తు శకంలో ప్రారంభమయిన ఆచారమే తప్ప అంతకు పూర్వం లేదంటాడు. అంతకుపూర్వం బ్రాహ్మణులకు దక్షిణ ఇచ్చేటప్పుడు బిళ్వఫలం ఇచ్చే వారు. క్రి. శ. మొదటి శతాబ్దాలలో పడమటి కోస్తా ప్రాంతంలోనికి కొబ్బరి పంటను ప్రవేశపెట్టడంతో అక్కడ వ్యవసాయక సమాజం ప్రారంభమయింది. అత్యంత ముఖ్యమైన ఈ పరిణామానికి గుర్తుగా కొబ్బరికాయ హిందూ ఆచారాలలో ప్రముఖ స్థానాన్ని పొందింది.[67]

స్వయం పోషక గ్రామాల ఆవిర్భావంతో రూపొందిన హిందూమతానికి ఆ సామాజిక పునాది నుండి వచ్చిన పరిమితులన్నీ వున్నాయి. గ్రామీణ జీవితానికి ఋతువులతోనే తప్ప సంవత్సరాలతో పని లేదు. ఆగ్రామాలలో స్థిరపడ్డ బ్రాహ్మణ మతానికి గూడ ఇదే వైఖరి అలవడింది. రాముడు లంకను జయించిన రోజు (తిథి) ఏదని బ్రాహ్మణులు అనంతంగా వాదించుకుంటారు గాని ఏ సంవత్సరంలో జయించాడని ఎన్నడూ చర్చించ లేదంటాడు కోశాంబి. జైనులు మాత్రమే (వాళ్ళలో వర్తకులు చాల మంది వున్నారు కాబట్టి) తిథులే కాక సంవత్సరములు గూడ లెక్కబెట్టారు.[68] ఈ వైఖరి చారిత్రక దృక్పథాన్ని నాశనం చేసింది. స్వయం పోషక గ్రామాలు మన సమాజం మీద సాధించిన విజయం విదేశీ దాడులకంటే గూడ ప్రమాదకరమయినదని. కోశాంబి అంటాడు.[69] కాలాన్ని ఋతువులతో లెక్కించడం వల్ల అది 'కాలచక్రం' అయింది. ఈ కాలచక్రాన్ని నాలుగు యుగాల ప్రాతిపదిక మీద విభజించారు. కృత త్రేతా ద్వాపర కలి యుగాలలో కాలం ఉన్నత దశనుండి హీన దశకు మారుతుంది. తిరిగి ప్రళయం వచ్చి మళ్ళి కృతయుగం ప్రారంభం అవుతుంది. ఈ కాలచక్రానికి ఋతుచక్రానికి కోశాంబి పోలిక చెప్తాడు. వర్షాలు రాగానే వ్యవసాయం మొదలవుతుంది. ఆహారం పుష్కలంగా దొరుకుతుంది. వర్షాకాలం తరువాత నేలక్రమంగా ఎండిపోవడం మొదలవుతుంది. వేసవి వచ్చేసరికి జీవితం దుర్భరమవుతుంది. మళ్ళిఒక్కసారిగా వర్షాలు రావడంతో గ్రామీణ పరిసరాలు ప్రళయం వచ్చినట్టు నీటితో నిండి పోతాయి. మళ్ళి కొత్తచక్రం ప్రారంభం అవుతుంది. ఈ జీవిత అనుభవం నుండే నాలుగు యుగాల కాలవిభజన వచ్చిందని కోశాంబి అంటాడు.[70]

ఈ నూతన గ్రామీణ జీవితానికి సిద్ధాంతకర్త అయిన బ్రాహ్మణుడు గ్రామజీవి. బ్రాహ్మణులు పట్టణాలలో స్థిర నివాసం ఏర్పరచు కోవడానికి వీలులేదని బౌధాయన ధర్మసూత్రం అంటుంది.[71] గ్రామంలో నివసించి కులవ్యవస్థను పటిష్ఠం చేసి తద్వారా స్వయంపోషక గ్రామాలను బలపరచడం ఈ దశలో బ్రాహ్మణుల కర్తవ్యం. ఈ క్రమంలో, కులాలుగా కలుపుకున్న గణాల దేవుళ్ళూ పూజలూ ఆచారాలూ వచ్చి హిందూమతంలో కలిసాయి. కథలూ పురాణాలూ కల్పించ బడ్డాయి. ఇంత భిన్న మయిన సంప్రదాయాలను కలుపుకోగలగాలంటే తార్కికతనూ వివేచననూ వాస్త వికతనూ వదిలి పెట్టాలి. హిందూమతంలో వీటికి తావు లేదు. ఏదీ అసంగతం కాదు.

అసంబద్ధం కాదు. నమ్మశక్యం కానిదేదీ లేదు. రాజనీతి, ధర్మం, శాస్త్రం, శాసనం, సాహిత్యం, అన్నీ పురాణాలతోనూ మూఢవిశ్వాసాలతోనూ కలగలిసి పోయాయి. సంకుచితమయిన మౌఢ్యం సమాజాన్ని ఆవరించింది.

భౌతిక వాస్తవాల పట్ల ఈ బ్రాహ్మణ మతానికి ఉన్న నిర్లక్ష్యం వల్ల చరిత్రకే కాదు, మన సంస్కృతికి గూడ చాలా నష్టం జరిగింది.[72] స్వయంపోషక గ్రామాలు ఏర్పడి ఒకే నమూనాలో దేశాన్నంతా తీర్చి దిద్దకముందు మన సమాజంలో చాలా వైవిధ్యం వుండింది. ఎన్నో గణాలూ తెగలూ వ్యవసాయిక సమాజాలూ ఉండేవి. వాటికి భిన్నమయిన సంప్రదాయాలుండేవి. లిచ్ఛావి, మల్ల తదితర మగధ కాలపు గణాల ప్రజాతంత్ర సంప్రదాయం గ్రీకు సంప్రదాయానికి ఎంత మాత్రం తీసిపోయింది కాదు. అయితే గ్రామీణ సమాజంలో కులాలగా దేశ ప్రజలనంతా ఐక్యం చేసిన బ్రాహ్మణ మతం ఈ వైవిధ్యం నుండి కేవలం పూజలనూ ఆచారాలనూ మాత్రం స్వీకరించింది. మిగిలిన విషయాలన్నింటినీ విస్మరించింది. అవి కనీసం రికార్డు గూడ కాకుండ పోయాయి. బ్రాహ్మణులలో ఒక అరిస్టాటిల్ గానీ హెరొడోటస్ గాని పుట్టలేదు. తిమ్మినిబమ్మి చేయగల శంకరాచార్యుడి తర్కం మాత్రమే పుట్టింది. తత్వ చింతనలో గూడ క్రీ.పూ. 6వ శతాబ్దంలో ఎంతో వైవిధ్యం వుండింది. దానినంతా కుతర్కంతో 'ఐక్య' పరచిన భగవద్గీత ఆ వైవిధ్యాన్ని నాశనం చేసింది. తార్కిక వైరుధ్యాలను నిరభ్యంతరంగా దిగమింగ గల నైజం హైందవ సమాజం మీద ఈనాటి దాకా నిలిచి పోయిన ముద్రవేసింది.

భౌతిక విజ్ఞానానికి గూడ ఇదేగతి పట్టింది. ఒకప్పుడు భారతీయ వైద్యశాస్త్రం (ఆయుర్వేదం) ఎన్నో మందులనూ మూలికలనూ తెలుసుకోగలిగింది. క్రమంగా ఆ విజ్ఞానం గూడ మౌఢ్యం వాతపడి, ఇవ్వాళ్టి ఆయుర్వేద వైద్యులు ఏ మూలిక ఏదోగూడ చెప్పలేని స్థితిలో వున్నారు. ప్రాచీన భారత దేశ చరిత్రకు సంబంధించిన స్థలాల గురించి, విషయాల గురించి తెలుసుకోవాలంటే టాలెమీ వంటి గ్రీకు భూగోళ శాస్త్రజ్ఞుల మీద, అరబ్బు వర్తకుల మీద, చైనీయ యాత్రికుల మీద, ఆధారపడాలి.[73] మన సాహిత్యంలో పౌరాణిక గాథలు తప్ప వేరే ఏమీ దొరకవు. స్వయంపోషక గ్రామాల బ్రాహ్మణ మతానికి ఋతు చక్రంతోనే తప్ప కాలప్రవాహంతో ప్రమేయం లేదు కాబట్టి అది మనకు చరిత్ర లేకుండ చేసింది. కాలం సహితం 'కాలచక్రం' అయింది. గుండ్రంగా తిరిగే ఈ చక్రంలో దేనికి మొదలు లేదు. అన్నీ 'అనాది' అయి పోయాయి.[74]

## వివరణలు


1. ISIH, Page 187
2. CCAI, Page 143
3. ISIH, Page 205

4. ISIH, Page 199
5. The Basis of Ancient Indian History, HS, Page 31
6. ISIH, Page 193
7. ISIH, Pages 209-215
8. ISIH, Page 215
9. ISIH, Page 215
10. ISIH, Page 226
11. ISIH, Page 223
12. ISIH, Page 223
13. ISIH, Page 232
14. ISIH, Pages 228-229
15. ISIH, Page 230
16. ISIH, Page 229
17. ISIH, Page 229
18. CCAI, Pages 150-151
19. Combined methods in Indology, HS, Page 10
20. CCAI, Page 149
21. ISIH, Pages 216-218
22. ISIH, Page 218
23. CCAI, Page 154
24. ISIH, Page 222
25. CCAI, Page 163
26. CCAI, Page 163
27. ISIH, Page 233
28. ISIH, Page 236
29. ISIH, Page 201
30. ISIH, Page 203
31. ISIH, Page 198
32. Combined methods in Indology, HS, Pages 3-4
    ISIH, Pages 207–208
33. ISIH, Page 199
34. జీవహింసను నిషేధించిన ఈ మానవతామూర్తి రెండుకాళ్ళ పశువుకు మరణ శిక్షనుమాత్రం రద్దుచేయలేదని కోశాంబి ఒక విసురు విసరకుండ ఉండలేదు. ISIH, Page 207.
35. ISIH, Pages 198-209
36. CCAI, Page 165
37. ISIH,Page 248
38. The Basis of Ancient Indian History, HS, Page 32
39. The Basis of Ancient Indian History, HS, Page 33
40. The Basis of Ancient Indian History, HS, Page 35
41. Combined methods in Indology, HS, Pages, 16-19.
    'ఆంధ్ర' అనే శబ్దానికి తెలుగు అనే అర్థం యిచ్చి శాతవాహనులను ఆంధ్ర

రాజులు అనడం అర్థరహితం. చరిత్రను మత దృక్పథంతో, కుల దృక్పథంతో చూడడం ఎంత తప్పో 20వ శతాబ్దపు తెలుగు జాతీయ వాదాన్ని వెనక్కి ప్రసరింపచేసి ఆ దృష్టితో చరిత్రను చూడడం అంతే తప్పు. భౌతిక నైసర్గిక స్పృహతో చరిత్రకు అర్థంచెప్పుకుంటే శాతవాహనులు 'దక్కన్ రాజులు'. వాళ్లు దక్కన్‌ను అంతా పరిపాలించారా అనేది ముఖ్యం కాదు, దక్కన్ పీఠ భూమి మీద ఆహార ఉత్పత్తి ప్రారంభమయిన తరువాత తత్ఫలితంగా ఏర్పడ్డ మొట్టమొదటి రాజ్యం వాళ్ళది.

42. Dhenukakata, HS, Pages 208-209
43. Dhenukakata, HS, Page 201
44. Dhenukakata, HS,Pages 199-200
45. The Basis of Ancient Indian History, HS, Page 47
46. The Basis of Ancient Indian History, HS, Page 47
47. ISIH, Page 270
48. The Basis of Ancient Indian History, HS, Page 32
49. ISIH, Pages 271-272
50. CCAI, Page 190
51. ISIH, Page 261
52. ISIH, Page 223
53. ISIH, Page 193
54. ISIH, Pages 276-277
55. CCAI, Page 170
56. CCAI, Pages 172-173
57. ISIH, Page 213
58. The Basis of Ancient Indian History, HS, Page 50
59. The Basis of Ancient Indian History, HS, Page 39
60. ISIH, Page 256
    The Basis of Ancient Indian History, HS, Page 43
61. On the study and metrology of silver punch-marked coins, IN, Page 36
62. CCAI, Page 154
63. ISIH, Page 255
64. ISIH, Page 254
65. ISIH, Page 257
66. The Basis of Ancient Indian History, HS, Page 50
67. ISIH, Pages 273-274
68. ISIH, Page 258
    On a Marxist approach to Indian Chronology, HS, Page 80
69. ISIH, Page 258
70. CCAI, Page 22
71. ISIH, Page 258
72. CCAI, Pages, 173-174
73. CCAI, Pages 174-175
74. The Basis of Ancient Indian History, HS, Page 28

# 8. సామంత స్వామ్యం - గ్రామీణ భూస్వామ్యం

ఉత్తర భారతదేశంలో మౌర్యుల అనంతరం, దక్కన్‌లో శాతవాహనుల అనంతరం, స్వయంపోషక గ్రామాలు ఏర్పడ్డాయని చూసాం. వీటి సంపదను దోచుకున్న రాజ్యాలు వచ్చాయి. విదేశాలనుండి దాడులు జరిగి, అందులో కుషాణుల వంటి ఒకరిద్దరు రాజ్యాలు ఏర్పరచారు. క్రీ. శ. 4వ శతాబ్దం వచ్చేసరికి ఈ రాజులలో ఒకరయిన గుప్తులు మళ్ళీ ఒక పెద్ద రాజ్యాన్ని ఏర్పరచగలిగారు. స్వయంపోషక గ్రామాల మీద ఇంత పెద్ద రాజ్యం ఏర్పరచడానికి గల కారణం, శాతవాహన కాలపు వర్తకంవల్ల దక్కన్‌లో పోగుపడిన సంపదను గుప్తులు తమ దండయాత్రలలో దోచుకోగలగడమే.[1]

గుప్తరాజుల పతనంతో మనదేశంలో భూస్వామ్య యుగం ప్రారంభమయిందని కోశాంబి అంటారు. భూస్వామ్య యుగంలో కోశాంబి రెండు దశలను గుర్తిస్తారు. మొదటి దశను 'పైనుండి భూస్వామ్యం, (Feudalism from above) అనీ రెండవ దశను క్రిందినుండి భూస్వామ్యం (Feudalism from below) అనీ అంటారు. గుణాలను బట్టి మొదటి దశను సామంత స్వామ్యం అనీ రెండవ దశను గ్రామీణ భూస్వామ్యం అనీ అనవచ్చును. మొదటి దశలో స్వయంపోషక గ్రామం తన స్వయం ప్రతిపత్తిని కలిగేవుండి. గ్రామంలోని వ్యవసాయకుల సభ అన్ని గ్రామ వ్యవహారాలను నిర్ణయిస్తుంది. రాజులకు పన్నులు మాత్రం చెల్లిస్తారు. ఈ రాజులు ఒక దొంతరగా ఏర్పడతారు. క్రిందివాడు పైవాడికి సామంతుడు. పై వాడికి కప్పం చెల్లించే ప్రాతిపదిక మీద తన పరిపాలనా స్వయం ప్రతిపత్తిని కలిగి వుంటాడు. ఇది సామంత స్వామ్యం స్థూల స్వరూపం.[2] ఇది క్రీ. శ. 4వ శతాబ్దంలో ప్రారంభమయి గుప్తుల పతనంతో సమగ్ర రూపం తీసుకుందని కోశాంబి అభిప్రాయం.

తరువాతి దశలో ('గ్రామీణ భూస్వామ్యం'లో) గ్రామాల పరిపాలనా స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది. గ్రామంనుండి శిస్తు వసూలుచేసి అందులో కొంతభాగాన్ని తాము ఉంచుకునే సాయుధులయిన భూస్వాముల వర్గం ఒకటి పుడుతుంది. వీళ్ళకు శిస్తు వసూలుచేసే అధికారమే కాక వివిధ గ్రామాలలో భూములు గూడ వుంటాయి. గ్రామ సభకు వీళ్ళు బాధ్యులుకారు. పరిపాలనాధికారాలు కలిగి వుంటారు.[3] ఈ దశ ముస్లిం పాలకుల కాలంలో (ముస్లిం రాజ్యాల వెలుపలగూడ) విస్తరించింది గాని, అంతకు పూర్వమే (క్రీ. శ. 9వ శతాబ్దం నుండి) ప్రారంభమయిందని కోశాంబి అంటారు.[4]

## భూదానాలు

క్రమంగా స్వయంపోషక మవుతూన్న నూతన గ్రామీణ వ్యవస్థను ప్రాతిపదికగా గల చిన్న చిన్న రాజ్యాలు ఏర్పడుతున్నాయనీ, వాయువ్య ప్రాంతంనుండి దాడిచేసిన యవనులూ శకులూ కుషానులలో కొందరు ఇక్కడ స్థిరపడి రాజ్యాలు ఏర్పరచారని చూసాము. ఈ విదేశీయులను మినహాయిస్తే మిగిలిన రాజులందరూ ఎవరన్నది చూడాలి. అశోకుడి సమకాలికులలో రాజులెవ్వరూ లేరు. అదే సముద్ర గుప్తుడి కాలానికి వచ్చే సరికి (క్రీ. శ. 4వ శతాబ్దం) అతనిచేత ఓడించబడ్డ రాజుల జాబితా చాలా పెద్దది. అతను ఆర్యావర్తంలో 9 మంది రాజులనూ దక్కన్‌లోని 12 మంది రాజులనూ ఓడించాడు.[5]

ఈ రాజ్యాలు, ఆటవిక గణాలలోనికి వ్యవసాయ వర్గసమాజం విస్తరించిన ఫలితంగా ఏర్పడ్డవి. గణ ముఖ్యులు ఒక రాచరిక వర్గంగా ఏర్పడ్డారు. ఇతరులు శూద్రకర్షకులయ్యారు. ఈ ఏర్పాటుకు సామాజిక ఆమోదం పొందడానికి గణముఖ్యులకు బ్రాహ్మణుల అండ కావలసి వచ్చింది. క్రింది స్థాయిలో కులవ్యవస్థ ఆవిర్భావంలాగ పై స్థాయిలో ఈ అవసరం బ్రాహ్మణ మతాన్ని బలపరిచింది. బ్రాహ్మణులు వీళ్ళకు క్షత్రియులుగా గుర్తింపు ఇచ్చారు. దానికోసం హిరణ్య గర్భం అనే సంస్కారాన్నిగూడ సృష్టించారు. రాజు కాదల్చుకున్న గణ ముఖ్యుడు ఒక బంగారు పాత్రలోనికి ప్రవేశిస్తాడు. పిండంలాగ ముడుచుకొని కూర్చుంటాడు. బ్రాహ్మణులు అప్పుడు జనన సంస్కారానికి సంబంధించిన కర్మకాండ నిర్వహిస్తారు. గణ ముఖ్యుడు ఈవిధంగా క్షత్రియుడిగా పునర్జన్మ పొంది బయటికి వస్తాడు. 'ఆర్యు' డయినందుకు ఒక గోత్రం కావాలి కాబట్టి కర్మకాండను జరిపించిన బ్రాహ్మణుడి గోత్రాన్నే అరువు తీసుకుంటాడు. బ్రాహ్మణుడికి ప్రతిఫలంగా బంగారు పాత్ర ఇవ్వబడుతుంది.[6] కొత్తగా క్షత్రియు డయిన గణ ముఖ్యుడికి ఇప్పుడు ఒక ప్రాచీన క్షత్రియ వంశంతో సంబంధం కల్పించ బడుతుంది. ఈ దశలో పరిపాలించిన ఇక్ష్వాకు, పాండు వంశీ, నల మొదలైన రాజ వంశాలు ఈ కోవకు చెందినవే తప్ప వాటికి నిజంగా ఇతిహాసాలలోని ఇక్ష్వాకులతో పాండవులతో సంబంధం ఉండే అవకాశం లేదు.[7] గుప్తరాజుల కాలానికి ప్రధాన గణాలన్నీ(అంటే ఇనుము వాడకాన్నీ వ్యవసాయాన్నీ నేర్చుకున్న గణాలన్నీ)రాచరికాలు ఏర్పరచుకోగలిగాయని కోశాంబి అంటాడు.[8] ఇనుము వాడకం వ్యవసాయం తెలియని ఆటవిక తెగలు మాత్రం మిగిలిపోయాయి-ఇంకా ఎన్నో మిగిలే వున్నాయి.

బ్రాహ్మణుల సహాయంతో తమతోటి గణసభ్యులను శూద్రకర్షకులగామార్చి తాము రాజులయిన గణ ముఖ్యులు బ్రాహ్మణ మతాన్నీ వర్ణ ధర్మాన్నీ ఘనంగా ఆదరించారు. అశ్మక గణంలో పుట్టిన గౌతమీ పుత్ర శాతకర్ణి ఎంతటి బ్రాహ్మణ భక్తుడయ్యాడంటే తన్నుతాను క్షత్రియుడిగా గూడ కాక బ్రాహ్మణుడిగానే చెప్పుకున్నాడు. తాను

క్షత్రియుల పొగరు అణచి వర్ణ సాంకర్యాన్ని నివారించానని ఒక శాసనంలో ప్రకటించు కున్నాడు. (అయినప్పటికీ తన కొడుకును విదేశీయులయిన శకుల రాజ కుమార్తెకిచ్చి పెండ్లి చేసాడు). ఇప్పటినుండి ఈ కొత్త రాజులు తమను తాము 'వర్ణాశ్రమ ధర్మ వ్యవస్థాపన ప్రవృత్తులు' అని 'వర్ణాశ్రమధర్మ స్థాపన నిరతులు' అని 'అత్యంత దేవ బ్రాహ్మణ భక్తులు' అని వర్ణించుకున్నారు.[9] విదేశాలనుండి వచ్చి ఇక్కడ రాజ్యాలు స్థాపించిన శకులూ కుషానులూ మొదలైన వాళ్ళుగూడ సంస్కృతం పేర్లు స్వీకరించి (ఉదాహరణకు వాసుదేవుడు, రుద్రదాముడు) వర్ణధర్మాన్ని కాపాడుతున్నామని చాటుకొని సంస్కృతంలో శాసనాలు ప్రకటించారు. మన దేశంలోని మొట్ట మొదటి సంస్కృత శాసనం రుద్ర దాముడిది.[10] వీళ్ళు అశ్వమేధం మొదలయిన యాగాలను ఆర్భాటంగా నిర్వహించే ప్రయత్నంగూడ చేసారు. ఈ విధంగా గ్రామీణ కులవ్యవస్థ ఆవిర్భావం ద్వారానేకాక కొత్త రాజ వంశాల ఏర్పాటుద్వారా గూడ బ్రాహ్మణమతం బలపడింది.

ఆటవికుల వ్యవసాయీకరణలో ఇక్కడ రెండు క్రమాలు పని చేసాయని కోశాంబి సూత్రీకరిస్తాడు.[11] ఒకటి, గణ ముఖ్యులు బ్రాహ్మణులను ఆహ్వానించి వాళ్ళ సహాయంతో క్షత్రియులయి గణాలలో వర్గ విభజనను ప్రవేశపెడతారు. తాము గణ బంధాలను తెంచుకొని రాజులవుతారు. మౌర్యుల అనంతరం మగధ ప్రాంతంలో శుంగులు రాజ్యం చేసారు. శుంగ అనేది బ్రాహ్మణ గోత్రం కాబట్టి వీళ్ళది బ్రాహ్మణ రాజ వంశంగా కొందరు చరిత్రకారులు చెప్తున్నారు. గాని, వీళ్ళు క్షత్రియులుగా మారిన ఆటవికులయి వుండాలనీ, అందుకు సాయం చేసిన బ్రాహ్మణుల గోత్రాన్ని స్వీకరించి వుంటారనీ కోశాంబి అంటాడు. ఈ చేయూతకు కృతజ్ఞతా చిహ్నంగా పుష్యమిత్ర శుంగుడు అశ్వమేధయాగాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేసాడు.[12]

రెండవది, బ్రాహ్మణులు తమ ఉదర పోషణకోసం శ్రేణులలోనికీ గణాల లోనికి ప్రవేశించడం. వాళ్ళ పూజలూ కర్మకాండ తాము నిర్వహించడమే కాక వాటికి వైదిక ప్రతిష్ఠ కృత్రిమంగా కల్పించడం. ఒక్కొక్క సారి వాళ్ళ స్త్రీని వివాహం చేసుకొని వాళ్ళలో ఒక బ్రాహ్మణ కులాన్ని కల్పించడం. ఇది చాలా విరివిగా జరిగిందనడానికి నిదర్శనం శాస్త్రకారులలో దీనివల్ల కలిగిన అదుర్దా. ఆటవికుల పూజలూ కర్మకాండ నిర్వహించే బ్రాహ్మణులను తద్దినాలకు పిలవకూడదని మనువు నియమం పెట్టాడు.[13] ఈ నిషేధం అవసరమయిందంటేనే ఆ పని బ్రాహ్మణులు తరచుగా చేస్తున్నారని అర్థం. అయితే శాస్త్రకారులు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా జరిగేవి జరుగుతూనే వుంటాయి కాబట్టి, ఈ వర్ణ సాంకర్యం ఫలితంగా కొత్తగా పుట్టు కొస్తున్న బ్రాహ్మణులను గుర్తించడానికి అదే మనువు ఒక సూత్రం సృష్టించాడు: ఏడుతరాలు కలిసిపోతే శూద్రులు బ్రాహ్మణులవుతారు, బ్రాహ్మణులు శూద్రులవుతారు, అన్నాడు.[14]

రెండవ క్రమానికి ఉదాహరణగా, ఈ చారిత్రక దశలో వ్యవసాయానికి

లొంగిన బెంగాల్ ప్రాంతపు రాజు లోకనాధుడు తాను బ్రాహ్మణ తండ్రికీ శూద్ర తల్లికి పుట్టిన వాడినని గర్వంగా చెప్పుకున్నాడు. తూర్పు ఆసియాలోని కంబోడియాలో హైందవ రాజ్యం (చంపా) ఈ విధంగానే ఏర్పడింది. కౌండిన్యుడు అనే హైందవుడు అక్కడి 'నాగ' రాజకుమార్తె సోమను వివాహం చేసుకొని రాజ్యాన్ని స్థాపించాడు. అన్నిటికంటె స్పష్టమైన ఉదాహరణ కేరళలోని నంబూదిరి-నాయర్ కులాల సంబంధం. నాయర్‌లది మాతృస్వామిక సంప్రదాయం అని ఇప్పటికీ అంటారు. నంబూదిరి బ్రాహ్మణులలో పెద్ద కొడుకు మాత్రమే తమ కులంలో వివాహం చేసుకుంటాడు. మిగిలిన వాళ్ళంతా నాయర్ స్త్రీలతో సంబంధం పెట్టుకుంటారు. ఈ సంబంధం ఫలితంగా పుట్టిన పిల్లలు నాయర్‌లగా గుర్తించబడతారు. చాలా కాలం పాటు మలబార్ ప్రాంతాన్ని నాయర్‌లే పరిపాలించారు. తమను తాము క్షత్రియులుగా గూడ చెప్పుకుంటారు. నంబూదిరీలు ఆ రాజుల దగ్గర పౌరోహిత్యం, గుళ్ళలో పూజలు, నిర్వహిస్తారు.[15]

శాతవాహనుల అనంతరం దక్కన్‌ను పరిపాలించిన అనేక చిల్లర రాజవంశాలలో గోవా ప్రాంతానికి చెందిన కదంబులు ఒకరు. క్రి. శ. 4-5 శతాబ్దాలకు చెందిన ఈ కదంబుల చరిత్రనుండి కోశాంబి తన విశ్లేషణను చక్కగా నిరూపిస్తాడు.[16] కదంబ వృక్షం ఇప్పటికీ కొన్ని ప్రాంతాలలో పవిత్రంగా భావించబడుతుంది. కాబట్టి అది కుదురు చిహ్నం అయివుండాలి. ఈ కదంబుల పూర్వీకులు కదంబ వృక్షాన్ని సేవించారనీ, దానితో వాళ్ళు 'సాధర్మ్యం' గలవాళ్ళనీ, కదంబ రాజు మయూర వర్మ తండ్రి శివుడి నుదుటి నుండి కదంబ వృక్షం క్రిందపడిన స్వేద బిందువు నుండి పుట్టాడనీ అన్నారు. కాబట్టి కదంబులు ఆ వృక్షాన్ని కుదురు చిహ్నంగా గల ఆటవికులని అర్థం అవుతుంది. స్కందపురాణం ప్రకారం ఈ కదంబులు ఉత్తరాది నుండి బ్రాహ్మణులను రప్పించి వాళ్ళకు గోవా ప్రాంతంలో భూములిచ్చారు. ఈ భూములు పూర్తిగా అడవి భూములు. వీటిని సేద్యం చేయడం కోసం గావడ తెగకు చెందిన ఆటవికులను రాజు నియమించాడు. పంటను బ్రాహ్మణులూ ఆటవికులూ పంచుకున్నారు. బ్రాహ్మణులు తమ మతాన్ని ప్రవేశ పెట్టి ఈ వర్ణవ్యవస్థను నిలబెట్టారు. ఈ విధంగా బ్రాహ్మణులకు భూములిచ్చి వాళ్ళ సహాయంతో రాజయిన కదంబ గణముఖ్యుడు మొదట మయూర శర్మ అనే బ్రాహ్మణ పేరు పెట్టుకున్నాడు. తరువాత దానిని మయూర వర్మ అనే క్షత్రియ పేరుగా మార్చుకున్నాడు.

పై కథలో బ్రాహ్మణులకు మయూర వర్మ ఇచ్చిన భూదానం గమనార్హమయినది. ఈ చారిత్రక దశ అంతటా గూడ బ్రాహ్మణులకు రాజులు భూదానాలు ఇచ్చారు. అంతకు పూర్వం బౌద్ధ విహారాలకు రాజులూ వర్తకులూ పోషణార్థం భూములూ గ్రామాలూ దానం ఇచ్చేవారు. అయితే ఈ రకమయిన భూదానాలకూ ప్రస్తుత చారిత్రక దశలో ఇచ్చిన భూదానాలకూ తేడా చూడాలంటాడు కోశాంబి.[17]

ఈ భూదానాలు బౌద్ధ విహారాలకూ బ్రాహ్మణ దేవాలయాలకూ పోషణార్థం యిచ్చినవి కావు. అత్యధికంగా, ఏ దేవాలయాలకూ చెందని బ్రాహ్మణులకు వ్యక్తులగా యిచ్చినవి.[18]

భూదానాల గురించి చర్చించేటప్పుడు భూమిలో స్వంత ఆస్తి వుందా లేదా అన్న సమస్య మళ్ళి వస్తుంది. భారతదేశంలో భూస్వామ్యాన్ని, చారిత్రక నేపథ్యాన్ని భౌతిక నైసర్గిక పరిస్థితులనూ దృష్టిలో పెట్టుకోకుండ యాంత్రికంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేసిన వాళ్ళను కోశాంబి తీవ్రంగా అభిశంసించాడు.[19] సజాత వ్యవసాయక బృందాలు శూద్రులను లోబరచుకొని స్థిర ఆవాసాలు ఏర్పరచుకోవడం ద్వారా మనదేశంలో వ్యవసాయక గ్రామాలు ఏర్పడ్డాయి కాబట్టి, గ్రామాలలోని ప్రధాన వ్యవసాయ క్షేత్రాలు ఈ గ్రామీణుల ఉమ్మడి ఆస్తిగానే వున్నాయి. వీళ్ళను ఈ దశనుండి 'కుటుంబినులు' అన్నారు.[20] వీళ్ళు తమ గ్రామ సభ ద్వారా ప్రతీ సంవత్సరం భూమిని తమలో తాము వ్యవసాయార్థం పంచుకుంటారు. ఇది ప్రధాన వ్యవసాయ క్షేత్రం సంగతి. ఇదికాక గ్రామంలో వ్యవసాయ యోగ్యమయిన బంజర్లు గూడ వుంటాయి. వాటి మీద అజమాయిషీ గూడ గ్రామసభదే ఈ బంజర్లను వ్యవసాయ యోగ్యం చేసే నిమిత్తం గ్రామసభ వాటిని తమలో కొందరికి గాని శూద్రులకు గాని పంచి ఇయ్యవచ్చును. అంతకంటే ప్రధానంగా ఈ భూమిని బ్రాహ్మణులకు ఇవ్వడం జరిగింది. ఈ దానం గ్రామసభ చేయవచ్చు, లేక గ్రామసభ అనుమతితో రాజులుగాని వర్తకులు గాని చేయవచ్చు. బ్రాహ్మణులు ఈ భూములలో శూద్ర లేక ఆటవిక కర్షకులను నియమించి సేద్యం చేయిస్తారు. ఈ భూములను అగ్రహారాలు లేక బ్రాహ్మదేయాలు అన్నారు. వీటికి ఒక్కొకసారి శిస్తు మినహాయింపు గూడ వుంటుంది.[21]

ఈ రకమయిన భూదానాలు జరుగుతున్నాయంటేనే నూతన గ్రామీణ వ్యవస్థలో బ్రాహ్మణుల ప్రాబల్యం ఎంతగా పెరిగిందీ అర్థం అవుతుంది. అర్థ శాస్త్రంలో కౌటిల్యుడు వ్యవసాయ యోగ్యమయిన భూమిని ఎవ్వరికీ దానం ఇవ్వకూడదని ఆంక్ష పెట్టాడు. దానిలో ప్రభుత్వమే శూద్రులను నియమించి 'సీతా' భూములగా సేద్యం చేయించాలి. వ్యవసాయానికి ఎంతమాత్రం తగని భూమిని మాత్రం (దీనిని భూమి-ఛిద్రం అన్నాడు) గురుకులాల ఏర్పాటుకు బ్రాహ్మణులకు ఇయ్యవచ్చునని అన్నాడు. స్వయంపోషక గ్రామాలు, వికేంద్రీకృత పాలన, బ్రాహ్మణ ఆధిక్యత, పెరిగే కొద్దీ పేరులో మార్పులేకుండ అలవాటు మారింది. 'భూమి-ఛిద్ర' న్యాయం ప్రకారమే వ్యవసాయానికి అయోగ్యమయిన భూమిని కాక వ్యవసాయ యోగ్యమయిన భూములను బ్రాహ్మణులకు ఇవ్వడం మొదలుపెట్టారు. భూస్వామ్య వ్యవస్థ ముదిరిన కొద్దీ ఈ అలవాటు గూడ ముదిరి, గుప్తరాజుల కాలం నుండి బంజర్లను కాక వ్యవసాయక గ్రామాలనే దానం ఇవ్వడం మొదలు పెట్టారు. అయితే పేరుకు మాత్రం దీనిని భూమి-

ఛిద్ర న్యాయం అనే అంటున్నారు.[22] సారాంశం మారిపోయినా రూపం మాత్రం పదిలంగా మిగుల్చుకునే బ్రాహ్మణ లక్షణం ఇక్కడ మళ్లీ కనబడుతుంది.

ఈ దశలో జరిగిన భూదానాలు గ్రామ సభల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీయ లేదు. గ్రామ దానాలు పొందిన బ్రాహ్మణులకు కొత్త పన్నులు విధించే హక్కుగాని ఆయుధాలు ధరించే హక్కుగాని లేదు. అంతవరకు రాజుకు చెల్లించిన పన్ను ఇక మీదట దానం గ్రహీతకు చెల్లిస్తారు-అంత మాత్రమే.[23] బ్రాహ్మణులకు భూమి దానాలిచ్చే అలవాటు బాగా ముదిరి ప్రభుత్వ ఉద్యోగులకూ సైనిక అధికార్లకు గూడ ఇటువంటి దానాలు ఇవ్వడం మొదలు పెట్టిన తరువాత గ్రామ సభ స్వయం ప్రతిపత్తి నశించి ఒక గ్రామీణ భూస్వామ్య వర్గం ఏర్పడింది. దానితో భారతదేశ భూస్వామ్యం తన రెండవ దశను చేరుకుంది. అది క్రీ. శ. 9వ శతాబ్దంలో జరిగింది. ప్రస్తుత దశలో గ్రామం మీద పెత్తనం చేసే భూస్వామ్య వర్గం లేదు. ఉమ్మడిగా భూమి కలిగివుండి శూద్ర జనంచేత కూలి చేయించుకుని ఉత్పత్తి కొనసాగించిన 'కుటుంబినులు' మాత్రమే వున్నారు.

గ్రామీణ స్వయం పోషకత్వానికి ఫలితంగా శ్రమ విభజన బాగా పెరిగి అనేక వృత్తులు పుట్టుకొచ్చాయి. సంస్కృత నిఘంటువయిన అమరకోశం సహాయంతో వృత్తులను తెలుసుకోవచ్చును. అమరకోశం ఈ చారిత్రక దశకు చెందిందని కోశాంబి అభిప్రాయం. క్రీ. శ. 2-5 శతాబ్దాల మధ్య కాలానిదని భావిస్తాడు.[24] మనువులాగే అమరసింహుడు గూడ ఈ కొత్త కులాలు చతుర్వర్ణాల సాంకర్యం ఫలితంగా ఏర్పడినవని సిద్ధాంతీకరించాడు.[25] అమరకోశంలో చెప్పిన వృత్తులు : మాలాకారుడు (పూలదండలు చేసేవాడు), కుమ్మరి, సుతారి, శాలి, దర్జీ, కత్తులు సానబెట్టేవాడు, ఇళ్ళకు రంగులు వేసేవాడు, చెప్పులు కుట్టేవాడు, కమ్మరి, కంసాలి, గాజులు తయారు చేసేవాడు, వడ్రంగి, రథకారుడు, వగైరా. ఇవన్నీ గ్రామాలలో వున్న వృత్తులు. ఇవికాక పట్టణాలలో ఇంకా వృత్తి శ్రేణులు-తమ ప్రాముఖ్యతను కోల్పోయినప్పటికీ-ఉండనే వున్నాయి.

గ్రామంలో స్థిరపడిన వృత్తిపనివాళ్ళు 'కుటింబినుల' వ్యవసాయేతర అవసరాలను తీరుస్తారు. దానికి ప్రతిఫలంగా వీళ్ళకు వ్యవసాయ ఫలాన్ని కొంత ఇవ్వడమే కాక, వ్యవసాయ యోగ్యమైన గ్రామ బంజర్ల నుండి కొంత భూమి యిచ్చినట్టు గూడ గుప్తరాజుల కాలపు శాసనాలను బట్టి తెలుస్తుంది.[26]. దీనిని మనదగ్గర ఆయగార్ల వ్యవస్థ అని, మహారాష్ట్రలో అలూటేదార్-బలూటేదార్ వ్యవస్థ అనీ అన్నారు. స్వయం పోషక గ్రామాలను పటిష్టం చేసిన ఈ ఏర్పాటు గుప్తరాజుల కాలం నుండి మొదలై భూస్వామ్య వ్యవస్థకు గట్టి పునాది అయింది. గ్రామాన్ని బ్రాహ్మణులకు దానం ఇచ్చినప్పుడు గూడ ఈ వృత్తి పనివాళ్ళ భూములు మాత్రం మినహాయించబడ్డాయి.

మరొక ముఖ్యమయిన పరిణామానికి చిహ్నం గూడ అమరకోశంలో వుంది.

తొలినాటి వర్ణ వ్యవస్థ ప్రకారం వ్యవసాయదారులు వైశ్యులు. శూద్రులు కూలి మాత్రం చేయాలి. కాని వ్యవసాయక సమాజం విస్తరించే క్రమంలో ఆటవిక గణాలు వ్యవసాయకులగా మారి శూద్రులగా వచ్చి హైందవ సమాజంలో చేరారు. పైగా, మగధ కాలంలో ప్రభుత్వమే బంజరు భూమిలో శూద్రులను వినియోగించి వాటిని వ్యవసాయ యోగ్యం చేసింది. అందే చారిత్రక క్రమంలో శూద్రులు చాలామంది వ్యవసాయదారులయ్యారు. గుప్తరాజుల కాలానికి చాలా గ్రామాలలో 'కుటుంబినులు' శూద్రులు అయివుండవచ్చును. ఇప్పుడు శూద్రుల కంటె నిమ్న స్థానంలో వున్న శ్రామికులు వచ్చారు. అమరకోశంలో శూద్రుల తరువాత వీళ్ళ జాబితావుంది. వీళ్ళను భృతకులు, కర్మకారులు, పామరులు, నీచులు, జాల్ములు, మొదలయిన పేర్లతో పిలిచారు. "పొలంలో నాట్లప్పుడూ కోతలప్పుడూ వీళ్లు కూలీలగా పనిచేసివుంటా"రని కోశాంబి అంటాడు.[27] వీళ్ళు అంటరానివాళ్లు, పంచములు. ఇవ్వాళ్టి 'హరిజనుల' పూర్వీకులు. ఇకమీదట వ్యవసాయ సమాజానికి లొంగిపోయిన ఆటవికులలో మరీ బలహీనులయిన వాళ్ళు శూద్రులగా గూడ కాక పంచములగా వచ్చి చేరారు. వీళ్ళకంటే ఇంకా హీనమయిన వారు చండాలురు, నిషాదులు, వగైరా. అమర సింహుడి జాబితాలో వీళ్ళవి ఆఖరి పేర్లు.

ఈ గ్రామీణ నిర్మాణాన్ని ఆధారం చేసుకొని రాజ్యాలు ఏర్పడ్డాయి. రాజులు అదనపు ఉత్పత్తిని పన్నులరూపంలో సేకరించారు. ఈ రాజులు తరచుగా కలహించుకున్నారు. ఈ యుద్ధాల పర్యవసానంగా క్రీ. శ. 4వ శతాబ్దంలో వాళ్ళలో ఒకరయిన గుప్తులు పెద్ద రాజ్యాన్ని స్థాపించారు. ఆ కాలం నాటి రాజులందరి లాగే గుప్తులది గూడ పెద్ద ప్రతిష్టాకరమయిన పుట్టుక కాదు. ప్రతిష్టకోసం పాకులాడి, ఎన్నడో అణగారిపోయిన లిచ్ఛవి క్షత్రియుల రాజకుమార్తె కుమారదేవిని మొదటి చంద్ర గుప్తుడు పెళ్ళి చేసుకున్నాడు.[28] నాణాలు ఇద్దరి పేరుమీదా వేసాడు. వీళ్ళకొడుకు అయిన సముద్ర గుప్తుడు తనతల్లి పేరుగూడ గొప్పగా చెప్పుకున్నాడు. అయినా ఈ సముద్ర గుప్తుడి కొడుకయిన రెండవ చంద్రగుప్తుడు కుబేరనాగ అనే 'నాగ' రాజకుమార్తెను పెళ్ళి చేసుకున్నాడు. వాళ్ళ కుమార్తె ప్రభావతిని ఆటవిక రాజులయిన వాకాటులకు ఇచ్చి పెళ్ళి చేసారు. బ్రాహ్మణ పురాణాలలో గుప్తులను 'మ్లేచ్ఛప్రాయులు' అన్నారు.[29]

కాబట్టి, ఇప్పటి మన జాతీయ చరిత్ర కారులు తమ పునరుద్ధరణ వాదంలో భాగంగా గుప్తరాజులను 'జాతిని పునరుద్ధరించిన' రాజులగా పొగిడినా, గుప్తరాజుల స్వర్ణయుగాన్ని స్తుతించినా, ఈ గుప్తులు అందరు సమకాలికరాజులలాగ అనార్య జాతుల నుండి వచ్చినవారని అర్థం అవుతుంది. వీళ్ళ గురించి చరిత్రకారులు గొప్పగా చెప్పే విషయాలన్నీ తమ శాసనాలలో వాళ్ళు స్వయంగా ప్రకటించుకున్నవే.[30] 'గుప్తరాజుల స్వర్ణయుగానికి' చెందిన సంస్కృత సాహిత్యంలో గుప్తుల గురించి ఒక మాటా లేదు.[31] 'స్వర్ణయుగం' మాటకొస్తే గుప్తుల కాలానికి చెందిన బంగారు నాణాలు

చాలా దొరికిన మాట వాస్తవమేనని కోశాంబి వేళాకోళంగా అంటాడు. అయితే ఇది ఎంతటి 'స్వర్ణయుగం' అంటే గుప్త రాజవంశం పతనం అయ్యేనాటికి వాళ్ళ రాజధాని అయిన పాటలీ పుత్రం కుగ్రామం అయింది.[32] మన దేశానికి చరిత్రలేదన్న బ్రిటిష్ సామ్రాజ్యవాదుల హేళనకు తట్టుకోలేని మన జాతీయ వాదులకు సముద్ర గుప్తుడి శాసనాలు దొరకగానే మనకు గూడ చరిత్ర వుందని గొప్పలు చెప్పుకునే అవకాశం దొరికింది. "గుప్తులు జాతిని పునరుద్ధరించ లేదు, జాతీయోద్యమం గుప్తులను పునరుద్ధరించింది" అంటాడు కోశాంబి.[33]

మగధ రాజ్యానికి గుప్తుల రాజ్యానికి మౌలికంగా తేడా వుంది. మగధ కొత్తగా ఏర్పడిన వ్యవసాయక సమాజం. అమ్మకపు సరుకుల ఉత్పత్తి వర్తకం పెద్ద ఎత్తున నిర్వహించిన రాజ్యం. మగధ కాలానికి చెందిన వెండి నాణాల నిక్షేపాలు ఈ విషయాన్ని రుజువు చేస్తాయి. గుప్తుల రాజ్యానికి స్వయం పోషక గ్రామాలు ప్రాతిపదిక. శాతవాహనుల కాలంలో దక్కన్‌లో పోగయిన సంపదను లూటీచేయడం ద్వారా గుప్తరాజ్యం ఏర్పడిందేగానీ లేకుంటే ఈ గ్రామీణ సమాజానికి అంత పెద్ద రాజ్యమే అవసరం లేదు. గుప్తులు వేసిన బంగారు నాణాలు చాలా ప్రశస్తమయినవేగాని వెండి నాణాలు సంఖ్యలోనూ వాసిలోనూ చాలా అల్పమయినవి. అంటే వర్తకం కేవలం ఖరీదయిన వస్తువులకు పరిమితం అయిందని అర్థం. గుప్తుల తరువాత వచ్చిన హర్షుడి మాటకొస్తే అతని పేరుమీద వేసిన ఒక్క నాణెం గూడ ఇప్పటిదాకా దొరకలేదు.[34] గుప్తుల కాలంలో భారత దేశానికి వచ్చిన ఫాహియాన్ కథనం ప్రకారం అప్పటికి శ్రావస్తి, కపిలవస్తు, రాజగృహం, గయ పట్టణాలు గ్రామాలుగా మారిపోయాయి. పాటలీ పుత్రానికి త్వరలో అదే గతి పట్టింది. బాణుడు రాసిన హర్ష చరితాన్ని బట్టి చూస్తే హర్షుడికి స్థిర మయిన రాజధాని గూడ లేదు.[35] ఈ దశ నుండి రాజులు పరివార సమేతంగా సంచరిస్తూ, ఎక్కడ మజిలీచేస్తే అదే రాజధాని అయింది. రాజశాసనాలు అధికంగా ఈ మజిలీల నుండే ప్రకటించారు.[36]

ఈ దశలో ముఖ్యమైన పరిణామం 'సామంతస్వామ్యం' ఆవిర్భావం. ఈ మార్పు క్రీ. శ. 4వ శతాబ్దంలో ప్రారంభమయి క్రీ.శ 6వ శతాబ్దంలో గుప్తుల పతనంతో వ్యవస్థీ కృతమయింది. ఈ వ్యవస్థలో గ్రామాల స్వయం ప్రతిపత్తి కొనసాగింది. రాజులు దొంతరగా ఏర్పడి పైవాడికి క్రిందివాడు కప్పం చెల్లించే ప్రాతిపదిక మీద తన రాజ్యంలో తన పరిపాలనా స్వయం ప్రతిపత్తిని నిలుపుకొనే ఏర్పాటు వచ్చింది. కప్పం చెల్లించే క్రింది రాజును 'సామంతుడు' అన్నారు. సామంతుడు అనే మాటకు గల అర్థంలో ఆకస్మాత్తుగా వచ్చిన మార్పుకు కోశాంబి చాలా ప్రాముఖ్యాన్ని ఇస్తాడు క్రీ.శ. 5వ శతాబ్దం అంతందాకా 'సామంతుడు' అంటే కేవలం పొరుగు రాజు అని అర్థం. అర్థశాస్త్రం నుండి మనుస్మృతి, అమర కోశం, జాతక కథలు, గుప్తుల తొలినాటి శాసనాలదాకా ఇదే అర్థం.[37] అయితే

క్రీ.శ. 592లో ప్రకటించిన విష్ణుసేనుడి శాసనంలో 'సామంతుడు' అంటే పొరుగు రాజుఅని కాక కప్పం చెల్లించే విధేయుడు అనే అర్థం వచ్చింది. ఆ తరువాత హర్షుడి శాసనాల లోనూ హ్యూయన్ త్సాంగ్ వంటి చైనీయ యాత్రికుల రచనలలోనూ ఈ అర్థమే కొనసాగింది.

గుప్త సామ్రాజ్యం ఎందుకు పతన మయింది అనే ప్రశ్న వస్తుంది. మౌర్యులతో ప్రారంభమయిన వ్యవసాయ విస్తరణ గుప్తులతో చాలా వరకు సంపూర్ణమయింది. ఇంకా అడవులూ ఆటవికులూ లేకపోలేదు, కాని ఈ ఆటవికులు నిరాయుధులైన ఆదిమ జీవులు. కొంత నాగరికత వున్న గణాలన్నీ గుప్తుల కాలంలో వ్యవసాయీకరణ చెందాయి.[38] 'సకల ఆటవిక రాజులనూ' తాను లొంగ దీసుకున్నట్టు సముద్ర గుప్తుడు చెప్తాడు.[39] ఇక మిగిలింది ఆయుధాలు లేని చాలా ఆదిమ జీవులయిన ఆటవికులు మాత్రమే.

అయితే మౌర్యులకూ గుప్తులకూ గల తేడా ఏమిటో గూడ చూసాము. మౌర్యుల కాలంలో సీతా భూముల వ్యవసాయ విస్తరణ ప్రభుత్వరంగ పరిశ్రమగా సాగింది. గుప్తుల కాలంలో ఆటవిక 'రాజులను' లొంగదీసుకోవడం ద్వారా, భూదానాల ద్వారా, వ్యవసాయ విస్తరణ సాగింది. మొదటి పద్ధతిలో వర్తకం ప్రబలంగా వుంటుంది. రెండవ దానిలో వుండదు. అందుకే మౌర్యుల కాలపు వెండి కార్షాపణాలు పెద్ద సంఖ్యలో దొరుకగా, గుప్తుల కాలానికి చెందినవి విలాస వస్తువుల మారకాన్ని సూచించే బంగారు నాణాలు మాత్రమే. మామూలు వస్తువులు కుండ మార్పిడి పద్ధతిలో మారకం అవుతున్నాయని చైనా నుండి వచ్చిన యాత్రికుల వల్ల తెలుస్తుంది.[40]

పెద్ద ఎత్తున దేశం నలుమూలలకు విస్తరించిన వ్యవసాయ సమాజం గుప్తుల సంపదకు మూలం. అయితే ఈవిస్తరణే గుప్త సామ్రాజ్యం పునాదిని తొలిచేసింది. ఈ విస్తరణ ఫలితంగా ఏర్పడిన ఆవాసాలు స్వయంపోషక గ్రామాలు. వాటినుండి పన్ను వసూలు చేయడమే పెద్ద సమస్య. పన్నువసూలుకోసం గ్రామాలలో 'గుల్మం' లేక 'పట్టి' అనే సాయుధ బలగాన్ని నెలకొల్పినట్టు శాసనాల ద్వారా తెలుస్తుంది.[41] దూర ప్రాంతాలకు వ్యవసాయం విస్తరించేకొద్దీ సేకరించిన పన్ను ఈ సాయుధ బలగాల పోషణకే సరిపోతుంది.

అంతకంటే ముఖ్యంగా, స్వయంపోషక గ్రామాలవల్ల ఉత్పత్తి పెరుగుతుంది, కాని అది సరుకుల ఉత్పత్తికాదు, అంటే అది అమ్మకం జరగదు, గ్రామంలోనే మారకం అవుతుంది. తలసరి సరుకుల ఉత్పత్తి (సరుకుల ఉత్పత్తి సాంద్రత) పడిపోవడం స్వయంపోషక గ్రామాల ప్రభావం. అయితే తగురాశిలో సరుకుల ఉత్పత్తి లేనిదే కేంద్రీకృత రాజ్యం నడవదు. ఈ కారణంగా, సరుకుల ఉత్పత్తి సాంద్రత పడిపోగానే కేంద్రీకృత రాజ్యం నాశనమవుతుంది. మౌర్యుల చివరి రోజులలో గంగా యమునా లోయలలో ఇది జరగడం మౌర్యుల పతనానికి ఒక కారణం.

అయితే అనంతరం శాతవాహనుల కింద దక్కన్‌లో పెద్దఎత్తున సరుకుల ఉత్పత్తి, వర్తకం, సాగాయి. వీటిని ఆధారం చేసుకొని గుప్తరాజ్యం ఏర్పడింది. మళ్లీ గుప్త రాజుల పాలనలో స్వయంపోషక గ్రామాల వ్యవసాయ సమాజం విస్తరించి సరుకుల ఉత్పత్తి సాంద్రత పడిపోవడంతో గుప్తరాజ్యం నాశనంకాక తప్పలేదు[42] దానితో భారతీయ భూస్వామ్యానికి మొదటి దశ అయిన సామంత స్వామ్యం ఆవిర్భవించింది.

## సాహిత్యం, మతం

స్వయంపోషక గ్రామాలు, దానిమీద ఆధారపడ్డ భూస్వామ్య సమాజం ఆవిర్భవిస్తున్న ఈ దశలో సంస్కృత భాషలో సాహిత్యం వచ్చింది. సంస్కృత సాహిత్యాన్ని గురించి కోశాంబి చేసిన అధ్యయనం మొత్తం తెలుసుకోవలసిన అవసరం ఈ పుస్తకం పరిధిలో లేదుగాని, స్థూలంగా కొన్ని విషయాలు అర్థంచేసుకోవడం అవసరం.

వేదకాలపు ఆర్యులు ప్రాచీన సంస్కృతం మాట్లాడారు. వేదాలు, బ్రాహ్మణాలు, తదితర యజ్ఞ సంబంధమయిన సాహిత్యం ఆ భాషలో వుంది. అయితే వ్యవసాయీకరణ క్రమంలో అల్పసంఖ్యాకులయిన ఆర్యులు ఆర్యేతరులను కలుపుకుంటూ పోయారు కాబట్టి సంస్కృత భాష ఏకైక భాషగా నిలవలేదు. పైగా వర్గసమాజం ఏర్పడిన కొత్తలో వైదిక మతంపట్ల వ్యతిరేకత ప్రబలింది కాబట్టే వైదిక సంస్కృతం గూడ పాలక వర్గాల ఆదరణ కోల్పోయింది. మగధ కాలానికి పాళీ పరిపాలనా మాధ్యమం అయింది. అది మగధ ప్రాంతంలో సామాన్య జనం మాట్లాడిన భాష. ఇతర ప్రాంతాల ప్రజలు విభిన్న ఆటవిక తెగలనుండి వచ్చినవారు కాబట్టి విభిన్న భాషలు మాట్లాడి వుండాలి.

దక్కన్‌లో శాతవాహనులు పరిపాలించిన కాలంలో గూడ పాళీయే పరిపాలనా మాధ్యమంగా వుండింది. మనదేశంలోని మొట్టమొదటి లౌకిక సాహిత్యం శాతవాహనుల రాజు హాలుడు సంకలనం చేసిన గథాసప్తశతి. అదేకాలానికి చెందిన గుణాఢ్యుడు 'పైశాచిక' భాషలో రాసాడన్నారు. అంటే పాళీ కంటె గూడ ఇంకా ప్రజలకు సన్నిహితమయిన భాష కావచ్చు. అయితే ఈ రచన సంస్కృత అనువాదం రూపంలో (కథాసరిత్సాగరం) మాత్రమే లభ్యం అయింది..[43]

స్వయంపోషక గ్రామాలూ భూస్వామ్యం ఏర్పడడంతో బ్రాహ్మణ మతం బలం పుంజుకుందని చూసాం. దానితోబాటు సంస్కృత భాష పునరుజ్జీవనం పొందింది. సంస్కృత భాషా సాహిత్యానికి ఉన్నత దశ గుప్తరాజుల కాలం. అప్పటికి సంస్కృతం ప్రజల వాడుక భాష కాకుండాపోయి చాలా కాలం అయింది. ఋగ్వేద కాలపు ఆర్యులు సంస్కృతం మాట్లాడి ఉండవచ్చును. ఆతరువాత మన చరిత్ర అంతాగూడ ఆర్యేతరులలోకి వ్యవసాయం విస్తరించిన చరిత్రే కాబట్టి సంస్కృతం సామాన్య ప్రజల భాషగా

నిలిచే ప్రసక్తే లేదు. వేద కర్మకాండకు ఆదరణ తగ్గడంతో అది పాలక భాషగూడ కాకుండపోయింది. ప్రజలమాటకొస్తే, వ్యవసాయీకరణ క్రమంలో వాళ్ళ భాషలు రూపొందుతున్నాయి. ఆర్య గణాల భౌతిక విస్తరణ ఫలితంగా వ్యవసాయక వర్గ సమాజం ఏర్పడిన ప్రాంతాలలో (అంటే ఉత్తర భారతదేశంలో) ఈ భాషలు సంస్కృతానికి సన్నిహితమయిన 'ఆర్య' భాషలయ్యాయి. వీటిని మొదట్లో ప్రాకృతాలు అన్నారు. ఆర్యుల భౌతిక విస్తరణ ఫలితంగా కాకుండ, గణంలో కొందరు ఇనుము వాడకం, వ్యవసాయం నేర్చుకొని సాంస్కృతికంగా బ్రాహ్మణీకరణ చెందిన ఫలితంగా వ్యవసాయం అలవడిన ప్రాంతాలలో ప్రజల భాషలు తమ స్థానిక ('ద్రవిడ') మూలాన్ని నిలుపుకున్నాయి.[44]

ప్రజల భాష కాకపోవడమేకాక, ఈ దశలో సంస్కృతం పాలకవర్గాల నిత్య జీవిత వ్యవహార భాష గూడ కాదు. ఎందుకంటే ఈ దశలోని పాలకవర్గం ఆటవికులలో వర్గ విభజన ఏర్పడిన కారణంగా పుట్టుకొచ్చిన కొత్త క్షత్రియులు, కొత్త బ్రాహ్మణులు. వీళ్ళ ప్రతిష్టకోసం, బ్రాహ్మణులను మంచిచేసుకోవడం కోసం, సంస్కృతాన్ని ఆదరించారు. భారతీయులయిన మగధ, శాతవాహన, రాజులు తమ శాసనాలను పాళీ లో ప్రకటించగా, మొట్టమొదటి సంస్కృత శాసనం క్రీ. శ. 2వ శతాబ్దానికి చెందిన విదేశీయుడు రుద్రదాముడిది. ఇతను వర్ణ ధర్మాన్ని కాపాడతానని సంస్కృతంలో ప్రకటించాడు. సంస్కృతభాష పునరుద్ధరణకు మూలం ఇక్కడే వుంది. ఇది కొత్త ఆర్యులను 'ఐక్య' పరచిన సాధనం అయింది. గణ బంధాలను తెంచుకొని ఇతర గణ సభ్యులను శ్రమ దోపిడీకి లోబరచుకునే క్రమంలో గణ ప్రముఖులంతా ఒకటి కావడానికి సంస్కృతం ఉపయోగపడింది. కొత్త పాలకవర్గానికి అత్యంత ప్రాచీనమయిన భాష అవసరం అయింది. ఈ విధంగా సంస్కృత సాహిత్యం స్వయంపోషక గ్రామాల భూస్వామ్య సమాజం ఆవిర్భావంతో ముడిపడివుంది.[45]

సంస్కృత భాషను పోషించి కాపాడింది బ్రాహ్మణులు కావడంవల్ల ఆ భాషకే పౌరోహిత్య లక్షణాలున్నాయంటాడు కోశాంబి. బ్రాహ్మణులకు ఉత్పత్తితో గానీ వర్తకంతో గానీ సంబంధంలేదు. కాబట్టి ఈ వృత్తులకు ఉపయోగపడగల సాహిత్యం సంస్కృత భాషలో లేదు. వాస్తుశాస్త్రం విషయంలో గూడ, గుప్తరాజుల తరువాతి కాలంలో రాసిన వాస్తు శాస్త్ర గ్రంథాలలోని నియమాలకూ సమకాలిక కట్టడాలకూ పోలిక లేదంటాడు. శాస్త్రం పాటికి శాస్త్రమే, నిర్మాణం పాటికి నిర్మాణమే.[46] అసలు మత, పురాణ, రచనలే తప్ప సాంకేతిక రచనలు చేయడానికి పనికిరాకుండ తయారయింది సంస్కృతం. రచనలను కంఠస్థం చేయడానికి అనుకూలంగా చాల క్లుప్తమయిన సూత్రాల రూపంలో రాయడం, దానిని మళ్ళ భాష్యం ద్వారా వ్యాఖ్యానించడం, రచనా నియమం అయింది. భాష్యం లేకుండ సంస్కృత రచనలు అర్థం కావు. భాష్యాలలో ప్రామాణికత వుండదు. ద్వంద్వార్థాలూ సుదీర్ఘమయిన సమాసాలు

ఒకేమాటకు అనేక పర్యాయపదాలూ వాడడం అలవాటయింది. గణిత భగోళ శాస్త్రాలమీద సంస్కృతంలో చేసిన రచనలు కంఠస్థం చేయడం సులభమేగాని అర్థం చేసుకోవడం చాలా కష్టం అంటాడు కోశాంబి. ఇదంతాగూడ ఆ భాషను విజ్ఞాన శాస్త్రానికి పనికిరాకుండ చేసింది.[47]

సంస్కృత కావ్యాలు గూడ తమ వర్గ స్వభావాన్ని స్పష్టంగానే ప్రదర్శిస్తాయి. ఇది పురుషాధిక్య వర్గ స్వభావం అనడానికి నిదర్శనంగా నాటకాలలో అగ్రవర్ణాలకు చెందిన పురుషులు మాత్రమే సంస్కృతం మాట్లాడతారు. స్త్రీలూ సేవకులూ ప్రాకృతం మాట్లాడతారు. అయితే తొలినాటి తరువాత ఈ ప్రాకృతం గూడ సంస్కృత మంత కృత్రిమం అయినదే-ప్రజలు మాట్లాడింది కాదు.[48]

సంస్కృత సాహిత్యంలో శృంగారం పాలు చాలా ఎక్కువ. శృంగారం అంత ఎక్కువగా ఉండంటేనే ఆ భాషను అర్థం చేసుకోగలవాళ్లు అల్పసంఖ్యాకులని అర్థం. వాత్స్యాయనుడి కామ సూత్రం ఆకాలంలో అక్షరాస్యులందరూ చదివింది కాదు. ఒక పరిమితమయిన పాలకవర్గానికి మాత్రమే అది అందుబాట్లోవుంది ఇక్కడ కోశాంబి గ్రీకు సాహిత్యంతో పోలిక చెప్తాడు. గ్రీసు దేశంలో గ్రీకు భాష ప్రజలందరి భాష. ఆ సాహిత్యం అందరికీ అర్థం అవుతుంది. అందుకే గ్రీసుకు చెందిన ప్రాచీన సాహిత్యంలో శృంగారం చాలా మితంగా వుంటుంది. అయితే, అలెగ్జాండర్ దండ యాత్రల ఫలితంగా ఈజిప్టులో అలెగ్జాండ్రియా పట్టణం కేంద్రంగా ఏర్పడ్డ గ్రీకు రాజ్యంలో గ్రీకు కేవలం పాలక వర్గాల భాష కావడంవల్ల, అక్కడి గ్రీకు సాహిత్యంలో శృంగారం చాలా అధికంగా వుంటుంది.[49]

సాహిత్యమే కాక మతంగూడ కొత్త సమాజానికి అనుకూలంగా మారింది. ఇవ్వాళ మనం 'హిందూమతం' అని పిలుచుకునేది ఈ దశలోనే రూపుదిద్దుకుంది. క్రీ. పూ. 6వ శతాబ్దంలో ప్రారంభమయిన భారత కథ ఈ దశలో తన చివరి రూపం (ఇప్పటి మహా భారతం) తీసుకుంది. మహాభారత కథలోకి చివరిగా చేర్చబడ్డ ప్రముఖ విషయాలు రెండు : ఒకటి, శాంతి పర్వంలో భీష్ముడిచేత చెప్పించే భూస్వామ్య యుగపు ధర్మబోధ. రెండవది వర్ణాశ్రమ ధర్మాన్ని 'భక్తి' భావాన్ని బోధించే భగవద్గీత. భగవద్గీత క్రీ. శ. 150-350 మధ్యకాలంలో మహాభారతంలోకి చేర్చబడిందని కోశాంబి అభిప్రాయం.[50]

ఈ దశలో బ్రాహ్మణ మతం మళ్ళీ బలం పుంజుకోవడానికి గల కారణాన్ని మరొకసారి గుర్తుచేయాలి. మౌర్యుల అనంతరం దేశం నలుమూలలకూ విస్తరించిన వ్యవసాయక వర్గసమాజాన్ని ఒక్క సామాజిక నిర్మాణం క్రిందికి తీసుకొచ్చింది ఈ నూతన బ్రాహ్మణ మతం. వివిధ జాతుల గణాల శ్రేణుల సంప్రదాయాన్ని ఐక్య పరచి కులవ్యవస్థ వర్ణధర్మాల ప్రాతిపదిక మీద హిందూ మతాన్ని రూపొందించింది. భగవద్గీత ఈ కర్తవ్యాన్ని తాత్త్విక స్థాయిలో పూర్తిచేసింది. వర్ణ ధర్మాన్ని స్వయంగా

భగవంతుడిచేత చెప్పించింది. క్రీ. పూ. 6వ శతాబ్దంనుండి విభిన్న తాత్విక ధోరణులగా ముందుకొచ్చిన అభిప్రాయాలన్నింటినీ అసాధారణమయిన కుతర్కంతో ఐక్యపరచింది. అన్ని అభిప్రాయాలూ మోక్షానికి వివిధ మార్గాలు మాత్రమేనని సిద్ధాంతీకరించింది. మూడవది, 'భక్తి' భావాన్ని ప్రవేశపెట్టింది. భగవద్గీత గురించి కోశాంబి చాలా వివరంగా చేసిన విశ్లేషణలో ఈ మూడు విషయాలను క్లుప్తంగా తెలుసుకుందాం.

పశుపోషణ స్థానంలో ఆహార ఉత్పత్తి ప్రారంభంకాగానే వైదిక యజ్ఞాలుల పట్ల వచ్చిన వ్యతిరేకతతో బ్రాహ్మణ మతం కొంత దెబ్బతినింది. అవైదిక సిద్ధాంతాలూ దర్శనాలూ పుట్టుకొచ్చాయి. వేదాలను తిరస్కరించని వాళ్ళుగూడ నూతన సమాజానికి స్పందించి కొత్త ప్రశ్నలు లేవదీసి సమాధానాలు చెప్పారు. ఈ కొత్త భావాలలో బౌద్ధం వంటివి విస్తృతంగా ఆదరణ పొందాయి. అయితే తిరిగి స్వయంపోషక గ్రామీణవ్యవస్థ ఏర్పడిన తరువాత బ్రాహ్మణమతం బలం పుంజుకుంది. వర్ణధర్మం కుల వ్యవస్థల క్రింద వ్యవసాయక సమాజం ఐక్యమయింది. ఇప్పుడు మత సంబంధమయిన ఐక్యతగూడ సాధించాలి. దానితోబాటు వర్ణ ధర్మాన్ని బ్రాహ్మణ ఆధిక్యాన్నిగూడ పటిష్టం చేయాలి.

ఈ పనులన్నీ విస్తృతంగా జనాదరణ పొందిన దేవుడిద్వారా చేయించాలి. కృష్ణుడు ఇందుకు పనికొచ్చాడు. ఆహార ఉత్పత్తి ప్రారంభమయిన నాటినుండి ఇంద్రుడి స్థానాన్ని కృష్ణుడు చేజిక్కించుకోవడం మొదలుపెట్టాడని చూసాం. మౌర్యుల పతనం అనంతరం దండెత్తివచ్చిన విదేశీయులను వర్ణ వ్యవస్థలోకి కలుపుకొచ్చే క్రమంలో కృష్ణుడు (విష్ణువు, నారాయణుడు) మరింత బలపడ్డాడు.[51] ఈ విదేశీ రాజులు ఎక్కువగా తమను తాము విష్ణు భక్తులగా చెప్పుకున్నారు. బుద్ధుడి పేరయిన పురుషోత్తముడు, భగవత్ అనే బిరుదు, విష్ణువుకు ఈ విదేశీయులు అంటగట్టారు.[52] క్రి. శ. 4వ శతాబ్దంనాటికి కృష్ణుడు దేవుడిగా అద్వితీయుడయ్యాడు. ఇప్పుడు బ్రాహ్మణులు తాము చెప్పదల్చుకున్న మూడు ముఖ్య విషయాలను కృష్ణుడిచేత చెప్పించి భగవద్గీత రూపంలో దానిని మహాభారతం లోనికి ప్రవేశపెట్టారు.

రాజ్యంకోసం బంధువులను చంపడం కొత్తవిషయం కాదు కాబట్టి (కృష్ణుడు స్వయంగా తన మేనమామే కాక రాజుగూడ అయిన కంసుడిని చంపాడు) అర్జునుడిచేత యుద్ధం చేయించడానికి భగవద్గీత ఎంతమాత్రం అవసరం లేదు. ఒకవేళ అయివున్నా అందుకోసం అంత దీర్ఘమయిన ఆధ్యాత్మిక చర్చ, ధర్మబోధ, చేయాల్సిన అవసరం లేదు. పైగా కురు పాండవుల తగవులో అన్ని దశలలోనూ కుటిలనీతిని ప్రదర్శించిన కృష్ణుడికి ధర్మబోధచేసే అర్హతలేదు. అదే ముఖ్యమయితే కృష్ణుడికన్న భీష్ముడు తగినవాడు.[53] వీటినిబట్టే భగవద్గీత పైకి కనిపించేది కాదని అర్థం అవుతుంది.

అర్జునుడు తన బంధువులను సహితం చంపడానికి ఎందుకు వెనకాడ కూడదంటే 'యుద్ధం చేయడం క్షత్రియుడిగా నీ ధర్మం కాబట్టి' అని కృష్ణుడు సమాధానం చెప్తాడు. ఎవరి వర్ణ ధర్మాన్ని వాళ్ళు ఆచరించాలి. 'చతుర్వర్ణ వ్యవస్థను నేనే సృష్టించాను'

అంటాడు కృష్ణుడు. కులవ్యవస్థను సమర్థించడం భగవద్గీత ముఖ్య ఉద్దేశ్యాలలో ఒకటి. అయితే అదొక్కటే అయితే అది కనీసం అసంగతంగా వుండేది కాదు. కాని భగవద్గీతకు వేరే రెండు లక్ష్యాలున్నాయని చూసాము. ఒకటి, అప్పటికి ప్రచారంలో వున్న సకల తాత్విక అభిప్రాయాలనూ సమైక్యపరచి అన్నీ ఒకటే అని ప్రకటించడం. దీనికి కృష్ణుడు వాదోపవాదాలుగానీ ప్రత్యర్థి అభిప్రాయాలను పూర్వపక్షం చేయడంగానీ చేయడు. ఒకదాని తరువాత ఒకటి అన్ని దర్శనాలనూ ఏకరువు పెడుతూ పోతాడు. సాంఖ్య, మీమాంస, వేదాంత, బౌద్ధ సంప్రదాయాలను ఇవి ఫలానా అని చెప్పకుండ అన్నీ తన అభిప్రాయాలుగా చెప్తాడు. వాటిమధ్య వైరుధ్యాలను పట్టించుకోడు. అన్నీ గూడ ఒకే సత్యానికి విభిన్న రూపాలు.[54] ఫలితంగా భగవద్గీత అంతటి అసంగతమైన రచన ప్రపంచ సాహిత్యంలోనే లేదు. ఒకేచోట బుద్ధుని నుండి అరువుతెచ్చుకున్న అహింసా సిద్ధాంతాన్ని బోధిస్తూ అదే సమయంలో 'యుద్ధం చేయడం నీ ధర్మం' అంటాడు. శరీరం అనిత్యమనీ ఆత్మ ఒకటే నిత్యమనీ అంటూ అదే సమయంలో ఎవరి కర్మలు వాళ్ల ఆచరించాలంటాడు. ఈ రకమయిన అవకాశవాదం గీత ప్రముఖ లక్షణం అంటూ, గీత అభిమానులలో అదే లక్షణం ప్రముఖంగా వుండడంలో ఆశ్చర్యంలేదని కోశాంబి అంటాడు.[55]

అయితే ఈ అసంగతత్వం నుండే భగవద్గీతకుండే ముఖ్య ప్రయోజనంగూడ పుట్టింది. భగవద్గీతలో లేనిదేదీ లేదు కాబట్టి తరువాతి కాలంలో బ్రాహ్మణమతాన్ని ఇబ్బంది పెట్టకుండ పాలక వర్గాలలో ఒక వర్గానికి వ్యతిరేకంగా ఏదయినా చెప్పదల్చు కున్నవాళ్ళు భగవద్గీతను ఆశ్రయించారు.[56] అపరిమితంగా వ్యాఖ్యానాలకు తావిచ్చే భగవద్గీతను తమకు అనుకూలంగా వ్యాఖ్యానించుకున్నారు. అందుకే అద్వైతాన్ని బోధించిన శంకరుడు, విశిష్టాద్వైతాన్ని బోధించిన రామానుజుడు, ద్వైతాన్ని బోధించిన మధ్వాచార్యుడు, అందరూ భగవద్గీతనే ఆశ్రయించారు. జాతీయోద్యమంలో 'తీవ్రవాది' అయిన తిలక్, అహింసావాది అయిన గాంధి, జాతీయోద్యమాన్నే వదిలిపెట్టిన అరవింద ఘోష్, అందరూ భగవద్గీతనుండే ఉత్తేజం పొందారు. అది ఎంత అసంగతమైన గ్రంథం కాకపోతే ఇది సాధ్యం అయ్యేది! అయితే వీళ్ళంతా పాలకవర్గాలలో భాగంగా వుండి ఒక వర్గానికి వ్యతిరేకంగా మార్పును సాధించాలని ప్రయత్నించినవాళ్ళు. ప్రజల వైపునుండి వ్యవస్థను విమర్శించిన తాత్వికులెవరూ భగవద్గీతను ఆశ్రయించలేదు-కబీర్ గాని, నాందేవ్ గాని, తుకారంగాని, చైతన్యుడుగాని[57] (మన వేమనేగాని).

భగవద్గీత చేసిన మూడవ పని, కొత్తగా 'భక్తి' భావాన్ని ప్రవేశపెట్టడం. భూస్వామ్య సమాజానికి సరిగ్గా అతికే భావజాలం 'భక్తి'. నామీద భక్తివుంచి, ప్రతి ఫలాపేక్ష లేకుండ నీ ధర్మం నువ్వు ఆచరించుకుంటూ పొమ్మనేది భగవద్గీతలో కృష్ణుడు ప్రధానంగా చెప్పే విషయం. తనమీద భక్తి వుంటే వాళ్ళు ఎంతటి పాపపుజన్మ ఎత్తిన వారయినా ('స్త్రీలయినా వైశ్యులయినా శూద్రులయినా') వాళ్ళకు మోక్షం దొరుకుతుం

దంటాడు కృష్ణుడు. పురుషాధిక్య వర్గసమాజంలో అణచివేతకు గురయ్యే వర్గాలకు భగవంతుడి కృపను ఉపశమనంగా చూపుతాడు. భూస్వామ్య భావజాలంలో 'భక్తి' చాలా ప్రధానమయినది.

## గ్రామీణ భూస్వామ్యం

క్రీ. శ. 9వ శతాబ్దం నుండి సామంత స్వామ్యం గర్భంలో నుండే 'గ్రామీణ భూస్వామ్యం' అనే రెండవ దశ పుట్టుకొచ్చింది. ఇప్పుడు పైనున్న రాజులకూ సామంతులకూ, క్రిందనున్న గ్రామీణ కుటుంబినులకూ మధ్య ఒక భూస్వామ్య వర్గం ఏర్పడింది. బ్రాహ్మణులకు యిచ్చిన భూదానాలలోనే ఈ గ్రామీణ భూస్వామ్య వర్గం ఆవిర్భావానికి నాందివుంది. అయితే బ్రాహ్మణుల లాగ కాక ఈ కొత్త భూస్వాములు ఆయుధ ధారులు. రాజుకు చెందే పన్నును తాము చేజిక్కించుకోవడమే కాక, శాంతి భద్రతల సంరక్షణ, శిస్తువసూలు, అమ్మకపు సరుకుల ఉత్పత్తి, చెరువులు తదితర నీటి వనరుల నిర్వహణ, వీళ్ళ బాధ్యతలయ్యాయి. గ్రామ సభ స్వయం ప్రతిపత్తి నశించింది. ముస్లిం రాజుల పరిపాలనలో పన్ను వసూలు కోసం ఈ భూస్వామ్య వర్గాన్ని ప్రధానంగా వాడుకున్నారు. వీళ్ళు వసూలు చేసిన పన్నులో కొంత భాగం తాముంచుకొని, రాజుకు అవసరమయినప్పుడు యుద్ధానికి వెళ్ళే సైనికులను పోషించారు. అప్పటి నుండి గ్రామీణ భూస్వామ్యం బలపడింది. అయితే ఈ దశ ఆవిర్భావానికి ముస్లింలు కారకులు కారు.[58]

గ్రామీణ భూస్వామ్యం ఎందుకోసం అవసరం అయింది అనే ప్రశ్నను కోశాంబి వివరంగా చర్చిస్తాడు. ఇందుకు గల వివిధ కారణాలలో ఒక దానిని ప్రధానంగా భావిస్తాడు. దేశవ్యాప్తంగా స్వయంపోషక గ్రామాలు విస్తరిస్తున్నాయి. వీటిని 'స్వయం పోషకం' అంటున్నామంటే పూర్తిగా స్వతంత్రంగా వున్నాయని కాదు. వ్యవసాయ దారులకు అవసరమయిన వ్యవసాయేతర వాడకపు వస్తువులను పట్టణాలలోని వృత్తి శ్రేణులు కాక, గ్రామాలలోని కులవృత్తుల వాళ్ళు తయారు చేస్తున్నారు. స్వయం పోషక గ్రామాలు అనడంలో అర్థం ఇంత మాత్రమే. అయితే రెండు ప్రధానమయిన అవసరాలు మాత్రం అన్ని గ్రామాలలోనూ తీరవు. అవి లోహాలు, ఉప్పు. ఇవి బయటి నుండి రావలసిందే. వీటిని కొనుక్కొనడానికి కర్షకులు కొంత మారకం చేయాలి. ఉత్పాదకత స్వల్పంగా వున్న దశలో ప్రతీ కర్షకుడూ స్వతంత్రంగా మారకం చేయ లేడు. గ్రామంలో మారకం జరిగే ఉత్పత్తి అంతా ఒకరి చేతిలో కేంద్రీకృతం కావాలి.[59] అంటే ఒక గ్రామీణ భూస్వామ్య వర్గం అవసరం.

అంతేకాక, కొన్ని ప్రధానమయిన వ్యాపార పంటలలో గూడ ఈ దశలో దేశవ్యాప్తంగా మారకం జరిగింది. అవి కొబ్బరి, పత్తి, కుంకుమపువ్వు మొదలయినవి. వీటి ఉత్పత్తినీ మారకాన్నీ నిర్వహించేందుకు గూడ ఒక గ్రామీణ భూస్వామ్య వర్గ

అవసరమయింది. గ్రామంలోని ప్రధాన వ్యవసాయ క్షేత్రాలు కుటుంబీనుల ఉమ్మడి ఆస్తిగా వున్నాయి. అయితే శివారు భూములలో భూదానాలు పొందిన భూస్వామ్య వర్గం ఆ భూమిని కొబ్బరి, పత్తి వంటి పంటలు పండించి మారకం చేయడానికి వినియోగించింది.[60] ఈ దశలో గమనించదగ్గ విషయం ఏమిటంటే దేశంలో బానిసల సంఖ్య పెరిగింది. భారతీయ భూస్వామ్యానికి ఉండే విచిత్రమయిన లక్షణాలలో ఇది ఒకటి. కొత్తగా ఏర్పడ్డ భూస్వామ్య వర్గం భూమిలో కూలి చేయడానికీ వ్యవసాయేతర ఉత్పత్తులు నిర్వహించడానికీ బానిసలను వాడుకుంది.[61]

గ్రామాల నుండి వ్యాపార ఉత్పత్తులను సరఫరా చేసే అవసరమే గ్రామీణ భూస్వామ్య వర్గం ఆవిర్భావానికి మూలం అని కోశాంబి బలంగా సూత్రీకరిస్తాడు. భూస్వాముల చేతిలో బలప్రయోగ సాధనాలుండడం వల్ల కర్షకుల నుండి అదనపు ఉత్పత్తిని అమ్మకపు ఉత్పత్తుల రూపంలో సేకరించి మారకం చేయడం సులువయింది.[62]

స్వయం పోషక గ్రామాల ఆవిర్భావంతో వృత్తి శ్రేణులు దెబ్బతిన్నాయి. కాని వర్తకం పూర్తిగా దెబ్బ తినలేదు. వ్యవసాయ విస్తరణ పురోగమించి దేశమంతటా వ్యవసాయక గ్రామాలు ఏర్పడడంతో సరుకుల ఉత్పత్తి సాంద్రత (తలసరి సరుకుల ఉత్పత్తి) తక్కువే అయినా మొత్తం సరుకుల ఉత్పత్తి పెరుగుతూనే వుంది. వర్తకులు గ్రామాలకు ఉప్పు, లోహాలు తదితర సరుకులు సరఫరా చేయడమేకాక రేవు పట్టణాల నుండి విదేశాలతో వ్యాపారం గూడ సాగించారు. క్రీ.శ. 6వ శతాబ్దం నుండి ఈ వర్గం బలపడుతోంది.[63] వాళ్ళకు వివిధ సౌకర్యాలు కల్పిస్తూ రాజులు శాసనాలు జారీ చేసారు. వీళ్ళ ఆవాసాలను 'వణిక్ గ్రామములు' (దక్కన్‌లో మణిగ్రామములు) అనీ, 'నగరములు' అనీ అన్నారు. ఈ వర్తక వర్గం చేతిలోనికి గ్రామీణ అదనపు ఉత్పత్తిని చేరవేసిన వర్గం కొత్తగా పుట్టిన గ్రామీణ భూస్వామ్య వర్గం. ఈ రెండు వర్గాలూ పరస్పర ఆశ్రితాలయి అభివృద్ధి చెందాయి.[64] రాజులు సహితం గ్రామీణ భూస్వామ్య వర్గం ఉపయోగాన్ని గుర్తించి భూదానాల ద్వారా దాన్ని విస్తరింప జేసారు. ఈ వర్గాన్ని రాష్ట్రకూటులు, రాణకులు, ఠాకూరులు, నాయకులు, మొదలయిన పేర్లతో పిలిచారు. వీళ్ళలో కొందరు పురోహితులు కావచ్చు, కొందరు ప్రభుత్వాధికారులు, సైనికాధికారులు, కావచ్చు. ఈ యిద్దరికీ జీతం బదులు భూదానాలు ఇచ్చే అలవాటు ముస్లిం రాజవంశాలతో (ముఖ్యంగా ఫిరోజ్ తుగ్లక్‌తో) పెరిగింది. గ్రామీణ భూస్వామ్యాన్ని నిజంగా కట్టుదిట్టం చేసినవాడు ఫిరోజ్ తుగ్లక్ అని కోశాంబి అభిప్రాయం.[65] కాలం గడిచి ఈ వ్యవస్థ ముదిరే కొద్దీ గ్రామీణ భూస్వాములు అసంఖ్యాకంగా పెరిగారు. ఈ వర్గాన్ని ఆయా ప్రాంతాలలో రకరకాల పేర్లతో పిలిచారు. మొగల్ పాలన తరువాత 'జమీందారీ' అనే పేరు అన్నిటి కంటె బలంగా నిలిచింది.

భూస్వామ్య యుగం మొదటి దశతో సంస్కృత సాహిత్యం ప్రారంభమయినట్టు, గ్రామీణ భూస్వామ్య దశతో 'ప్రాంతీయ' భాషలలో సాహిత్యం ప్రారంభమయింది. తెలుగు, కన్నడం, మరాఠీ మొదలయిన భాషలలో లిఖిత సాహిత్యం ఈ దశలో మొదలయింది. సంస్కృత సాహిత్యం గూడ కొన్ని చోట్ల రెండవ జన్మ పొందింది.[**]

గ్రామీణ భూస్వామ్యవ్యవస్థ ఆవిర్భావాన్ని కాశ్మీరు చరిత్ర ఆధారంగా కోశాంబి వివరిస్తాడు. బ్రాహ్మణ సాహిత్యంలోని ఏకైక చరిత్ర గ్రంథం కాశ్మీరుకు చెందిన కల్హణుడి 'రాజతరంగిణి' కాశ్మీరులో గ్రామీణ భూస్వామ్యం ఆవిర్భవించిన దశలోని సామాజిక సంఘర్షణను ఈ కావ్యం ద్వారా కొంత తెలుసుకోవచ్చును.[**] కాశ్మీరులో వ్యవసాయ యోగ్యమైన భూమి ఉమ్మడి ఆస్తిగా వుండింది. బయటినుండి దిగుమతి చేసుకున్న సరుకులకు మారుగా ఎగుమతి చేసిన వర్తకపు పంట మాత్రం స్వంత భూములలో సాగింది. ఆ పంట కుంకుమపువ్వు (సాఫ్రన్)

కుంకుమపువ్వు పండించి వర్తకం చేసిన గ్రామీణ భూస్వాములు డామరులు కాశ్మీరు దుర్గమమయిన కొండ ప్రాంతం కావడంవల్ల వీళ్ళు చిన్నచిన్న సైన్యాలు పెట్టుకొని రాజాజ్ఞను ధిక్కరించారు. రాజ్యానికి ఆర్థిక సంక్షోభం వచ్చినప్పుడల్లా రాజులకూ సామంతులకూ ఈ డామరులకూ సంఘర్షణ జరిగేది. ఆ సంఘర్షణలో అంతిమంగా డామరులదే పైచేయి అయి గ్రామీణ భూస్వామ్యం బలపడింది.[**]

గ్రామీణ భూస్వామ్యం ఆవిర్భవించిన దశలో దేశవ్యాప్తంగా జరిగిన మరొక సంఘర్షణ శైవ-వైష్ణవ కలహం. శంకరాచార్యుడి అద్వైతానికీ రామానుజుడి విశిష్టాద్వైతానికీ గల అస్పష్టమయిన తేడా గురించి జనం తలలు పగలగొట్టుకున్నారంటే నమ్మడం కష్టమే. ఇది నిజానికి సామంతస్వామ్యానికీ గ్రామీణ భూస్వామ్యానికీ మధ్య ఘర్షణ అని కోశాంబి అభిప్రాయం. సామంతులు శైవాన్ని ఆదరించగా గ్రామీణ భూస్వాములు వైష్ణవాన్ని ఆదరించారంటాడు.[**]

## ముగింపు

క్రి. శ. 1000 తరువాత గ్రామీణ భూస్వామ్యం విస్తరించడంతో రెండువేల సంవత్సరాల చరిత్ర ముగింపుకొస్తుంది. క్రి. పూ. 1000 ప్రాంతంలో ఆహార సేకరణ పశుపోషణల స్థానంలో ప్రారంభమయిన ఆహార ఉత్పత్తి, స్థిర వ్యవసాయాన్ని స్వయం పోషక గ్రామీణ సమాజాన్ని రూపొందించి, భూస్వామ్య దశను చేరుకుంది. ఈ 2000 సంవత్సరాల కాలంలో సంస్కృతిలో, మతంలో, సాహిత్యంలో, ఆచారాలలో వచ్చిన అన్ని మార్పులకూ ఈ పరిణామక్రమం ప్రాతిపదిక. ఆ తరువాతి చరిత్ర అంతా (బ్రిటిషువాళ్ల వచ్చేదాకా) భూస్వామ్యం బలపడడం, దానిమీద ఆధారపడి రాజులూ రాజవంశాలూ కలహించుకోవడం, సంహరించుకోవడం. ఎవరు పాలించినా

క్రిందనున్న గ్రామానికి ఒకటే. రాజ్యంలో శాంతివుంటే జీవితానికి కొంత భద్రత వుంటుంది, దోపిడీ క్రమబద్ధంగా వుంటుంది. రాజ్యంలో శాంతి లేకపోతే అవి మృగ్యం అవుతాయి. ఇంతవరకే రాజులతో రాజ్యాలతో ఈ గ్రామాలకు ప్రమేయం.

అయితే ఈ భూస్వామ్య వ్యవస్థ యూరప్‌లో లాగ తన అంతర్గత వైరుధ్యాల ఫలితంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎందుకు దారి తీయలేదు అన్న ప్రశ్న వస్తుంది. భారతీయ భూస్వామ్యానికి ఇతర దేశాల భూస్వామ్యానికి గల తేడాలను ఇక్కడ గమనించాలి.

అమ్మకపు సరుకుల తలసరి ఉత్పత్తి క్షీణించడం భారత దేశ భూస్వామ్యానికి గల ప్రముఖ లక్షణం అని కోశాంబి అభిప్రాయం. దీనినే మరొక రకంగా చెప్పాలంటే స్వయంపోషక గ్రామాలు భారతీయ భూస్వామ్యానికి గల ప్రముఖ లక్షణం. దీనికి మూలం వృత్తి శ్రేణులు క్షీణించి గ్రామాలలో కులవృత్తులుగా స్థిరపడడం. యూరప్‌లో అట్లాకాకుండ భూస్వామ్యదశలో గూడ వృత్తిశ్రేణులు పట్టణాలలో కొనసాగాయి. యూరప్‌లోని భూస్వామ్య వ్యవస్థ ఈ కారణంగా కొత్త ఉత్పత్తి పద్ధతులను ఆవిష్కరించ గలిగింది. భారత దేశంలో సాంకేతిక పురోగమనం స్తంభించింది.[70]

వృత్తి శ్రేణులు నశించడంచేత వర్తకశ్రేణులు గూడ బలహీనమయ్యాయి.[71] ఇవిరెండూ కలిస్తేనే బలంగా వుంటాయి. దేశంలోని వ్యవసాయేతర ఉత్పత్తి ఎక్కువగా గ్రామాలలోనే జరగడం వల్ల వర్తకులు రేవుపట్టణాలలో కేంద్రీకృతమయ్యారు.[72] ఒక దేశ వ్యాప్తమయిన వర్గం కాలేక పోయారు. యూరప్‌లో వృత్తిశ్రేణులూ వర్తక శ్రేణులూ పట్టణ ప్రాంతాలలో ఒక బలమైన వర్గంగా వుండి పెట్టుబడిని సమీకరించుకొని పెట్టుబడిదారీ విప్లవం సాధించగలిగారు, భారతదేశంలో వృత్తి శ్రేణులు భూస్వామ్య దశలో నశించి పోవడం వల్ల వర్తకులు బలహీనమయిన వర్గంగా వున్నారు సరుకులు మారకం చేసేటప్పుడు గ్రామాల అదనపు ఉత్పత్తిని చేజిక్కించుకున్న భూస్వాముల దాక్షిణ్యం పైన ఈ వర్తకులు ఆధారపడక తప్పలేదు. ఈ కారణాల వల్ల వర్తకులు భూస్వామ్య వ్యవస్థను కూలదోయగల బలమయిన వర్గంగా రూపొందలేదు.[73]

కులవ్యవస్థకు గల పాత్రను గూడ కోశాంబి సూచిస్తారు. వృత్తి పని వాళ్ళంతా సామాజికంగా నిమ్న కులాలకు చెందిన వాళ్ళు. వాళ్ళనూ వాళ్ళ పనినీ కులధర్మం నీచంగా చూసింది. వాళ్ళు సాంకేతిక అభివృద్ధిని సాధించే స్థితిలో లేరు. విద్యావంతులయిన బ్రాహ్మణులకు ఉత్పత్తితో సంబంధంలేదు కాబట్టి వాళ్ళు గూడ సాంకేతిక అభివృద్ధి సాధించే స్థితిలో లేరు. వర్తకుల విషయం గూడ అంతే. చైనా తదితర దేశాలలో వర్తకులకు రాజాస్థానాలలో బంధువులుండేవారు, రాచరిక సంబంధాలుండేవి. భారతీయ కుల వ్యవస్థలో ఇది అరుదు. అంటే వర్తక వర్గానికి పాలక వర్గంలో విస్తృతమయిన పునాది లేదు.[74] పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావానికి ఇది గూడ ఆటంక

మయింది.

## వివరణలు

1. The Basis of Ancient Indian History, HS, Page 47
2 ISIH, Page 295
3. The Basis of Ancient Indian History, HS, Page 44
4, On the development of Feudalism in India, HS, Page 100
5. The Basis of Ancient Indian History, HS, Page 35
6. The Basis of Ancient Indian History, HS, Page 37
7. What Constitutes Indian History, HS, Page 70
8. The Basis of Ancient Indian History, HS, Page 35
9. The Basis of Ancient Indian History, HS, Page 42.
10. ISIH, Page 285
11. The Basis of Ancient Indian History, HS, Page 42
12. ISIH, Page 245
13. The Basis of Ancient Indian History, HS, Page 42
14. ISIH, Page 243
15. The Basis of Ancient Indian History, HS, Page 36
16. The village community in the 'Old conquests' of Goa: History vs Skanda purana, MR, Pages 165-168
ISIH, Pages 324-328
The Basis of Ancient Indian History, HS, Pages 37-38
17. ISIH, Page 313
18. On the development of Feudalism in India, HS, Page 95
19. సోవియట్ రచయిత్రి కె. ఏ. ఆంటోనోవా రాసిన వ్యాసాన్ని తీవ్రంగా విమర్శించి రాసిన సమీక్ష : On the Development of Feudalism in India, HS, ముఖ్యంగా పేజీ 98
20. On the Development of Feudalism in India, HS, Pages 99-100
21. ISIH, Pages 323-324
22. The Basis of Ancient Indian History, HS 49.
23. On the Development of Feudalism in India, HS, 96
24. The Working class in Amarakosa, HS, Pages 185-186
25. The Working class in Amarakosa, HS, Page 188
26. The Working class in Amarakosa, HS, Page 190
27. The Working class in Amarakosa, HS, Page 192.
28. The Basis of Ancient Indian History, HS, Page 31
29. ISIH, Page 311
30. ISIH, Page 299
31. ISIH, Page 311
32. ISIH, Page 304
33. ISIH, Page 313

34. ISIH, Page 310
35. ISIH, Page 310
36. The Basis of Ancient Indian History, HS, Pages 61-62
37. Combined methods in Indology, HS, Pages 8-10
38. Combined methods in Indology, HS, Page 11
39. The Basis of Ancient Indian History, HS, Page 35
40. Combined methods in Indology, HS, Page 11
41. ISIH, Pages 297-298
42. The Basis of Ancient Indian History, HS,Pages 47-48
43. ISIH, Page 280
44. The Basis of Ancient Indian History, HS, Page 40
45. ISIH, Page 280. తరువాతి కాలంలో పర్షియన్ భాష, ఆధునిక కాలంలో ఇంగ్లీష్ భాష, ఇదే సామాజిక పాత్రను నిర్వహించాయని కోశాంబి అంటాడు.
46. ISIH, Page 284
47. ISIH, Pages 283-284
48. ISIH, Pages 287-288
49. ISIH, Page 281
50. Social and Economic aspects of the Bhagavadgita, MR, Page 16
51. ISIH, Page 259
52. ISIH, Page 259-260
53. Social and Economic aspects of the Bhagavadgita, MR, Pages 18-19
54. Social and Economic aspects of the Bhagavadgita, MR, Page 16
55. Social and Economic aspects of the Bhagavadgita, MR, Page 17
56. Social and Economic aspects of the Bhagavadgita MR, Page 15
57. Social and Economic aspects of the Bhagavadgita, MR, Pages 13-14
58. On the Development of Feudalism in India, HS, Pages 99-102
59. Indian Feudal Trade charters, HS, Page 106
60. On the Development of Feudalism in India, HS, Page 101
61. On the Development of Feudalism in India, HS, Page 102
62. On the origin of Feudalism in Kashmir, HS, Page 126
63. India Feudal Trade charters, HS, Page 104
64. Indian Feudal Trade charters, HS, 106
65. On the Development of Feudalism in India, HS, Page 102
66. ISIH, Page 369
67. On the Origin of Feudalism in Kashmir, HS, Pages 115-126
68. ISIH, Page 365
69. ISIH, Page, 373

70. ISIH. Page 355
71. ISIH, Page 395
72. Indian Feudal Trade charters, HS, Page 113
73. Indian Feudal Trade charters, HS, Page 113
74. Indian Feudal Trade charters, HS, Pages 112-113.

34810

# తప్పొప్పుల పట్టిక

| ఉన్నవి | ఉండవలసినవి | పేజీ నెం. | మరియు పం క్తి |
|---|---|---|---|
| అభావ | అభావ | 3వ పేజీ | 21వ పం క్తి |
| గ్రామాలు | గ్రామాల | 4వ ” | 4 ” |
| కల్వాణుడు | కల్హాణుడు | 4 ” | 19 ” |
| అలంకారిక | ఆలంకారిక | 4 ” | 20 ” |
| గమనార్వమయిన | గమనార్హమయిన | 9 ” | 17 ” |
| అవుతోంది | అవుతుంది | 14 ” | 16 ” |
| Mesalithic age | Mesolithic age | 14 ” | 25 ” |
| సగోతీకులు | సగో్త్రీకులు | 17 ” | 10 ” |
| బోల్లా | బోల్హా | 19 ” | 3 ” |
| వీళ్ళు | వీశ్ళ | 19 ” | 12 ” |
| అద్దేశ్యించిన | ఉద్దేశ్యించిన | 35 ” | 20 ” |
| ఏర్పాటు | అర్థం | 35 ” | 21 ” |
| భావించారేమో | భావించాలేమో | 38 ” | 11 ” |
| ప్రాధానం | ప్రధానం | 48 ” | 1 ” |
| చుట్టూవున్న | కొట్టం చుట్టూవున్న | 48 ” | 12 ” |
| ఆర్యులు | ఆర్యులు సాధించిన | 48 ” | 17 ” |
| అరణ్యకాలు | ఆరణ్యకాలు | 49 ” | 29 ” |
| అవాస్తవికత | అవాస్తవికత | 51 ” | 12,13 ” |
| కణ్వాయన | కాణ్వాయన | 57 ” | 17 |
| చేసినా | చేసిన | 58 ” | 26 ” |
| యజ్ఞవల్క్యుడికి | యాజ్ఞవల్క్యుడికి | 61 ” | 16 ” |
| అదిపురుముడు | ఆదిపురుషుడు | 63 ” | 29 ” |
| మెట్టి ప్రాంతాలలో | మెట్ట ప్రాంతాలలో | 65 ” | 22 ” |
| కావు | క్రాపు | 69 ” | 5 ” |
| పుట్టలేదు | పుట్టారు | 79 ” | 9 ” |
| సామ్రశవుడు | సోమశ్రవుడు | 79 ” | 23 ” |
| భుజించారు | భుజించరు | 88 ” | 13 ” |
| అధ్యాత్మ | అధ్యాత్మ | 93 ” | 4 ” |
| Numisuratics | Numismatics | 100 ” | 7 ” |
| గర్రం | గుర్రం | 137 ” | 21 ” |